

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 274

బుధవారం 25-12-2024



పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి క్రిస్మస్ శుభాకాంక్షలు


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



దుబాయ్‌లో భారత్ మ్యాచ్‌లు

చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నీ షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో ఏర్పాటు చేసింది.

- వివరాలు 16లో▶



'ఎన్నికల'పై కాంగ్రెస్ పిటిషన్

కేంద్ర ప్రభుత్వం 'ఎన్నికల నిర్వహణ నిబంధనలు–1961'లో సవరణ చేయడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

- వివరాలు 6లో▶




మస్తిష్కం అంత ఫాస్ట్ కాదు!

శాస్త్రవేత్తలు కొత్త విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. తనకందిన సమాచారాన్ని మెదడు నెమ్మదిగా ప్రాసెస్ చేస్తోందని గుర్తించారు.

- వివరాలు 6లో▶

శ్యామ్ బెనగల్‌కు తుది వీడ్కోలు

సీనియర్ సినీ దర్శకుడు శ్యామ్ బెనగల్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో దాదర్‌లోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో మంగళవారం ముగిశాయి. - వివరాలు 6లో▶



3.30 గంటలు 20 ప్రశ్నలు

'సంధ్య థియేటర్' ఘటనపై అల్లు అర్జున్‌ను విచారించిన పోలీసులు



విచారణానంతరం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న అల్లు అర్జున్

తండ్రి, మామ, న్యాయవాదితో కలసి హాజరైన అర్జున్

- ఘటన జరిగిన నాటి వీడియోలను చూపిస్తూ ప్రశ్నించిన అధికారులు
- ఉదయం 11:13 గంటల నుంచి మధ్యాహ్నం 2:47 గంటల వరకు విచారించిన పోలీసులు
- చివరిగా అల్లు అర్జున్ వాంగ్మూలం నమోదు
- అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని, రావాలని ఆదేశం
- తొక్కిసలాటకు కారకుడిగా పేర్కొంటూ అల్లు అర్జున్ బౌన్సర్ ఆంటోనీ అరెస్టు
- నిందితుల జాబితాలో ఏ–18గా మైత్రి మూవీ మేకర్స్‌ను చేర్చిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్/ ముషీరాబాద్/ చిక్కడపల్లి: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి పోలీసులు మంగళవారం అల్లు అర్జున్‌ను విచారించారు. మూడున్నరగంటలపాటు 20కిపైగా ప్రశ్నలు అడిగారు. ప్రీమియర్‌షోకు వచ్చేందుకు పోలీసుల అనుమతి లేదన్న విషయం తెలుసా తెలియదా అనే అంశం నుంచి ర్యాలీగా రావడం, వెళ్లడం దాకా ఎప్పుడేం జరిగిందనేది గుర్తు చేస్తూ విచారించారు. చివరిగా అల్లు అర్జున్ వాంగ్మూలం తీసుకున్నారు. అవసరమైతే మరోసారి పిలుస్తామని, విచారణకు రావాలని సూచించారు.

ఈ నెల 4న రాత్రి హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప–2 ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ రావడం, ఆ సమయంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించడం, ఆమె కుమారు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడటం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు చేయగా.. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసు దర్యాప్తు నిమిత్తం పోలీసుల ఆదేశాల మేరకు అల్లు అర్జున్ మంగళవారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు.

సుమారు మూడున్నర గంటల పాటు

తన తండ్రి అల్లు అరవింద్, మామ చంద్రశేఖర్‌రెడ్డి, సినీ నిర్మాత బన్నీ వాసు, న్యాయవాది అశోక్‌రెడ్డిలతో కలిసి అల్లు అర్జున్ ఉదయం 11:03 గంటలకు చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. అరవింద్, చంద్రశేఖర్‌రెడ్డి, బన్నీవాసులను పోలీస్‌స్టేషన్

మిగతా 8వ పేజీలో ▶

కావాలని ఎవరూ చేయరు

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన దురదృష్టకరం.. 2–3 రోజుల్లో సినీ పరిశ్రమ పెద్దలతో కలిసి సీఎంను కలుస్తాం..
- ప్రముఖ నిర్మాత, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు వెల్లడి
- కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి పరామర్శ


8 లో

కళ్లు తెరిచిన శ్రీతేజ్

కొద్దిగా స్పర్శ కూడా తెలుసుకుంటున్నట్లు వైద్యుల వెల్లడి

- వివరాలు 8లో

ప్రార్థనలకు వేళాయె..



విద్యుద్దీపాల కాంతుల్లో మెదక్ సీఎస్ఐ చర్చి

శత వసంత కాంతులు

శతాబ్ది ఉత్సవాలకు మెదక్ సీఎస్ఐ చర్చి సిద్ధం

పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

మెదక్‌జోన్: ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చి శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది. రంగురంగుల విద్యుద్దీపాలతో జిగేల్‌మంటోంది. సీఎస్ఐ చర్చిని నిర్మించి 100 ఏళ్లు అవుతున్న సందర్భంగా నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు మొదటి ఆరాధన ప్రారంభమైంది. ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ డాక్టర్ రూబెన్‌మార్క్ ఆరాధనను ప్రారంభించారు. 2వ ఆరాధన 10 గంటలకు ప్రారంభం కానుంది. ఈ ఉత్సవాలకు 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. 20 మంది గురువులను ఏర్పాటు చేయనున్నట్లు చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య తెలిపారు.

న్యూస్‌రీల్

కేసీఆర్, హరీశ్‌కు ఊరట



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో నమోదైన ప్రైవేట్ పిటిషన్‌లో మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట దక్కింది. సెషన్స్ జడ్జి నిర్ణయాన్ని తప్పుబడుతూ ప్రైవేట్ పిటిషన్ విచారణపై స్టే ఇస్తూ, హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

- వివరాలు 3లో▶

అమిత్‌షా రాజీనామా చేయాలి



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టింది.

- వివరాలు 3లో▶

79,40,520 ఎకరాల్లో యాసంగి సాగు



రాష్ట్రంలో యాసంగి సీజన్ సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. మొత్తం 79,40,520 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో ఒక్క వరి పంటే 63,54,288 ఎకరాల్లో సాగవుతుందని, దీని తరువాత మొక్కజొన్న 7,18,100 ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది.

- వివరాలు 5లో▶

జీసీసీల చూపు హైదరాబాద్ వైపు!



- ఐదేళ్లలో దేశంలో ఏర్పాటైన జీసీసీల్లో 30 శాతం ఇక్కడే
- వీటి ద్వారా ఆవిష్కరణలు, నిర్వహణ సామర్థ్యం పెంపు
- 2030 నాటికి దేశంలో జీసీసీల ద్వారా 28 లక్షల ఐటీ జాబ్స్
- నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మౌలిక వసతులే బలం

రాష్ట్రంలో జీసీసీల ఏర్పాటు అనుకూలతలపై నాస్కామ్ అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ)కు హబ్‌గా మారుతోంది. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై జీసీసీలను ఆకర్షించేందుకు హైదరాబాద్‌తో తీవ్రంగా పోటీ పడుతున్నప్పటికీ.. ఈ రంగంలో తెలంగాణ రాజధాని నగరం స్పష్టమైన ఆధిపత్యం కనబరుస్తోంది. గడిచిన ఐదేళ్లలో భారత్‌లో 1,700 జీసీసీలు, 2,975 జీసీసీ యూనిట్లు ఏర్పాటు కాగా, వీటిలో 30 శాతం హైదరాబాద్‌లోనే నెలకొల్పటం గమనార్హం. 2019లో హైదరాబాద్‌లో 230 జీసీసీలు ఉండగా 2024 నాటికి వీటి సంఖ్య 355కు చేరింది. భారత సాంకేతిక వాతావరణం, ఉద్యోగాల కల్పన, మార్కెట్ వృద్ధి, సామర్థ్యాల పెంపుదల తదితరాల్లో 2030 నాటికి జీసీసీలు కీలకపాత్ర పోషిస్తాయని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో

మిగతా 14వ పేజీలో ▶



హెచ్‌పీఎస్ వందేళ్ల ప్రస్థానంపై కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరిస్తున్న మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల. చిత్రంలో అడోబ్ సీఈవో శంతను నారాయణ్ తదితరులు


హెచ్‌పీఎస్ జ్ఞాపకాలతో మురిసిన నాదెళ్ల

- చిన్నప్పుడు చదువుకున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన మైక్రోసాఫ్ట్ సీఈవో... మైదానం, తరగతి గదుల పరిశీలన.. తన గురువులకు ఆత్మీయ పలకరింపు
- స్కూల్ వందేళ్ల ప్రస్థానంపై పుస్తకావిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరు
- పాల్గొన్న మరో పూర్వ విద్యార్థి, అడోబ్ సీఈవో శంతను నారాయణ్

సాక్షి, హైదరాబాద్/సనత్‌నగర్: సుమారు 45 ఏళ్ల క్రితం తాను చదువుకున్న స్కూల్లోని జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల హైదరాబాద్ బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో అడుగుపెట్టారు. తాను ఆడుకున్న మైదానం, కూర్చున్న తరగతి గదులను చూసి మురిసిపోయారు. తనకు చదువుచెప్పిన ఉపాధ్యాయులను ఆప్యాయంగా పలకరించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వందేళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ 'ఫ్లైట్ ఆఫ్ ది ఈగిల్' పేరిట రూపొందిన కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం

మిగతా 14వ పేజీలో ▶

నీట్ పీజీ అడ్మిషన్లలో జాప్యం.. ఆందోళనలో విద్యార్థులు



- జీవోలు 148, 149ను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయించిన ప్రభుత్వం
- జనవరి 7న సుప్రీంలో విచారణ
- ఇప్పటికీ మెరిట్ లిస్ట్, ర్యాంకు కార్డులను ఇవ్వని కాళోజీ వర్సిటీ
- కౌన్సెలింగ్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విద్యార్థుల విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఇప్పటికే ఆలస్యమైన నీట్–పీజీ ప్రవేశాల అంశం సుప్రీంకోర్టు ముందుకెళ్లడంతో తెలంగాణ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ స్థానికత అంశంపై జీవోలు 148, 149ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు హైకోర్టుకు వెళ్లడంతో నవంబర్‌లో మొదలు కావాల్సిన పీజీ కౌన్సెలింగ్ ఆలస్యమైంది. ఇటీవల హైకోర్టు ఆ జీవోలను రద్దు చేస్తూ తీర్పు వెలువరించడంతో సర్కార్ సుప్రీంకోర్టు తలుపుతట్టింది. తెలంగాణలోని పీజీ సీట్లు తెలంగాణ విద్యార్థులకే దక్కాలని, హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని కోరింది. ఇది సుప్రీంకోర్టులో జనవరి 7న విచారణకు రానుంది. సుప్రీం విచారణ ముగిస్తే గానీ తెలంగాణ విద్యార్థుల కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలయ్యేలా లేదు. ఇప్పటికే అఖిల భారత కోటా (ఏఐక్యూ) కింద మొదటి రౌండ్ ప్రవేశాల ప్రక్రియ పూర్తికాగా, రెండో రౌండ్

మిగతా 14వ పేజీలో ▶

ఇదండీ సంగతి



అజాత శత్రువు... ఆదర్శ నేత



అటల్ బిహారీ వాజ్‌పేయి. భారత రాజకీయాల్లో శిఖర సమానుడు. అజాతశత్రువుగా నిలిచిన అతి కొద్దిమంది నాయకుల్లో అగ్రగణ్యుడు. అనుక్షణం దేశ క్షేమాన్నే కాంక్షించిన స్వాప్నికుడు. టెలికం మొదలుకుని హైవేల దాకా దేశ ప్రగతి ప్రస్థానానికి బాటలు పరిచిన అరుదైన దార్శనికుడు. రాజకీయాల్లో అత్యున్నత విలువలను నెలకొల్పిన ఆదర్శ నాయకుడు. ఇటు కోమలమైన కవి హృదయం. అటు అచంచలమైన రాజతంత్రం. ఇలా వాజ్‌పేయి కత్తికి రెండువైపులా పదునే. చివరి శ్వాస వరకూ ఓటమిని ఒప్పుకునేది లేదన్నదే ఆయన ఆచరించి చూపిన సిద్ధాంతం...

రాజకీయ కవి సార్వభౌముడు

లోకం మెచ్చిన నాయకుడు

దార్శనికత గల రాజనీతిజ్ఞుడు

వాజ్‌పేయిపై ప్రధాని ప్రత్యేక వ్యాసం

- వివరాలు 4,7 పేజీల్లో

దేశం గర్వించదగ్గ గొప్ప నేత 14 లో



ఆధారం.. జాగారం!

ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం జనం తిప్పలు



- పొరపాట్లు, బయోమెట్రిక్ సవరణ కోసం ప్రాంతీయ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- రోజుకు 150 మందికి మాత్రమే టోకెన్లు...
- తప్పుల సవరణపై సందేహాలు తీర్చని తీరు

18 లో

తెల్లవారక ముందే...

హైదరాబాద్ అమీర్‌పేటలోని ఆధార్ ప్రాంతీయ కార్యాలయం ఉన్న స్వర్ణ జయంతి కాంప్లెక్స్ గేటు వద్ద తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలోనే బారులు తీరిన జనం. ఆధార్ కార్డులో సవరణల కోసం తెలంగాణ, ఏపీతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అండమాన్–నికోబార్ దీవుల నుంచి కూడా ఇక్కడికి వస్తున్నారు.



సూది రంధ్రంలో 'క్రైస్ట్ ది రిడీమర్' విగ్రహం



హనుమకొండ కల్చరల్: వరంగల్ నగరంలోని గిర్మాజీపేటకు చెందిన స్వర్ణకారుడు, సూక్ష్మశిల్ప కళాకారుడు మట్టెవాడ అజయ్‌కుమార్ క్రిస్మస్ సందర్భంగా సూది రంధ్రంలో 'క్రైస్ట్ ది రిడీమర్' విగ్రహాన్ని సృష్టించారు. ప్రపంచ ఏడు వింతల్లో ఒకటైన బ్రెజిల్ దేశంలోని 124 అడుగుల ఎత్తులో నిర్మించిన క్రైస్ట్ ది రిడీమర్ విగ్రహాన్ని సూది రంధ్రంలో 1.1 ఎంఎం పరిమాణంలో తీర్చిదిద్దారు. జీసస్ రెండు చేతుల చేతి వేళ్లను, బట్టలపైన ఉండే ముడతలను సైతం స్పష్టంగా ఉండేలా చూశారు. మైనం, ప్లాస్టిక్ పౌడర్, రంగులు అద్దడానికి గొంగళి పురుగు వెంట్రుకలు, నోటితో ఊదితే వంగిపోయే సున్నితమైన పరికరాలను ఉపయోగించినట్లు అజయ్‌కుమార్ తెలిపారు. ఈ సూక్ష్మ శిల్పం తయారీకి రెండు నెలల కాల వ్యవధిలో 90 గంటల సమయం పట్టిందని, దీనిని మైక్రోస్కోప్ ద్వారా చూడాలని చెప్పారు.

గవర్నర్, సీఎం క్రిస్మస్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు, రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు జీవితం ప్రేమ, కరుణ, జాలి, సోదరభావం, త్యాగాలకు ప్రతీక అని స్పష్టం చేశారు. ఈ పర్వదినం సందర్భంగా అందరి జీవితాల్లో ప్రేమ, ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వం రావాలని కోరారు. ఏసుక్రీస్తు బోధనలు ఇప్పటికీ.. ఎప్పటికీ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని అభివర్ణించారు.

కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: క్రీస్తు పుట్టిన రోజు క్రిస్మస్‌ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు, కార్యాచరణ ప్రపంచ మానవాళిని ఎంతగానో ప్రభావితం చేశాయని ఆయన అభిప్రాయపడ్డారు. పాపులను సైతం క్షమించే ఓర్పు, సహనం, దార్శనికత.. మానవ సమాజానికి క్రీస్తు చూపిన అత్యద్భుతమైన శాంతి మార్గమని పేర్కొన్నారు.

రైతులపై బీఆర్ఎస్ మొసలికన్నీరు కారుస్తోంది

పదేళ్ల పాలనలో 6,121 మంది రైతుల ఆత్మహత్యలు: శ్రీధర్ బాబు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పాలనలో 6,121 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, పదేళ్లు రైతులను మోసగించిన ఆ పార్టీ నేతలు ఇప్పుడు దొంగ ప్రేమను ఒలకబోస్తున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బీఆర్ఎస్ నేతలు మీడియాలో కనిపించడం మానేసి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కారమయ్యేందుకు ప్రయత్నించాలని మంగళవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో రైతులను మోసగించిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు వారి గురించి మొసలికన్నీరు కారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకం తెచ్చిందని ఆయన వెల్లడించారు. పదేళ్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, సాగులోలేని రాళ్ల గుట్టలకు 'రైతుబంధు' పేరిట దోచిపెట్టిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందంటూ విమర్శించారు. 2018–19 నుంచి 2022–2023 వరకు రూ.25,672 కోట్ల నిధులను సాగులో లేని భూములకు చెల్లించారని విమర్శించారు. రైతులకు సాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే బాధ్యత కలిగిన ప్రతిపక్షం అభినందించాల్సిపోయి అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టడం ఏమిటని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు.

కేబినెట్ నిర్ణయాన్ని తప్పుబట్టలేం

తెలంగాణ తల్లి విగ్రహాలపై హైకోర్టు వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటు ముఖ్యమంత్రి నేతృత్వంలోని కేబినెట్ నిర్ణయమని, దాన్ని తప్పుబట్టలేమని హైకోర్టు అభిప్రాయపడింది. పిటిషన్‌ను మరింత మెరుగ్గా దాఖలు చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకుని, సంబంధిత అన్ని అంశాలతో సమగ్రంగా మళ్లీ దాఖలు చేస్తామని పిటిషనర్ న్యాయవాది కోరగా.. న్యాయస్థానం అంగీకరించింది. తెలంగాణ తల్లి విగ్రహాలు పాతవి మార్చి కొత్తవి ఏర్పాటు చేయడంతో రూ.150 కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని.. మార్చకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ హైకోర్టులో రచయిత జూలూరి గౌరీశంకర్ ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. 'రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ప్రస్తుత తెలంగాణ తల్లి విగ్రహం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పాత విగ్రహాల స్థానంలో కొత్త విగ్రహాలు పెట్టాలంటే పెద్ద ఎత్తున ప్రజా ధనం వృథా అవుతుంది' అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో ఇంత పెద్ద మొత్తంలో విగ్రహాలపై ఖర్చు చేయడం సరికాదన్నారు.

ప్రభుత్వం మారితే పథకాలు రద్దు చేస్తారా?: ఎమ్మెల్సీ మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: మైనారిటీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కె.చంద్రశేఖర్‌రావు చేపట్టిన పథకాలను.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేయడం లేదని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత, ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి విమర్శించారు. ప్రభుత్వం మారినంత మాత్రాన అప్పటి పథకాలను రద్దు చేయడం సరికాదన్నారు. తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ భవన్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రిస్మస్ కానుక, ఎల్‌బీ స్టేడియంలో క్రైస్తవులకు విందు, సమాధి స్థలం కోసం 45 ఎకరాల కేటాయింపు, ఉప్పల్ భగాయత్‌లో క్రిస్టియన్ భవన నిర్మాణానికి 2 ఎకరాలు, రూ.10 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. క్రైస్తవుల సంక్షేమానికి గత ప్రభుత్వం చేపట్టిన పనులు, పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడం లేదని తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ అన్నారు. క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్‌గా కేరళకు చెందిన వ్యక్తిని నియమించడాన్ని తప్పుబట్టారు. క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుకోసం పోరాడతాం: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: 'కామారెడ్డి డిక్లరేషన్' పేరిట కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. బీసీలకు హామీ ఇచ్చిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఎగవేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముదిరాజ్ మహాసభ, విశ్వకర్మ కుల సంఘాల నాయకులు మంగళవారం కవితను ఆమె నివాసంలో కలిశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 'బీసీల సమస్యలను పట్టించుకోకుండా కులవృత్తులను కాంగ్రెస్ ప్రభుత్వం కుదేలు చేస్తోంది. బీసీ సంక్షేమం లక్ష్యంగా గత ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది. ఏడాది కాలంలో బీసీ సంక్షేమానికి ఈ ప్రభుత్వం ఖర్చు చేసిన లెక్కలు బయటపెట్టాలి' అని డిమాండ్ చేశారు. కవితను కలిసిన వారిలో యునైటెడ్ ఫూలే ఫ్రంట్ నాయకులు బొల్లా శివశంకర్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు కొట్టాల యాదగిరి, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి ఉన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు

కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలంటూ అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతిపత్రాలు

ఖమ్మంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్/సాక్షిప్రతినిధి, ఖమ్మం/కవాడిగూడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో మంగళవారం అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలను చేపట్టాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, వరంగల్, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌తోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. జిల్లా కేంద్రాల్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం జిల్లా కలెక్టరేట్లకు ర్యాలీగా వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు అక్కడ కలెక్టర్‌ను కలిసి అమిత్ షాను బర్తరఫ్ చేయాలంటూ వినతిపత్రాలు ఇచ్చాయి.

కేంద్ర ప్రభుత్వాన్ని రద్దు చేయాలి: భట్టి

భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి.. ఆ రాజ్యాంగాన్నే ఉల్లంఘించిన కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రపతి రద్దు చేయాలని భట్టివిక్రమార్క డిమాండ్ చేశారు. ఖమ్మంలో ర్యాలీ అనంతరం భట్టి మాట్లాడుతూ.. రాజ్యాంగంపై ప్రమాణం చేసి.. అందుకు అనుగుణంగా పాలన అందించకుంటే ఏ ప్రభుత్వాన్ని అయినా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గుర్తించదన్నారు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మనగలుగుతోందంటే అందుకు రాజ్యాంగం, దాన్ని అందించిన అంబేడ్కరే కారణమని పేర్కొన్నారు. అలాంటి అంబేడ్కర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజీనామా కోరడం అందరి నైతిక హక్కు అని భట్టి చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.



ఖమ్మంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలో భట్టి, తుమ్మల తదితరులు



హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శనలో మహేశ్‌గౌడ్, అనిల్‌కుమార్

బీజేపీ ముసుగు తొలగిపోయింది: టీపీసీసీ చీఫ్

➤ బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలతో బీజేపీ పార్టీ ముసుగు తొలగిపోయిందన్నారు. రాజ్యాంగంపై నమ్మకమున్న ప్రతి పౌరునికి అమిత్ షా మాటలు బాధ కలిగించాయన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీకి అంబేడ్కర్‌పై ఎంత ద్వేషం ఉందో బయటపడిందని ఏఐసీసీ నేత కొప్పుల రాజు అన్నారు. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉప రాష్ట్రపతి పర్యటన

నేడు తునికి ఐసీఏఆర్–కృషి విజ్ఞాన కేంద్రం సందర్శన



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తెలంగాణలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. 25, 26తేదీల్లో మెదక్ జిల్లా, హైదరాబాద్‌ల్లో పర్యటిస్తారని మంగళవారం ఉప రాష్ట్రపతి కార్యాలయం తెలిపింది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న సహజ, సేంద్రియ రైతుల సదస్సుకు ధన్‌ఖడ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొంది. దేశంలోని వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, శాస్త్రవేత్తలు, జాతీయ సంస్థల డైరెక్టర్లతో ఉపరాష్ట్రపతి సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులతో ఆయన మాట్లాడతారు. వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ కూడా పాల్గొంటారు.

మెదక్ జిల్లాలో సీఎం పర్యటన నేడు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నారు. హెలికాప్టర్‌లో ముందుగా ఏడుపాయల వనదుర్గ మాతా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మెదక్ సీఎస్ఐ చర్చి శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. జిల్లాలో ఉపరాష్ట్రపతి, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది.

జనవరిలో జిల్లా అధ్యక్షుల ఎన్నిక

- ఈ నెలాఖరు నాటికి బూత్ స్థాయి ఎన్నికలు
- సంస్థాగత నిర్మాణంపై బీజేపీ కసరత్తు
- ఎంపీలు, ఎమ్మెల్యేలతో పార్టీ అధ్యక్షుడి సమావేశం

సాక్షి, హైదరాబాద్: పార్టీ సంస్థాగత నిర్మాణంపై బీజేపీ దృష్టిపెట్టింది. పార్టీ జిల్లాల అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియను జనవరి మొదటివారంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్‌బన్సల్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఇందులో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు, రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. బూత్, మండల కమిటీల ఎన్నికలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేయాలని తీర్మానించారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల నిర్వహణపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, గొడం నగేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల ఫొటో ఎగ్జిబిషన్‌ను కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సుధాన్షు త్రివేది ప్రారంభించారు.

పోలీసుల వైఫల్యంతోనే సంధ్య థియేటర్ ఘటన: రఘునందన్‌రావు

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన పోలీసుల వైఫల్యమేనని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. ఈ ఘటనపై శాసనసభలో తన మిత్రుని(అక్బరుద్దీన్)తో ప్రస్తావన చేయించి, కాంగ్రెస్ రాజకీయం చేసిందని విమర్శించారు. రేవతి కుటుంబ సభ్యులను తొలిరోజే కాంగ్రెస్ నేతలు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. పోలీసులు అనుమతి నిరాకరించినప్పుడు హీరోను ఇంటి నుంచి ఎందుకు బయటకు రానిచ్చారు? థియేటర్ దగ్గర బారికేడ్లు వేసి ఎందుకు అడ్డుకోలేదు? అని నిలదీశారు. బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఆందోళనను ఆయన తప్పుపట్టారు. కాంగ్రెస్‌కు అంబేడ్కర్ పేరెత్తే అర్హత కూడా లేదని దుయ్యబట్టారు.

కేసీఆర్, హరీశ్‌లకు ఊరట

భూపాలపల్లి కోర్టు విచారణపై హైకోర్టు స్టే

ప్రతివాదులకు నోటీసులు.. విచారణ జనవరి 7కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో నమోదైన ప్రైవేట్ పిటిషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట దక్కింది. ప్రైవేట్ పిటిషన్‌కు నంబర్ చేయాలని జూలై 10న సెషన్స్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులను నిలుపుదల చేసింది. భూపాలపల్లి ప్రధాన మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఆర్డర్‌పై పునర్విచారణకు అనుమతిస్తూ సెషన్స్ జడ్జి నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుబట్టింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు రివిజన్ పిటిషన్లను స్వీకరించడంలో కిందికోర్టుల పరిధి స్వల్పమని పేర్కొంది. కౌంటర్ దాఖలు చేయాలని అనధికారిక ప్రతివాది సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ జనవరి 7కు వాయిదా వేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో తమను ప్రతివాదులుగా చేరుస్తూ రామలింగమూర్తి దాఖలు చేసిన ప్రైవేట్ పిటిషన్ విచారణార్హం కాదని, కొట్టివేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రైవేట్ వ్యక్తి పిటిషన్ (ఫిర్యాదు)పై విచారణ జరిపే అధికార పరిధి సెషన్స్ జడ్జికి లేదన్నారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ మున్సిఫ్ మేజిస్ట్రేట్ తొలుత పిటిషన్‌ను కొట్టివేశారని గుర్తుచేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది టీవీ రమణారావు, ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సెషన్స్ జడ్జి నిర్ణయాన్నితప్పుబడుతూ ప్రైవేట్ పిటిషన్ విచారణపై స్టే ఇస్తూ, విచారణ వాయిదా వేశారు.



దేవుని యొద్దకు రండి, అప్పుడాయన మీ యొద్దకు వచ్చును.
పాపులారా, మీ చేతులను శుభ్రము చేసికొనుడి;
ద్విమనస్కులారా, మీ హృదయములను పరిశుద్ధ పరచుకొనుడి.
– క్రైస్తవ ధర్మం

సాక్షి
బుధవారం, 25 డిసెంబర్ 2024

హసీనా అప్పగింత సాధ్యమేనా?

బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచీ మన దేశానికి తలెత్తుతున్న దౌత్య సమస్యలకు తాజాగా మరొకటి వచ్చిచేరింది. గత ఆగస్టు నుంచీ భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని సోమవారం బంగ్లా విదేశాంగ శాఖ దౌత్య సందేశం పంపింది. హసీనా అవినీతి పాలనను వ్యతిరేకిస్తూ విద్యార్థుల నాయకత్వంలో జనాగ్రహం వెల్లువెత్తి ఆమె ఆ దేశం నుంచి నిష్క్రమించారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ మైనారిటీలకూ, హసీనా హయాంలో బాధ్యతలు నిర్వర్తించిన నేతలకూ, ఉన్నతాధికారులకూ గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. దాడులూ, దౌర్జన్యాలూ, నిర్బంధాలూ తప్పడం లేదు. ఆఖరికి న్యాయమూర్తుల్ని సైతం వెంటాడుతున్నారు. భయోత్పాతంలో ముంచెత్తుతున్నారు. చాలామంది అజ్ఞాతంలోకి పోయారు. దీన్నంతటినీ ఆపాలనీ, మైనారిటీలకు రక్షణ కల్పించాలనీ మన దేశం ఇప్పటికే బంగ్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కానీ కక్షపూరిత చర్యలు ఎక్కడా తగ్గిన దాఖలా లేదు. పైగా భారత మీడియా ఉన్నవీ లేనివీ కల్పించి తప్పుడు ప్రచారం చేస్తున్నదని అక్కడి ప్రభుత్వం ఆరోపిస్తోంది. అంతేకాదు... దానికి సమాంతరంగా అంతా బాగానే ఉన్నట్టు చూపించే ప్రయత్నం చేస్తోంది. 'న్యూయార్క్ టైమ్స్'లో వచ్చిన కథనమే ఇందుకు ఉదాహరణ. విద్యార్థి బృందాలు దేశాభివృద్ధికి, అవినీతి అంతానికి ప్రణాళికలు వేస్తున్నట్టు ఆ కథనం సారాంశం. మైనారిటీలు సురక్షితంగా ఉన్నట్టు ఆ వర్గాలతోనే చెప్పించారు. నోబెల్ శాంతి బహుమతి పొందిన యూనస్ పాలన తీరుతెన్నులు గమనిస్తే పరిస్థితులు ఆయన నియంత్రణలో ఉన్నట్టు కనబడదు. మైనారిటీల సంగతలావుంచి అసలు ముస్లిం మహిళలకే ఇబ్బందులు తప్పడం లేదు. మత ఛాందసవాదులు రంగంలోకి దిగి బురఖా ధరించని బాలికలనూ, మహిళలనూ నడిరోడ్లపై పంచాయతీలు పెట్టి హింసిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. హసీనా ఏలుబడిలో అవినీతి పెరిగిందనటంలో సందేహం లేదు. పదవి కాపాడుకొనేందుకు ఎన్నికల ప్రక్రియను ఏమార్చారన్న ఆరోపణల్లో కూడా నిజం వుంది. కానీ దానికి విరుగుడు ఈ అరాచకమా?!

ప్రభుత్వాలను కూలదోసిన సందర్భాల్లో పాలకులు పరారీ కావటం, వేరేచోట ఆశ్రయం పొందటం అసాధారణమేమీ కాదు. హసీనా ఢిల్లీకి ఆదరా బాదరాగా వచ్చినా ఇక్కడినుంచి లండన్ వెళ్లాలని ప్రయత్నించారు. కానీ బ్రిటన్ ఆమె వినతిని తోసిపుచ్చింది. బంగ్లాలో హఠాత్తుగా బయల్దేరిన ఉద్యమానికి అమెరికా ఆశీస్సులున్నాయని ఆరోపణలొచ్చిన నేపథ్యంలో బ్రిటన్ ఆమె వినతిని తిరస్కరించటంలో వింతేమీ లేదు. కానీ ఆమెను అప్పగించాలని కోరిన వెంటనే మన ప్రభుత్వం అందుకు అంగీకరించటం సాధ్యమేనా? చట్టబద్ధ పాలన ఆనవాళ్లు లేవు సరికదా... ఎడాపెడా కక్షపూరిత విధానాలు అమలవుతున్నప్పుడు కోరిన వెంటనే ఒక మాజీ అధినేతను అప్పగిస్తారని బంగ్లా ఎలా అనుకుంది? ఉగ్రవాదుల ఆటకట్టించేందుకు వీలుగా రెండు దేశాలూ 2013లో నేరస్తుల అప్పగింత ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. తగిన సాక్ష్యాధారాలు అందజేశాకే నేరస్తుల్ని అప్పగించాలని ఉన్న నిబంధనను కాస్తా వారెంటు జారీ అయితే చాలు అప్పగించవచ్చని సవరిస్తూ 2016లో ఆ ఒప్పందాన్ని సరళం చేశారు. కానీ తనపై పెట్టిన కేసులు న్యాయసమ్మతమైనవి కాదని, అందువల్ల అప్పగింత వినతిని తిరస్కరించాలని హసీనా మన ప్రభుత్వాన్ని కోరుకోవచ్చు. రాజకీయ కారణాలతో అప్పగించాలని కోరితే తిరస్కరించొచ్చని ఒప్పందంలోని నిబంధనలే చెబుతున్నాయి. సంక్లిష్టమైన ఈ ప్రక్రియంతా పూర్తికావటానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో హసీనా విషయంలో అక్కడి న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా వ్యవహరిస్తుందన్న విశ్వాసం తమకు లేదని మన ప్రభుత్వం చెప్పే అవకాశం కూడా ఉంది. ఒకవేళ మన దేశం అందుకు సంసిద్ధత చూపినా హసీనా మన కోర్టుల్ని ఆశ్రయించి ఉపశమనం పొందుతారు. బ్రిటన్‌తో మనకు నేరస్తుల అప్పగింత ఒప్పందం ఉన్నప్పటికీ రుణాలు తీసుకుని బ్యాంకులను వేలాది కోట్ల రూపాయల మేర మోసగించి పరారైన వ్యాపారవేత్త విజయ్ మాల్యా వంటివారిని రప్పించటం అసాధ్యమవుతున్నది. మన దేశంలో ఉగ్రవాద ఘటనలకు పాల్పడి పరారీలో ఉన్న నేరగాళ్లను పట్టి అప్పగించటానికి కొన్ని యూరప్ దేశాలు నిరాకరిస్తున్నాయి. మన న్యాయవ్యవస్థ, జైళ్లు ప్రామాణికంగా లేవన్న కారణాలు చూపుతున్నాయి.

అసలు తన ప్రస్థానం ఏ విధంగా కొనసాగించదల్చుకున్నదో బంగ్లాదేశ్ నిర్ధారించుకోవాలి. ఆ దేశ ఆవిర్భావానికి మూలకారణమైన 'బెంగాలీ భావన'కు తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోంది. బంగ్లా విముక్తిని తాము గుర్తించబోమని చెప్పే ఘనులు తయారవుతున్నారు. అడుగడుగునా మత ఛాందసుల ప్రాబల్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. మన దేశంతో సంబంధాల పునరుద్ధరణకు నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకొనేందుకు బంగ్లా ఇంతవరకూ సిద్ధపడలేదు. పైగా పాకిస్తాన్‌తో అంటకాగేందుకు ఉత్సాహపడుతోంది. 53 యేళ్ల క్రితం ఒక దేశంగా ఆవిర్భవించటానికి ముందు పాక్ సైనిక పాలకులు తమను ఎంత దారుణంగా అణచేశారో ఈ తరం మరిచిపోయి ఉండొచ్చు. 30 లక్షలమందికి పైగా ప్రజల బలిదానాలతో ఏర్పడిన దేశం కళ్లముందు కుప్పకూలుతుంటే నిశ్చేష్టులై ఉండిపోవటం విషాదకరం. అత్యంత విషమ పరిస్థితుల్లో కూడా ఎంతో అప్రమత్తతతో, వివేకంతో వ్యవహరించిన శ్రీలంక పౌరులను ఆదర్శంగా తీసుకుంటేనే దేశానికి మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని బంగ్లా ప్రజలు తెలుసుకోవాలి.

దార్శనికత గల రాజనీతిజ్ఞుడు



నరేంద్ర మోదీ
భారత ప్రధాని


దేశ ప్రజలు తమ ప్రియతమ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి (డిసెంబర్ 25)ని జరుపుకొంటున్న వేళ ఇది. ఆయన ఎంతో మందికి ప్రేరణను ఇస్తూ ఒక రాజనీతి కోవిదునిగా సమున్నత స్థానంలో నిలిచారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఆయన సామాన్య పౌరుల కష్టాలను అర్థం చేసుకున్నారు. ప్రభుత్వానికి దక్షత ఉంటే ఎంతటి పరివర్తనను తీసుకురావచ్చో చేతల్లో చూపించారు. దేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపిన మహనీయునిగా అటల్‌జీకి దేశ ప్రజలు ఎన్నటికీ రుణపడి ఉంటారు.

అటల్‌జీ 1998లో ప్రధానిగా పదవిని స్వీకరించిన తరుణంలో మన దేశం రాజకీయ అస్థిరత్వంతో కొట్టుమిట్టాడుతోంది. దాదాపు తొమ్మిదేళ్లలో నాలుగు సార్లు లోక్‌సభకు ఎన్నికలు జరగడాన్ని మనం చూశాం. దేశ ప్రజానీకం సహనాన్ని కోల్పోతూ, ఈ ప్రభుత్వాలు వాటి బాధ్యతను సమర్థంగా నెరవేర్చ గలుగుతాయా? అనే అనుమానంలో పడిపోయారు. ఈ స్థితిని అటల్‌జీ మార్చి స్థిరమైన, ప్రభావవంతమైన పాలనను అందించారు.

అటల్‌జీ నాయకత్వం ఎన్నో రంగాల్లో గణనీయ ప్రభావాన్ని చూపించింది. ఆయన పదవీ కాలంలో సమాచార సాంకేతిక విజ్ఞానం (ఐటీ), టెలికం, కమ్యూనికేషన్స్ రంగాల్లో గొప్ప పురోగతి చోటు చేసుకొంది. యువశక్తి అత్యంత చైతన్యవంతంగా ఉన్న భారత్ వంటి దేశానికి ఇది చాలా ముఖ్యం. అటల్‌జీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం టెక్నాలజీని సామాన్య పౌరులకు అందుబాటులోకి తేవడానికి శ్రద్ధ తీసుకుంది. భారత్‌లో సంధాన సదుపాయాల కల్పన విషయంలోనూ ముందుచూపు కనిపించింది. స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టును ఈనాటికీ చాలామంది గుర్తు పెట్టుకుంటున్నారు. ఇది దేశంలో అనేక ప్రాంతాలను అనుసంధానం చేసింది. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన వంటి కార్యక్రమాలను అమలుచేయడం ద్వారా స్థానికంగా కూడా సంధానాన్ని పెంపొందింప చేయడానికి వాజ్‌పేయి ప్రభుత్వం చేసిన కృషి అంతే గుర్తించదగ్గది. ఇదే మాదిరి ఆయన ప్రభుత్వం ఢిల్లీ మెట్రోను ఏర్పాటు చేయడానికి పడ్డ శ్రమ అంతా ఇంతా కాదు. ఢిల్లీ మెట్రోకు ఒక ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల రంగ ప్రాజెక్టు అనే పేరు ప్రఖ్యాతులున్నాయి. వాజ్‌పేయి ప్రభుత్వం ఆర్థిక వృద్ధిని పెంచడమే కాక, దూరదూరాల్లో ఉన్న ప్రాంతాలను చేరువచేసి ఏకత, సమగ్రత వర్ధిల్లేటట్టు చూసింది.

సర్వ శిక్షా అభియాన్ వంటి కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రజలకు, ముఖ్యంగా పేదలకూ, సమాజంలో ఆదరణకు నోచుకోకుండా ఉండిపోయిన వర్గాలకూ ఆధునిక విద్యను అందుబాటులోకి తేగలిగే భారత దేశాన్ని ఆవిష్కరించాలన్న అటల్‌జీ కలను గురించి చెబుతుంది. ఆశ్రిత పక్షపాతం, దశాబ్దాల పాటు ఎదుగూబొదుగూ లేని ఆర్థిక విధానాలతో సాగిన దేశంలో... అనేక ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టేందుకు ఆయన ఆధ్వర్యంలోని ప్రభుత్వం చొరవ తీసుకుంది.

వాజ్‌పేయి అద్భుత నాయకత్వానికో చక్కటి ఉదాహరణ 1998 వేసవి. ఆయన ప్రభుత్వం అప్పుడే పదవీ బాధ్యతలు చేపట్టింది. వెంటనే మే 11న పోఖ్రాన్‌లో అణు పరీక్షలను నిర్వహించింది. 'ఆపరేషన్ శక్తి' పేరిట జరిగిన ఈ పరీక్షలు భారత శాస్త్రవేత్తల శక్తిని నిరూపించాయి. భారత్ ఈ రకమైన పరీక్షలను నిర్వహించడమా? అని ప్రపంచం విస్తుపోయింది. ప్రపంచ దేశాలు వాటి ఆగ్రహాన్ని స్పష్టంగా వ్యక్తం చేశాయి. ఆ సమయంలో ఏ సామాన్య నేత అయినా ఒత్తిడికి తలొగ్గేవారు. కానీ, అప్పుడు జరిగిందేమిటి? భారత్ దృఢంగా నిలబడటమే కాక, మరో రెండు రోజుల తరువాత అంటే మే 13న రెండో దఫా పరీక్షలు నిర్వహించింది. 11వ తేదీ పరీక్షలు విజ్ఞానశాస్త్ర నైపుణ్యాన్ని చాటితే, 13వ తేదీన నిర్వహించిన పరీక్షలు సిసలైన నాయకత్వం అంటే ఏమిటో రుజువుచేశాయి. బెదిరింపులకో, ఒత్తిడికో



అటల్ బిహారీ వాజ్‌పేయి

లొంగిపోయే రోజులు గతించాయని ప్రపంచానికి ఆయన ఒక సందేశాన్ని పంపారు. అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం అంతర్జాతీయ ఆంక్షల్ని ఎదుర్కొంటూనే గట్టిగా నిలబడింది. భారత్ తన సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకొనే హక్కును నిలబెట్టుకొంటూ, ప్రపంచ శాంతిని బలంగా సమర్థించే దేశంగా కూడా నిలిచింది.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థను, దాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని అటల్‌జీ అర్థం చేసుకున్నారు. దేశ రాజకీయాల్లో సంకీర్ణాలను పునర్నిర్వచించిన ఎన్డీఏకు ఆయన నాయకత్వం వహించారు. ఆయన రాజకీయ ప్రయాణంలో అడుగడుగునా రాజనీతిజ్ఞత కనిపిస్తుంది. గుప్పెడు మంది ఎంపీలున్న పార్టీకి చెందిన వ్యక్తి అయినప్పటికీ ఆయన మాటలు శక్తిమంతమైన కాంగ్రెస్ పార్టీని గడగడలాడించేవి. ప్రధానమంత్రిగా తనదైన శైలిలో విపక్షాల విమర్శలను తిప్పి కొట్టేవారు. తనను ద్రోహిగా ముద్ర వేసే స్థాయికి కాంగ్రెస్ దిగజారినప్పటికీ ఎవరిపైనా ద్వేషం పెంచుకోలేదు.

అధికారం కోసం ఏనాడూ ఆయన అవకాశవాద రాజకీయాలకు పాల్పడలేదు. 1996లో ప్రతికూల పరిస్థితుల్లో సైతం రాజీనామా చేయడానికి మొగ్గు చూపారే తప్ప బేరసారాలకు పాల్పడలేదు. 1999లో కేవలం ఒక్క ఓటు తేడాతో ఆయన ప్రభుత్వం కూలిపోయింది. ఆ సమయంలో జరిగిన అనైతిక రాజకీయాలను సవాలు చేయమని చాలా మంది చెప్పినప్పటికీ, న్యాయబద్ధంగానే ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. చివరకు అద్భుతమైన ప్రజాతీర్పుతో తిరిగి అధికారాన్ని చేపట్టారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదానం ఆయన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. కొన్నేళ్ల తర్వాత జరిగిన ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో ఆయన ప్రధాన భూమిక పోషించారు. ఆత్యయిక పరిస్థితి తర్వాత, 1977 ఎన్నికలకు ముందు తాను స్థాపించిన (జన్ సంఘ్) పార్టీని జనతా పార్టీలో విలీనం చేసేందుకు అంగీకరించారు. ఇది ఆయనతో పాటు ఇతరులను సైతం బాధించిన నిర్ణయమని నేను భావిస్తున్నాను. కానీ రాజ్యాంగాన్ని పరిరక్షించడమే ఆయనకు ప్రధానం.

భారతీయ సంస్కృతితో అటల్‌జీ ఎంతగా మమేకమయ్యారో కూడా గమనించాల్సిందే. విదేశీ వ్యవహారాల మంత్రిగా ఐక్యరాజ్య సమితిలో హిందీలో ప్రసంగించిన తొలి భారతీయ నేతగా నిలిచారు. భారతీయ వారసత్వం, గుర్తింపు పట్ల ఆయన ఎంత గర్వంగా ఉండేవారో చెప్పడానికి అంతర్జాతీయ వేదికపై చెరగని ముద్ర వేసిన ఈ ఒక్క ఉదాహరణ చాలు.

ఆయన ఓ గొప్ప రచయిత, కవి. స్ఫూర్తి నింపేందుకు, ఆలోచనలను రేకెత్తించేందుకు, ఓదార్పును అందించేందుకు తన మాటలను ఉపయోగించేవారు. ఆయన అంతర్మథనానికి, దేశం పట్ల ఉన్న ఆకాంక్షలకు ఆయన కవిత్వం అద్దం పడుతుంది.

అటల్‌జీతో సంభాషించే, నేర్చుకొనే అవకాశం దక్కడం నాలాంటి ఎంతో మంది భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఓ గొప్ప వరం. బీజేపీకి ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివి. పార్టీ తొలినాళ్ళ నుంచి ఎటువంటి సవాళ్లు ఎదురైనప్పటికీ ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి లాంటి దిగ్గజాలతో కలసి వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ పార్టీని విజయపథంలో నడిపించారు. సిద్ధాంతం, అధికారం మధ్య ఒకదాన్ని ఎంచుకోవాల్సిన సందర్భాలు ఎదురైతే ఆయన మొదటిదానినే ఎంచుకొనేవారు.

అటల్‌జీ శత జయంతి వేళ ఆయన ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేందుకు మనల్ని మనం పునరంకితం చేసుకోవాలి. ఆయన అనుసరించిన సుపరిపాలన, ఐక్యత, ప్రగతి అనే నియమాలను ప్రతిబింబించే భారత్‌ను నిర్మించడానికి మనం కృషి చేద్దాం. మన దేశ సామర్థ్యంపై అటల్‌జీకి ఉన్న అచంచలమైన విశ్వాసం ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, కష్టపడి పనిచేసేలా మనల్ని ప్రేరేపిస్తుంది.

(మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి ముగింపు నేడు.)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నిషేధం తొలగినట్టేనా?



'భాష అనేది ధైర్యం: ఒక ఆలోచనను కల్పించగలిగే సామర్థ్యం, దాన్ని మాట్లాడటం, అలా చేయడం ద్వారా దాన్ని నిజం చేయడం...' అంటారు సల్మాన్ రష్దీ. ఎట్టకేలకు 36 ఏళ్ల నిషేధం తర్వాత సల్మాన్ రష్దీ నవల 'ద సతానిక్ వర్సెస్'ను ఇండియాలో అమ్మడానికి అనుమతించారు. (న్యూఢిల్లీలోని ఒక బుక్ స్టోర్‌లో ఉన్న కాపీల ఫొటో పెట్టారు.)

– మానసి సుబ్రమణియం, సంపాదకురాలు

చూపాల్సిన గౌరవం



'కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా' ఆతిథ్యమిచ్చిన క్రిస్మస్ వేడుకల్లో నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఇది మంచి విషయం. భిన్న విశ్వాసాల దేశంలో అత్యున్నత స్థాయిలో ఉన్న ఎవరైనా విధిగా అన్ని ప్రధాన మతాల పట్ల బహిరంగంగా గౌరవం చూపించాలి.

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

బ్రిక్స్ విస్తరణ



అధికారికంగా 'బ్రిక్స్'లో 9 కొత్త దేశాలు 2025 జనవరి 1 నుంచి భాగమవుతున్నాయి: బెలారస్, బొలీవియా, క్యూబా, ఇండోనేషియా, కజక్‌స్థాన్, మలేషియా, థాయిలాండ్, ఉగాండా, ఉజ్బెకిస్తాన్. తన మిత్రదేశాలను నిందించని స్థిరమైన ప్రభుత్వం కోసం ప్రపంచం ఎదురు చూస్తోంది.

– హెంద్ ఫైజల్ అల్ ఖసీమీ, యూఏఈ యువరాణి

మంచి సంకేతం



ఒత్తిడి అనేది ప్రయాణంలో భాగం. వైఫల్యం అనేది ప్రయాణంలో భాగం. నిరాశ అనేది ప్రయాణంలో భాగం. అదేమీ చెడ్డది కాదు. ఎంతో కొంత మంచి చేస్తున్నావన్నదానికి సంకేతం.

– స్టయిన్ నూర్‌మాన్, వ్యాపార సలహాదారు

అత్యుత్తమ అలవాట్లు



అత్యుత్తమ ఎనర్జీ డ్రింక్? 3 లీటర్ల నీళ్లు. అత్యుత్తమ ఫోకస్ బూస్టర్? 8 గంటల నిద్ర. అత్యుత్తమ యాంటీ డిప్రెసంట్? 45 నిమిషాల వ్యాయామం. సాధారణ అలవాట్లు, పెద్ద ఫలితం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఇదొక అరుదైన వ్యాధి

ప్రముఖ తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకిర్ హుస్సేన్ డిసెంబర్ 15న మరణించారు. ఇందుకు కారణమైన వ్యాధి చాలా అరుదైనది. దాని పేరు 'ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్' (ఐపీఎఫ్). ఇడియోపతిక్ వ్యాధులంటే... కారణం తెలియని వ్యాధులు అని అర్థం. సైన్స్ ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ కారణం తెలియని వ్యాధులు ఇప్పటికీ ఎన్నో ఉన్నాయి.

మానవ దేహంలో ఊపిరితిత్తులు చాలా కీలక పాత్ర పోషిస్తాయి. ఈ ఊపిరితిత్తులు కొన్ని లక్షల గాలి సంచులు లేదా వాయు గోళాల (అల్వియోలై)తో నిర్మితమై ఉంటాయి. వాయు గోళాలు ఆక్సిజన్/ కార్బన్ డై యాక్సైడ్ పరస్పర మార్పిడి కేంద్రాలు. ఐపీఎఫ్ వ్యాధిలో వాయుగోళాలూ, వాటి చుట్టూ ఉండే కణజాలాలూ మందంగా తయారై బిగుసుగా తయారవుతాయి. మృదువుగా ఉండే కణజాలాలు మందబడటం (స్కారింగ్/ ఫైబ్రోసిస్/ మచ్చలు బారడం) వల్ల అవి వాయు మార్పిడి సామర్థ్యాన్ని కోల్పోతాయి. దీని మూలంగా శరీరానికి కావల్సినంత ఆక్సిజన్ సరఫరా జరుగదు. ఈ పరిస్థితి క్రమేణా మరింత పెరిగి ఊపిరితిత్తుల సామర్థ్యం చాలా తగ్గుతుంది. అవసరమైన స్థాయిలో శరీరానికి ఆక్సిజన్ సరఫరా ఉన్నప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉంటాడు. ఆక్సిజన్ సరిపడా అందనపుడు శరీరంలో వివిధ అవయవాలు తమ విధులు నిర్వర్తించలేవు.



ఉస్తాద్ జాకిర్ హుస్సేన్

ఈ వ్యాధి లక్షలో 20 మందికి వచ్చే అవకాశం ఉంది. దీనిని గుర్తించడం చాలా కష్టం. లక్షణాలు కనిపించినప్పటి నుండి వ్యాధిని గుర్తించేందుకు ఒకటి నుండి మూడు సంవత్సరాలు పడుతుంది. టీబీ, ఐపీఎఫ్ లక్షణాలు ఒకేలా ఉండటం వల్ల వ్యాధిని నిర్ధారించడం సంక్లిష్టం. ధూమ పానం చేసే వారిలో, గతంలో ధూమ పానం అలవాటు ఉన్నవారిలో, 50 ఏళ్ల వయసు దాటిన వారిలో, గతంలో కుటుంబంలో ఎవరికయినా ఈ వ్యాధి సోకిన వారిలో ఐపీఎఫ్ వచ్చే అవకాశాలు ఎక్కువ. దుమ్ము, ధూళి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో; లోహ, కలప ధూళి వ్యాపించి ఉన్న ప్రాంతాల్లో నివసించే వారికి ఈ వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువ. వైరల్ ఇన్ఫెక్షన్, జీర్ణకోశ వ్యాధుల వల్ల కూడా ఈ వ్యాధి రావచ్చు.

శ్వాసలో ఇబ్బంది, పొడి దగ్గు, ఆయాసం, ఆకస్మికంగా బరువు కోల్పోవడం, కండరాలు మరియు కీళ్ళ నొప్పులు, చేతి మరియు కాలి వేళ్ళు గుండ్రంగా మారడం, ఆకలి మందగించడం, ఉమ్మిలో తెమడ, దగ్గినప్పుడు రక్తం పడటం, ఛాతీలో నొప్పి, గురక వంటి లక్షణాలు క్రమేణా పెరిగి శ్వాస తీసుకోవడం చాలా కష్టం అవుతుంది. రోజు వారీ పనులు కూడా నిర్వర్తించలేని స్థితి వస్తుంది. చివరికి ప్రాణాంతకంగా మారుతుంది. రెండు వారాల కన్నా ఎక్కువగా పై లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

ఊపిరితిత్తుల సీటీ స్కాన్, రక్త పరీక్షలు, ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష, నడక సామర్థ్య పరీక్ష, బయాప్సీ ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. వివిధ రకాల ఔషధాలు ప్రయోగాత్మకంగా వాడుతున్నప్పటికీ కచ్చితమైన చికిత్సా విధానం అందుబాటులో లేదు. కృత్రిమంగా ఆక్సిజన్ అందించడం ద్వారా వ్యాధి ప్రభావాన్ని తగ్గించవచ్చు. అరుదైన కేసులలో ఊపిరితిత్తుల మార్పిడి చేస్తారు.

– డా॥ అనుమాండ్ల వేణుగోపాల రెడ్డి । 99481 06198

చెదిరిన జీవితాలు... వీడని జ్ఞాపకాలు!

సందర్భం



డా॥ టి. సంపత్ కుమార్

డిసెంబర్ 26వ తేదీ వచ్చిందంటే విషాద ఛాయలు ఆవరిస్తాయి. సునామీ మన దేశపు సముద్రపు తీరప్రాంతాన్ని 2004 డిసెంబర్ 26 నాడు ఎంత గట్టి దెబ్బ కొట్టిందో... ఆ క్రమంలో చోటుచేసుకున్న అన్ని దృశ్యాలూ నా కళ్లముందు ప్రత్యక్షమవుతాయి.

నేను కెనడియన్ హైకమిషన్ ఢిల్లీ కార్యాలయంలో సీనియర్ సలహాదారునిగా పనిచేసి 2015లో పదవీ విరమణ చేశాను. నా ఉద్యోగ బాధ్య తల్లో ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన పని ఒక కీలక భాగం. విశాలమైన మన దేశంలో ఏడాదంతా ప్రకృతి వైపరీత్యాలు పలురూపాల్లో (వరదలు, కరువు, అకాల వర్షాలు, భూకంపాలు, తుఫానులు, అడవి కార్చిచ్చులు, వేడి–చలిగాలులతో చావులు) జీవజాలాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ప్రాణ నష్టంతో పాటు మౌలిక వసతుల్ని నాశనంచేసి... సవాళ్లను ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగాలకు వదిలేసి వెనుదిరిగి పోతాయి.

ప్రకృతి వైపరీత్యాలతో నా బంధం 1999 అక్టోబర్ 29 నాడు ఒరిస్సాలో వచ్చిన సూపర్ సైక్లోన్‌తో మొదలయ్యింది. అదొక పెద్ద విషాదం. ఇరవై వేలకి పైగా జనాన్ని పొట్టన పెట్టుకొంది. ఆ తర్వాత రెండు సంవత్సరాలకే అంటే 2001 జనవరి 26న (రిపబ్లిక్ డే) గుజరాత్‌లోని భుజ్ ప్రాంతాన్ని కుదిపిన బలమైన భూకంపం వచ్చింది. ఉద్యోగ రీత్యా ఫీల్డ్ విజిట్ కోసం వెళ్ళాను. వందశాతం నెలకొరిగిన గ్రామాలను చూసి చలించి పోయాను. విధ్వంసపు తీవ్రతని కళ్ళారా చూశాక, జీవితంలో మొదటిసారిగా నాకు నోట మాటరాలేదు. బాంబుల దాడికి సంపూర్ణంగా నాశనమైన గ్రామాల మధ్యలో నడుస్తున్న భావన. కూలిన ఇండ్లు, విసిరి పడేసినట్టుగా ఇంటి సామాన్లు, పిల్లల వస్తువులు, చెల్లాచెదురుగా పడి ఉన్న దేవుళ్ళ పటాలు, పెళ్లి ఫోటోలు... ఎనభై సెకండ్ల భూకంపానికి చిన్నా భిన్నమైన జన జీవన దృశ్యాలు! నాలోని రచయిత ఏదైనా రాద్దాం (కథో, నవలో...) అనే ఆలోచనల్లో పడి ఓ వైపు సామగ్రినంతా చక్కగా అమర్చి పెట్టు కొన్నాను. కథలో మరణమృదంగం ఇమడలేదు. బలమైన వస్తువు కదా... నవల రాద్దాం అంటే సమయం దొరకలేదు.

గుజరాత్ భూకంపపు ప్రాజెక్టుల్ని పూర్తిచేసి కాస్త ఊపిరి పీల్చుకొంటున్నామో లేదో, 2004 డిసెంబర్ రానే వచ్చింది. సునామీతో మనదేశపు



తూర్పుతీర ప్రాంతాన్ని చావుదెబ్బ కొట్టింది. మన దేశంతో సహా పదమూడు దేశాల్లో మహా బీభత్సాన్ని వదిలి వెళ్లింది సముద్రం. మనదేశంలో ఇరవై వేలకి పైగా చనిపోయారంటారు. కానీ అంతకంటే ఎక్కువే అని అనధికారికంగా చెబుతుంటారు. జనవరి (2005) మొదటి వారంలో ఫీల్డ్ విజిట్ మొదలు పెట్టి రెండువారాలు మూడు రాష్ట్రాల్లో (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ) దెబ్బ తిన్న ప్రదేశాల్ని చూస్తూ తిరిగాను. ఎన్నో కష్టాల కోర్చి అంకిత భావంతో పనిచేస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థలను కలిశాను. ప్రభావితులైన వారి స్థితి ఏంటి? తక్షణ అవసరాలేమిటి? ఎవరు ఎలాటి సహాయ కార్యక్ర మాలను చేపట్టారు? దాతలు సహాయాన్నందించడానికి ఎలా ముందుకు వస్తున్నారు వంటి విష యాలపై ఒక అవగాహన కోసం ఎందరినో కలి శాను. మూడు రాష్ట్రాలూ పుస్తకాల్లో దొరకని జ్ఞానపు గనుల్ని నా ముందుకు తెచ్చాయి. 2009 వరకు కెనడా దేశం ఆర్థిక సహాయాన్నిచ్చిన ప్రాజె క్టులు పూర్తయ్యాయి.

ప్రాజెక్టు పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ నాలోని రచయిత ఏం రాయాలా అని ఆలోచిస్తూ ఉన్నాడు. అప్పుడే ఊపు అందుకొంటున్న 'నానీల' ప్రక్రియ పట్ల ఆకర్షితుడనై, 'సునామీ నానీలు' అనే 45 పేజీల పుస్తకాన్ని వంద నానీలతో ప్రచురించి సునామీ వచ్చి సంవత్సరం పూర్తికాకముందే ప్రచురించాను. నాకు గొప్ప తృప్తినిచ్చింది. తరువాత ఇది ఇంగ్లీష్, హిందీ భాషల్లోకి అనువదింపబడి రెండు భాషల సాహితీ ప్రియులకీ చేరింది. ఈ చిరు పుస్తకాల అమ్మకాలతో వచ్చిన డబ్బుని (రూ. 37,000) రెండు స్వచ్ఛంద సేవా సంస్థలకు విరాళంగా ఇచ్చాను.

ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఫైళ్లని మూసేశాము. మళ్ళీ ఆ ప్రదేశాల్ని తిరిగి చూసే అవకాశాలు రావు. అయిదేళ్లగా తరచుగా వెళ్లి తిరిగిన ప్రాజెక్టు ప్రాంతాల్లో ఇరవై సంవత్సరాల్లో చాలా మార్పులు తప్పక వచ్చి ఉంటాయి. అప్పటి పిల్లలు యువకులైపోయుంటారు. మధ్య వయస్కులు అరవై దాటి వృద్ధాప్యంలోకి అడుగు పెట్టి ఉంటారు. పిల్లల్ని కోల్పోయిన తల్లులు మళ్ళీ పిల్లల్ని కని ఉంటారు. వారందరి మోహాలపై నవ్వుల్ని చూసే అవకాశం రాదు. రానే రాదు. అందరూ సునామీ తమకి మిగిల్చిన విషాదాన్ని పీడ కలగా భావించి ఆశావాదంతో నెమ్మదిగా నిలదొక్కుకొంటూ, కాలక్రమేణా ముందుకు దూసుకు పోయి ఉంటారని ఊహించుకొంటూ ప్రతి డిసెంబర్ చివరివారం గడుపుతుంటాను.

వ్యాసకర్త ఢిల్లీలోని కెనడియన్ హైకమిషన్‌లో మాజీ సీనియర్ సలహాదారు
(2004 నాటి సునామీకి రేపటితో ఇరవై ఏళ్లు)

క్రీస్తు తాత్వికత

ప్రేమయే క్రీస్తుని ప్రాథమిక మూల తత్త్వం. ఆ ప్రేమతోనే ప్రజలందరినీ తన చెంతకు చేర్చుకున్నాడు. ఆ చేర్చుకోవడంలో నీ, నా, తన, మన లేకుండా; ధనిక, పేద అనే తేడాల్లేకుండా పిలిచాడు. ఆ ప్రేమను ఒకరికొకరు పంచుకోమన్నాడు. పరస్పరం ప్రేమించుకోమన్నాడు. నీవలె సాటి, తోటి వారిని... ఇంకా చెప్పాలంటే పొరుగు శత్రువుల్ని సైతం ప్రేమించమన్నాడు. తప్పులుంటే ఆ ప్రేమ తత్త్వంతోనే ఒకరినొకరు క్షమించుకోమన్నాడు. నీవు ఆరాధించే వానినీ, జపించే దేవుడ్నీ అందరిలోనూ చూడమన్నాడు. ఆ ప్రేమతోనే పరుల్ని నిందించ వద్దనీ, ఊహలతో కల్పనాభరితంగా వారి గురించి తప్పుడు ప్రచారం చేయొద్దనీ, మాటలతో కటువుగా దూషించ వద్దనీ, చేతలతో హింసించ వద్దనీ, నీ సుఖమొక్కటే చూచుకోవద్దనీ అన్నాడు. పర హితార్థమే త్యాగం చేయమన్నాడు. ఆ తాత్విక సూత్రాన్నే చేసి చూయించాడు.



తనకు అద్భుతాలు చేసే శక్తి ఉన్నప్పటికీ పరుల వల్ల శిలువపై చిత్ర హింసలతో మౌనం వహించి అన్నిటినీ భరించి మరణించింది అందుకే... ఈ తత్త్వం నేర్పించడానికే మరి. ఆ ప్రేమ ఇతరుల కష్ట నష్టాల్లో ఓదార్చింది. దీనులకు అనంత ధైర్యాన్నిచ్చింది. కుంగిపోతున్న వారికి కొండంత ధైర్యాన్నిచ్చింది. ఆ ప్రేమ తత్త్వమే విర్ర వీగే అహంకారుల్ని వినయంగా ఉండమని చెప్పింది. నా అనే స్వార్థాన్ని విడిచి 'అందరూ నా వాళ్ళే' అని ప్రకటించింది. తన తల్లికీ, తండ్రికీ, చెల్లికీ మాత్రమే సంకుచితం కాకుండా... ఆ ప్రేమ సూత్రం అనంత ప్రజా కోటికై నిలబడి నేర్పించింది.

ఆ ప్రేమ సూత్రమే ఇక్కడ చలామణి అయ్యే మూఢ భావాల చీకటిలో వెలుగుగా ప్రసరిస్తూ ఉంది. అయోమయ పరిస్థితుల్లో పరిష్కార మార్గం చూపిస్తూ ఉంది. అదే ప్రేమ తత్త్వం ఈ ప్రజల్లో నానాటికీ కొత్త బీజాలతో మొలకెత్తి ఇంకా ఈ విశ్వానికి ఒక మహత్తర సందేశంలా వినబడుతూనే ఉంది. ఎన్నటికీ చెరగని ఒకానొక నిత్య తత్త్వంగా ప్రజలకై నిలబడి ఉంది.

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు
(నేడు క్రిస్మస్ పర్వదినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.దశమి రా.9.33 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** చిత్త ప.3.14 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.9.26 నుండి 11.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.41 నుండి 12.29 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.00 నుండి 9.47 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.31, **సూర్యాస్తమయం:** 5.28.

79,40,520 ఎకరాల్లో యాసంగి సాగు

సాగు ప్రణాళికను ఖరారు చేసిన వ్యవసాయ శాఖ

- అత్యధికంగా 63.20 లక్షల ఎకరాల్లో వరి సాగు
- సాధారణంకంటే 16 లక్షల ఎకరాలు అధికం
- 7.18 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు అంచనా
- అవసరానికంటే అధికంగానే విత్తనాలు, ఎరువులు సిద్ధం
- వ్యవసాయశాఖ అధికారుల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి సీజన్ సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. మొత్తం 79,40,520 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో ఒక్క వరి పంటే 63,54,288 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేసింది. రాష్ట్రంలో యాసంగిలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 47,27,000 కాగా, ఈసారి అదనంగా 15.86 లక్షల ఎకరాల్లో సాగవుతుందని లెక్కగట్టింది. వరి తరువాత మొక్కజొన్న 7,18,100 ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ పంట సాధారణ సాగు విస్తీర్ణం 5,89,098 ఎకరాలు కాగా.. ఈసారి అదనంగా 1.30 లక్షల ఎకరాల్లో సాగవుతుందని లెక్కలు వేశారు. స్వీట్‌కార్న్ (తీపి మొక్కజొన్న) కూడా 950 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు తెలిపారు. వీటి తరువాత స్థానంలో వేరుశనగ ఉంది. ఈ పంట సాధారణ సాగుకన్నా కొంచెం ఎక్కువగా 2,57,600 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అంచనా వేశారు. జొన్నలు 1,42,900 ఎకరాల్లో, మినుములు 49,250 ఎకరాల్లో, కుసుమలు 23,100 ఎకరాల్లో సాగు కానున్నట్లు ప్రతిపాదించారు.

గత యాసంగి కన్నా అధికం..

గత సంవత్సరం యాసంగితో పోలిస్తే ఈసారి దాదాపు 12 లక్షల ఎకరాలకుపైగా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. 2023 యాసంగిలో 67,83,358 ఎకరాల్లో పంటలు వేయగా, అందులో వరి వాటా 55 లక్షల ఎకరాలు. మొక్కజొన్న, పప్పులు, చిరుధాన్యాలు, నూనె గింజలు తదితర అన్ని పంటలు కలిపి 12 లక్షల ఎకరాలకు పైగా సాగైనట్లు వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. గడిచిన వానాకాలం సీజన్‌లో సుమారు కోటి ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయగా, అందులో వరి ఒక్కటే 66.78 లక్షల ఎకరాల్లో వేశారు. వానాకాలం సాగుకు దాదాపు సమానంగా ఈసారి యాసంగిలో వరి సాగు ఉంటుందని వ్యవసాయ శాఖ చెబుతోంది.

పెరిగిన సన్నాల సాగు..

వానాకాలం సీజన్‌లో సన్నాల సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగింది. సన్న వడ్లకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్‌ప్రకటించడమే అందుకు కారణమని ప్రభుత్వం చెబుతోంది. 2023 వానాకాలం సీజన్‌లో కేవలం 25.05 లక్షల ఎకరాల్లో (మొత్తం సాగులో 38 శాతం) సన్న రకం వరి పండించారు. 2024 వానాకాలం సీజన్‌లో ఏకంగా 40.55 లక్షల ఎకరాల్లో సన్న ధాన్యం వేశారు. ఈ నేపథ్యంలో యాసంగిలో కూడా సన్నాల సాగు గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. యాసంగిలో సాగుకు అనువైన వడ్ల రకాలను సీడ్ కార్పొరేషన్, ప్రైవేటు సీడ్ కంపెనీలు విడుదల చేయటంతో రైతులు ఎక్కువగా అటువైపే మొగ్గుచూపుతున్నారు.

అందుబాటులో 30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు

యాసంగి సాగు కోసం 18,10,438 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, 30,11,119 క్వింటాళ్లు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. ఇందులో సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 52,850 క్వింటాళ్లు, ఎన్‌ఎస్‌సీ 27,308 క్వింటాళ్లు, ప్రైవేటు సంస్థలు 29,30,962 క్వింటాళ్లు అందుబాటులో ఉంచాయి. అలాగే యాసంగి సీజన్‌కు 19.60 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ, యూరియా, ఎన్‌పీకే, ఎంఓపీ, ఎస్‌ఎస్‌పీ ఎరువులను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

యాసంగి పంటల సాగు ప్రణాళిక (విస్తీర్ణం.. ఎకరాల్లో)

పంట	సాధారణ సాగు	ప్రతిపాదిత సాగు
వరి	47,27,000	63,20,300
మొక్కజొన్న	5,89,098	7,18,100
గోధుమ	11,684	7,200
జొన్నలు	1,39,565	1,42,900
స్వీట్‌కార్న్	739	950
రాగులు	1,058	400
సజ్జలు	14,689	7,400
కొర్రలు	370	210
ఇతర చిరుధాన్యాలు	69	150
పచ్చి శనగ	3,34,359	2,47,000
మినుములు	48,214	49,250
పెసర్లు	23,184	14,300
బొబ్బర్లు	10,507	8,600
కందులు	3,195	2,600
ఉలవలు	1,177	890
ఇతర పప్పులు	1,643	170
వేరుశనగ	2,62,261	2,57,600
కుసుమ పువ్వు	11,951	23,100
ఆవాలు	3,274	1,200
పొద్దుతిరుగుడు	22,739	20,600
ఆముదం	4,212	7,000
నువ్వులు	50,377	36,850
గడ్డి నువ్వులు	124	420
సోయాబీన్	1,831	3,680
ఇతర నూనెగింజలు	288	0
పొగాకు	6,244	8,350
చెరుకు	29,781	11,450
పత్తి	759	2,740
ఇతర ఆహారపంటలు	-	8,310
పశుగ్రాసం, పచ్చిరొట్ట	53,896	38,800
మొత్తం	63,54,288	79,40,520

మైనర్ డ్రైవింగ్.. తల్లికి శిక్ష

సిరిసిల్ల క్రైం: బాలుడు వాహనం నడుపుతూ ఒకరి మరణానికి కారణమైన కేసులో.. అతని తల్లిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనపై డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం అందించిన వివరాలివి. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రం బస్టాండ్ సమీపంలో ఈ నెల 18న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. రుద్రంగి మండలానికి చెందిన గడ్డం లక్ష్మి.. మైనర్ అయిన ప్పటికీ తన కొడుక్కి వాహనం ఇవ్వడం వల్ల ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కంటే రాములు (72) తీవ్రగాయాలతో మృతి చెందాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. మైనర్‌కు బైక్ ఇచ్చిన తల్లిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణమైతే.. పెద్దలు జైలుకు వెళ్లాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు.

కబళించిన చలిమంట

తీవ్రగాయాలతో మహిళ మృతి



బిచ్చమ్మ (ఫైల్)

వెల్దుర్తి (తూప్రాన్): చలిమంట కాస్తుండగా.. ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని తీవ్ర గాయాలైన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ రాజు కథనం ప్రకారం.. హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన మామిండ్ల బిచ్చమ్మ (55) ఈ నెల 19న చలి వేస్తోందని గ్యాస్ స్టవ్ వెలిగించి కాచుకుంటోంది. ఈ క్రమంలో చీరకు మంటలు అంటుకోవడంతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు మంటలార్పివేసి.. కుటుంబ సభ్యుల సాయంతో ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న బిచ్చమ్మ మంగళవారం మృతి చెందింది. మృతురాలి మరిది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జలాల్‌పురం చెరువుకట్టపై బారికేడ్లు ఏర్పాటు



జలాల్‌పురం చెరువుకట్టపై పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం చెరువు కట్టపై రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం బారికేడ్లు ఏర్పాటు చేశారు. గడిచిన పదిహేను రోజుల్లో రెండు కార్లు చెరువులోకి దూసుకెళ్లి ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. వరుస ప్రమాదాలు జరుగుతుండటంతో రక్షణ చర్యలు చేపట్టడం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో 'అసలే ఇరుకు.. ఆపై మలుపు'అనే శీర్షికన ఈనెల 22న సాక్షి మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రమాదాలు నివారించడానికి పోలీసులు చెరువు కట్టపై 11 భారీ బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హెచ్‌సీఏపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ ఆరా

- 21 అంశాలపై వివరాలివ్వండి
- హెచ్‌సీఏ సీఈవోకు అధికారుల లేఖ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో నిధుల గోల్‌మాల్, అడ్మినిస్ట్రేషన్‌లో అవకతవకలకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తలు, పలువురి నుంచి వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. హెచ్‌సీఏ కార్యకలాపాలు, ఇతర అంశాలపై వివరాలు కోరుతూ రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌సీఏ సీఈవోకు సోమవారం లేఖ రాశారు. హెచ్‌సీఏ నిర్వహించే టెండర్ల సమాచారం, ఐపీఎల్ కాంట్రాక్టులు, ఇతర స్టోర్ రికార్డులు మార్చి 1, 2023 నుంచి సోమవారం వరకు మొత్తం అందజేయాలని కోరారు. ఇలా మొత్తం 21 అంశాలపై విజిలెన్స్ అధికారులు వివరాలు కోరారు.

భార్యను వదిలేసి పరారీ..

భర్త కోసం నిరీక్షిస్తున్న అభాగిని



బాన్సువాడలో భర్త కోసం ఎదురుచూస్తున్న జ్యోతి

బాన్సువాడ: అనారోగ్యంతో బాధపడుతున్న భార్యను రోడ్డు పక్కన వదిలేసి పారిపోయాడొక భర్త. తనకోసం భర్త వస్తాడని ఆ అభాగ్యురాలు ఆరు రోజులుగా నిరీక్షిస్తోంది. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌కు చెందిన లక్ష్మణ్ బిచ్కుందలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. లక్ష్మణ్ భార్య జ్యోతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఈనెల 18న రాత్రి లక్ష్మణ్ తన భార్య జ్యోతిని తీసుకుని బాన్సువాడలోని సరస్వతి మందిరం సమీపానికి వచ్చాడు. అక్కడ ఉన్న ఇసుక డంప్‌పై ఆమెను పడుకోబెట్టి, తెల్లారి వస్తానని చెప్పి, మూడు నెలల బాబును మాత్రం తీసుకుని వెళ్లాడు. తెల్లారి వస్తానని చెప్పి వెళ్లినవాడు ఇప్పటికీ రాలేదు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించి నడవలేని స్థితిలో ఉన్న జ్యోతి.. చలిలో ఇసుకపైనే గడుపుతోంది. అక్కడ ఉన్న స్థానికులు దీనిని గమనించి రోజూ అన్నం పెడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించేందుకు ప్రయత్నించామని, కానీ వైద్యులు చేర్చుకోలేదని తెలిపారు. మంగళవారం కొందరు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి జ్యోతిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త వచ్చి తనను తీసుకెళ్తాడని జ్యోతి ఆశతో ఇప్పటికీ ఎదురుచూస్తోంది.

వేధింపుల నుంచి విముక్తి కల్పించండి

- ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని బీచుపల్లి గురుకుల పాఠశాల విద్యార్థుల నిరసన
- గురుకులం నుంచి 20 కి.మీ. దూరంలో ఉన్న కలెక్టరేట్‌కు పాదయాత్ర



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

గద్వాల/ఎర్రవల్లి: బీచుపల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో జరుగుతున్న అక్రమాలతో పాటు ప్రిన్సిపాల్ వేధింపుల నుంచి విముక్తి కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లి గురుకులంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వేధింపులను నిరసిస్తూ మంగళవారం పాఠశాల, కళాశాలకు చెందిన వందమంది విద్యార్థులు బీచుపల్లి నుంచి గద్వాలకు 20 కిలోమీటర్ల మేర కాలినడకన కలెక్టరేట్ వెళ్లారు. ఈ సందర్భంగా వారు కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. పాఠశాల ప్రిన్సిపాల్ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని, డబ్బులకు ఆశపడి అకారణంగా తమ పేర్లు తొలగించి ఆ స్థానంలో కొత్త విద్యార్థులను చేర్చుకుంటూ పెద్దఎత్తున డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపించారు. ప్రిన్సిపాల్‌కు స్థానికంగా ఓ మాజీ ప్రజాప్రతినిధి అండదండలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన అక్రమాలపై ప్రశ్నించినందునే తమపై వేధింపులకు పాల్పడుతున్నారని, భౌతికంగా దాడులు చేస్తున్నారని ఆవేదన వెళ్లిబుచ్చారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, రోజూ పెట్టే భోజనం కూడా నాణ్యతగా ఉండడం లేదన్నారు. ఇటీవల పాఠశాలలో కలెక్టర్ సంతోష్ రాత్రి నిద్ర చేసినప్పుడు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేయగా తమను బెదిరించారని విద్యార్థులు తెలిపారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వారు కలెక్టర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫోన్..

కాగా, కాలినడకన గద్వాలకు వెళుతున్న విద్యార్థులను చూసి ఎర్రవెల్లివైపు వెళుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన వాహనాన్ని ఆపారు. విద్యార్థులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. అనంతరం ఆయన అక్కడి నుంచే కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు.

సోషల్ మీడియాలో ప్రిన్సిపాల్ ఆడియో వైరల్..

బీచుపల్లి గురుకులం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'కొందరు విద్యార్థులు పక్కనే ఉన్న పౌల్ట్రీఫామ్ నుంచి గుడ్లు, కోళ్లు తెచ్చుకొని ఉపాధ్యాయులకు తెలియకుండా వంట చేసుకుంటున్నారు. ఫుడ్‌పాయిజన్ ఘటనల నేపథ్యంలో వాటిని అడ్డుకొని, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చాం. క్రమశిక్షణలో భాగంగా ఐదుగురిని సస్పెండ్ చేశాం. కొందరు మొబైల్స్ తెచ్చుకొని అశ్లీల చిత్రాలు సైతం చూస్తున్నారు.. అందుకే ఓ విద్యార్థికి టీసీ ఇచ్చాం. దీనిని దృష్టిలో పెట్టుకొని కొందరు కావాలనే విద్యార్థులను రెచ్చగొట్టి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించారు'అని ఆ ఆడియోలో ఉంది. కాగా.. దీనిపై వివరణ అడిగేందుకు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

మస్తిష్కం మనం అనుకున్నంత ఫాస్ట్ కాదు!

విషయాన్ని మెదడు చాలా నెమ్మదిగా ప్రాసెస్ చేస్తోందన్న శాస్త్రవేత్తలు

నూతన అధ్యయనంతో కొత్త విషయాలు వెలుగులోకి



పంచేంద్రియాల నుంచి నిరంతరాయంగా వచ్చే సమాచారాన్ని రెప్పపాటు వ్యవధిలో ప్రాసెస్ చేసి అందుకు అనుగుణంగా మానవ మెదడు ఆయా అవయవాలకు ఆదేశాలుగా తిరిగి పంపిస్తుందని ఇన్నాళ్లూ చదువుకున్నాం. అయితే గత అభిప్రాయాలను పటాపంచలు చేస్తూ శాస్త్రవేత్తలు కొత్త విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. తనకు అందిన సమాచారాన్ని మెదడు ఎంతవేగంగా విశ్లేషిస్తుందనే అంశంపై శాస్త్రవేత్తలు తొలిసారిగా దృష్టిసారించారు. ఈ పరిశోధనలో వెల్లడైన ఫలితాలు మెదడుపై ఇన్నాళ్లూ ఉన్న అభిప్రాయాలను మార్చుకునే పరిస్థితుల్ని కల్పిస్తున్నాయి. కళ్లు, చెవులు, చర్మం, ముక్కు ఇలా ఇంద్రియాలు, అవయవాల నుంచి ఒక్క సెకన్ కూడా ఆపకుండా వచ్చే సమాచారాన్ని మెదడు కేవలం సెకన్‌కు 10 బైట్ల వేగంతో మాత్రమే ప్రాసెస్ చేస్తోందని పరిశోధనలో పాల్గొన్న అధ్యయనకారులు తేల్చి చెప్పారు. కంప్యూటర్ పరిభాషలో సమాచారాన్ని ప్రాథమికంగా ఒక బైట్‌లో కొలుస్తారు. ఈ లెక్కన ఒక వై–ఫై కనెక్షన్ గుండా ఒక సెకన్‌లో 5 కోట్ల బైట్ల సమాచారం ప్రాసెస్ అవుతోంది. అలాంటిది చదవడం, రాయడం, వీడియో గేమ్ ఆడటం, రూబిక్ క్యూబ్ గళ్లను పరిష్కరించడం వంటి పనులు చేసేటపుడు మనిషి మెదడు కేవలం 10 బైట్ల వేగంతోనే సమాచారాన్ని ప్రాసెస్ చేయగల్గుతోంది. ఇది నిజంగా అత్యంత తక్కువ వేగం ''అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని అధ్యయనకారుల పరిశోధన వివరాలు 'న్యూరాన్'జర్నల్‌లో గతవారం ప్రచురితమయ్యాయి. ''ప్రధాన అంగాల నుంచేకాకుండా అంతర్గతంగా కోటానుకోట్ల కణాల నుంచి నాడీ వ్యవస్థ ద్వారా కోట్లాదిగా పోటెత్తుతున్న సమాచారంలో కేవలం ఈ పదిని మాత్రం తీసుకుంటూ మన మెదడు తన చుట్టూ ఉన్న బాహ్య ప్రపంచంపై ఒక అవగాహనకు వస్తోంది. ఆ అవగాహనతోనే నిర్ణయాలు తీసుకుంటోంది. ఇది నిజంగా తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం. అసలు మన మెదడు సెకన్‌కు కేవలం 10 బైట్ల స్థాయిలోనే పనిచేయడానికి కారణాలేంటో తెలియాల్సి ఉంది. వేగంగా ఆలోచించాల్సిన అవసరం లేదని ఒక నిర్ధారణకు వచ్చిందా? లేదంటే ఇంతవరకు అతివేగంగా ప్రాసెస్ చేయాల్సిన అవసరమే రాలేదా? అనే కొత్త ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. మానవ పరిణామ క్రమంలో మనిషి అడవులను దాటి మైదాన ప్రాంతాలకు విస్తరించినా జంతువుల నుంచి రక్షణ, ఆహారాన్వేషణ, మైథునం వంటి బహుకొద్ది అంశాలకు మాత్రమే ఆదిమమానవుడు తన ఆలోచనలను పరిమితం చేశాడు. అలా ఎప్పుడూ స్వల్ప స్థాయిల్లో కొనసాగిన ఆలోచనల వేగం నేటి యుగంలోనూ పుంజుకోకపోయి ఉండొచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఏకకాలంలో కేవలం కొన్ని ఆలోచనలు, సమాచారాన్ని మాత్రమే ఎందుకు ప్రాసెస్ చేయగల్గుతోంది? ఎక్కువ డేటాను ఎందుకు విశ్లేషించలేకపోతోంది? సమాచార సముద్రంలోంచి కేవలం గుక్కెడు నీటినే ఎందుకు ఒడిసి పట్టుకోగల్గుతోంది? అనే విషయాలపై మరింత లోతైన అధ్యయనం చేపట్టాల్సి ఉంది. మానవ మెదడులో ఏకంగా 8,500 కోట్ల న్యూరాన్లు ఉన్నాయి. వీటిల్లో మూడింట ఒక వంతు మెదడు వల్కలంలోనే పోగుబడి ఉన్నాయి. అత్యున్నత స్థాయి ఆలోచనలు ఈ వల్కలంలోనే ఉద్భవిస్తాయి. ఇంతటి సామర్థ్యం ఉండి కూడా మెరుపువేగంతో దూసుకెళ్లాల్సిన మెదడు ఎందుకిలా మొండికేస్తుందో తెలియాల్సి ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్



మంగళవారం పాండవ్ నగర్‌లో కుళాయి నీరు తాగుతున్న కేజ్రీవాల్


ఢిల్లీలో '24 గంటల స్వచ్ఛమైన నీరు' అందిస్తాం

ఎన్నికల వేళ మరో హామీ ఇచ్చిన కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజల కోసం పెద్ద ఎన్నికల హామీలు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో 24 గంటలు స్వచ్ఛమైన నీటిని అందిస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. కాగా ఇంతకుముందు, కేజ్రీవాల్ మహిళా యోజన, సంజీవని యోజన, ఆటో డ్రైవర్లకు హామీ మరియు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తామని వాగ్దానం చేశారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓ కాలనీలో మంగళవారం నుంచి 24 గంటల స్వచ్ఛమైన నీటి సరఫరా ప్రారంభిస్తున్నట్లు ఆప్ అధినేత తెలిపారు. త్వరలో మొత్తం ఢిల్లీలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నామని వాగ్దానం చేశారు. మంగళవారం బూస్టర్ పంపింగ్ స్టేషన్ ప్రారంభోత్సవం తర్వాత, అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిషి రాజేంద్ర నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పాండవ్ నగర్ డీడీఏ ఫ్లాట్‌లకు వెళ్లి... అక్కడ నేరుగా కుళాయిలో నీరు తాగి నీటి నాణ్యతను తనిఖీ చేశారు. కాగా అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ముఖ్యమంత్రి ఆతిషి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోమవారం తూర్పు కిద్వాయ్ నగర్ నుంచి మహిళా సమ్మాన్ యోజన కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. ఈ పథకం కింద మహిళలకు నెలకు రూ.2,100 అందించనున్నారు. అదేవిధంగా, 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఉచిత చికిత్స కోసం సంజీవని యోజన కోసం రిజిస్ట్రేషన్లు కూడా జంగ్‌పురా నుంచి ప్రారంభించారు. వీటితో పాటు దళితుల కోసం డాక్టర్ అంబేద్కర్ సమ్మాన్ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రకటించారు.

మణిపూర్ గవర్నర్‌గా హోం శాఖ మాజీ కార్యదర్శి ఏకే భల్లా

- ఒడిశా గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు
- ఐదు రాష్ట్రాలకు గవర్నర్లను నియమించిన రాష్ట్రపతి ముర్ము



అజయ్ కుమార్ భల్లా

సాక్షి, న్యూఢిల్లీ: కల్లోలిత మణిపూర్ సహా ఐదు రాష్ట్రాలకు కొత్తగా గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా, ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్ రాజీనామాను ఆమె ఆమోదించారు. దాదాపు రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో అట్టుడుకుతున్న మణిపూర్‌కు గవర్నర్‌గా కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాను నియమించారు. 1984 బ్యాచ్ ఐఏఎస్ అయిన భల్లా అస్సాం, మేఘాలయ కేడర్ అధికారి. అదేవిధంగా, మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబుకు ఒడిశా గవర్నర్ బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో మిజోరం గవర్నర్‌గా ఆర్మీ మాజీ చీఫ్ విజయ్‌కుమార్ సింగ్‌ను నియమించారు. బిహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కేరళ గవర్నర్‌గా... కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను బిహార్ గవర్నర్‌గా నియమించారు. వీరు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ నియామకాలు అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ తెలిపింది.

రేపటి నుంచి సీడబ్ల్యూసీ సమావేశాలు

కర్ణాటకలోని బెలగావిలో రెండ్రోజుల పాటు కాంగ్రెస్ కీలక భేటీ

- నవ సత్యాగ్రహ బైఠక్‌గా నామకరణ
- వచ్చే ఏడాదికి కార్యాచరణపై కీలక చర్చలు.. 27న జై సంవిధాన్ ర్యాలీ

సాక్షి, న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ ఏఐసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ తన ప్రత్యేక భేటీ నిర్వహించనుంది. మహాత్మా గాంధీ బాధ్యతలు స్వీకరించిన కర్ణాటకలోని బెలగావిలోనే ఈ నెల 26, 27 తేదీల్లో రెండ్రోజుల పాటు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఈ భేటీకి నవ సత్యాగ్రహ బైఠక్‌గా నామకరణం చేసింది. ఈ భేటీకి సీడబ్ల్యూసీ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు, పీసీసీలు, సీఎల్పీ నేతలు, పార్లమెంటరీ పార్టీ ఆఫీస్ బేరర్లు, మాజీ సీఎంలు హాజరుకానున్నారు. మొత్తంగా 200ల మంది కీలక నేతలు హాజరవుతారని ఏఐసీసీ ప్రకటించింది. 26న మహాత్మాగాంధీ నగర్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు సీడబ్ల్యూసీ భేటీ ప్రారంభం కానుంది. 27వ తేదీన ఉదయం 11.30 గంటలకు ఏఐసీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలతో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ భేటీలో పార్టీ రెండు తీర్మానాలను ఆమోదించనుంది. దీంతో పాటే వచ్చే ఏడాది పార్టీ తీసుకోవాల్సిన కార్యాచరణపై ఇందులో కీలక చర్చలు చేయనున్నారు. దీంతో పాటే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంశంపైనా చర్చించనున్నారు. '1924లో బెలగావిలో తన తొలి ప్రసంగంలో మహాత్మాగాంధీ అహింస, సహాయ నిరాకరణ, అంటరానితనం నిర్మూలన, వివిధ వర్గాల మధ్య ఐక్యత, సామాజిక-ఆర్థిక సమతుల్యత, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రసంగించారు. ఈ భేటీకి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక భేటీ నిర్వహిస్తున్నాం. 200 మందికి పైగా నాయకులు దీనికి హాజరవుతారు. 27న నిర్వహించే సంవిధాన్ ర్యాలీలో కీలక నేతలతో పాటు లక్షలాది మంది కార్యకర్తలు పాల్గొంటారు'అని ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఆర్థిక అసమానత, ప్రజాస్వామ్య ఖూనీ, రాజ్యాంగ సంస్థలపై దాడి, బీజేపీ పాలనలో దేశం ఎదుర్కొంటున్న క్లిష్టమైన సవాళ్లు వంటి అంశాలపై ఇందులో చర్చిస్తామన్నారు.

ఆస్పత్రి నుంచి బిల్ క్లింటన్ డిశ్చార్జ్

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్(78) మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. సోమవారం ఆయన జ్వరంతో జార్జిటౌన్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌లో చేరారు. వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని క్లింటన్ సహాయకులు చెప్పారు. డెమొక్రాట్ పార్టీకి చెందిన క్లింటన్ 1993 జనవరి నుంచి 2001 జనవరి వరకు అమెరికా అధ్యక్షుడిగా కొనసాగడం తెలిసిందే. ఈ ఏడాది నవంబర్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తరఫున ఆయన ప్రచారం కూడా చేశారు. బిల్ క్లింటన్ పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. 2004లో ఆయనకు బైపాస్ సర్జరీ జరిగింది. 2005 ఊపిరితిత్తులకు శస్త్రచికిత్స చేశారు. 2010లో గుండెకు రెండు స్టెంట్లు వేశారు.

కెన్-బెట్వా ప్రాజెక్టుకు నేడు మోదీ శంకుస్థాపన

భోపాల్: కెన్–బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధాని మోదీ బుధవారం ఖజురహో వద్ద శంకుస్థాపన చేయనున్నారు. జాతీయ నదుల అనుసంధానం విధానంలో ఇది మొదటి ప్రాజెక్టు కానుందని అధికారులు తెలిపారు. సుమారు రూ.44 వేల కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు పూర్తయితే మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని 10 జిల్లాలకు చెందిన 44 లక్షల మందికి తాగునీరు అందనుంది. అంతేకాదు 103 మెగావాట్ల జల విద్యుత్, 2 వేల గ్రామాల్లోని 7.18 లక్షల రైతు కుటుంబాలు లబ్ధి పొందుతారని సీఎం మోహన్ యాదవ్ చెప్పారు. అండర్ గ్రౌండ్ ప్రెషరైజ్డ్ పైప్ ఇరిగేషన్ విధానంలో చేపట్టే దేశంలోనే అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టని అన్నారు.

ఈఫిల్ టవర్‌కు మంటలు

వేలాది మంది తరలింపు

ప్యారిస్: ప్రపంచ ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌కు మంగళవారం ఉదయం మంటలంటుకున్నాయి. లిఫ్ట్ షాఫ్ట్ కేబుల్ వేడెక్కడంతో టవర్‌లోని మొదటి రెండో అంతస్తుల మధ్య మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఆ సమయంలో టవర్‌పై ఉన్న 1,200 మంది పర్యాటకులను ఖాళీ చేయించారు. తీవ్రంగా శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది మధ్యాహ్నానికల్లా మంటలను ఆర్పివేశారు. కాగా, ప్రతిరోజూ ఈఫిల్ టవర్‌ను 15 వేల నుంచి 25 వేల మంది సందర్శిస్తారు. ఈఫిల్ టవర్‌లో గతంలోనూ ప్రమాదాలు జరిగాయి. టవర్‌లోని టీవీ కంట్రోల్ రూమ్‌లో 1956లో అగ్నిప్రమాదం జరిగింది. ఇది తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. మరమ్మతులకు ఒక సంవత్సరం పట్టింది.

లోయలో పడిన వాహనం.. ఐదుగురు జవాన్లు మృతి

జమ్మూ: భద్రతా బలగాలతో వెళ్తున్న వాహనం లోయలో పడిన ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు క్షతగాత్రులయ్యారు. ఈ ఘటన జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లా ఘరోవా ప్రాంతంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. నీలంలోని హెడ్‌క్వార్టర్స్ నుంచి బల్నోయి ఘోరా పోస్ట్ వైపు వెళ్తున్న ఈ వాహనం రోడ్డు పైనుంచి జారి దొర్లుకుంటూ పక్కనే 300 అడుగుల లోతున్న లోయలో పడిపోయిందన్నారు. సహాయక బృందాలు వెంటనే అక్కడికి చేరుకుని 11 మద్రాస్ ఇన్‌ఫాంట్రీకి చెందిన బాధితులను బయటకు తీశారన్నారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందన్నారు.

హసీనా రూ. 41 వేల కోట్ల లంచం తీసుకున్నారు

రూప్‌పూర్ అణు ప్లాంట్ నిర్మాణంలో అక్రమాలు

ఆపద్ధర్మ ప్రభుత్వం ఆరోపణలు • విచారణ చేపట్టిన అవినీతి నిరోధక విభాగం

ఢాకా: బంగ్లాదేశ్‌లోని ఏకైక అణు విద్యుత్ కర్మాగారం నిర్మాణంలో పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా రూ.41.46 వేల కోట్ల మేర లంచం తీసుకున్నారని ఆపద్ధర్మ ప్రభుత్వం ఆరోపించింది. దీనిపై అవినీతి నిరోధక విభాగం తాజాగా విచారణ చేపట్టినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. రూప్‌పూర్ అణు ప్లాంట్ డిజైన్, నిర్మాణ బాధ్యతలను రష్యా ప్రభుత్వ రంగ సంస్థ రోసటోమ్ తీసుకోగా, నిర్మాణ పనులను భారతీయ కంపెనీలు చేపట్టాయి.రూప్‌పూర్ పవర్ ప్రాజెక్ట్ నుంచి షేక్ హసీనా, ఆమె కుమారుడు జాయ్, బంధువు తులిప్ సిదిఖీలు మలేసియా బ్యాంకుకు చేసిన రూ.41.46 వేల కోట్ల బదిలీని అక్రమంగా ఎందుకు ప్రకటించలేదంటూ రెండు రోజుల క్రితం బంగ్లాదేశ్ హైకోర్టు దేశ యాంటీ కరప్షన్ కమిషన్(ఏసీసీ)ను ప్రశ్నించిన నేపథ్యంలోనే ఈ దర్యాప్తు చేపట్టినట్లు మీడియా తెలిపింది. నేషనల్ డెమొక్రాటిక్ మూవ్‌మెంట్(ఎన్‌డీఎం) చైర్మన్ బాబీ హజాజ్ అవినీతి జరిగిందంటూ మొదటిసారిగా ఆరోపించారు. రూప్‌పూర్ అణు ప్లాంట్ నిర్మాణంలో అవినీతి అంటూ వచ్చిన ఆరోపణలను రష్యా ప్రభుత్వ సంస్థ రోసటోమ్ తీవ్రంగా ఖండించింది. షేక్ హసీనా, సోదరి రెహానాతోపాటు ప్రస్తుతం భారత్‌లో ఉండగా, ఆమె కుమారుడు జాయ్ అమెరికాలో ఉంటున్నారు. వీరి బంధువు తులిప్ సిద్దిఖీ బ్రిటన్ ఎంపీగా వ్యవహరిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో అల్లర్లు, హింసాత్మక ఘటనలపైనా ఆపద్ధర్మ ప్రభుత్వం హసీనాతోపాటు ఆమె కేబినెట్ సభ్యులు, ఇతర ఉన్నతాధికారులపైనా జన హననం కేసులు నమోదయ్యాయి. ఆమెను అప్పగించాలంటూ రెండు రోజుల క్రితం బంగ్లాదేశ్‌లోని ఆపద్ధర్మ ప్రభుత్వం భారత్‌ను అధికారికంగా కోరడం తెలిసిందే.

ఎన్నికల నిబంధనల్లో సవరణపై సుప్రీంలో కాంగ్రెస్ పిటిషన్

న్యూఢిల్లీ: ఎన్నికలకు సంబంధించి ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు, సీసీటీవీ కెమెరా ఫుటేజీ, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీ, వీడియో రికార్డింగులను సాధారణ ప్రజలు తనిఖీ చేయడానికి వీల్లేకుండా కేంద్ర ప్రభుత్వం 'ఎన్నికల నిర్వహణ నిబంధనలు–1961'లో సవరణ చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికల సమగ్రతను ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారని మండిపడింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మంగళవారం పిటిషన్ దాఖలు చేసింది. నిబంధనల్లో సవరణను తాము వ్యతిరేకిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రజలను సంప్రదించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. ఇలాంటి అనుచిత చర్యలను అనుమతించకూడదని చెప్పారు. ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసి, ఎన్నికల సమగ్రతను పునరుద్ధరిస్తుందన్న విశ్వాసం తమకు ఉందని స్పష్టంచేశారు. ఎన్నికలు పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన సమస్త సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంటేనే వారిలో నమ్మకం పెరుగుతుందని జైరామ్ రమేశ్ తేల్చిచెప్పారు. ఎన్నికల సంఘం సిఫార్సుల మేరకు కొన్ని రకాల ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి వీల్లేకుండా కాండక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్–1961లోని సెక్షన్ 93(2)(ఎ)లో కేంద్రం ఈ నెల 20వ తేదీన సవరణ చేసిన సంగతి తెలిసిందే.

తప్పులతడకగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఎంపిక

ఆరోపించిన సెలక్షన్ ప్యానెల్ సభ్యులు ఖర్గే, రాహుల్

న్యూఢిల్లీ: జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ తప్పుల తడకగా ఉందని ఆ చైర్మన్ ఎంపిక కమిటీ సభ్యులు, విపక్ష నేతలైన మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆరోపించారు. పరస్పర సంప్రదింపులు, ఉమ్మడి అభిప్రాయాలకు నీళ్లొదిలేసి ఏకపక్షంగా ప్రభుత్వం తమకు నచ్చిన వ్యక్తిని చైర్మన్ పదవిలో కూర్చోబెడుతోందని ఖర్గే, రాహుల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ముందే అన్నీ అనేసుకుని, తూతూమంత్రంగా సెలక్షన్ ప్యానెల్ సమావేశంలో చర్చించారని, ఇలాంటి ప్రభుత్వ నిర్ణయంతో విబేధిస్తున్నట్లు వారు మంగళవారం తెలిపారు. వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం దక్కేలా సమ్మిళిత విభిన్న వర్గాల మేళవింపుగా జస్టిస్ రోహింటన్ ఫాలీ నారిమన్, జస్టిస్ కుట్టియిల్ మాథ్యూ జోసెఫ్ పేర్లను మేం ప్రతిపాదిస్తే వాటిని పక్కనపడేసి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వి.రామసుబ్రమణియన్‌ను ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్‌గా ఎంపికచేశారు. ఇలాంటి అంశాల్లో విపక్ష సభ్యులతో కలిసి అత్యావశ్యకమైన పరస్పర సంప్రదింపులు జరపాలి. ఏకాభిప్రాయ సాధనకు కృషిచేయాలి. అప్పుడే సెలక్షన్ కమిటీకున్న విశ్వసనీయ, నిష్పాక్షికత ఇనుమడిస్తాయి. కానీ కమిటీ అనుసరించిన ఎంపిక విధానంలో ప్రాథమిక లోపాలున్నాయి''అని రాహుల్, ఖర్గే తప్పుబట్టారు. జూన్ ఒకటిన రిటైర్డ్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌గా పదవీకాలాన్ని పూర్తిచేసుకున్నాక ఆ పదవి ఖాళీగా ఉంది. ప్రియాంక్ కనూంగో, డాక్టర్ జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగిలు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులుగా నియమితులయ్యారు.

అఫ్గానిస్తాన్‌లో భారత రాయబార కార్యాలయంపై దాడి

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో భారత రాయబారి కార్యాలయంపై దాడి జరిగింది. భారత కాన్సులేట్‌కు చెందిన అఫ్గాన్ సిబ్బందిపై మంగళవారం ముష్కరులు దాడి చేశారు. పరిస్థితిని ప్రభుత్వం పర్యవేక్షిస్తోందని భారత వర్గాలు తెలిపాయి. భారత ఉద్యోగి ఎవరూ మరణించలేదని, గాయపడలేదని వారు ధృవీకరించారు. స్థానిక సిబ్బంది ప్రయాణిస్తున్న కాన్సులేట్ వాహనాన్ని తెలిసిన వ్యక్తులే ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. కాగా, ఘటనపై ఏ ఉగ్రవాద సంస్థ ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా, జలాలాబాద్‌లో ఉన్న భారత కాన్సులేట్‌ను 2020లో అధికారికంగా మూసివేశారు. భద్రతా కారణాలరీత్యా భారత ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ప్రస్తుతం అక్కడ స్థానిక సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు.

చండీగఢ్ మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల బాహాబాహీ

చండీగఢ్: చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం మంగళవారం రెజ్లింగ్ బరిని తలపించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలంటూ ఆప్, కాంగ్రెస్ సభ్యులు ప్రవేశ పెట్టిన తీర్మానమే ఇందుకు కారణం. గత వారం రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సమయంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపడం తెలిసిందే. హోం మంత్రి వెంటనే వైదొలగాలని ఆప్, కాంగ్రెస్ సభ్యులు సభలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. చర్చ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్లు రాజ్యాంగ నిర్మాత కృషిని అప్పట్లో నెహ్రూ హయాంలో కాంగ్రెస్ చులకన చేసిందని ఆరోపించారు. ఇది మాటల యుద్ధానికి దారి తీసింది. అదే సమయంలో నామినేటెడ్ సభ్యుడు అనిల్ మసీహ్‌ను కొందరు కాంగ్రెస్, ఆప్ సభ్యులు 'ఓటు దొంగ'అంటూ ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన మేయర్ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన ఈయన ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. ప్రతిగా అనిల్ కూడా రాహుల్ గాంధీ బెయిల్‌పైనే బయట ఉన్నారంటూ నేషనల్ హెరాల్డ్ కేసునుద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. దీంతో, మొదలైన కొట్లాట 20 నిమిషాలపాటు కొనసాగింది.

శ్యామ్ బెనగల్‌కు తుది వీడ్కోలు



శ్యామ్ బెనగళ్

ముంబై: సీనియర్ సినీ దర్శకుడు శ్యామ్ బెనగళ్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో మంగళవారం ముగిశాయి. జాతీయ పతాకం, పూలమాలలతో కప్పిన ఆయన పార్థివ దేహాన్ని మధ్యాహ్నం 3 గంటల సమయంలో దాదర్‌లోని శివాజీ పార్క్ శ్మశాన వాటికకు తీసుకొచ్చారు. పోలీసులు త్రీ గన్ సెల్యూట్ అనంతరం విద్యుత్ దహన వాటికలో దహనం చేశారు. అనంతరం పూజారులు పూజలు చేశారు. బెనగళ్‌కు కడసారి వీడ్కోలు పలికిన వారిలో భార్య నీరా, కుమార్తె పియాతోపాటు సినీ రంగానికి చెందిన నసీరుద్దీన్ షా, రంజిత్ కపూర్, కుల్‌భూషణ్ కర్బందా, ఇలా అరుణ్, గుల్జార్, జావెద్ అక్తర్, బొమన్ ఇరానీ, కునాల్ కపూర్ ఉన్నారు. ఈ సందర్భంగా నటుడు నసీరుద్దీన్ షా..'శ్యామ్ సాహబ్, నేను, నా సర్వస్వం మీవే. మీకు రుణపడి ఉన్నాను. ఇంతకు మించి నేనేమీ చెప్పలేను'అంటూ ఉద్విగ్నం చెందారు. సినీ నిర్మాత గోవింద్ నిహలానీ కూడా తనేమీ మాట్లాడలేకపోతున్నానన్నారు. '14న 90వ బర్త్‌డేనాడు బెనగళ్ సార్ ఆఫీసుకు వెళ్లి బర్త్‌డే పాట పాడాం. గతంలో ఎప్పుడూ మేం ఆయనకు పుట్టిన రోజు వేడుక చేయకపోవడంతో ఆయన చాలా ఆశ్చర్యపోయారు. త్వరలోనే మరో సినిమాకు ప్లాన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అదే ఆయన చివరి చూపవుతుందని అస్సలు ఊహించలేదు'అని దర్శకుడు శ్యామ్ కౌశల్ విచారం వ్యక్తం చేశారు. 'సినీ రంగంలో బెనగళ్ విప్లవం సృష్టించారు. మళ్లీ మరొకరు అలాంటిది చేయలేకపోయారు'అని సినీ రచయిత గుల్జార్ పేర్కొన్నారు. శ్యామ్ బెనగళ్ అనారోగ్యంతో ముంబైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూసిన విషయం తెలిసిందే.



శ్యామ్ బెనగళ్ పార్థివదేహం వద్ద గాయని ఇలా అరుణ్ తదితరులు

బంగ్లాదేశ్‌లో మరో ఉగ్రవాద నిందితుడి విడుదల

- మాజీ మంత్రి అబ్దుస్ సలామ్ పింటూను విడుదల చేసిన హైకోర్టు
- భారత్‌పై ఉగ్రదాడికి ఉగ్రవాద సంస్థలకు నిధులు సమకూర్చిన అబ్దుస్
- మాజీ ప్రధాని షేక్‌హసీనాపై గ్రెనేడ్ దాడికి కుట్ర, 2008లో మరణశిక్ష
- అబ్దుస్‌తోపాటు మరో ఐదుగురికి విడుదల చేసిన కోర్టు


ఢాకా: భారత్ వ్యతిరేకి అయిన మరో ఉగ్రవాద నిందితుడికి బంగ్లాదేశ్ కోర్టు ఉపశమనం ఇచ్చింది. భారత్‌పై దాడి చేసేందుకు ఉగ్రవాదులకు నిధులు సమకూర్చిన బంగ్లాదేశ్ నేషనల్‌పార్టీ సభ్యుడు, మాజీ మంత్రి అబ్దుస్ సలామ్ పింటూ జైలు నుంచి విడుదలయ్యాడు. 2004లో అప్పటి ప్రధాని షేక్ హసీనాపై గ్రెనేడ్ దాడికి కుట్ర కేసులో 2008లో అతనికి మరణ శిక్ష పడింది. 17 ఏళ్ల జైలు శిక్ష అనంతరం బంగ్లాదేశ్ హైకోర్టు అతడిని విడుదల చేసింది. ఇదే కేసులో బీఎన్‌పీకే చెందిన మాజీ మంత్రి లుత్ఫుజ్జామన్ బాబర్ మరో దోషి. ఈ కేసులో బాబర్‌తో పాటు మరో ఐదుగురిని కోర్టు గత వారం నిర్దోషులుగా ప్రకటించింది.

సోదరుడితో దాడికి ప్రయత్నం..


భారత్‌పై దాడికోసం ఆయుధాలను సేకరించడంలో అబ్దుస్ సలాం పింటూ ఉగ్రవాద సంస్థకు సహాయం చేశాడని 2004 గ్రెనేడ్ దాడి కేసులో దర్యాప్తు అధికారి 2021లో ఢాకా కోర్టుకు తెలిపారు. అబ్దుస్, బాబర్ అనేక మంది యువకులకు, ప్రధానంగా మదర్సా విద్యార్థులకు తుపాకులు, బాంబుల నిర్వహణలో శిక్షణ ఇచ్చారని ఆయన కోర్టుకు తెలిపారు. అబ్దుస్ సోదరుడు, హుజీ నేత మౌలానా తాజుద్దీన్‌తో భారత్‌ను రక్తసిక్తం చేసేందుకు ప్రయత్నించారని, ఆయన పాకిస్తాన్‌కు పారిపోవడానికి సహకరించారని కోర్టుకు చెప్పారు. ముహమ్మద్ యూనుస్ నేతృత్వంలోని నయా బంగ్లాదేశ్ భారత వ్యతిరేక వైఖరితో అనేక మంది ఇస్లామిస్టులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. హసీనా దేశం విడిచిన కొద్ది వారాల్లోనే... అల్ ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అన్సారుల్లా బంగ్లా టీమ్ (ఏబీటీ) చీఫ్ జషిముద్దీన్ రహ్మానీని కూడా విడుదల చేశారు.

భారత్‌పై హుజీ వరుస దాడులు..

పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ హుజీ ఒక్క భారత్‌లోనే కాదు.. బంగ్లాదేశ్, ఇజ్రాయెల్, న్యూజీలాండ్, యూకే, యూఎస్‌లలోనూ తన కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వీరి నియామకాల్లో ఎక్కువ మంది పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే), బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారే. భారతదేశంలో వరుస ఉగ్రవాద దాడులను నిర్వహించడంలో హుజీ కీలక పాత్ర పోషించింది. 2006లో వారణాసిలో కోర్టు కాంప్లెక్స్ బాంబు పేలుళ్లు, 2007లో అజ్మీర్ షరీఫ్ దర్గాపై బాంబు దాడి, 2011లో ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్లు వంటి తక్కువ తీవ్రత కలిగిన దాడులు ఇందులో ఉన్నాయి. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి ఇతర ఉగ్రవాద సంస్థలతో కలిసి పనిచేస్తున్న హుజీకి పాకిస్తాన్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) నుంచి మద్దతు లభిస్తోంది.



రాజకీయ కవిసార్వభౌముడు



చావు ఆయుష్షెంత,
రెండు క్షణాలేగా! మరి జీవితమేమో
ప్రగతిశీలం, ఒకటీ రెండు నాళ్లలో
ముగిసేది కాదు

ప్రధానిగా ఒకనాటికి మాజీని
అవుతానేమో. మాజీ కవిని మాత్రం
ఎప్పటికీ కాలేను

మిత్రులను మార్చగలం గానీ
పొరుగువారిని మార్చుకోలేం

భారతీయులుగా మనమంతా
ఉత్కృష్ట నాగరికతకు వారసులం.
శాంతే మన జీవిత గీతిక

అధికారం కోసం పార్టీని చీల్చాల్సి,
కొత్త గ్రూపులు కట్టాల్సే వస్తే అలాంటి
అధికారాన్ని తాకనైనా తాకను

పేదరికం బహుముఖీనం. దాన్ని
కేవలం డబ్బు, ఆదాయం, విద్య,
ఆరోగ్య పరామితుల్లో కొలవలేం

పుడమి వయసు లక్షల ఏళ్లు. మనిషివి
అంతులేని జీవన గాథలు.
కానీ మన దేహానికి హద్దులున్నాయి.
శత శరత్కాలాల వాణిని విన్నాం.
అది చిట్టచివరిసారి తట్టినపుడైనా
మనసు తలుపు తెరుద్దాం

పాలిటిక్స్‌తో విసిగిపోయా. వాటిని
వదిలేద్దామనుకుంటున్నాను.
కానీ అవి నన్ను వదిలేలా లేవు

స్వేచ్ఛకు సంకెళ్లు వేద్దామనుకునేవాళ్లు
ఒకటి గుర్తుంచుకోవాలి. నిప్పుతో
చెలగాటాలొద్దు. పక్కింటికి నిప్పుపెడితే
ఆ దావాగ్ని మీ ఇంటినీ కాల్చేస్తుంది

-వాజ్‌పేయి

స్వతంత్ర భారత చరిత్రలో అతికొద్ది మంది రాజనీతిజ్ఞుల్లో అగ్రగణ్యుడు.

అగ్ర రాజ్యపు బెదిరింపులను బేఖాతరు చేస్తూ దేశ భద్రతకు 'అణు కవచం' తొడిగిన నాయకుడు.

రాజకీయ ప్రత్యర్థులు కూడా ఏనాడూ వేలెత్తి చూపనంతటి గొప్ప వ్యక్తిత్వానికి చిరునామా.

దేశ ప్రగతి ప్రస్థానంపై చెరగని రీతిలో శాశ్వత ముద్ర వేసిన అరుదైన దార్శనికుడు.

సున్నిత మనస్కుడైన ఓ కవి.

భగ్న హృదయుడైన విఫల ప్రేమికుడు.

ఉర్రూతలూగించే ప్రసంగాలకు పెట్టింది పేరు.

అతడే... **అటల్ బిహారీ వాజ్‌పేయి**

నేడు శత జయంతి సందర్భంగా ఆయనను దేశం ఆప్యాయంగా గుర్తు చేసుకుంటోంది. ఘనంగా నివాళులు అర్పిస్తోంది.

అది 1984 డిసెంబర్ 30. ముంబైలోని శివాజీ పార్కు. బీజేపీ సదస్సులో అటల్ ప్రసంగిస్తున్నారు. చీమ చిటుక్కుమన్నా విన్పించేంతటి నిశ్శబ్దం నడుమ అంతా చెవులు రిక్కించి మరీ వింటున్నారు. ''చీకట్లు విడిపోతాయి. సూర్యుడు ఉదయిస్తాడు. కమలం వికసిస్తుంది'' అంటూ భవిష్యద్దర్శనం చేశారాయన. అప్పట్లో అంతా పెదవి విరిచినా, మరో పుష్కరం తిరక్కుండానే హస్తిన కోటపై కాషాయ జెండా ఎగరేసి చూపించారు. ప్రాణమిత్రుడు ఆడ్వాణీతో కలిసి బీజేపీని కేవలం రెండు లోక్‌సభ సీట్ల స్థాయి నుంచి కేంద్రంలో అధికార పీఠం దాకా ఒక్కొక్క మెట్టూ ఎక్కించారు. ఒకప్పుడు రాజకీయాల్లో అంటరానిదిగా పరిగణన పొందిన బీజేపీని వాజ్‌పేయీ ప్రబల శక్తిగా తీర్చిదిద్దారు. ఆ క్రమంలో ఎదురైన ఆటుపోట్లను ఏమాత్రమూ చలించని నిబ్బరంతో, అచంచల ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నారు. మూడుసార్లు ప్రధానిగా చేసి ఆ పదవికే వన్నె తెచ్చారు. అంతకు ముందు లోక్‌సభలో విపక్ష నేతగానూ పార్టీలకతీతంగా మన్ననలూ అందుకున్నారు. అంతర్జాతీయ వేదికలపై పొరుగు దేశం కుట్రలను పటాపంచలు చేసి దేశ వైఖరిని ప్రస్ఫుటంగా చాటారు. నెహ్రూ తనకిష్టమైన నేత అని చెప్పినా, పాక్ పీచమణిచి బంగ్లాను విముక్తం చేసిన ఇందిరను విజయేందిరగా కొనియాడినా వాజ్‌పేయికే చెల్లింది. తర్వాత కొన్నేళ్లకే ఎమర్జెన్సీ వేళ అదే ఇందిర నియంతృత్వాన్ని ఆయన అంతే నిస్సంకోచంగా కడిగిపారేశారు. అదే సమయంలో పార్టీ సిద్ధాంతాల కంటే దేశమే ముందని, ముఖ్యమని త్రికరణ శుద్ధిగా నమ్మడమే గాక దాన్ని ఆచరణలోనూ చూపారు. పలు సందర్భాల్లో మాతృ సంస్థ ఆరెస్సెస్ విధానాలతోనే విభేదించారు. బాబ్రీ మసీదు కూల్చివేతపై పార్టీ వైఖరికి భిన్న స్వరం వినిపించేందుకు కూడా వెనకాడలేదు. అంతేనా...? తొలిసారి ప్రధాని పదవి తనకు 13 రోజుల ముచ్చటగానే ముగిశాక నెలకొన్న రాజకీయ అనిశ్చితికి తెర దించేందుకు ఏకంగా కాంగ్రెస్‌కు బయటి నుంచి మద్దతిచ్చేందుకు కూడా ముందుకొచ్చిన దేశ ప్రేమికుడు వాజ్‌పేయి. ఇలా బహుముఖీనమైన వ్యక్తిత్వంతో పార్టీలకతీతంగా చెరగని అభిమానం సంపాదించుకున్నారు వాజ్‌పేయి. రాజనీతిజ్ఞుడనే పదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిపోయారు. ఆయన జయంతి డిసెంబర్ 25 సుపరిపాలన దినోత్సవంగా ప్రకటిస్తూ కేంద్రం సముచిత నిర్ణయమే తీసుకుంది.

ఆదర్శ నాయకుడు

1984 సార్వత్రిక ఎన్నికల నాటికే దేశంలో ముఖ్యమైన పార్టీగా బీజేపీ గుర్తింపు తెచ్చుకుంది. వాజ్‌పేయి నేతృత్వంలో 1996 ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా నిలిచింది. మిత్రపక్షాల సాయంతో తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎన్డీఏ రూపంలో జాతీయ రాజకీయాల్లో సంకీర్ణ ప్రయోగాలకు వాజ్‌పేయి ఆద్యునిగా నిలిచారు. పదో ప్రధానిగా ప్రమాణం చేశారు. 13 రోజులకే గద్దె దిగాల్సి వచ్చినా 1998లో రెండోసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. 13 నెలల అనంతరం ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వం పడిపోయినా చలించలేదు. ఆ వెంటనే వచ్చిన ఎన్నికల్లో నెగ్గి ముచ్చటగా మూడోసారి గద్దెనెక్కి పూర్తికాలం పదవిలో కొనసాగారు. ఆ ఘనత సాధించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా నిలిచిపోయారు. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో దశాబ్దాల విభేదాలకు, ఉద్రిక్తతలకు శాంతి చర్చలే విరుగుడంటూ సాహసోపేతంగా సంప్రదింపులకు తెర తీశారు. నాటి పాక్ అధ్యక్షుడు ముషార్రఫ్ ఆగ్రా ఒప్పందం కుదుర్చుకున్నారు. 1999లో ఢిల్లీ–లాహోర్ మధ్య చరిత్రాత్మక బస్సు సర్వీసును ప్రారంభించారు. పాక్ కపట బుద్ధి కార్గిల్ యుద్ధానికి దారి తీసినా 'ఆపరేషన్ విజయ్' ద్వారా దాయాదికి మర్చిపోలేని గుణపాఠం నేర్పారు. 2003లో ఇరాక్‌పై యుద్ధంలో అమెరికా సైనిక సాయం కోరితే నిష్కర్షగా తిరస్కరించిన ధీశాలి వాజ్‌పేయి. డజన్ల కొద్దీ దేశాలు అమెరికా పక్షం వహించినా, అదే బాటన నడుద్దామని సొంత మంత్రివర్గ సభ్యులే ఒత్తిడి తెచ్చినా, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అదే మేలని మీడియా సలహాలిచ్చినా ససేమిరా అన్నారు. ఇరాక్‌పై అమెరికా యుద్ధంలో పాల్గొనేది లేదని పార్లమెంటులోనే కుండబద్దలు కొట్టారు. ఇది అంతర్జాతీయ వేదికపై భారత ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన కీలక ఘట్టంగా మిగిలిపోయింది.

కీలక సంస్కరణలు

మూడోసారి ప్రధానిగా కీలక ఆర్థిక సంస్కరణలకు వాజ్‌పేయి బాటలు వేశారు. పీవీ బాటన సాగుతూ స్వేచ్ఛా వాణిజ్యాన్ని, సరళీకృత విధానాలను, విదేశీ పెట్టుబడులను, ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించారు. ఆర్థికరంగాన్ని కొత్తపుంతలు తొక్కించారు. హైవేల అభివృద్ధి, ప్రధాని గ్రామసడక్ పథకాలతో దేశ రవాణా రూపురేఖలనే మార్చేశారు. అమెరికాతో బంధాన్ని బలోపేతం చేశారు. నాటి అధ్యక్షుడు బిల్ క్లింటన్‌తో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. 1998లో పోఖ్రాన్‌లో రెండో అణు పరీక్షల ద్వారా భారత అణ్వస్త్ర పాటవాన్ని ప్రపంచానికి చాటారు. దేశంలో టెలికాం విప్లవానికి బాటలు పరిచిందీ వాజ్‌పేయే. ఆయన హయాం సుపరిపాలనకు పర్యాయపదంగా నిలిచిపోయింది.


2004 ఎన్నికల్లో బీజేపీ ఓటమి అనంతరం వాజ్‌పేయీ క్రమంగా రాజకీయ రంగం నుంచి తప్పుకున్నారు. 2006లో బీజేపీ జాతీయ కార్యవర్గ భేటీ తర్వాత చివరిసారిగా మీడియాతో మాట్లాడారు వాజ్‌పేయి. ఈ సందర్భంగానే నాయకత్వ బాధ్యతలను ఆడ్వాణీకి అప్పగించారు. క్షీణించిన ఆరోగ్యానికి నిదర్శనంగా అప్పటికే చేతికర్ర సాయం తీసుకున్నారు. 2007లో చివరిసారి ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ కోసం ప్రచారం చేశారు. ఆ తర్వాత 2018 ఆగస్టు 16న కన్నుమూసేదాకా దాదాపు పుష్కర కాలం వాజ్‌పేయి ఏకాంత జీవితమే గడిపారని చెప్పాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆ గళం.. అనితరసాధ్యం

వాజ్‌పేయి అద్భుత వక్త. హిందీ, ఇంగ్లిష్‌ల్లో తిరుగులేని వాగ్ధాటి ఆయన సొంతం. 1957లో పార్లమెంటేరియన్‌గా తొలి ప్రసంగంతోనే నాటి ప్రధాని నెహ్రూతో సహా అందరినీ ఆకట్టుకున్నారు. రాజకీయాల్లో గొప్పగా రాణించి ప్రధాని అవుతాడంటూ నెహ్రూ ప్రశంసలు అందుకున్నారు. విపక్ష నేతగా అయినా, ప్రధానిగా హోదాలోనూ ఆయన మాట్లాడేందుకు లేచారంటే సభ్యులంతా చెవులు రిక్కించి వినేవారు. సునిశితమైన హాస్యం, చమత్కారాలు, అక్కడక్కడా అవసరమైన మేరకు వ్యంగ్యం మేళవిస్తూ కవితాత్మకంగా సాగే వాజ్‌పేయి ప్రసంగాలు అందరినీ మంత్రముగ్ధుల్ని చేసేవి. హిందీ అంతగా అర్థం కాని తమిళ దిగ్గజం సీఎన్ అన్నాదురైని కూడా ఆకట్టుకున్న ఘనత ఆయన ప్రసంగాలకు దక్కింది! 1994లో జెనీవా వేదికపై కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ సమస్యగా చిత్రించేందుకు పాక్ చేసిన ప్రయత్నాన్ని తిప్పికొట్టేందుకు నాటి ప్రధాని పీవీ నరసింహారావు ఏరికోరి వాజ్‌పేయినే ఎంచుకున్నారు. ఏ అంశంపై అయినా సమగ్ర కసరత్తు చేశాకే మాట్లాడేవారు. గణాంకాలు తదితరాలను తప్పకుండా ప్రస్తావించేవారు. అందుకే పార్లమెంటులో ఆయన వాదనలను తిప్పికొట్టలేక ప్రత్యర్థి పక్షాల్లోని మహామహులైన నేతలు కూడా చేష్టలుడిగేవారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో హిందీలో ప్రసంగించిన క్షణాలు తనకు మరపురానివని గుర్తు చేసుకునేవారు. వాజ్‌పేయి కొంతకాలం జర్నలిస్టుగా కూడా రాణించారు.

సినీ ప్రియుడు



వాజ్‌పేయి సినీ ప్రియుడు. పాత హిందీ సినిమాలు బాగా చూసేవారు. తీస్రీ కసమ్, దేవదాస్, బందినీ వంటివి ఆయన ఆల్‌టైం ఫేవరెట్ హిందీ సినిమాల్లో కొన్ని. లతా మంగేష్కర్, ముకేశ్, ఆయన అభిమాన గాయనీ గాయకులు. 'మీకూ నాకూ ఎన్నో పోలికలు. ఇద్దరమూ ఒంటరితనమే. ఇంగ్లిష్‌లో నా పేరు (అటల్)ను తిరగేస్తే మీ పేరు (లత) వస్తుంది' అంటూ ఓసారి లతా మంగేష్కర్‌తో చమత్కరించారట! అలాగే హాలీవుడ్ సినిమాలు కూడా బాగా ఇష్టపడేవారు. ద బ్రిడ్జ్ ఆన్ ద రివర్ క్వై తనకిష్టమైన సినిమా అని తరచూ చెప్పేవారు. అలాగే బార్న్ ఫ్రీ, గాంధీ సినిమాలు కూడా. వాజ్‌పేయి కవితలకు పలువురు గాయకులు ప్రాణం పోయడం మరో విశేషం. ఆయన రాసిన 'క్యా ఖోయా, క్యా పాయా', 'దూర్ కహీ కోయీ రోతా హై', 'ఝుకీ న ఆంఖే' వంటి వేదనాభరిత కవితలను గజల్ సమ్రాట్ జగ్జీత్‌సింగ్ తన గళంతో అజరామరం చేశారు. శరత్, ప్రేమ్‌చంద్ సాహిత్యమన్నా వాజ్‌పేయికి ప్రాణం. ఎమర్జెన్సీ వేళ జైల్లోనూ కవితా రచన చేసిన కళాపిపాసి వాజ్‌పేయీ. అడ్వాణీ ఆయనకు ఆజన్మాంతం ప్రియమిత్రుడు. తనతో కలిసి ఢిల్లీ వీధుల్లో స్కూటర్‌పై చక్కర్లు కొట్టేవారు. పానీపూరీ, చాట్ వాజ్‌పేయి ఎంతో ఇష్టంగా తినేవారని అడ్వాణీ చెబుతారు. ఆయన చేయి తిరిగిన వంటగాడే గాక మంచి భోజనప్రియుడు కూడా.

చదవని ప్రేమలేఖ

అటల్ బిహారీ వాజ్‌పేయి అవివాహితునిగా మిగిలిపోవడం వెనక ఆసక్తికరమైన కథ ఉంది. కాలేజీ రోజుల్లోనే ఆయన మనసు దోచిన రాజ్‌కుమారీ హస్కర్ అనే మహిళ దూరమవడంతో పెళ్లి చాప్టర్‌కు దూరమయ్యారు. ఏక్ నిరంజన్‌లా ఉండిపోయారు.


ఎవరీ హస్కర్?

కశ్మీర్ పండిట్ల కుటుంబానికి రాజ్‌కుమారీ హస్కర్ వాజ్‌పేయికి కాలేజీ రోజుల్లో సహాధ్యాయి. ఇందిరాగాంధీకి దూరపు బంధువంటారు. పలు కార్యక్రమాల్లో కలిసి పని చేసే క్రమంలో మొదలైన స్నేహం ప్రేమగా మారింది. కానీ ఎవరూ దాన్ని బయటపెట్టలేదు. వాజ్‌పేయి ఆమెకు ప్రేమలేఖ రాసినా నేరుగా ఇవ్వకుండా గ్రంథాలయంలో ఆమె చదివే అవకాశమున్న ఓ పుస్తకంలో పెట్టారు. అయితే హస్కర్ ఆ పుస్తకాన్ని చదవలేదు. అలా వాజ్‌పేయి ప్రేమలేఖ ఆమెకు అందనే లేదు. రాజకీయాలు చేసే వ్యక్తికి కూతురును ఇవ్వడం హస్కర్ తండ్రికీ ఇష్టం లేకపోయింది. దాంతో బ్రిజ్ నారాయణ్ కౌల్ అనే ప్రొఫెసర్‌తో ఆమె వివాహం జరిగిపోయింది. అలా హస్కర్ శ్రీమతి కౌల్‌గా మారి వాజ్‌పేయి జీవితం నుంచి అదృశ్యమైంది. వాజ్‌పేయి కూడా ప్రేమ సంగతి మర్చిపోయి క్రియాశీల రాజకీయాల్లో మునిగిపోయారు.

16 ఏళ్ల తర్వాత

దాదాపు 16 ఏళ్ల తర్వాత వాజ్‌పేయి, శ్రీమతి కౌల్ ఓ కాలేజీ ఫంక్షన్‌లో అనుకోకుండా పరస్పరం తారసపడ్డారు. ఢిల్లీలో తన భర్త పని చేసే కాలేజీలో కీలకోపన్యాసం సందర్భంగా అక్కడ కౌల్‌ను చూసి వాజ్‌పేయి నిశ్చేష్టులయ్యారు. తర్వాత కౌల్ దంపతులతో ఆయన అనుబంధం బలపడింది. వాజ్‌పేయి విదేశాంగ మంత్రిగా ఉండగా కౌల్ దంపతులు కూడా తమ కూతురు నమితతో కలిసి ఆయన ఇంటికి మారిపోయారు. దాంతో వారి బంధంపై ఢిల్లీ వర్గాల్లో పెద్ద చర్చే జరిగింది. భావ సారుప్యత ఉన్న కౌల్‌ను వాజ్‌పేయీ పెళ్లాడితే మంచిదని సన్నిహితులు, రాజకీయ నేతలు, ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు చెప్పినా ఆయన కొట్టిపారేశారంటారు. ''దీనిపై చర్చ అనవసరం. నేను పెళ్లీడు వయసులో ఉండగా ఆదర్శవంతమైన భార్య కోసం అన్వేషణ మొదలెట్టాను. దొరికినా దురదృష్టవశాత్తు ఆమె తండ్రి తనకు అనువైన ఆదర్శ భర్త కోసం వెతికారు'' అని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. వాజ్‌పేయిలోని ఈ కోణాన్ని జాతీయ మీడియా ఎప్పుడూ పతాక శీర్షికలకు ఎక్కించలేదు. కౌల్ కూతురు నమితను వాజ్‌పేయి తన కన్నకూతురిలా చూసుకున్నారు. తర్వాత దత్తత తీసుకున్నారు. వాజ్‌పేయి అంత్యక్రియలను నమిత, ఆమె కూతురు నీహారిక దగ్గరుండి జరిపించారు.


– సాక్షి, నేషనల్ డెస్క్



నరేంద్రమోదీతో వాజ్‌పేయి



యువకునిగా..



ప్రాణ స్నేహితుడు ఆడ్వాణీతో వాజ్‌పేయి

లోకం మెచ్చిన నాయకుడు

అరుదైన రాజనీతిజ్ఞుడు వాజ్‌పేయి ● మూడుసార్లు ప్రధానిగా చేసిన విలక్షణ నేత

ప్రపంచం మెచ్చిన విలక్షణ నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి. ఆయన మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో 1924 డిసెంబర్ 25న కన్యాకుబ్జ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు కృష్ణాదేవి, కృష్ణ బిహారీ వాజ్‌పేయి. తండ్రి గ్వాలియర్‌లో స్కూల్ టీచర్. తాత శ్యామ్‌లాల్ వాజ్‌పేయి ఉత్తరప్రదేశ్‌లోని బటేశ్వర్ నుంచి మధ్యప్రదేశ్‌లోని మొరేనాకు వలస వెళ్లారు. తర్వాత మెరుగైన జీవనోపాధి కోసం గ్వాలియర్‌కు చేరారు. అక్కడి సరస్వతి శిశు మందిర్‌లో వాజ్‌పేయి ప్రాథమిక విద్య అభ్యసించారు. గ్వాలియర్ విక్టోరియా కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. హిందీ, ఇంగ్లిష్, సంస్కృతంలో బీఏ ఉత్తీర్ణులయ్యారు. కాన్పూర్‌లో ఆగ్రా వర్సిటీకి చెందిన డీఏవీ కాలేజీ నుంచి ఎంఏ (పొలిటికల్ సైన్స్) చేశారు.

ఆర్య సమాజోద్యమంతో ప్రస్థానం

ఆర్య సమాజ ఉద్యమం పట్ల వాజ్‌పేయి చిన్నప్పుడే ఆకర్షితులయ్యారు. గ్వాలియర్‌లో ఆర్య సమాజ ఉద్యమ యువజన విభాగమైన ఆర్యకుమార సభలో చేరారు. 1944లో ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1939లోనే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లో చేరారు. 16 ఏళ్ల వయసులోనే స్వయం సేవకునిగా చురుకైన పాత్ర పోషించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్టై 24 రోజులు జైల్లో ఉన్నారు. 1947లో ఆరెస్సెస్ ప్రచారక్ (పూర్తి స్థాయి కార్యకర్త)గా ఎదిగారు. దేశ విభజన పరిణామాల నేపథ్యంలో న్యాయ విద్యను మధ్యలోనే ఆపేశారు. ఆర్‌ఎస్‌ఎస్ పత్రికల్లో జర్నలిస్టుగా సేవలందించారు. కవిగా, రచయితగా, ప్రజానాయకుడిగా రాణించారు. ఆరెస్సెస్ రాజకీయ విభాగం భారతీయ జన సంఘ్‌లో సభ్యుడిగా చేరారు. దాని అధినేత శ్యామాప్రసాద్ ముఖర్జీ ప్రధాన అనుచరుడిగా ఉత్తరాదిన పార్టీని ముందుకు నడిపారు. 1957 సాధారణ ఎన్నికల్లో బలరాంపూర్ లోక్‌సభ స్థానం నుంచి నెగ్గారు. పార్లమెంట్‌లో పలు అంశాలపై ఉర్రూతలూగించేలా ప్రసంగించేవారు. ఆయనపై నెహ్రూ ప్రభావం బాగా ఉండేది. నెహ్రూనూ వాజ్‌పేయి ప్రతిభ ఆకట్టుకుంది. దీన్ దయాళ్ ఉపాధ్యాయ మరణం తర్వాత జన సంఘ్ బాధ్యతలను వాజ్‌పేయి స్వీకరించారు. 1968లో జనసంఘ్ అధ్యక్షుడయ్యారు. నానాజీ దేశ్‌ముఖ్, ఎల్.కె.ఆడ్వాణీ వంటి సహచరుల తోడ్పాటుతో పార్టీ అభివృద్ధికి అవిశ్రాంతంగా కృషి చేశారు.

పదవీ వ్యామోహం లేదు

ప్రధాని పదవి పట్ల వాజ్‌పేయికి ఎన్నడూ వ్యామోహం లేదంటారు. 1995 డిసెంబర్‌లో బీజేపీ భేటీలో ఆడ్వాణీ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలిస్తే వాజ్‌పేయే ప్రధాని అవుతారని ప్రకటించగా ఆయన వారించారు. ఎన్నికల్లో నెగ్గడంపైనే దృష్టి పెట్టాలని, ప్రధాని అభ్యర్థి ఎవరన్నది అప్రస్తుతమని సున్నితంగా హెచ్చరించారు. 1996 ఎన్నికల్లో బీజేపీ పూర్తి మెజార్టీకి అడుగు దూరంలో ఆగినా ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ వాజ్‌పేయిని రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ ఆహ్వానించారు. దాంతో వాజ్‌పేయి తొలిసారిగా ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌సభలో మెజార్టీని కూడగట్టడంలో విఫలం కావడంతో 13 రోజుల్లోనే వాజ్‌పేయి రాజీనామా చేయాల్సి వచ్చింది.

1996 నుంచి 1998 మధ్య రెండు యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు కొలువుదీరినా మధ్యలోనే కూలిపోయాయి. 1998 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు మెజార్టీ రావడంతో వాజ్‌పేయి రెండోసారి ప్రధాని అయ్యారు. కానీ అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత మద్దతు ఉపసంహరించడంతో 13 నెలల తర్వాత ప్రభుత్వం కుప్పకూలింది. 1999 ఏప్రిల్ 17న లోక్‌సభలో విశ్వాస పరీక్షలో ఒక్క ఓటు తేడాతో పడిపోయింది. కార్గిల్ విజయం తదితరాల సాయంతో 1999 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించింది. లోక్‌సభలో 543 సీట్లకు గాను 303 సీట్లు గెలుచుకుంది. వాజ్‌పేయి మూడోసారి ప్రధానమంత్రి అయ్యారు. 1999 నుంచి 2004 దాకా ఐదేళ్లపాటు పూర్తికాలం పదవిలో ఉన్నారు. జవహర్ లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడు లోక్‌సభల్లో ప్రధానమంత్రిగా పనిచేసిన తొలి నాయకుడిగా వాజ్‌పేయి రికార్డుకెక్కారు. నాలుగు వేర్వేరు రాష్ట్రాలు(ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఢిల్లీ) నుంచి వేర్వేరు సమయాల్లో పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించిన ఏకైక నేత వాజ్‌పేయి. తగిన మెజార్టీ లేక వాజ్‌పేయి ప్రభుత్వాలు కూలిపోవడాన్ని హేళన చేసిన ప్రతిపక్షాలతో, ''చూస్తూ ఉండండి! ఏదో ఒక రోజు బీజేపీ పూర్తి మెజార్టీతో సొంతంగా అధికారంలోకి వస్తుంది'' అని పార్లమెంట్‌లో వాజ్‌పేయి బల్లగుద్ది మరీ చెప్పారు. ఆయన వాక్కు నిజమైంది.

– సాక్షి, నేషనల్ డెస్క్



1996లో తొలిసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తూ...

బీజేపీ తొలి అధ్యక్షుడు

1975లో ఎమర్జెన్సీ సమయంలో వాజ్‌పేయీ అరెస్టయ్యారు. తర్వాత 1977 ఎన్నికల్లో జనసంఘ్ ఇతర పార్టీలతో కూడిన జనతా కూటమి నెగ్గి మొరార్జీ దేశాయ్ ప్రధాని అయ్యారు. వాజ్‌పేయీ విదేశాంగ మంత్రిగా రాణించారు. 1977లో ఐరాసలో హిందీలో మాట్లాడి చరిత్ర సృష్టించారు. 1980లో జనసంఘ్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)గా మారాక దాని తొలి అధ్యక్షుడయ్యారు. ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో లోక్‌సభకు పదిసార్లు, రాజ్యసభకు రెండుసార్లు ఎన్నికయ్యారు. 1996లో 13 రోజులు, 1998లో 13 నెలలు, 1999 నుంచి పూర్తిస్థాయిలో ఐదేళ్లు ప్రధానిగా చేశారు. 1998లో పోఖ్రాన్ అణుపరీక్షలతో ప్రపంచాన్ని నివ్వెరపరిచారు. దాయాది పాకిస్తాన్‌తో సంబంధాలకు ప్రాధాన్యమిచ్చారు. లాహోర్ బస్సు యాత్ర చేశారు. కార్గిల్ యుద్ధం తర్వాత కూడా పాక్‌తో సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నించారు. గొప్ప రాజనీతిజ్ఞుడిగా దేశ విదేశాల్లో పేరుగాంచారు. పార్టీలకతీతంగా ఎంపీలతో ఆయనకు సత్సంబంధాలుండేవి. అంతర్జాతీయ వ్యవహారాలపై వాజ్‌పేయీకి అమితాసక్తి ఉండేది. ఆసియా, ఆఫ్రికా, యూరప్ దేశాల్లో విస్తృతంగా పర్యటించారు. వాజ్‌పేయీ హయాంలో 2001లో పార్లమెంట్‌పై దాడి 2002లో గుజరాత్‌లో మత కలహాలు జరిగాయి. ఆయన్ను భారత రాజకీయాల్లో భీష్మ పితామహుడిగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అభివర్ణించారు.

మనసారా మాట్లాడండయ్యా!

నిలువెత్తు కవితాత్మకతకు ప్రతిరూపం అటల్

కవితాత్మక ప్రసంగాలతో మంత్రముగ్ధుల్ని చేసే చాతుర్యం వాజ్‌పేయికి వెన్నతో పెట్టిన విద్య. తేలికైన పదాలతో బరువైన భావాలను వెల్లడించే మాటలకు ఆయన పెట్టింది పేరు. సాహితీ రంగంలోనూ అటల్ తనదైన ముద్ర వేశారు. హిందూ పురాణాల సారాన్ని నింపుకున్న ఆయన వాక్యాలకు పార్లమెంటులో పార్టీలకు అతీతంగా సభ్యులంతా సలామ్ కొట్టేవారు. ఆయన రాజకీయ ప్రసంగాలు కూడా సాహితీ సౌరభాలు వెదజల్లేవి. తాను అధికారంలో ఉండగా విపక్షాలు చేసే విమర్శలకు హుందాగా, చమత్కారంగా బదులిచ్చేవారు. 'మనసారా మాట్లాడండయ్యా' అంటూ తోటివారిని ప్రోత్సహించేవారు.

చిరస్మరణీయ ప్రసంగం

ప్రజాస్వామ్యంపై వాజ్‌పేయికి ఉన్న అపార నమ్మకం ఆయన దార్శనికతలో తొణికిసలాడేది. తన తొలి ప్రభుత్వం 13 రోజులకే కూలిన సందర్భంలో 1996 మే 27న ఆయన పార్లమెంట్‌లో చేసిన ప్రసంగం మరపురానిది! దాన్ని నాటి పార్లమెంట్ సభ్యులు, రాజకీయ నేతలు నేటికీ గుర్తు చేసుకుంటారు. ఎమర్జెన్సీ వేళ జైలు జీవితం గడుపుతూ రాసిన కవితలతో 'ఖైదీ కవి కుండలీ' అనే కవితా సంకలనం రచించారు. 'అమరత్వం అగ్నిలాంటిది', 'నా 51 కవితలు' వంటి పలు సంకలనాలు వెలువరించారు. 'కవిత్వం రాసుకునేంత సమయాన్ని కూడా రాజకీయాలు మిగల్చలేదు. నా కవితా వర్షపుధార రాజకీయ ఎడారిలో ఇంకిపోయింది' అని ఓసారి వాపోయారు. ధోతీ, కుర్తాలో నిండుగా కనిపించే అటల్ ఖాళీ సమయాల్లో కవితలు రాస్తూ సాహిత్యంతో దోస్తీ చేసేవారు.

అవుంటేనే కవిత

వాజ్‌పేయి సరదా మనిషి. ''కవిత్వం రాయాలంటే అనువైన వాతావరణముండాలి. మనసు లగ్నం చేయగలగాలి. మనల్ని ఆవిష్కరించుకునే సమయం చిక్కాలి. ఈ రణగొణ ధ్వనుల మధ్య అవెలా సాధ్యం?'' అన్నారోసారి. కొంతమేర సాహిత్య కృషి చేసినా పెద్దగా రాణించలేదంటూ తెగ బాధపడేవారట. ''కవిత్వంలో నేను చేసింది సున్నా. అసలు రాజకీయాల గడప తొక్కక పోయుంటే హాయిగా కవితలు రాసుకుంటూ, కవి సమ్మేళనాల్లో పాల్గొంటూ ముషాయిరాల్లో మునిగి తేలుతూ గడిపేవాడిని'' అంటూ తరచూ అంతర్మథనానికి లోనయ్యేవారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

క్లుప్తంగా...

సినీ పరిశ్రమను బోనులో పెట్టే ప్రయత్నం: ఈటల



విలేకరులతో మాట్లాడుతున్న ఈటల

రాంగోపాల్‌పేట్: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొత్తం సినీ పరిశ్రమను బోనులో నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్‌ను మంగళవారం ఆయన కిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి వివాదంగా చేస్తున్నట్లుందని ఆరోపించారు. హీరో అల్లు అర్జున్‌ను కావాలనే పోలీస్ స్టేషన్‌కు పిలిపించి స్టేషన్‌లో కూర్చోబెట్టడం మంచిది కాదని హితవు పలికారు.

రాజకీయం చేయడం తగదు: డీకే అరుణ

సంధ్య థియేటర్ ఘటనను రాజకీయం చేయడం మానుకోవాలని.. లేకుంటే దీన్ని సినీ పరిశ్రమపై ప్రభుత్వ వేధింపులుగా భావించాల్సి వస్తుందని ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించారు. మంగళవారం శ్రీతేజను పరామర్శించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బాలుడి కుటుంబాన్ని ఆదుకొనే బాధ్యత సినీ పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కాగా, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సైతం బాలుడిని పరామర్శించారు.

ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు జరుగుతున్నాయి

హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి



పంజగుట్ట (హైదరాబాద్): సంధ్య థియేటర్ ఘటనను ఆసరాగా తీసుకుని తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు, కవిత కలిసి చంద్రబాబు సాయంతో ఢిల్లీలో మోదీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని పడగొట్టి గవర్నర్ పాలన తీసుకువద్దామని చూస్తున్నారని ఆయన అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కలిసి ఎమ్మెల్యేలను ఎలా కొనుగోలు చేయాలన్న ఆలోచనలో ఉన్నాయని, రాబోయే 48 గంటల్లో ఏదో అల్లకల్లోలం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అధికారం లేకపోతే కేసీఆర్ ఫ్యామిలీ ఉండలేదని, ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ మౌనంగా లేరని, ప్రభుత్వాన్ని కూల్చేందుకు స్కెచ్ వేస్తున్నారని ఆయన ఆరోపించారు.

27న రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల నిరసన



మహాత్మా గాంధీ విగ్రహం ముందు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ సర్పంచులు

సాక్షి, హైదరాబాద్/గాంధీ ఆస్పత్రి: గ్రామ పంచాయతీలకు బకాయి ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వద్ద మహాత్మా గాంధీ విగ్రహం ముందు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టి పోస్టర్‌ను ఆవిష్కరించారు. సర్పంచులుగా ఎన్నికై న పాపానికి అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే.. ఆ నిధులు విడుదల చేయకపోవడంతో మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు తమ సమస్యలను ప్రస్తావిస్తే అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవహేళన చేస్తూ మాట్లాడి, సర్పంచుల సమస్యను మరింత జటిలం చేసే విధంగా వ్యవహరించారని వాపోయారు. అందుకు నిరసనగా ఈనెల 27న తెలంగాణవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు ఇవ్వాలని మాజీ సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ తరఫున పిలుపునిస్తున్నామని చెప్పారు. బకాయిలు విడుదల చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, మాజీ సర్పంచుల జేఏసీ ఉపాధ్యక్షుడు జి.మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

‘కృష్ణా’పై మళ్లీ కొట్లాట!

అపెక్స్ కౌన్సిల్ నీటి పంపకాల జోలికి వెళ్లదని తేల్చిన కేంద్ర జలశక్తి శాఖ

మళ్లీ కృష్ణా బోర్డు ముందుకు తెలంగాణ, ఏపీ మధ్య నీటి పంపిణీ అంశం

అనుమతుల్లేని ప్రాజెక్టులకు నీటి విడుదలపై జనవరి 21న బోర్డు భేటీలో జరగనున్న చర్చ

ఎజెండాలో ఇరు రాష్ట్రాల ప్రతిపాదనలను వేర్వేరుగా చేర్చిన బోర్డు


సాక్షి, హైదరాబాద్: నీటి పంపకాల జోలికి అపెక్స్ కౌన్సిల్ వెళ్లదని కేంద్ర జలశక్తి శాఖ తేల్చిచెప్పడంతో కృష్ణా జలాల తాత్కాలిక సర్దుబాటు అంశం మళ్లీ కృష్ణా బోర్డు ముందుకొచ్చింది. దీంతో తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీ, ఇతర అంశాలపై చర్చించడానికి జనవరి 21న కృష్ణా బోర్డు భేటీ కానుంది. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల వాటా ఉండగా ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను తాత్కాలిక సర్దుబాటు పేరుతో జరిపిన కేటాయింపులు 2021–22 వరకు కొనసాగాయి. ఆ తర్వాతి నుంచి తెలంగాణ రాష్ట్రం ఆ కేటాయింపులను వ్యతిరేకిస్తోంది. 50:50 నిష్పత్తిలో తాత్కాలికంగా నీటి పంపిణీ జరపాలని కోరుతోంది. అయితే ఏపీ మాత్రం 66:34 నిష్పత్తిలోనే నీటి పంపిణీ కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది.

ఎజెండాలో తెలంగాణ ప్రతిపాదనలివీ..



- నాగార్జునసాగర్ నిర్వహణ, పర్యవేక్షణ, యాజమాన్యాన్ని అప్పగించాలి. ఆనకట్టల భద్రత చట్టం 2021 ప్రకారం సాగర్ నిర్వహణ, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలు తెలంగాణ పరిధిలోకే వస్తాయి. రాష్ట్ర విభజన నాటి నుంచి సాగర్ డ్యామ్, కుడి, ఎడమ కాల్వల రెగ్యులేటర్ల నిర్వహణ, పర్యవేక్షణ తెలంగాణ చేతిలో ఉండగా 2023 నవంబర్ 28న ఏపీ అ .దీనంలోకి సగం డ్యామ్‌ను తీసుకోవడం సరికాదు.
- తెలంగాణ వాడుకోకపోవడంతో సాగర్‌లో మిగిలిన తమ వాటా జలాలను తదుపరి నీటి సంవత్సరంలో వాడుకోవడానికి అనుమతించాలి.
- సాగర్ టెయిల్‌పాండ్ డ్యామ్ గేట్ల నిర్వహణను తెలంగాణకే అప్పగించాలి. ఆర్డీఎస్ ఆనకట్ట ఆధునీకరణకు ఏపీ అడ్డుకోకుండా సహకరించాలి.
- ఆర్డీఎస్ కుడికాల్వ పనులను ఏపీ చేపట్టరాదు.
- ఏపీ నీటి వినియోగాన్ని కచ్చితంగా లెక్కించడానికి శ్రీశైలం, సాగర్, ప్రకాశం, సుంకేశుల బరాజ్‌ల వద్ద టెలిమెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.
- కృష్ణా ట్రిబ్యునల్‌–1 తీర్పు ప్రకారం తాగునీటికి తీసుకున్న జలాల్లో 20 శాతాన్నే లెక్కించాలి.
- రాయలసీమ ఎత్తిపోతలు సహా అనుమతుల్లేకుండా కృష్ణా బేసిన్‌లో ఏపీ చేపడుతున్న ఇతర ప్రాజెక్టులు, ఎస్‌ఆర్‌ఎంసీ కాల్వ లైనింగ్ పనులను నిలుపుదల చేయాలి.
- శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు, ఎస్‌ఆర్‌బీసీ, జీఎన్‌ఎస్‌ఎస్, తెలుగు గంగ, హెచ్‌ఎన్‌ఎస్, నిప్పులవాగు ఎస్కేప్ చానల్ ఇతర మార్గాల ద్వారా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు కృష్ణా జలాలను ఏపీ తరలించకుండా నిలువరించాలి.
- ఏపీ పరిధిలో శ్రీశైలం జలాశయం ప్లంజ్ పూల్‌కు అత్యవసర మరమ్మతులు నిర్వహించాలి.

ఏపీ ప్రతిపాదించిన అంశాలు..



- శ్రీశైలం, సాగర్, ఇతర ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించే వరకు సాగర్ కుడికాల్వ హెడ్ రెగ్యులేటర్ వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలను ఉపసంహరించుకోవాలి.
- నీటి కేటాయింపుల్లేకుండా తెలంగాణ చేపట్టిన సుంకిశాల ఇన్‌టేక్ వెల్ నిర్మాణాన్ని అడ్డుకోవాలి.
- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను మాకు అందించాలి.
- పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టా సిస్టమ్‌కు తరలించడానికి బదులుగా సాగర్ ఎగువన 80 టీఎంసీల కృష్ణా జలాలు వాడుకొనే అవకాశాన్ని గోదావరి ట్రిబ్యునల్ కల్పించింది. వాటిలో మిగిలిన ఉన్న 45 టీఎంసీలను తెలంగాణ పాలమూరు–రంగారెడ్డికి కేటాయించింది. ఆ జలాలపై తెలంగాణకు ఎలాంటి హక్కులు లేవు.
- కల్వకుర్తి లిఫ్టు ద్వారా అదనంగా 15 టీఎంసీల తరలింపు పనులకు గెజిట్ నోటిఫికేషన్‌లో అనుమతుల నుంచి మినహాయింపు కల్పించడం సరికాదు.
- అనుమతులు లేకుండా తెలంగాణ చేపట్టిన అచ్చంపేట, నారాయణపేట – కొడంగల్ లిఫ్టు పనులను అడ్డుకోవాలి.

3.30 గంటలు.. 20 ప్రశ్నలు

▶ మొదటి పేజీ తరువాయి

కింద రూమ్ వరకే అనుమతించారు. మొదటి అంతస్తులో అడ్వొకేట్ అశోక్‌రెడ్డి సమక్షంలో అల్లు అర్జున్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ విచారించారు. సంధ్య థియేటర్ ఘటన, తదినంతర పరిణామాలపై మధ్యాహ్నం 2:47 గంటల వరకు ప్రశ్నించారు. తొక్కిసలాట ఘటనపై ఇటీవల విడుదల పోలీసులు చేసిన పది నిమిషాల వీడియోను ఆధారంగా చూపిస్తూ వివరాలను తెలుసుకున్నారు. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్‌లో ప్రస్తావించిన అంశాలపైనా ఆరా తీశారు. విచారణ అనంతరం అల్లు అర్జున్ నేరుగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వెళ్లిపోయారు.

10 నిమిషాలకోసారి విరామమిస్తూ..

పోలీసుల విచారణ సందర్భంగా అల్లు అర్జున్ ప్రతి పది నిమిషాలకోసారి విరామం తీసుకున్నట్లు తెలిసింది. దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన విచారణలో అల్లు అర్జున్ కేవలం ఒక్కసారి మాత్రమే టీ తీసుకున్నట్లు సమాచారం. చివరిగా అవసరమైతే మరోసారి నోటీసులు ఇస్తామని, విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని, అందుబాటులో ఉండాలని పోలీసులు అల్లు అర్జున్‌కు సూచించినట్లు తెలిసింది.

ఏ–18గా మైత్రి మూవీస్..

సంధ్య థియేటర్ ఘటనలో ఇప్పటివరకు మైత్రి మూవీస్ సంస్థపై ఎటువంటి కేసులు నమోదు చేయని పోలీసులు.. మంగళవారం అల్లు అర్జున్ విచారణ సమయంలో మైత్రి మూవీస్ సంస్థ నిర్మాతలను ఏ–18 నిందితులుగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

సంధ్య థియేటర్ కేసులో నిందితుల వివరాలివీ..

- ఏ–1: ఆగమాటి పెదరామిరెడ్డి, థియేటర్ యజమాని
- ఏ–2: ఆగమాటి చిన్నరామిరెడ్డి, థియేటర్ యజమాని
- ఏ–3: ఎం.సందీప్, భాగస్వామి
- ఏ–4: సుమిత్, భాగస్వామి
- ఏ–5: ఆగమాటి వినయ్, భాగస్వామి
- ఏ–6: అశుతోష్‌రెడ్డి, భాగస్వామి
- ఏ–7: రేణుకాదేవి, భాగస్వామి
- ఏ–8: అరుణారెడ్డి, భాగస్వామి
- ఏ–9: నాగరాజు, థియేటర్ మేనేజర్
- ఏ–10: విజయ్ చందర్, లోయర్ బాల్కనీ ఇన్‌చార్జి
- ఏ–11: అల్లు అర్జున్, పుష్ప సినిమా హీరో
- ఏ–12: సంతోష్, అల్లు అర్జున్ పీఏ
- ఏ–13: శరత్ బన్నీ, అల్లు అర్జున్ మేనేజర్
- ఏ–14: రమేష్, సెక్యూరిటీ
- ఏ–15: రాజు, సెక్యూరిటీ
- ఏ–16: వినయ్‌కుమార్, ఫ్యాన్స్ అసోసియేషన్
- ఏ–17: పర్వేజ్, బాడీగార్డ్
- ఏ–18: మైత్రీ మూవీస్ సంస్థ నిర్మాతలు

తొక్కిసలాట కాదు... ఊపిరాడకనే..

సంధ్య థియేటర్‌లో తొక్కిసలాటతోనే రేవతి మరణించిందని, శ్రీతేజ్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారని ఇప్పటివరకు భావిస్తున్నారు. తొక్కిసలాట అయితే వారి శరీరంలో ఎముకలు విరగడం గానీ, ఇతర అవయవాలు దెబ్బతినడం గానీ జరిగి ఉండేది. అయితే రేవతికి గానీ, శ్రీతేజ్‌కి గానీ ఎక్కడ కూడా గాయాలైన ఆనవాళ్లు లేవని వైద్యుల నివేదికలో వెల్లడైంది. థియేటర్ లోయర్ బాల్కనీలో పరిమితికి మించి అభిమానులు ఒక్కసారిగా దూసుకురావడం వల్లే వారికి ఊపిరి ఆడలేదని.. ఈ క్రమంలోనే రేవతి కన్నుమూసిందని, శ్రీతేజ్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం.

బౌన్సర్ల ఆర్గనైజర్ ఆంటోనీ ఆరెస్టు



సంధ్య థియేటర్‌లో ఒక్కసారిగా తొక్కిసలాట మొదలవడానికి కారణం ఎవరనేది గుర్తించేందుకు పోలీసులు 10వేలకు పైగా వీడియోలను విశ్లేషించారు. తొక్కిసలాటకు ప్రధాన కారకుడు ఈవెంట్లలో బౌన్సర్లకు ఆర్గనైజర్‌గా పని చేస్తున్న ఆంటోనీ అని గుర్తించారు. పోలీసులను సైతం అల్లు అర్జున్ దగ్గరకు వెళ్లకుండా అడ్డుకోవడం, గేట్లను మూసివేయడం వంటి వాటిని అతడే దగ్గరుండి పర్యవేక్షించినట్టు సీసీ కెమెరా ఫుటేజీలలో గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆంటోనీని చిక్కడపల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

అల్లు అర్జున్‌ను పోలీసులు అడిగిన పలు ప్రశ్నలివే..

సుమారు మూడున్నర గంటల పాటు అల్లు అర్జున్‌ను విచారించిన పోలీసులు నాటి ఘటనకు సంబంధించి 20కి పైగా ప్రశ్నలు అడిగారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం పోలీసులు అడిగిన ప్రశ్నలివే..

- పుష్ప–2 సినిమా బెనిఫిట్ షోకు అల్లు అర్జున్ సహా ఇతర నటీనటుల రాకకు పోలీసులు అనుమతి తిరస్కరించినట్లు సంధ్య థియేటర్ సీనియర్ మేనేజర్ నాగరాజు అంగీకరించారు. ఈ విషయాన్ని నాగరాజు మీకు చెప్పారా? లేదా?
- థియేటర్ యాజమాన్యం నుంచి మీకు సమాచారం అందిందా, లేదా? అందినప్పటికీ మీరు ప్రీమియర్ షోకు వచ్చారా?
- పోలీసుల అనుమతి లేకున్నా థియేటర్‌కు ఎందుకు వచ్చారు?
- మీతో పాటు సినిమా చూసేందుకు ఎంత మంది వచ్చారు?
- మీతోపాటు ఎంత మంది బౌన్సర్లు వచ్చారు? ఆ బౌన్సర్ల ఏజెన్సీకి అనుమతులు ఉన్నాయా?
- మీరు థియేటర్‌కు రావడం వల్లనే తొక్కిసలాట జరిగిందనే దానిని అంగీకరిస్తారా?
- చేతులు ఊపుతూ ర్యాలీగా ఎందుకు థియేటర్‌లోకి వచ్చారు?
- పోలీసుల విధులను మీరు ఎందుకు అడ్డుకున్నారు?
- రేవతి చనిపోయిందనే విషయం మీకు థియేటర్ లోపల మేనేజర్ నాగరాజు చెప్పారా? లేదా?
- రేవతి మృతి గురించి మరుసటి రోజు వరకు మీకు తెలియదని మీడియాతో ఎందుకు చెప్పారు?
- చనిపోయిన రేవతి కుటుంబంతో మీరు మాట్లాడుతున్నారా?
- తొక్కిసలాట జరిగినా, ఒక వ్యక్తి మరణించినా కూడా మీరు ఎందుకు థియేటర్ నుంచి బయటికి రాలేదు?

బందోబస్తు మధ్య విచారణకు..

సినీహీరో అల్లు అర్జున్ పోలీసు విచారణకు హాజరయ్యే ముందు తన నివాసంలో లీగల్ టీమ్‌తో రెండు గంటల పాటు చర్చించారు. లీగల్ టీమ్‌ను కూడా తన వెంట పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లే అవకాశాలు ఉన్నాయా అని అల్లు అర్జున్ ఆరా తీశారని... ఇందుకు నిబంధనలు ఒప్పుకోబోవని, ఒక న్యాయవాది వెంట ఉండవచ్చని నిపుణులు పేర్కొన్నారని తెలిసింది. దీంతో అల్లు అర్జున్ తండ్రితో కలసి సుమారు 10.37 గంటల సమయంలో నివాసం నుంచి బయలుదేరారు. ఆయన బయటికి వస్తున్నారని తెలిసి పెద్ద సంఖ్యలో అభిమానులు గుమిగూడగా, పోలీసులు వారిని పంపించి వేశారు. ఇక అల్లు అర్జున్ ఇంటిపై మూడు రోజుల క్రితం ఓయూ జేఏసీ విద్యార్థి సంఘాల నేతలు దాడి చేసిన నేపథ్యంలో పోలీసులు అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నివాసానికి దారితీసే మార్గాల్లోనూ పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేసి... అనుమానితుల కదలికలపై నిఘా పెట్టారు. విచారణకు హాజరయ్యేందుకు వెళ్తున్న సమయంలోనూ ముందు వెనుక పోలీసు భద్రత కల్పించారు.

అల్లు అర్జున్ ఇంటికి పరదాలు

సంధ్య థియేటర్ వివాదం, అరెస్టు, పోలీసు విచారణ నేపథ్యంలో.. అల్లు అర్జున్ నివాసం వద్దకు యూ ట్యూబర్లు, సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లు, అభిమానులు చాలా మంది వస్తూ ఫొటోలు, వీడియోలు తీయిస్తున్నారు. ఇంటి లోపలి వరకు కెమెరాలను ఫోకస్ చేస్తున్నారు. ఈ క్రమంలో అల్లు ఇంటి చుట్టూ తెల్లటి పరదాలు కట్టారు. బయటి నుంచి లోపలి వరకు కనబడకుండా ఏర్పాట్లు చేశారు.



త్వరలో రూ.400 కోట్లు విడుదల

- మా ప్రభుత్వం వచ్చేనాటికి గ్రామ పంచాయతీలకు ఉన్న బకాయిలు రూ. 1,300 కోట్లు: భట్టి
- బిల్లులు పెండింగ్‌లో పెట్టిన బీఆర్‌ఎస్ నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన అప్పటి సర్పంచులకు త్వరలోనే రూ.400 కోట్లు విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వం వారితో అభివృద్ధి పనులు చేయించి.. నిధులు విడుదల చేయకుండా వారిని రోడ్డుపై వదిలేసిందని మండిపడ్డారు. అందువల్ల పంచాయతీ బకాయిలపై బీఆర్‌ఎస్ నాయకులు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని హితవు పలికారు. రూ.10 లక్షలలోపు పెండింగ్‌లో ఉన్న ప్రజాప్రతినిధుల బిల్లులు దాదాపు రూ.400 కోట్లు ఉంటాయని అంచనా వేశామని, వాటిని త్వరలోనే విడుదల చేస్తామని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో భట్టి చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు వంటి ప్రజాప్రతినిధులు చేసిన అభివృద్ధి కార్యక్రమాల పెండింగ్ బిల్లులు గత సంవత్సరం డిసెంబర్ 7 నాటికి ఉన్న బకాయిలు రూ.1,300 కోట్లు అని వెల్లడించారు. సర్పంచులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పడుతున్న ఇబ్బందులను సీఎం రేవంత్‌రెడ్డి, తాను గమనించి రూ.10 లక్షల లోపు ఉన్న బకాయిలను త్వరలోనే విడుదల చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల ఇబ్బందులకు కారణమైన బీఆర్‌ఎస్ నేతలు పెండింగ్ బిల్లుల కోసం ధర్నాలు చేస్తామని ప్రకటించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

పంట పొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు

ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం–కుసుమ్) పథకం కింద రాష్ట్రంలో రైతుల పంట పొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 0.5– 2 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్లను ఎండిపోయిన, పాడుబడిన వ్యవసాయ భూముల్లో రైతులతో ఏర్పాటు చేయిస్తామన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్‌కు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు యూనిట్‌కు రూ.3.13 చొప్పున ధర చెల్లిస్తాయన్నారు. రైతులు, రైతు బృందాలు, సహకార సొసైటీలు, పంచాయతీలు, రైతు సంఘాలు, నీటి వినియోగ సంఘాలు ఈ పథకం కింద అర్హులన్నారు.

కళ్లు తెరిచిన శ్రీతేజ్

కొద్దిగా స్పర్శ కూడా తెలుసుకుంటున్నట్లు వైద్యుల వెల్లడి

రాంగోపాల్‌పేట్: సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోంది. ప్రమాదం జరిగినప్పటి నుంచి కోమాలో ఉన్న బాలుడిని వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తూ వచ్చారు. దీంతో అతను కాస్త కోలుకోవడంతో రెండు రోజుల క్రితం వెంటిలేటర్ తొలగించారు. ప్రస్తుతం అతను సొంతంగానే శ్వాస తీసుకుంటుండటంతోపాటు కళ్లు తెరిచి చూస్తున్నాడని.. కొద్దిగా స్పర్శ కూడా తెలుసుకోగలుగుతున్నాడని వైద్యులు తెలిపారు. అయితే ఇంకా కుటుంబ సభ్యులను గుర్తించట్లేదని.. మాటలకు ప్రతిస్పందించట్లేదని చెప్పారు. గత మూడు రోజులుగా నాసోగ్యాస్ట్రిక్ ట్యూబ్ ద్వారా అందించే ఆహారాన్ని తీసుకుంటున్నట్లు వివరించారు.

థియేటర్ లోపల ఏమి జరిగిందో తెలియదు: భాస్కర్

సంధ్య థియేటర్ లోపల ఏమి జరిగిందో తనకు తెలియదని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ మీడియాకు చెప్పారు. తాను కుమార్తెతో కలిసి థియేటర్ బయట నుంచి భార్యకు ఫోన్ చేయగా లోపల ఉన్నట్లు చెప్పిందని.. ఆ కొద్దిసేపటికే తొక్కిసలాటలో మరణించినట్లు తెలిసిందన్నారు. ఇంతవరకు తాను ఆస్పత్రికి బిల్లులేవీ చెల్లించలేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. మైత్రీ మూవీస్ రూ. 50 లక్షలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆయనకు చెందిన కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ. 25 లక్షలు, హీరో అల్లు అర్జున్ నుంచి రూ. 10 లక్షలు తనకు అందాయన్నారు. అల్లు అర్జున్ మేనేజర్ తదితరులు నిత్యం శ్రీతేజ్ ఆరోగ్యం గురించి తనను సంప్రదిస్తున్నారని చెప్పారు. అలాగే దర్శకుడు సుకుమార్ రెండుసార్లు వచ్చి కలిశారని తెలిపారు. ఘటన జరిగిన రెండవ రోజు అల్లు అర్జున్ అరెస్టు అవుతున్నాడని సానుభూతితోనే నేను కేసు వాపసు తీసుకుంటానని చెప్పినట్లు తెలిపారు.

కావాలని ఎవరూ చేయరు

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన దురదృష్టకరం
- 2–3 రోజుల్లో సినీపరిశ్రమ పెద్దలతో వెళ్లి సీఎంను కలిసి మాట్లాడతా
- ప్రముఖ నిర్మాత, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు వెల్లడి
- కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి పరామర్శ



విలేకరులతో మాట్లాడుతున్న దిల్‌రాజు


రాంగోపాల్‌పేట్: పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఒకరు మృతిచెందడం దురదృష్టకరమని ప్రముఖ నిర్మాత, తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు అన్నారు. అయితే ఇలాంటి ఘటనలను ఎవరూ కావాలని చేయరని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఉదంతాలు మళ్లీ జరగకుండా అందరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను మంగళవారం దిల్‌రాజు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య సమస్యల్లేకుండా చూసుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు ఎఫ్‌డీసీ చైర్మన్ బాధ్యతలు అప్పగించారని ఆయన చెప్పారు. రెండు, మూడు రోజుల్లో పరిశ్రమ పెద్దలతో సహా ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడతానని.. సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారమవుతాయని ఆయన హామీ ఇచ్చారు. మరోసారి సీఎం కలవడంతోపాటు హీరో అల్లు అర్జున్‌ను కూడా కలిసి అన్ని విషయాలు తెలుసుకుంటానన్నారు.

రేవతి కుటుంబానికి అండగా ఉంటాం..

శ్రీతేజ్‌కు వెంటిలేటర్ తొలగించి రెండు రోజులైందని.. బాలుడు త్వరలోనే కోలుకుంటాడని ఆశిస్తున్నట్లు దిల్‌రాజు చెప్పారు. అమెరికా పర్యటనలో ఉండటం వల్ల తాను ఇక్కడికి రాలేకపోయానని.. సీఎంను మంగళవారమే కలిశానన్నారు. తొక్కిసలాటలో మృతిచెందిన రేవతి కుటుంబాన్ని ఆదుకొనే బాధ్యతను ప్రభుత్వం, సినీ పరిశ్రమ తీసుకుంటుందన్నారు. బాలుడి తండ్రి భాస్కర్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారని.. అవసరమైతే సినీ పరిశ్రమలో ఉద్యోగం కల్పిస్తామని దిల్‌రాజు తెలిపారు.

నచ్చిన రీతిలో ఇందిరమ్మ ఇళ్లు

- వాటి నిర్మాణానికి అధికారిక నమూనా లేదు
- లబ్ధిదారులు సొంత డిజైన్‌లో నిర్మించుకోవచ్చు
- సంక్రాంతి నాటికి నిర్మాణాలు మొదలు: మంత్రి పొంగులేటి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: లబ్ధిదారులు వారికి ఇష్టమైన నమూనాలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవచ్చని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి డిజైన్‌లను లబ్ధిదారులపై రుద్దబోదని చెప్పారు. తొలి విడతలో సొంత స్థలాలున్న వారికే ఇళ్లను మంజూరు చేస్తున్నందున, ఆ స్థలం ఆకృతికి తగినట్లుగా ఇళ్లను నిర్మించుకోవచ్చని అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి నాటికి ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేస్తున్నామని, జనవరి తొలివారం నాటికి కసరత్తు పూర్తవుతుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణకు ఏఈ స్థాయి అధికారిని ప్రతి జిల్లాకు ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తున్నామని వెల్లడించారు. వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నందున.. అందుకు సరిపడా ఉద్యోగులను ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. 1,200 మంది వరకు సర్వేయర్లను నియమించుకుంటామని పేర్కొన్నారు. తొలివిడతలో వికలాంగులు, వితంతువుల వంటి వారికి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. తాము అర్హులుగా భావించినప్పటికీ ఏదైనా కారణంతో కేంద్రం తిరస్కరిస్తే.. రాష్ట్ర ప్రభుత్వమే వారికి పూర్తి నిధులు చెల్లించి లబ్ధిదారులుగా కొనసాగిస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం 80 లక్షలవరకు దరఖాస్తులు వస్తే.. ఇప్పటివరకు 32 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్

ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్వహణకు ప్రత్యేక విధివిధానాలను ప్రకటిస్తామని మంత్రి తెలిపారు. వారంలో ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేస్తామని, ఇందులో టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. రేషన్‌కార్డులతో సంబంధం లేకుండా సొంత స్థలం ఉన్నవారికి తొలుత ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడించారు. గ్రామాల వారీగా ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేస్తాయని చెప్పారు. గత ప్రభుత్వం వదిలేసిన రెండు పడకగదుల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని ప్రకటించారు. హైదరాబాద్ నలువైపులా 100 ఎకరాల చొప్పున సమీకరించి హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఇళ్లు నిర్మిస్తామన్నారు.

ఆ డిఫాల్ట్ మిల్లర్లకూ ధాన్యం మిల్లింగ్ అవకాశం

ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: సీఎంఆర్ కోసం ధాన్యం ఇవ్వకుండా ఎగవేసిన మిల్లులను డిఫాల్టర్లుగా ప్రకటించిన ప్రభుత్వం వారికి ఖరీఫ్ ధాన్యం కేటాయించేందుకు షరతులతో కూడిన అనుమతులు ఇచ్చింది. ఎగవేసిన సీఎంఆర్ బియ్యాన్ని 100% రికవరీ కింద తిరిగి ఇచ్చి 25% అపరాధ రుసుము చెల్లించిన వారికి కొంత వెసులుబాటు ఇచ్చింది. అపరాధ రుసుములో తొలుత సగం చెల్లించిన వారికి ధాన్యం కేటాయించాలని జిల్లా కలెక్టర్లకు సివిల్ సప్లైస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాలు ఇచ్చారు. మిగతా 50 శాతాన్ని 3 నెలల్లో చెల్లించే అవకాశం కల్పించారు.



చొక్కా చించి.. చెంపపై కొట్టి..
అక్రమ నిర్మాణాల కూల్చివేతకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై కొందరు కబ్జాదారులు దాడికి పాల్పడ్డారు. రెవెన్యూ అధికారి చొక్కా చించి.. చెంపపై కొట్టి మరీ దాడి చేశారు. -10లో



'కొత్త' ఉత్సాహం..
నగర యువతలో 'కొత్త' ఉత్సాహం ఉరకలెత్తు తోంది. న్యూ ఇయర్ వేడుకలకు పబ్‌లు, రిసార్ట్‌లు, ఫామ్ హౌస్‌లు వేదికలు కానున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0/20.0
నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

కరుణామయుడు అరుదెంచే..


సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీ చర్చి


కల్వరి టెంపుల్


అబిడ్స్‌లోని సెయింట్ జోసెఫ్ చర్చి

కరుణామయుడు అరుదెంచే శుభ తరుణాన.. బుధవారం క్రిస్మస్ సందర్భంగా నగరంలోని చర్చిలు విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబయ్యాయి. ప్రధానంగా మియాపూర్‌లోని కల్వరి టెంపుల్, అబిడ్స్‌లోని సెయింట్ జోసెఫ్, సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీ తదితర చర్చిలు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమయ్యాయి. క్రీస్తు స్తుతి గీతాలతో అంతటా పండగ వాతావరణం నెలకొంది. శాంటాక్లాజ్‌లు, క్రిస్మస్ ట్రీలు, రంగు రంగుల స్టార్‌లు వేడుకలకు వన్నెలద్దాయి. మంగళవారం రాత్రి చర్చిలు ఇలా విద్యుత్ కాంతులతో తళుకులీనాయి.

'ఎన్ఆర్ఎస్‌సీ'తో చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

- అధికారులతో సమావేశమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్



సాక్షి, సిటీబ్యూరో: చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిని నిర్ధారించడంతో పాటు ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఎన్ఆర్ఎస్‌సీ శాటిలైట్ ఇమేజ్‌లు ప్రధాన పాత్ర పోషిస్తాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. 1973 నుంచి 2024 వరకు ఎక్కువ వర్షపాతం నమోదైన డేటా ఆధారంగా ఆపరేట్ శాటిలైట్ ఇమేజీల ద్వారా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించేందుకు హైడ్రా పూనుకుంది. ఇప్పటికే సర్వే ఆఫ్ ఇండియా, సర్వే ఆఫ్ తెలంగాణ, గ్రామీణ మ్యాప్‌ల నుంచి హైడ్రా సమాచారాన్ని సేకరించించిన సంగతి తెలిసిందే. తాజాగా బాలానగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) కార్యాలయాన్ని కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఎస్సీ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి దశాబ్దాల నాటి శాటిలైట్ ఇమేజీలను పరిశీలించారు. చెరువులు, పార్కులను గుర్తించడంతో పాటు లోతట్టు, వరద ముప్పు ప్రాంతాలను గుర్తించేందుకు కూడా ఈ ఇమేజీలు ఎంతో ఉపయోగపడతాయని కమిషనర్ తెలిపారు. వరదలు వచ్చినప్పుడు ఏ ప్రాంతాలు నీట మునిగాయి, వరద కాలువల ఉద్ధృతి, చెరువుల పూర్తి స్థాయి నీటి నిలువ సామర్థ్యం ఇలా అన్ని కోణాల్లో వీటితో అంచనా వేసి జాగ్రత్తలు తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని చెరువుల పరిరక్షణపై అధికారులతో రంగనాథ్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ఎంఎంటీఎస్ స్పెషల్స్

సాక్షి, సిటీబ్యూరో: క్రిస్మస్ సందర్భంగా బుధవారం, జనవరి 1వ తేదీ కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో ప్రత్యేకంగా ఎంఎంటీఎస్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్- లింగంపల్లి, ఫలక్‌నుమా- లింగంపల్లి, సికింద్రాబాద్- లింగంపల్లి తదితర ప్రాంతాల మధ్య ప్రయాణికుల రద్దీకనుగుణంగా ప్రత్యేక రైళ్లు నడపనున్నారు.

సికింద్రాబాద్‌లో స్కైవాక్

రైల్వేస్టేషన్, మెట్రోస్టేషన్‌లు, బస్ టర్మినళ్లకు అనుసంధానం

- లక్షలాది మంది ప్రయాణికులకు ఊరట
- సుమారు 800 మీటర్ల స్కైవాక్ నిర్మాణానికి ప్రణాళికలు
- దాదాపు రూ.30 కోట్ల వరకు అంచనా
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన హుమ్టా



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లో స్కైవాక్ నిర్మాణానికి హెచ్ఎండీఏ అనుబంధ హైదరాబాద్ యూనిఫైడ్ మొబిలిటీ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (హుమ్టా) ప్రణాళికలను రూపొందించింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌తో పాటు బస్టాప్‌లు, టర్మినళ్లు, మెట్రో స్టేషన్‌లను కలుపుతూ స్కైవాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సిటీబస్సులు, మెట్రోలు, ప్రధాన రైళ్లలో వివిధ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు చేరుకొనే ప్రయాణికులు తమకు అవసరమైన రవాణా సదుపాయం వరకు స్కైవాక్ మార్గంలోనే రాకపోకలు సాగించవచ్చు. హుమ్టా ప్రతిపాదించిన స్కైవాక్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తే లక్షలాది మంది ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుంది. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్ నుంచి సికింద్రాబాద్ వెస్ట్ మెట్రోస్టేషన్ వరకు 800 మీటర్‌ల స్కైవాక్ నిర్మాణానికి రూ.30 కోట్ల వరకు ఖర్చు కానున్నట్లు అంచనా. ఈ స్కైవాక్ రూట్‌లో సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్, రేతిఫైల్ బస్‌స్టేషన్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, గురుద్వార, సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో తదితర ప్రాంతాలు అనుసంధానమవుతాయి. మెట్రోలో వచ్చిన ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు చేరుకోవచ్చు. అలాగే.. సికింద్రాబాద్ స్టేషన్‌లో ట్రైన్ దిగిన వాళ్లు స్కైవాక్ మార్గంలో నేరుగా రేతిఫైల్‌బస్టేషన్ లేదా మెట్రోస్టేషన్‌కు వెళ్లిపోవచ్చు. ఇలా ఒకే రూట్‌లో మెట్రోరైళ్లు, సిటీబస్సులు, దూర ప్రాంతాల రైళ్లకు ప్రయాణికులు మారేందుకు అవకాశం ఉంటుంది.

రోజుకు లక్షలాది మంది..

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాలు నిత్యం ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారితో పాటు దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రాకపోకలతో ఆ ప్రాంతం రద్దీగా ఉంటుంది. ప్రతిరోజూ సుమారు 1000 బస్సులు సికింద్రాబాద్ నుంచి నగరంలోని అన్ని ప్రధాన రూట్లలో తిరుగుతున్నాయి. అల్వాల్, తిరుమలగిరి, జీడిమెట్ల, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్, ఉప్పల్, ఘట్కేసర్, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, అఫ్జల్‌గంజ్, చార్మినార్, జూపార్క్, మెహిదీపట్నం, లంగర్‌హౌస్, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, ఐటీ కారిడార్‌లు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే సిటీ బస్సులకు సికింద్రాబాద్ ప్రధాన కేంద్రం. సిటీ బస్సుల్లోనే సుమారు 8 లక్షల మందికి పైగా సికింద్రాబాద్ నుంచి ప్రయాణం చేస్తారు.
- ఈసీఐఎల్, మల్కాజిగిరి, కుషాయిగూడ వైపు వెళ్లే బస్సులు బ్లూ సీ హోటల్ ఎదురుగా ఉన్న బస్టాపులో ఆగుతాయి. ఉప్పల్ వైపు నుంచి వచ్చేవాటిని చిలకలగూడ చౌరస్తాలో నిలుపుతారు. అలాగే.. బార్కాస్, కాచిగూడ, కోఠి, అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లే వాటికి రేతిఫైల్ వద్ద హాల్టింగ్ ఉంది. రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉన్న బస్టాపులో అఫ్జల్‌గంజ్, మెహిదీపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లేవి ఆగుతాయి. గురుద్వార వద్ద పటాన్‌చెరు, బీహెచ్ఈఎల్, జీడిమెట్ల, అల్వాల్, బోయిన్‌పల్లి తదితర మార్గాల్లో నడిచే బస్సులు ఆగుతాయి. దీంతో చిలకలగూడలో దిగిన ప్రయాణికులు జీడిమెట్ల బస్సు ఎక్కాలంటే వాహనాల రద్దీని దాటుకొని కనీసం 2 కిలోమీటర్‌లు నడవాల్సి ఉంటుంది. ట్రైన్ దిగిన ప్రయాణికులు బ్లూ సీ వైపు, చిలకలగూడ చౌరస్తా వైపు వెళ్లాలన్నా కష్టమే. అలాగే.. ఈ ప్రాంతంలో రోడ్డు మార్గంలో మెట్రోకు చేరుకోవడం కూడా కష్టంగానే ఉంటుంది.

స్కైవాక్ కనెక్టివిటీ ఇలా..

ప్రస్తుతం మెట్రో ఈస్ట్ స్టేషన్ నుంచి రేతిఫైల్‌కు చేరుకొనేందుకు హైదరాబాద్ మెట్రోరైల్ ఒక స్కైవేను ఏర్పాటు చేసింది. ఈ రూట్‌లో రేతిఫైల్ నుంచి మెట్రోకు రాకపోకలు సాగిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరభివృద్ధిలో భాగంగా స్టేషన్ నుంచి రేతిఫైల్ వరకు ఒక ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు.

వేగంగా సికింద్రాబాద్ పునరభివృద్ధి...

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని దక్షిణమధ్య రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి రోజుకు సుమారు 200 రైళ్లు నడుస్తున్నాయి. 2 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. బస్సులు, రైళ్లు, మెట్రోల్లో ప్రయాణం చేసే మొత్తం ప్రయాణికుల సంఖ్య 10 లక్షలకుపైగా ఉంటుంది.
- ప్రస్తుతం ఉప్పల్ రింగ్‌రోడ్డు మార్గంలో అందుబాటులో ఉన్న స్కైవాక్ వల్ల ప్రతి రోజు వేలాది మంది ఎలాంటి ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగిస్తున్నారు. అదే తరహాలో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేయడం వల్ల లక్షలాది మందికి ప్రయోజనం కలుగుతుందని హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

చౌక్కా చించి.. చెంపపై కొట్టి..

జవహర్‌నగర్‌లో రెచ్చిపోయిన కబ్జాదారులు

- రెవెన్యూ అధికారులపై దాడి
- అక్రమ కట్టడాల కూల్చివేతలో ఘటన



జవహర్‌నగర్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్‌పై దాడి చేస్తున్న కబ్జాదారులు



రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర సాయిపై దాడి..

జవహర్‌నగర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేతకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై కొందరు కబ్జాదారులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ అధికారి చొక్కా చించి.. చెంపపై కొట్టి మరీ దాడి చేశారు. ఈ ఘటన మంగళవారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి దేవేందర్ నగర్‌లో చోటుచేసుకుంది. అధికారుల కథనం ప్రకారం వివరాలు.. కాప్రా తహసీల్దార్ ఆదేశాల మేరకు జవహర్ నగర్ కార్పొరేషన్ దేవేందర్‌నగర్‌లోని 645, 646, 655 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలసిన నిర్మాణాలను హైడ్రా అధికారులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. ఈ క్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్‌పై కొందరు దాడికి పాల్పడ్డారు. ఆయన చొక్కా చించి.. చెంపపై కొట్టారు. అక్కడే ఉన్న మరో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర సాయిపై సైతం దాడికి పాల్పడ్డారు. వెంటనే రమేష్‌ను ఆస్పత్రికి తరలించారు. విధి నిర్వహణలో ఉన్న రమేష్‌పై దాడి చేసిన నిందితులు ఇ.వెంకటేష్, రాపనోళ్ల రాజు, శ్రీనులతో పాటు ముగ్గురు మహిళలపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దాడి అమానుషం: కాప్రా తహసీల్దార్ సుచరిత

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి వెళ్లిన అధికారులపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని కాప్రా తహసీల్దార్ సుచరిత మండిపడ్డారు. గతంలోనూ సీఐ, తహసీల్దార్‌లపై దాడులకు పాల్పడ్డారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడటమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

సైబర్ నేరాలు..ఆర్థిక మోసాలు!

సైబరాబాద్ పరిధిలో ఈ ఏడాది 37,689 కేసులు

- 32 శాతం సైబర్; 6 శాతం ఆర్థిక నేరాల వాటా
- మొత్తం 11,914 సైబర్ క్రైమ్ కేసులు నమోదు
- సైబర్ బాధితులు పోగొట్టుకున్న సొమ్ము రూ.793 కోట్లు
- 3,829 రోడ్డు ప్రమాదాలు.. రూ.111 కోట్లకుపైగా ట్రాఫిక్ చలాన్లు
- వివరాలు వెల్లడించిన సీపీ అవినాష్ మహంతి

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు పెరిగాయి. మొత్తం 37,689 కేసులు నమోదు కాగా.. ఇందులో 32 శాతం సైబర్ క్రైమ్స్, 6 శాతం ఆర్థిక నేరాలు ఉన్నాయి. 11,914 సైబర్ మోసాల్లో బాధితులు పోగొట్టుకున్న సొమ్ము రూ.793 కోట్లకు పైమాటే. ఇక 90 ఆర్థిక నేరాలు (ఈఓడబ్ల్యూ) జరిగాయి. గతేడాది కంటే 2024లో నేర నిరూపణ (కన్విక్షన్లు) పెరిగింది. ఈ ఏడాది 47.62 శాతం కన్విక్షన్ రేటుతో 11,916 కేసులు పరిష్కృతమయ్యాయి. మంగళవారం సైబరాబాద్‌సీపీ అవినాష్ మహంతి వార్షిక నివేదికను విడుదల చేశారు.

- సైబరాబాద్‌లో ఏటా సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. ఎఫ్‌ఐఆర్‌ల సంఖ్య పెరిగిపోతోంది. 2022లో 4,866 సైబర్ క్రైమ్స్ నమోదు కాగా.. 2023 నాటికి 5,561కి చేరాయి. ఈ ఏడాది ఏకంగా 11,914కు చేరాయి. ఇందులో బాధితులు నేరుగా కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసినవి 7,324 కేసులు కాగా.. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా 5,046 ఫిర్యాదులు అందాయి.

రూ.793 కోట్లు స్వాహా..

ఈ ఏడాది సైబర్ బాధితులు పోగొట్టుకున్న మొత్తం రూ.793 కోట్లకు పైమాటే. ఇందులో అత్యధికంగా 3,267 పార్ట్ టైం జాబ్స్ మోసాల్లో రూ.173 కోట్లు, 1,686 ట్రేడింగ్ ఫ్రాడ్స్‌లో రూ.338 కోట్లు, 1,276 స్కిషింగ్ ఫ్రాడ్స్‌లో రూ.18 కోట్లు మేర బాధితులు మోసపోయారు. ఇక, డిజిటల్ అరెస్ట్‌లు కూడా సైబరాబాద్‌లో పెరుగుతున్నాయి. గతేడాది 102 డిజిటల్ అరెస్ట్ కేసుల్లో రూ.6.20 కోట్లు బాధితులు పోగొట్టుకోగా.. ఈ ఏడాది ఏకంగా 1,002 కేసుల్లో రూ.80.57 కోట్లు మోసపోయారు. 372 సైబర్ క్రైమ్ కేసుల్లో 534 మంది నిందితులను అరెస్టు చేశారు.

ట్రాఫిక్ జరిమానాలు రూ.111 కోట్లు..

ఈ ఏడాది సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చలాన్ల రూపంలో ఏకంగా రూ.111 కోట్లకు పైగానే జరిమానాలు విధించారు. ఇందులో 15.74 లక్షలు ఈ–చలాన్లు, 6.85 లక్షలు స్పాట్ చలాన్లు ఉన్నాయి. 7,181 డ్రైవింగ్ లైసెన్సుల రద్దుకు ఆర్టీఏకు సిఫార్సు చేశారు. ఇక, కమిషనరేట్‌లో ఈ ఏడాది 3,829 రోడ్డు ప్రమాదాలు జరిగాయి.

2024లో సైబరాబాద్‌లో ఏ నేరాలు

ఎంత వాటా..	ఇలా (శాతాల్లో)
సైబర్ నేరాలు	32
ప్రాపర్టీ నేరాలు	12
రోడ్డు ప్రమాదాలు	10
శారీరక నేరాలు	6
ఆర్థిక నేరాలు	6
ఎక్సైజ్ చట్టం	5
ప్రత్యేక, స్థానిక చట్టాలు	3
ఎన్‌డీపీఎస్	1
ఇతర ఐపీసీ	17

రూ.24.92 కోట్ల డ్రగ్స్ స్వాధీనం..

ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ)లో 90 కేసుల్లో 208 మందిని అరెస్టు చేశారు. ఆయా కేసుల్లో రూ.30.77 కోట్లు ఫ్రీజ్ చేయగా.. రూ.5.29 కోట్ల ప్రాపర్టీలు అటాచ్‌మెంట్ చేశారు. ఇక, 421 ఎన్‌డీపీఎస్ కేసుల్లో 954 మందిని అరెస్టు చేశారు. రూ.24.92 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. 163 పీడీఎస్ బియ్యం కేసులు నమోదు చేయగా.. రూ.1.78 కోట్ల విలువైన 5,944 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు 1,135 పిటీషన్స్ రాగా.. 81 ఎఫ్‌ఐఆర్‌లు, 1,613 ఈ–పెట్టీ కేసులు నమోదు చేశారు. 1,470 మంది ఆకతాయిలను అరెస్టు చేశారు. 9 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. 105 మానవ అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయి.

మోహన్ అంటే అభిమానం: గోరటి వెంకన్న



కార్యక్రమంలో పాల్గొన్న కార్టూనిస్టులు, చిత్రకారులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ కార్టూనిస్టు మోహన్ జయంతి వేడుకలను ఆయన అభిమానులు, శిష్యులు ఘనంగా నిర్వహించారు. మోహన్ డ్రీమ్స్, డ్రాయింగ్స్ పేరిట మూడు రోజుల పాటు జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మోహన్‌తో ఉన్న అనుభవాలను నెమరేసుకున్నారు. ముగింపు ఉపన్యాసంలో మంగళవారం గోరటి వెంకన్న మాట్లాడుతూ 1996 నాటి నుంచి ఆయనతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. తాను మోహన్‌కు పెద్ద అభిమానిని, అందుకే ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా తప్పనిసరిగా హాజరవుతానన్నారు. ఆయనకు నివాళిగా మూడు పాటలు పాడి వినిపించారు.

నాంపల్లి కోర్టుకు లగచర్ల రైతులు

సిటీ కోర్టులు: లగచర్లలో అధికారులపై దాడి కేసులో విచారణకు సంబంధించి రైతులు మంగళవారం నాంపల్లి కోర్టుకు వచ్చారు. బెయిల్‌పై బయటికి వచ్చిన తర్వాత మొదటి విచారణ నేపథ్యంలో నాంపల్లిలోని ప్రిన్సిపల్ ఏసీబీ కోర్టు ముందు హాజరయ్యారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రిన్సిపల్ ఏసీబీ కోర్టు జడ్జి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్ విచారణను మార్చి 28కి వాయిదా వేశారు.

'ఎన్నారై' కుటుంబం వేధింపులకు ఒకరి బలి

- కూతురి వేదన చూసి కుంగిన తండ్రి
- బిర్యానీలో విషం కలుపుకొని ఇద్దరూ తిన్న వైనం..
- చికిత్స పొందుతూ తండ్రి మృతి.. కోలుకున్న కూతురు




జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

అల్వాల్: ఎన్నారై అల్లుడు, అతని కుటుంబీకుల వేధింపులు భరించలేక..ఇంటికి తిరిగి వచ్చేసిన కూతురి వేదన చూసి కుంగిపోయిన ఓ తండ్రి కుమార్తెతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ విషాద ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం..కరీంనగర్ జిల్లా రాంనగర్ ప్రాంతానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి (60) ఆర్టీసీ ఉద్యోగి. 2021లో తన కుమార్తె స్నేహ (30)కు సూరారం ప్రాంతానికి చెందిన నవీన్ రెడ్డికి ఇచ్చి పెళ్లి చేశారు. పెళ్లి జరిగిన వెంటనే నవీన్‌రెడ్డి, స్నేహలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల నిమిత్తం అమెరికా వెళ్లారు. మార్చి 2024లో నవీన్‌రెడ్డి, స్నేహ దంపతులకు ఒక పాప పుట్టింది. డెలివరీ సమయంలోనే స్నేహ అనారోగ్యానికి గురైంది. దీంతో భర్త నవీన్‌రెడ్డి భార్యను నెలన్నర పసిపాపతో సహా అల్వాల్ రీట్రీట్ కాలనీలో ఉంటున్న స్నేహ తండ్రి జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు పంపించేశాడు. ఈ క్రమంలో నవీన్ తల్లిదండ్రులు మహేందర్‌రెడ్డి, పద్మలు వీరిని వేధించారు. అనారోగ్యానికి గురయ్యావంటూ నిందించారు. అనంతరం చిన్నారిని బలవంతంగా సూరారం తీసుకెళ్లారు. ఈ విషయంపై మాట్లాడేందుకు జగన్‌మోహన్‌రెడ్డి, స్నేహలు సూరారం వెళ్లి పాపను తమకు ఇచ్చేయాలని కోరారు. దీనికి నిరాకరించిన నవీన్ కుటుంబ సభ్యులు దూషించారు. వారి వేధింపులు భరించలేక అనారోగ్యానికి గురైన కుమార్తెను తీసుకొని జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 12వ తేదీన నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ ఆమెకు చూపించి..తిరిగి వస్తూ బోయిన్‌పల్లిలో బిర్యానీ కొనుగోలు చేసి..దాంట్లో విషం కలుపుకొని కారులో కూర్చొని తిన్నారు. ఇంటికి వచ్చిన అనంతరం వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం జగన్‌మోహన్‌రెడ్డి మృతి చెందగా కూతురు స్నేహ కోలుకుంది. కూతురు జీవితం చిన్నాభిన్నం అయిందన్న వేదనతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని అల్వాల్ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణిలో ఆర్టీసీ కార్మికుల విజయోత్సవం

లక్డీకాపూల్: ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం చొరవతో ఆర్టీసీలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు కావడం పట్ల బాధిత ఆర్టీసీ కార్మికులు మంగళవారం ప్రజాభవన్ వద్ద విజయోత్సవాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలకు బాధిత ఆర్టీసీ కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. చిన్నచిన్న కారణాలతో తొలగింపునకు గురైన ఆర్టీసీ కార్మికులు తమ గోడును ప్రజావాణిలో విన్నవించగా.. స్పందించిన అధికారులు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.

27 నుంచి 'శ్రీకృష్ణ నీతి'పై ప్రవచనాలు



శ్రీగోవింద్‌దేవ్ మహరాజ్

సనత్‌నగర్: గీతా పరివార్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు 'శ్రీకృష్ణ నీతి'పై స్వామి శ్రీ గోవింద్‌దేవ్ గిరిజీ మహరాజ్ ప్రవచనాలు నిర్వహించనున్నారు. కింగ్‌కోఠిలోని భారతీయ విద్యా భవన్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమం మొదటి రెండు రోజులు సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకు, చివరి రోజు 29వ తేదీన మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని గీతా పరివార్ హైదరాబాద్ ప్రతినిధులు తెలిపారు. ఇతర వివరాలకు 98480 30950 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో ఎంబీబీఎస్ విద్యార్థిని మృతి



మేఘన (ఫైల్)

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని మహవీర్ మెడికల్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి..హైదరాబాద్‌కు చెందిన మేఘన(18) స్థానిక మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతోంది. కాగా సోమవారం సాయంత్రం కళాశాల ఆవరణలోని గ్రౌండ్‌లో స్నేహితులతో కలిసి ఉండగా.. గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. తోటి విద్యార్థులు వెంటనే ఆమెను కళాశాల ఆస్పత్రిలోకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. తల్లిదండ్రులు చేరుకుని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతిచెందింది. విద్యార్థిని తండ్రి బాబురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వికారాబాద్ పోలీసులు తెలిపారు.

బండ్లగూడలో రూ.50 లక్షల నగలు చోరీ

పనిమనుషులే ఈ పనికి పాల్పడినట్లు గుర్తింపు



నిందితులు భారతి, నమీన్ కుమార్

రాజేంద్రనగర్: ఇంట్లో పనికోసం వచ్చిన ఓ బిహార్ జంట అదును చూసి ఇంట్లోని విలువైన నగలు, నగదుతో ఉడాయించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పనికి కుదిరిన 55 రోజుల్లోనే ఈ జంట దొంగతనానికి పాల్పడి ఉడాయించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడలోని మైఫీల్ టౌన్ విల్లా నంబర్ 20లో డాక్టర్ కొండల్ రెడ్డి కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. గత నవంబర్ 1వ తేదీన ఏజెంట్ బిట్టు ద్వారా ఇంట్లో పనిచేసేందుకు బిహార్‌కు చెందిన నమీన్ కుమార్ యాదవ్, భారతిలను నెలసరి జీతంపై ఇంట్లో పనికి తీసుకొచ్చారు. తమ విల్లాలోని ఓ గదిని ఇచ్చి వారిని ఇంట్లోనే ఉండనిచ్చారు. ఈ క్రమంలో సోమవారం కొండల్‌రెడ్డి భార్య తన కుమారుల వద్దకు వెళ్లగా... కొండల్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లాడు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చిన ఆయన తన గదిలోకి వెళ్లి నిద్రించాడు. ఉదయం కొండల్ రెడ్డికి కాఫీ ఇచ్చేందుకు నమీన్ కుమార్ రాకపోవడంతో కొండల్‌రెడ్డి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కిందికి వెళ్లి చూడగా బయటి తలుపులు తెరిచి ఉండటంతో పాటు భార్యభర్తలిద్దరూ గదిలో కనిపించలేదు. ఇంట్లోని సీసీ కెమెరాలు పరిశీలించగా రాత్రి 8.52 గంటలకు భార్యభర్తలిద్దరూ బ్యాగ్‌లతో బయటికి వెళ్లినట్లు రికార్డు అయ్యింది. ఇంట్లోకి వచ్చి బీరువాను పరిశీలించగా..రూ.35 వేల నగదు, డైమండ్ బ్యాంగిల్స్, డైమండ్ రింగులు, రూబీ డైమండ్ నెక్లెస్, మంగళసూత్రం తదితర బంగారు వస్తువులు కనిపించలేదు. వీటి విలువ దాదాపు రూ.50 లక్షలు ఉంటుందని డాక్టర్ కొండల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. ఏజెంటు బిట్టు వద్ద భార్యాభర్తలిద్దరి వివరాలను సేకరించారు. నిందితులిద్దరూ రైలు మార్గం ద్వారా వెళుతున్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ప్రత్యేక టీమ్ వీరిని పట్టుకునేందుకు పంపించినట్లు పోలీసులు వెల్లడించారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

శ్రీనగర్‌కాలనీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు కళ్యాణ్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నిరసనలో స్టేట్ ఎస్టీసెల్ కోఆర్డినేటర్ రమేష్‌నాయక్, జనరల్ సెక్రటరీ రవిగౌడ్, సలామ్, గౌస్, రఘునాయక్, రషీద్, శశి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలతో డాన్‌బాస్కో స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీనగర్‌కాలనీ: డాన్‌బాస్కో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాన్‌బాస్కో క్రికెట్ ప్రీమియం లీగ్ టిటెన్ ఇంటర్‌కాలేజ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌ను సోమవారం నిర్వహించారు. నగరానికి చెందిన ఆరు టీమ్స్ ఈ పోటీల్లో పాల్గొనగా ఎన్‌ఆర్‌ఐ ఇంటర్‌కాలేజ్ టీమ్ విజేతగా, మాస్టర్స్ జూనియర్ కాలేజీ రన్నరప్‌గా నిలిచింది. డాన్‌బాస్కో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ అక్వినాస్ విజేతలను బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ ఇంచార్జ్ బాలరాజు, లెక్చరర్స్ సురేష్, రాజు, కోఆర్డినేటర్స్ అబ్దుల్ సమీర్, యాసీన్, శ్యామ్, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం


నియామకపత్రాన్ని అందుకుంటున్న డా.శంకర్‌నాయక్

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ప్రతిభానగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు డా.కెలావత్ శంకర్ నాయక్ బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా డాక్టర్స్ సెల్ కన్వీనర్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు డా.కళ్యాణ్‌నాయక్ సోమవారం డా.శంకర్‌నాయక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బర్మావత్ రమేశ్ నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డా.శంకర్ నాయక్‌ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు.

28న ఇందిరాపార్క్ వద్ద యాదవ మహాదీక్ష



పంజగుట్ట: రాష్ట్రంలో 15 శాతానికి పైగా జనాభా ఉన్న యాదవులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని యాదవ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. యాదవులకు ఒక మంత్రి పదవి, మూడు ఎమ్మెల్సీలు, ఐదు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వాలన్న డిమాండ్‌తో ఈ నెల 28వ తేదీన ఇందిరా పార్క్ వద్ద సమితి ఆధ్వర్యంలో యాదవ మహా దీక్ష నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి వంశీమోహన్ యాదవ్‌లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి యాదవులు లేని మంత్రివర్గం లేదని అది కేవలం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యమయ్యిందని ఎద్దేవా చేశారు.

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు


బంజారాహిల్స్‌లోని ఓ స్టార్ హోటల్‌లో క్రిస్మస్ డెకరేషన్



రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఎమ్మెల్యే కాలనీ షారోన్ చర్చి

బంజారాహిల్స్: క్రిస్మస్ వేడుకలకు ఖైరతాబాద్ ముస్తాబవుతుంది. దీంతో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని చర్చిలన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలతో తళుక్కుమంటున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే పలు చర్చిల్లో సెమీక్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 74 చర్చిలలో క్రిస్మస్ వేడుకలు జరగనున్నాయి. ఖైరతాబాద్‌లోని షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చి రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆకట్టుకుంటుంది. మరోవైపు ఏ మాల్ చూసినా, ఏ హోటల్ చూసినా క్రిస్మస్ శోభతో కళకళలాడుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 9లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చిలో సోమవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు చర్చి కమిటీ సభ్యులు తెలిపారు.

జేహెచ్‌ఐసీలో ఘనంగా సెమీ క్రిస్మస్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ లోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్లో (జేహెచ్ఐసీ) మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా క్లబ్ ఆవరణలో చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా, వేడుకల్లో మాంచెస్టర్ స్కూలు విద్యార్థులు సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శాంటాక్లాజ్ ల వేషధారణలో అలరించారు.



వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు క్లబ్ కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మాంచెస్టర్ స్కూల్ సీఈఓ సుధీర్ రెడ్డిలు బహుమతులను అందించారు. అనంతరం కిలారు రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది క్రిస్మస్ ముందు రో జు ఈ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జేహెచ్ఐసీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కాలనీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు...

షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో...

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘ నంగా జరిగాయి. ప్రతియేటా క్రిస్మస్‌కు రెండురోజుల ముందు సెమీ క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని చర్చి పాస్టర్ ఎం. ప్రభుదాస్ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, నృత్యాలు అలరించాయి. అనంతరం పాస్టర్ క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. వేడుకగా జరిగిన ఈ సెమీ క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి చంద్రశేఖర్, ప్రమీల, నీలిమ, పాస్టర్ జయ, సరళ, లక్ష్మి పాల్గొన్నారు.

దృష్టిమరల్చి గొలుసు చోరీ

బంజారాహిల్స్: ఓ యువకుడు మెహిదీపట్నంలో సిటీ బస్సుఎక్కి కేపీహెచ్‌బీ వైపు వెళ్తుండగా కొందరు దృష్టిమరల్చి మెడలో ఉన్న గొలుసును చోరీ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొత్తగూడెంకు చెందిన శ్రీకాంత్ మెహిదీపట్నంలో బస్సు ఎక్కి కేపీహెచ్‌బీ వైపు వెళ్తుండగా మాసబ్‌ట్యాంక్ వైపు రాగానే ప్రయాణికుడి ముసుగులో ఉన్న జేబు దొంగ తనకు వాంతులు అవుతున్నాయని కిటికీ వద్దకు వెళ్లాడు. వాసన భరించలేని శ్రీకాంత్ సీటు నుంచి లేచి నిల్చోగా మరో నలుగురు శ్రీకాంత్‌ను చుట్టుముట్టారు. ఎటూ కదలకుండా అయోమయానికి గురిచేసి మెడలోని గొలుసు కాజేశారు. ఆ తరువాత శ్రీకాంత్ జీవీకే వద్ద బస్సు దిగి చూసుకోగా మెడలో ఉన్న గొలుసు కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు నిందితులకు జైలు శిక్ష

వెంగళరావునగర్: మద్యం సేవించి ఇతరులను ఇబ్బందిపెడుతున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేయగా కోర్టు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రహమత్‌నగర్‌కు చెందిన ముఖేష్ ఠాకూర్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ప్రతిరోజూ మద్యం సేవించి మద్యం దుకాణాలు, రోడ్లపై వెళ్లేవారిని ఇబ్బంది పెడుతున్నాడు. అదేవిధంగా బి.బాబు రహమత్‌నగర్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. ప్రతిరోజూ మద్యం సేవించి తల్లిని, కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడుతున్నాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ వారికి 15 రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

ఫిలింనగర్: పాదచారులకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తూ వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆపరేషన్ రోప్‌లో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి నుంచి ఫిలింనగర్ గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్ వరకు రోడ్లకు రెండువైపులా ఏర్పాటు చేసిన డబ్బాలు, నిర్మాణాలను తొలగించారు. ఆపరేషన్ రోప్ అనేది నిరంతర ప్రక్రియ అని దాన్ని ఎవ్వరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని భారీ జరిమానాలు ఉంటాయని తెలిపారు. దుకాణాల పరిధులు దాటి ముందుకు ఏర్పాటు చేసిన షెడ్లను కూడా తొలగిస్తామని తెలిపారు.


ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలి


రక్తదానం చేస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం దొరకక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అందుకే ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని ఎస్ఎంఆర్ బిల్డర్స్ అధినేత రాంరెడ్డి అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ 25లోని ఆయన నివాసంలో ఆయన కుమారుడు సాయిరెడ్డి వినయ్‌రాజ్ రెడ్డి జయంతి సందర్భంగా సాయిరెడ్డి వినయ్ రాజ్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం తన కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని అప్పటినుంచి సామాజిక బాధ్యత సాయిరెడ్డి వినయ్ రాజ్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రతియేటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో తమ సంస్థ ఉద్యోగులు 200 మందికిపైగా రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు.

వేడుకగా వింటర్ కార్నివాల్



వింటర్ కార్నివాల్‌లో విద్యార్థుల ఆటపాటలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని మెరీడియన్ స్కూల్‌లో క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన వింటర్ కార్నివాల్ మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా స్కూల్‌లో విద్యార్థులకు ఎగ్జిబిషన్‌తో పాటు ఆటలు, పాటలు, ఫుడ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నిషీరాణా, వైస్ ప్రిన్సిపాల్ రహద్ రషీద్ పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై బీఎస్పీ నిరసన ర్యాలీ


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఎస్పీ నేతలు

బంజారాహిల్స్: పార్లమెంట్‌లో హోంశాఖ మంత్రి అమిత్‌షా భారతరత్న బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అవమానకర వ్యాఖ్యలను నిరసిస్తూ ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బీఎస్పీ ఆధ్వర్యంలో శ్రేణులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షకుడైన అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వాఖ్యలను నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కూరగాయల మార్కెట్ వద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అమిత్‌షా వెంటనే క్షమాపణ చేయాలని, ఆయన హోంమంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నేతలు శ్రీరామకృష్ణ, దోరపల్లి రమేష్, బక్కూరి నర్సిం, బండారి శ్రీనివాస్, కత్తి మురళి, ఎల్లన్న, కొత్త సంపత్, కె. సుజాత, మెట్టు ప్రవీణ్‌కుమార్, షేక్ ఇమ్రాన్, చంద్రహాస్, సంజీవ్ కుమార్, సుదర్శన్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

పార్కింగ్ ఆటోలే వారి టార్గెట్

- ఆటో దొంగల అరెస్టు.. వివరాలు వెల్లడించిన ఏసీపీ మోహన్‌కుమార్

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన ఆటోలను చోరీ చేస్తున్న దొంగలను మధురానగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నట్లు పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ తెలియజేశారు. మధురానగర్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ మాట్లాడుతూ శంషాబాద్‌కు చెందిన వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన పి.రాజు, టి.శ్రీశైలంతో కలిసి డబ్బుల కోసం గత ఏడాదిగా ఆటోలను దొంగతనం చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో నగరంలోని పలు ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ఆటోలను పరిశీలించి, తాళాలను తీసి దొంగిలించుకుని పోయి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు మధురానగర్, పంజగుట్ట, జడ్చర్ల, శంషాబాద్, రాజేంద్రనగర్, బంజారాహిల్స్ తదితర పీఎస్ పరిధిల్లో దాదాపు ఆరు ఆటోలను దొంగిలించారు. వాటికి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో ఆటోల యజమానులు తమకు డబ్బులు బాకీ ఉన్నారని, అప్పు తీర్చకపోవడంతో ఆటోలను ఇచ్చి వెళ్లారని మాయమాటలు చెప్పి ఏదుల కుమార్, జవహర్‌లకు వాటిని విక్రయించారు. ఒక ఆటోను ట్రాఫిక్ పోలీసులు ఆపడంతో వదిలేసి వెళ్లిపోయారు. కాగా మరో మూడు మధురానగర్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ముగ్గురు అనుమానాస్పదంగా ఉండటంతో ఆపి వివరాలు అడిగారు. వారి వద్ద ఎలాంటి ఆటోల పత్రాలు లేకపోవడంతో నిందితులను అదుపులోనికి తీసుకుని విచారించగా అసలు విషయాన్ని తెలిపారు. కాగా ఒక ఆటోను కొనుగోలు చేసిన కుమార్‌ను కూడా అదుపులోనికి తీసుకున్నారు. జవహర్ పరారీలో ఉన్నాడు. ఆరు ఆటోలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు ఏసీపీ వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో మధురానగర్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు, డిఐ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుకున్న ఆటోలతో నిందితులు, పోలీసులు

అయ్యప్ప దేవస్థానంలో ప్రత్యేక పూజలు

రహమత్‌నగర్: బోరబండ ఎస్ఆర్ఆర్‌పురం సైట్–2 హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో శివశంకర్ స్వామి, జగన్‌స్వామి దాతల సహకారంతో మంగళవారం లక్ష పుష్పాలతో అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వన లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ 16 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 24 నుంచి 26 వరకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలకృష్ణ, విజయ్‌కుమార్, సత్యనారాయణ, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాపడిపూజ


పూజల్లో మాజీమంత్రి తలసాని

శ్రీనగర్‌కాలనీ: గురుస్వామి పహిల్వాన్ గొంటి శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిగూడలో మహాపడిపూజ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తులు భక్తి గీతాలు, ప్రత్యేక పూజలతో మహాపడి పూజను ఘనంగా చేపట్టారు. పడిపూజలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, సాయికిరణ్ యాదవ్, నవీన్‌యాదవ్, చెట్టి సురేష్‌గౌడ్, కార్పొరేటర్ వనం సంగీత, గొంటి సాయినాథ్‌యాదవ్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచార యత్నం

రహమత్‌నగర్: మైనర్ బాలికపై అత్యాచార యత్నం జరిగిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... వేరే రాష్ట్రానికి చెందిన మైనర్ బాలిక, బాలుడు బోరబండలోని బాలిక నివాసానికి సోమవారం రాత్రి అర్ధరాత్రి షేర్‌ఆటోలో బయల్దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఐదుగురు యువకులు ఆటోను అడ్డుకొని ఇద్దరు ఆటోలో ఎక్కగా, మిగతా ముగ్గురు ద్విచక్ర వాహనాలపై ఆటోను వెంబడించారు. ఆటో ఎక్కిన ఇద్దరు యువకులు బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. దీంతో అడ్డుకోబోయిన ఆటో డ్రైవర్‌పై దాడికి దిగారు. బాలిక ఇంటికి చేరుకున్న తరువాత సైతం ఐదుగురు యువకులు అక్కడ హంగామా చేయడంతో స్థానికులు 100 డయల్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న బోరబండ పోలీసులు బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులకు అదుపులోకి తీసుకుని కేసును విచారిస్తున్నారు.

నేటి నుంచి మండల పూజా ఉత్సవాలు

వెంగళరావునగర్ : వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ టెంపుల్‌లో ఈనెల 25వ తేదీ నుంచి రెండురోజుల పాటు మండల పూజా ఉత్సవాలు నిర్వహించబడతాయని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి గుమ్మడిదల సుధాకర్ తెలియజేశారు. జీటీఎస్ టెంపుల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25వ తేదీ ఉదయం 5 గంటల నుంచి లక్ష్మీగణపతి హోమంతో పూజలు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగుతాయని తెలియజేశారు. 26వ తేదీ సాయంత్రం 6 గంటలకు రథోత్సవం పెద్దఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు కూడా చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందని తెలియజేశారు. రెండురోజులపాటు కొనసాగనున్న ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఫిలింనగర్‌లోని వారాంతపు సంత తరలింపు

- ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా పోలీసుల చర్యలు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎదురుగా దీన్‌దయాళ్‌నగర్ బస్తీగల్లీలో ప్రతి మంగళవారం వారాంతపు కూరగాయల సంత జరుగుతుంది. ఈ సంత జరిగే సమయంలో ప్రధాన రోడ్డుతోపాటు గల్లీలన్నీ కూరగాయల వ్యాపారులు, కొనుగోలుదారులతో గంటల తరబడి కిటకిటలాడుతుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అంబులెన్స్‌తో పాటు అత్యవసర సమయాల్లో వెళ్లే వారికి ట్రాఫిక్ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ విషయంలో ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో మంగళవారం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ గోపీ తదితరులు వారాంతపు సంత వద్దకు వెళ్లి ఇక నుంచి ఇక్కడ కూరగాయల వ్యాపారాలు చేయవద్దని, దీని వల్ల ఏర్పడుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చి వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వచ్చే మంగళవారం నుంచి ఇక్కడ సంత ఏర్పాటు చేయవద్దని, మరో చోటికి వెళ్లాలని సూచించారు. దీంతో స్థానికులు కూడా హర్షం వ్యక్తం చేశారు. వ్యాపారులు కూడా వచ్చే వారం నుంచి మరో చోట పెట్టుకుంటామని హామీనిచ్చారు. ప్రతి మంగళవారం ఈ సంత వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవడమే కాకుండా అన్ని వైపులా ట్రాఫిక్ స్తంభించిపోతున్న దృష్ట్యా వ్యాపారులను ఒప్పించి మరోచోటికి మార్చుకోవాలని చెప్పినట్లు ఏసీపీ తెలిపారు.


వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

బుక్‌ఫెయిర్‌లో సందడే సందడి



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జాతీయ పుస్తక ప్రదర్శనలోని డాక్టర్ బోయి విజయభారతి వేదికపై చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సాహితీప్రియులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివేకానంద కాన్వెంట్ స్కూల్ విద్యార్థుల జానపద బృంద నృత్యాలు, మిమిక్రీలు అబ్బురపరిచాయి. కళాకారుల ప్రదర్శనలతో సందర్శకులు కేరింతలు కొట్టారు. అనంతరం విద్యార్థులను అభినందించి వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

'నువ్వెళ్లిన దారిలో' పుస్తక ఆవిష్కరణ

కవాడిగూడ: జీఎస్ సాయిబాబా స్ఫూర్తి కవిత్వం నువ్వెళ్లిన దారిలో పుస్తకాన్ని సాయిబాబా సహచరి ఏఎస్ వసంత కుమారి ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తారతమ్యాలు లేని సమాజాన్ని నిర్మించాలని సాయిబాబా కలలుగన్నారని, ఈ కవితల పుస్తకాన్ని చదివిన తర్వాత ఆయన మనమధ్యే ఉన్నాడంటూ భావోద్వేగానికి గురయ్యారు. అరణ్యకృష్ణ, వైష్ణవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏఎస్ వసంత కుమారి, వేణుగోపాల్ తదితరులు

నూతన సాంస్కృతిక విధానం రూపకల్పన

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



నేటికీ తెలంగాణకంటూ ఒక సాంస్కృతిక విధానం రాలేదని, సాంస్కృతిక విధానం తెలంగాణకు ఎంతో అవసరమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ వేదికగా డాక్టర్ సబ్బని లక్ష్మీనారాయణ రచించిన సబ్బని సమగ్ర తెలంగాణ సాహిత్యం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంగిశెట్టి శ్రీనివాస్, బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకూబ్, బోయినపల్లి హనుమంతరావు, సుంకపల్లి నాగేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు ప్రస్తుతం నూతన సాంస్కృతిక విధానాన్ని రూపకల్పన చేసుకొని ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణానికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

శ్యామ్ బెనగళ్‌కు బుక్‌ఫెయిర్ నివాళి



లెజెండరీ దర్శకులు శ్యామ్ బెనగళ్ సోమవార మృతి చెందగా హైదరాబాద్ బుక్‌ఫెయిర్ నిర్వాహకులు మంగళవారం నివాళులర్పించారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. భారతీయ సినిమా రంగానికి ఆయన చేసిన సేవలు భేష్ అన్నారు. అద్భుతమైన చిత్రాలను దేశానికి అందించారని, అంకుర్, మంథన్ వంటి సినిమాలు చిరస్మరణీయం అన్నారు. ప్రజలు తమ జీవితాన్ని మల్చుకోవడానికి చేస్తున్న పోరాటాలను శ్యామ్ బెనగళ్ అద్భుతంగా తెరకెక్కించారని కొనియాడారు.

ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ పోటీలకు కేసరి ధ్రితి



కేసరి ధ్రితి



కేసరి ధ్రితిని సత్కరిస్తున్న జిమ్ ట్రైనర్ జయసింహగౌడ్ తదితరులు

రామంతాపూర్: వచ్చేనెల 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు మలేషియాలో నిర్వహించే ఐసీసీ అండర్-19 మహిళా టీ20 ప్రపంచ కప్ క్రికెట్ పోటీలకు ఆల్ రౌండర్ కేసరి ధ్రితిని బీసీసీఐ సెలెక్ట్ కమిటీ ఎంపిక చేసింది. రామంతాపూర్‌కు చెందిన ధ్రితి స్థానిక సిమ్‌లైన్ ఫిట్‌నెస్ సెంటర్‌లో కోచ్ వంశీ సమక్షంలో స్ట్రెంత్ అండ్ కండిషనింగ్‌లో శిక్షణ తీసుకుంది. సిమ్‌లైన్ ఫిట్‌నెస్ జిమ్ ట్రైనర్ జయసింహగౌడ్ తదితరులు ఉన్నారు.

అలరించిన శ్రీచైతన్య ఫీస్ట్



కార్యక్రమానికి హాజరైన అతిథులు

సనత్‌నగర్: అమీర్‌పేటలోని బీఎస్‌రావు సౌదం శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీచైతన్య ఫీస్ట్–2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎర్రగడ్డలోని మెజిస్టిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన వేడుకలకు ఎస్సార్‌నగర్ జోన్‌కు చెందిన ఆరు శ్రీచైతన్య కళాశాలలతో పాటు అత్తాపూర్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ శాఖలకు చెందిన సుమారు 2 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు కట్టిపడేశాయి. ఫ్యాషన్ షో, నృత్య రూపకాలతో విద్యార్థులు హోరెత్తించారు. వేడుకలకు షాద్‌నగర్ ఏసీపీ కే.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విలువలకు కట్టుబడి ఉండాలన్నారు. మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు తమను తాము మార్చుకుంటూ పోటీ వాతావరణాన్ని ఎదుర్కోవాలన్నారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, శ్రద్ధ, నిరంతర సాధన తదితర అంశాల ప్రాతిపదికగా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇటీవల ఐఐటీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులను సాధించిన 100 మంది విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. టీజీఎస్‌ఆర్‌టీసీ డివిజనల్ మేనేజర్ జీఆర్ కిరణ్, శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం రవికుమార్, డీన్లు నాయుడయ్య, సతీష్‌తో పాటు రాకేష్, చరణ్, వివిధ కళాశాలల శాఖల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. అమలు మరిచారు..

- జెన్‌కో ఏఈ, కెమిస్ట్ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు
- గాంధీ భవన్ ఎదుట ఆందోళన




గాంధీ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న జెన్‌కో ఏఈ, కెమిస్ట్ అభ్యర్థులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ జెన్‌కో ఏఈ, కెమిస్ట్ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు తక్షణమే నియామక పత్రాలు అందజేయాలని అభ్యర్థులు కోరారు. 4 నెలలుగా తమకు నియామక పత్రాలను అందించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమకు న్యాయం చేయాలని కోరుతూ.. గాంధీభవన్ ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన, సమర్పణ జరిగిందని గుర్తుచేశారు. ఆ సమయంలో 15 రోజుల్లో నియామక ఉత్తర్వులు అందజేస్తామని తెలిపారని, కానీ ఇప్పటి వరకు అందజేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జెన్‌కో అధికారులకు అనేకమార్లు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు న్యాయం చేయాలని, దాదాపు 340 మంది అభ్యర్థులు ఉద్యోగ నియామక పత్రాల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలు

సీఈఓ మధుకర్ నాయక్



కూల్చివేతలను పర్యవేక్షిస్తున్న కంటోన్మెంట్, ట్రాఫిక్, డిఫెన్స్ ఎస్టేట్స్ ఉన్నతాధికారులు

కంటోన్మెంట్: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కంటోన్మెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ) మధుకర్ నాయక్ అన్నారు. కంటోన్మెంట్, పోలీసు, డిఫెన్స్ ఎస్టేట్స్ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం సిఖ్ రోడ్డు, డైమండ్ పాయింట్ చౌరస్తాలో జాయింట్ ఆపరేషన్ నిర్వహించి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. సిఖ్‌రోడ్డులో డిఫెన్స్ ఎస్టేట్స్‌కు చెందిన బీ–4 స్థలంలో వెలిసిన ఆక్రమణలను కూల్చేశారు. డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్ దినేశ్‌రెడ్డి, నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ శంకర్ రాజు, కంటోన్మెంట్ హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్ తదితర ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా ఈ డ్రైవ్‌లో పాల్గొని కూల్చివేతలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు. వివిధ ప్రాంతాల్లో కంటోన్మెంట్, రక్షణ భూములను సైతం ఆక్రమించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా ప్రాంతాల్లోనూ త్వరలోనే అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపడతామన్నారు.

అల్లు అర్జున్ ఒక్కడినే బాధ్యుడిగా చూపడం సరికాదు

పంజగుట్ట: రాష్ట్రంలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలతో చిత్రపరిశ్రమ ఇతర ప్రాంతాలకు తరలిపోయే ప్రమాదం ఉందని, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను కాపాడాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) ప్రభుత్వాన్ని కోరింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ.. పుష్ప–2 సినిమా బెనిఫిట్‌షో సందర్భంగా జరిగిన ప్రమాదం తీవ్ర విచారకరమని, ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబాన్ని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీతేజను ప్రభుత్వంతో పాటు చిత్రపరిశ్రమ ఆదుకోవాలని సూచించారు. సంధ్యా థియేటర్ ఘటనకు అల్లు అర్జున్‌ను ఒక్కడినే బాధ్యుడిగా చూపడం, ఆయనను విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్‌కు రప్పించడం బాధాకరమన్నారు.



కుటుంబాల మీటింగ్‌కే ప్రాధాన్యం



రకరకాల సంస్కృతుల సమ్మేళనంగా వేడుకలు

ఐటీ కుటుంబాల్లో ప్రత్యేక ఆసక్తి

నూతన సంవత్సరం వస్తోందంటే చాలు నగరమంతా కొత్త ఉత్సాహం నిండుతుంది. నెలలు, వారాల ముందు నుంచే ఈవెంట్ల నిర్వాహకులు రకరకాల ఆఫర్లతో ఆకట్టుకుంటారు. దీంతో నగర యువతతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యువత నగరంలో న్యూఇయర్ వేడుకల్లో ఎంజాయ్ చేస్తుంటారు. ఇప్పటికే పబ్బులు, ఫాంహౌస్‌లు, రిసార్టులు, హోటళ్లు అందంగా ముస్తాబవుతున్నాయి. మరోవైపు వరుస సెలవులను దృష్టిలో ఉంచుకొని సిటీజనులు ఇయర్ ఎండింగ్ టూర్స్‌కు సైతం ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు. –సాక్షి, సిటీబ్యూరో

పలు ఐటీ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు తమ కుటుంబాలతో కలిసి నూతన సంవత్సర వేడుకలను మరింత వినూత్నంగా సరికొత్త థీమ్‌లతో నిర్వహించుకొనేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. సాధారణంగా వీకెండ్స్‌లో కుటుంబాలతో సహా కలిసే స్నేహితులు రకరకాల థీమ్‌లను ఎంపిక చేసుకుంటారు. ముఖ్యంగా ధరించే దుస్తుల్లో ప్రత్యేకత చాటుకుంటారు. ఈసారి ఇయర్ ఎండ్ వేడుకలను మరింత ఆకర్షణీయమైన థీమ్‌లతో నిర్వహించుకొనేందుకు ఐటీ ఫ్యామిలీస్ రెడీ అవుతున్నాయి. ఒకప్పటి ఉమ్మడి కుటుంబాల స్థానంలో ఇప్పుడు పూర్తిగా న్యూక్లియర్ కుటుంబాలు వచ్చేశాయి. కోవిడ్ కాలంలో ఈ ఒంటరి కుటుంబాలు మరింత ఒంటరిగా మారాయి. ఈక్రమంలో కుటుంబాల్లో ఒంటరితనాన్ని పోగొట్టుకొనేందుకు ఒకేవిధమైన ఆలోచనా విధానం, స్నేహంగా ఉన్న కుటుంబాలు శని, ఆదివారాల్లో కలిసి గడిపేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఒక్క ఐటీ సెక్టర్ లోనే కాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం వీకెండ్ ఫ్యామిలీ మీట్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీని వల్ల స్నేహితుల మధ్య మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులు, పిల్లల మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడుతుంది. పైగా ఓ పది కుటుంబాలు వారానికి ఒక రోజు ఒకరి ఇంట్లో కలుసుకోవడం వల్ల తామంతా ఒక్కటేననే భావన, తమలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా మిగతా వాళ్లు ఆదుకుంటారనే భరోసా ఏర్పడుతుంది. ఇలా వీకెండ్ పార్టీలు చేసుకొనే కుటుంబాలు ఇయర్ ఎండ్ వేడుకలకు హోటళ్లు, పబ్బులు వంటి ప్రదేశాలను కాకుండా అపార్ట్‌మెంట్ ప్రాంగణాలు, పర్యాటక స్థలాలను ఎంపిక చేసుకోవడం విశేషం. అలాగే కనీసం నాలుగైదు కుటుంబాలకు చెందిన వారు ఎవరో ఒకరి ఇంట్లో కలిసి వేడుకలను నిర్వహించుకొనేందుకు ప్లాన్లను సిద్ధం చేస్తున్నారు.



విభిన్నం.. వైవిధ్యం..

ఫ్యామిలీ మీట్‌లలో సాధారణంగా ఒక్కో కుటుంబం ఒక్కో విధమైన రంగు దుస్తుల్లో వేడుకలకు హాజరుకావాలనేది ఒక థీమ్. ఒక కుటుంబంలోని భార్యాభర్త, వారి పిల్లలు ఎరుపు రంగు దుస్తుల్లో వేడుకలకు వస్తే మరో కుటుంబం పసుపు రంగు దుస్తులతో వస్తారు. ఇలా రకరకాల రంగుల కలయికగా వేడుకలు ఉంటాయి. మరోవైపు ఈ వైవిధ్యభరితమైన థీమ్‌లలో సంప్రదాయాలకు సైతం పెద్దపీట వేస్తున్నారు. ధోవతి, లాల్చీ, పైజామా వంటి దుస్తులు, మహిళలు చీరలు ధరించి వేడుకల్లో పాల్గొనడం, పిల్లలను సైతం ధోవతి, పరికిణి వంటి దుస్తుల్లో అలంకరించడం మరో థీమ్ ట్రెండ్. ఇక వెస్టర్న్ థీమ్‌లలో భాగంగా డిస్నీ, హాలోవిన్, మార్వెల్, ఘోస్ట్, రెట్రో వంటి ఆకర్షణీయమైన థీమ్‌లతో వేడుకలకు సన్నద్ధమవుతున్నారు. 'ఇయర్ ఎండ్ వేడుకలు కేవలం పెద్దవాళ్లకే కాదు కదా.. పిల్లలు కూడా ఆ ఉత్సాహంలో భాగం కావాలి. ఆ సదుపాయం ఫ్యామిలీ మీట్‌లలోనే ఎక్కువగా ఉంటుంది. నాలుగైదు కుటుంబాలకు చెందిన పిల్లలంతా ఒకచోట చేరి రకరకాల ఆటలు ఆడుకుంటారు. వారి మధ్య స్నేహం పెరుగుతుంది. సృజనాత్మకంగా ఆలోచిస్తారు. ఇలా అన్ని విధాలుగా ఫ్యామిలీ మీట్‌లు ఎంతో ఉన్నతంగా ఉంటాయి. అందుకే ఈ ఇయర్ ఎండ్ వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాం.' అని ఐటీ రంగానికి చెందిన ప్రదీప్ తెలిపారు.



సంస్కృతి ఉట్టిపడేలా..

ఉత్తర, దక్షిణ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు హైదరాబాద్‌లో ఉన్నారు. ఈసారి వేడుకల్లో ఆయా రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించే వస్త్రధారణకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పలువురు ఐటీ ఉద్యోగులు తెలిపారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హర్యానా, రాజస్తాన్.. ఇలా వివిధ రాష్ట్రాలకు చెందిన వారు నగరంలో విధులు నిర్వహిస్తున్నారు. వారి సంస్కృతికి అనుగుణమైన వస్త్రధారణను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.



సాహితీ పురస్కారాల సూచనలకు ఆహ్వానం

నాంపల్లి: తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ రచనల్ని ప్రోత్సహించడానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. 2023వ సంవత్సరానికి ప్రదానం చేసే పురస్కారాల ఎంపికకు పాఠకులు, రచయితల నుంచి విశ్వవిద్యాలయం సూచనలు కోరుతోంది.

- వివిధ ప్రక్రియల్లో 2020 జనవరి నుంచి 2022 డిసెంబర్ మధ్య కాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన గ్రంథాల్లో పాఠకులు ఉత్తమంగా భావించిన గ్రంథాలను పరిగణలోనికి తీసుకోవడం జరుగుతుంది. రచయిత మరణించినప్పటికీ వారి రచనలు ప్రచురణ పొంది ఉంటే సూచించవచ్చు.
- గేయ కవిత ప్రక్రియల్లో మాత్రం 2018 నుంచి 2022 మధ్య ప్రచురణ పొందిన గ్రంథాలను సూచించవచ్చు. వచన కవిత, పద్య కవిత, బాల సాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం/నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, గేయ కవిత, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే 11 ప్రక్రియల్లో అన్ని ప్రక్రియలకు తమకు నచ్చిన గ్రంథాలను పురస్కారాలకు సూచించవచ్చు. సూచనలో ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామా, పేజీల సంఖ్య, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ కర్త పేరు పేర్కోవాలి. రచయితలు కూడా తమ గ్రంథాలను స్వయంగా సూచించవచ్చు.
- అనువాద సాహిత్య విభాగానికి తప్ప మిగతా విభాగాలకు అనువాదాలు, అనుసరణలు ఆమోదించరు. వచన రచన అనే ప్రక్రియలో సామాజిక, ఆర్థిక, తాత్త్విక, వైజ్ఞానిక, స్వీయ చరిత్ర, దేశ చరిత్ర, సంస్కృతి, కళలకు సంబంధించిన గ్రంథాలు సూచించవచ్చు. అన్ని ప్రక్రియల్లోనూ ప్రామాణికమైన మౌలిక గ్రంథాలనే సూచించాలి.
- కవితా సంపుటులయితే కనీసం 60 పేజీలు, మిగతా ప్రక్రియల్లోని గ్రంథాలు 96 పేజలకు తగ్గొద్దు. బాల సాహిత్యం, నాటకం ప్రక్రియల్లో పుటల పరిమితి లేదు. పాఠకులు/రచయితలు తమ దరఖాస్తులను రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, పబ్లిక్‌గార్డెన్స్ హైదరాబాదు–500004 అనే చిరుమానాకు 20 జనవరి 2025వ తేదీలోగా పంపాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

3న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు

- నెక్లెస్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



పంజగుట్ట: వర్గీకరణను అడ్డుకునే శక్తులు రాజకీయంగా, ఆర్థికంగా, మీడియాపరంగా ఎంతో శక్తివంతులుగా ఉన్నారని, వారిని మన లక్ష డప్పులు, వెయ్యి గొంతులతో ఎదుర్కోవాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. వచ్చేనెల 3వ తేదీన నిర్వహించనున్న 'లక్ష డప్పులు, వెయ్యి గొంతులు' మండే మాదిగల గుండె చప్పుడు సన్నాహక సమావేశం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. అన్ని పార్టీల్లో అన్ని కులాల వారు ఉంటారని కానీ కాంగ్రెస్ పార్టీలో శాసించే స్థాయిలో మాల కులస్తులు ఉంటారని, కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ ఇంట్లో మూడు పదవులు ఉంటే.. తిరిగి అవే మూడు పదవులు వెంకటస్వామి కుటుంబంలో ఉన్నాయని ఇదే అందుకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాను, భవిష్యత్‌లో ఎలాంటి అడ్డంకులు రాకుండా వర్గీకరణ చేస్తున్నాను, కానీ అడ్డంకులు కల్పించే శక్తులు ఉన్నాయని పరోక్షంగా మనల్ని అప్రమత్తం చేశారని తెలిపారు. ఆలస్యం అవుతున్నకొద్దీ ఉద్యోగాల్లో, విద్యలో మాదిగలు ఎంతో నష్టపోతున్నారని, ఇటీవల జరిగిన టీచర్ నియామకాల్లో 1600 పోస్టులు నష్టపోయామని గుర్తుచేశారు. ర్యాలీ నెక్లెస్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందని అక్కడే బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, దండోరా కళామండలి జాతీయ అధ్యక్షుడు ఎన్.వై.అశోక్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, ప్రజా వాగ్గేయకారుడు దరువు ఎల్లన్న, గిద్దె రంనర్సయ్య, నలింగంటి శరత్, గజ్జల అశోక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- రెంటాల జయదేవ్ రచించిన మన సినిమా 'ఫస్ట్ రీల్' పరిచయ గోష్ఠి ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో కొనసాగుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని బోయి విజయభారతి వేదికపై సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువుల ప్రదర్శన ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటుంది.
- హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్‌కృష్ణలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తారు.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 25, డిసెంబర్, 2024



అనుమతులు తప్పనిసరి..

హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ట్రై కమిషనరేట్ పోలీసు ఉన్నతాధికారులు సూచించారు. లిక్కర్ సరఫరా చేస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఆబ్కారీ శాఖ అనుమతులు కూడా ఉండాల్సిందేనని, ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడే ఈవెంటర్స్ నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.





కొత్త ఉత్సాహం..!

న్యూ ఇయర్ పార్టీలకు సర్వం సిద్ధం

కొత్త సంవత్సరం రాబోతోంది.. దీంతో నగర యువత కొత్త ఉత్సాహంతో పార్టీ ఎందుకుండదు పుష్పా.. ఉంటుంది అంటున్నారు. పబ్‌లు, రిసార్ట్‌లు, ఫామ్ హౌస్‌లు.. ఎక్కడైతేనేం న్యూ ఇయర్‌కు గ్రాండ్ వెల్కమ్ పలికేందుకు యువత, ఐటీ ఉద్యోగులు సిద్ధమై పోయారు. ఈవెంట్ మేనేజర్లు కూడా కొత్త ఏడాదికి వేడుకలను భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నారు. పాపులర్ సింగర్స్, డీజేలు, మ్యూజిక్ డైరెక్టర్లు, సినిమా సెలిబ్రిటీలతో ఈవెంట్లు, విందులు.. వినోదాలు.. సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అనేక ఏర్పాట్లతో సెలబ్రేషన్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో దీనిపైనే ఈ కథనం.. - సాక్షి, సిటీబ్యూరో





డిసెంబర్ 31 ఈవెంట్స్ కోసం యూత్ స్పెషల్ ప్లాన్స్

గోవా, గోకర్ణ టూర్లలో టెకీ ఉద్యోగులు బిజీ

లోకల్ వేడుకలపై పోలీసుల నిఘాతో మారిన వైఖరి

శివార్లలోని ఫాంహౌస్‌లలో పార్టీలకు ఏర్పాట్లు

ముందస్తు అనుమతి తప్పనిసరి అంటున్న పోలీసులు

ఈ వెంట్స్‌కి ఫుల్ డిమాండ్..

షామీర్‌పేట, శంషాబాద్, మెయినాబాద్, మేడ్చల్, కీసర వంటి శివారు ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్, రిసార్టులు ఇప్పటికే బుక్ అయ్యాయి. దీంతో మిగిలిన వ్యక్తిగత గృహాలకు సైతం ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఇక ఈవెంట్స్ కూడా భారీగానే ప్లాన్ చేశారని, ఆయా ప్రాంతాల్లోని డిమాండ్ బట్టి పార్టీ వేడుకలకు ఒక్కో టికెట్ కనీసం రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకూ ఉండొచ్చని అంచనా. సాధారణ రోజుల్లో ఫామ్‌హౌస్, రిసార్ట్‌లలో రోజుకు ఒక్క గది అద్దె రూ.15 వేల నుంచి రూ.30 వేలు ఉండగా.. న్యూ ఇయర్‌కు మాత్రం రూ.50 వేలపైనే చెబుతున్నారు.

ఈసారి డిసెంబర్ 31న ఐటీ నిపుణులు, ఉన్నతోద్యోగులు ఐదారుగురు బృందంగా ఏర్పడి వేడుకలకు ప్లాన్ చేస్తున్నారు. దీంతో పాటు గేటెడ్ కమ్యూనిటీలోని రెండు మూడు ఫ్యామిలీలు కలిసి న్యూ ఇయర్ వేడుకలను సరికొత్తగా ప్లాన్ చేస్తున్నారు. హోటళ్లు, పబ్‌లు, క్లబ్‌లు నిర్వహించే పార్టీల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో పోలీస్ తనిఖీలతో ఇబ్బందులు పడే బదులు.. శివారు ప్రాంతాల్లోని ఫామ్ హౌస్‌లు, విల్లాలు, వ్యక్తిగత గృహాలను అద్దెకు తీసుకొని పార్టీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి సమస్యలు అసలే ఉండవనేది వారి వాదన. దీంతో పాటు పార్టీ జోష్‌ను మరుసటి రోజు సాయంత్రం వరకూ ఎంజాయ్ చేయొచ్చనే యోచనలో ఉన్నారని సమాచారం.

అద్దెకు విల్లాలు, వ్యక్తిగత గృహాలు..

శివరాంపల్లి, శామీర్‌పేట, భువనగిరి, కొల్లూరు వంటి ఔటర్ రింగ్ రోడ్‌కు చేరువలో నిర్మితమైన విల్లాలు, వ్యక్తిగత గృహాలను యజమానులు అద్దెకు ఇస్తున్నారు. ఈ తరహా ట్రెండ్ ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ.. గతేడాదితో పోలిస్తే 20–30 శాతం అద్దె ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఓ కస్టమర్ చెబుతున్నాడు. భారీగా అద్దెలు రావడంతో విల్లాలు, వ్యక్తిగత గృహాల నిర్మాణాలూ భారీగానే ఏర్పాటయ్యాయని, అయినా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో రోజుకు అద్దె రూ.5 వేలుగా చెబుతున్నారని పేర్కొన్నారు. అదనపు చార్జీలతో మద్యం, ఫుడ్ ఇతరత్రా వాటిని కూడా ఫామ్‌హౌస్ నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు.

పోలీసు నిబంధనలివే..

- ✔ పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా న్యూ ఇయర్ వేడుకలను చేయకూడదు.
- ✔ వేడుకలకు హాజరయ్యే వారి గుర్తింపు కార్డులు, వివరాలను నమోదు చేయాలి.
- ✔ సీటింగ్ సామర్థ్యానికి మించి టికెట్లను విక్రయించకూడదు.
- ✔ కపుల్స్ కోసం నిర్వహించే పార్టీల్లో మైనర్లను అనుమతించకూడదు.
- ✔ డీజేలు కాకుండా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధన ప్రకారం 45 డిసెబుల్స్ కంటే తక్కువ సౌండ్స్ ఉన్న పరికరాలును మాత్రమే వినియోగించాలి.
- ✔ ఎంట్రీ, ఎగ్జిట్ ప్రాంతాలతో పాటు ప్రాంగణం ముందు ఉన్న రహదారిలో 50 అడుగుల దూరాన్ని కవర్ చేసేలా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.
- ✔ అసభ్యకరమైన దుస్తులతో నృత్య ప్రదర్శనలు నిర్వహించకూడదు.
- ✔ పురుషులతో పాటు మహిళా సెక్యూరిటీ గార్డులను కూడా నియమించాలి.
- ✔ మైనర్లకు లిక్కర్ సరఫరా చేసినా లేదా మాదక ద్రవ్యాలను వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు.



ఆకట్టుకుంటున్న క్రిస్మస్ ట్రీ

'ఐఎస్‌బీ' ప్రాంగణంలో భారీగా ఏర్పాటు

రాయదుర్గం : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రాంగణంలో భారీ క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశారు. ఇది ఐఎస్‌బీ ప్రాంగణానికి ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రతియేటా ఐఎస్‌బీ ప్రాంగణంలో అదే స్థానంలో ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులే కాకుండా సందర్శకులు కూడా ఆసక్తిగా పాల్గొంటారు. హైదరాబాద్, మొహాలీలోని రెండు ఐఎస్‌బీ ప్రాంగణాలలో కులమతాలకు అతీతంగా అన్ని రకాల పర్వదినాలనూ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా దీన్ని ఏర్పాటు చేశారు.





శిల్పారామం.. సాంస్కృతిక సంబరం..

ఆకట్టుకుంటున్న అంతర్జాతీయ చేనేత హస్తకళ ప్రదర్శన





మాదాపూర్ : వెస్ట్ బెంగాల్‌కు చెందిన కళాకారులు నృత్యప్రదర్శనతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ చేనేత హస్తకళా మేళాలో భాగంగా మంగళవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. దుబాయ్ నుంచి వచ్చిన భరతనాట్య కళాకారిణి అమృత వినోద్ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. గణేశస్తుతి, గరుడ కవిత్వం, కళ్యాణ సుందరేశ్వరీ కీర్తన, కృష్ణ తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కూచిపూడి నృత్య గురువు సుధామాల శిష్య బృందం ఘం గణపతే నమః, రామాయణశబ్దం, భో శంభో, సీతాపహరణం, జతిస్వరం, ప్రహ్లాద శబ్దం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు యశస్విని, నిహారిక, శక్తిహరిణి, కావ్య, తన్మయ, తనుశ్రీ, మౌనిక వీక్ష కుల అభినందనలు పొందారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ వెస్ట్‌బెంగాల్‌కు చెందిన జానపద నృత్యం పురూలియా చౌ టీం లీడర్ రూప్ చంద్ బృందం ప్రదర్శన అలరించింది.

ఏఐ ప్రయోజనాలు అందరికీ అందాలి..



సాక్షి, సిటీబ్యూరో : ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే దిశగా కృత్రిమ మేధ(ఏఐ)ని ఉపయోగించడంపై సంస్థలు దృష్టి పెట్టాలని, సామాజిక ప్రభావాన్ని చూపే ఏఐ సొల్యూషన్స్‌కు మద్దతు ఇవ్వడానికి తాము సిద్ధమని తెలంగాణ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్స్, పరిశ్రమలు వాణిజ్య విభాగాల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. వోక్సెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఫ్యూచర్ టెక్ సమ్మిట్‌లో గౌరవ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆచరణాత్మక ఏఐ వినియోగంపై దృష్టి సారించాలని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు , పంట నష్టాల తగ్గింపు, మారుమూల ప్రాంతాలకు వైద్యం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి తదితరాలకు దోహదపడేవి ఉంటే సంతోషంగా స్వీకరిస్తామన్నారు. స్టార్టప్‌లు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నాయని, స్టార్టప్ ప్రోగ్రామ్‌లు రూపొందించే క్రమంలో సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వోక్సెన్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రౌల్ విల్లామరిన్ రోడ్రిగ్జ్ మాట్లాడారు.

బిర్యానీయే మన భాగ్యం

- ఏడాదిలో కోటి యాభై లక్షలపైగా తినేశారు
- నిమిషానికి 34 బిర్యానీలు సిటీ బొజ్జలోకే..
- దేశంలో అత్యధిక వినియోగం మనదే..
- మదర్స్ డే సందర్భంగా భారీగా కేక్ ఆర్డర్స్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ బిర్యానీతో పోటీపడుతూ నగరవాసుల బిర్యానీ ప్రియత్వం కూడా అంతర్జాతీయ ఖ్యాతి పొందుతోంది. చికెన్ నుంచి పన్నీర్ వరకూ, రొయ్యల నుంచి గుడ్డు వరకూ..మష్రూమ్ నుంచి వెజ్ బిర్యానీ వరకూ 15.7 మిలియన్లకు పైగా వివిధ రకాల బిర్యానీలు గత ఏడాదిలో నగరవాసులు ఆరగించారు. ప్రతి నిమిషానికీ 34 బిర్యానీలు ఆర్డర్ చేయడం ద్వారా దేశంలోనే హైదరాబాద్ అగ్రగామిగా నిలిచింది. ఈ విశేషాలను ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ తాజా నివేదిక వెల్లడించింది.





చికెన్.. టాప్..

ఏడాది పొడవునా సగటున నిమిషానికి 21 చికెన్ బిర్యానీల ద్వారా మొత్తం 97,20,000 ప్లేట్‌లతో చికెన్ బిర్యానీ నెంబర్ వన్‌గా నిలిచింది. నగరంలో ఒక వినియోగదారు 60 బిర్యానీలకి 18,840 వెచ్చించడం విశేషం. అత్యధికంగా టీ 20 క్రికెట్ ప్రపంచ కప్ సందర్భంగా 8,69,000 చికెన్ బిర్యానీలను ఆర్డర్ చేశారు. పన్నీర్ బిర్యానీ, మినీ చికెన్ బిర్యానీలను తెల్లవారుజామున 4 గంటలకే ఆర్డర్ చేయడం విశేషం. అత్యంత వేగంగా 10 నిమిషాల్లో డెలివరీ చేయడానికి ఉపయోగించే స్విగ్గీలోని 'బోల్ట్' ఫీచర్ ద్వారా ఒక్కరోజే హైదరాబాదీలు 42,904 చికెన్ బిర్యానీలను ఆర్డర్ చేశారు. ఇవన్నీ కేవలం ఒక్క ఫుడ్ డెలివరీ యాప్ ద్వారా మాత్రమే కావడం గమనార్హం.



ఆసక్తికరమైన అభిరుచుల్లో..

- నగరవాసులు చికెన్ షావర్మాలను అత్యధిక సంఖ్యలో ఆర్డర్ చేయగా, చికెన్ రోల్స్, చికెన్ నగెట్స్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- ఉదయపు బ్రేక్‌ఫాస్ట్‌గా ఉల్లిపాయ దోసె వినియోగంలో సిటీ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఉల్లియేతర వెర్షన్ వెజ్ దోసలు 17.54 లక్షల ఆర్డర్‌లను అందుకున్నాయి.
- నగరం ఇష్టపడే స్వీట్ డబుల్ కా మీఠా ఏడాదిలో 2.01 లక్షల ఆర్డర్‌లను అందుకుంది.
- మదర్స్ డే సందర్భంగా 8050 కేక్‌లను అంటే సగటున నిమిషానికి 5 కేక్‌లు ఆర్డర్ చేయడం ద్వారా మన నగరం మాతృదినోత్సవ వేడుకల పట్ల తన ప్రేమని చాటుకుంది.

క్లుప్తంగా...

అరగంటలో 'వైకుంఠ ఏకాదశి' టికెట్లు ఖాళీ

తిరుమల: తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి టీటీడీ ఆన్‌లైన్‌లో టికెట్లు విడుదల చేసిన అరగంటకే ఖాళీ అయిపోయాయి. జనవరి 10న వైకుంఠ ఏకాదశి రోజు నుంచి 19వ తేదీ వరకు తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులను టీటీడీ అనుమతిస్తుంది. ఇందుకోసం ఆ పది రోజులకు 1.40 లక్షల రూ.300 టికెట్లను మంగళవారం ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. అయితే కేవలం 30 నిమిషాల్లోనే టికెట్లన్నీ అయిపోయాయి. వీటి కోసం 14 లక్షలు మంది ఆన్‌లైన్‌లో పోటీపడ్డారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


ఆలయం వెలుపల జస్టిస్ పంకజ్ మిట్టల్

శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్, సినీ నటుడు రావు రమేష్ ఉన్నారు.

1న స్పర్శదర్శనం, ఆర్జిత అభిషేకాలు నిలుపుదల

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో జనవరి 1వ తేదీన ఐచ్ఛిక సెలవు రోజు కారణంగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఈ కారణంగా ఆ రోజున స్వామివార్ల స్పర్శదర్శనం పూర్తిగా నిలుపుదల చేసినట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జనవరి 1వ తేదీన భక్తుల రద్దీ కారణంగా భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆర్జిత గర్భాలయ అభిషేకాలు, ఆర్జిత సామూహిక అభిషేకాలు కూడా నిలుపుదల చేశామన్నారు. ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాల సేవ, ప్రదోషకాలసేవలు కూడా ఆ రోజున నిలుపుదల చేసినట్లు ఈవో తెలిపారు.

అంతర్జాతీయ ఒలింపియాడ్‌లలో 'నారాయణ' ప్రతిభ

సాక్షి, హైదరాబాద్: నారాయణ స్కూల్స్ విద్యార్థులు 2024 సంవత్సరంలో జాతీయ, అంతర్జాతీయ ఒలింపియాడ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ నెలలో రొమేనియాలోని బుఖారెస్ట్‌లో జరిగిన ఇంటర్నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్ (ఐజ ె)లో, అంతకుముందు అక్టోబర్‌లో నేపాల్‌లోని ఖాట్మండులో జరిగిన 3వ ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆన్ ఆస్ట్రానమీ, అస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్‌లో పతకాలు కొల్లగొట్టినట్టు వెల్లడించింది. ఆగస్టులో బ్రెజిల్‌లోని రియో డి జెనీరోలో జరిగిన 17వ ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆన్ ఆస్ట్రానమీ అస్ట్రోఫిజిక్స్ పోటీల్లో సీనియర్ విభాగంలో, జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్ (ఖ్మా లో కూడా విజయ దుందుభి మోగించినట్టు తెలిపింది. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ తమ పాఠశాలలు సాధిస్తున్న అప్రతిహత విజయాలపై హర్షం వ్యక్తం చేశారు.

రాధాకిషన్‌రావుకు మధ్యంతర బెయిల్

పలు షరతులు విధించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు రాధాకిషన్‌రావుకు హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆయన మామ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి.. 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు బెయిల్ మంజూరు చేసింది. సికింద్రాబాద్‌లో అంత్యక్రియలు జరిగే స్థలానికి రక్షణతో తీసుకెళ్లాలని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. తిరిగి 28న జైలుకు తరలించాలని స్పష్టం చేసింది. కుటుంబ సభ్యులు, సమీప బంధువులను కలవడానికి రాధాకిషన్‌రావును అనుమతించాలని, అంత్యక్రియలు, ఇతర కార్యక్రమాలకు ఎస్కార్ట్ ఎలాంటి భంగం కలిగించరాదని స్పష్టం చేసింది. ప్రయాణ ఖర్చులు, ఎస్కార్ట్ చార్జీలను రాధాకిషన్‌రావు భరించాలని ఆదేశించింది. జైలు నుంచి బయటికి వచ్చినప్పటి నుంచి.. తిరిగి జైలుకు వెళ్లేవరకు ఎలాంటి టెలిఫోన్, మొబైల్ వినియోగించకుండా పర్యవేక్షించాలని సూపరింటెండెంట్‌కు సూచించింది. ఎస్కార్ట్ బెయిల్‌ను రాధాకిషన్ దుర్వినియోగం చేయవద్దని హెచ్చరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన రాధాకిషన్‌రావు చంచల్‌గూడ జైలు ఉంటున్న విషయం తెలిసిందే. బెయిల్ కోసం ఆయన ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించగా.. వాదనలు పూర్తయి న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. ఇతర నిందితులు ఇచ్చిన తప్పుడు వాంగ్మూలం మేరకు తనను అరెస్టు చేశారని, సీనియర్ సిటిజన్‌ను అయిన తాను మార్చి నుంచి జైలులో ఉంటున్నానని పేర్కొన్నారు. కాగా, మృతి చెందిన మామ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఈ నెల 24 నుంచి 28 వరకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన మంగళవారం విచారణ చేపట్టారు. మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయడాన్ని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు తీవ్రంగా వ్యతిరేకించారు. కుటుంబంలోని ఇతర వ్యక్తులు ఎవరైనా అంత్యక్రియలు చేయవచ్చని పేర్కొన్నారు. రాధాకిషన్‌రావు మృతుని కుమారుడు కాదని, ఐఏను కొట్టివేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు రాధాకిషన్‌రావుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు.

మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే

కడప కార్పొరేటర్లు, ముఖ్య నేతల సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

- కష్టాలు శాశ్వతం కాదు.. 2027లోనే జమిలి ఎన్నికలు
- ప్రజలకిచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ప్రభుత్వం మనది
- చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అని చేతులెత్తేసింది
- వైఎస్సార్ ఘాట్‌లో తండ్రి వైఎస్సార్‌కు ఘన నివాళి
- ఇడుపులపాయ చర్చి ప్రాంగణంలో కుటుంబీకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు


వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో దివంగత సీఎం వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో అవినాశ్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, కడప: 'ఎన్నికల ముందు అలవిగాని హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదు. అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారు. 2027 చివర్లో జమిలి ఎన్నికలు రానున్నాయి. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే'అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇడుపులపాయలో కడప కార్పొరేటర్లు, ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రజలకిచ్చిన మాట మీద నిలబడి, ప్రజల కష్టాలను నా కష్టాలుగా భావించి, ప్రజలకు మంచి చేశాం. ఈ రోజు కూడా ప్రతి ఇంటికీ మనం కాలర్ ఎగరేసుకుని వెళ్లగలుగుతాం. మనం చెప్పింది చేశామనే మాట ప్రతి ఇంట్లో నుంచి వినిపిస్తోంది. ప్రజలు సంతోషంగా మీరు చేశారంటున్నారు. అదే టీడీపీ నాయకులు ఎవరైనా ప్రజల దగ్గరకు వెళ్లి ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ అమలు చేశామని వెళ్లగలుగుతారా? వాళ్లు ప్రజల దగ్గరకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉంది. ఏ ఇంటికి వెళ్లినా చిన్న పిల్లలతో నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అని, వారి తల్లులైతే నీకు రూ.18 వేలు, ఆ అమ్మలకు తల్లులు, అత్తలు కనిపిస్తే నీకు రూ.48 వేలు అని, 20 ఏళ్లు దాటిన పిల్లవాడు కనిపిస్తే రూ.36 వేలు అని, కండువా వేసుకుని ఇంట్లోంచి రైతు బయటకు వస్తే నీకు రూ.20 వేలు అని.. ఇలా ఇంట్లో ఎవరినీ వదిలి పెట్టకుండా ఆశ పెట్టారు. ఇప్పుడు వారంతా మా డబ్బులు ఏమయ్యాయని అడుగుతున్నారు. అందుకే ఏ టీడీపీ కార్యకర్త ఎవరి ఇంటికి వెళ్లే పరిస్థితి లేదు'అని చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

కలిసికట్టుగా పని చేద్దాం

జమిలి ఎన్నికలు 2027లో అంటున్నారు. నెలలు గడిచేకొద్దీ చంద్రబాబులో భయం పెరిగిపోతోంది. మనం రెట్టించిన ఉత్సాహంతో ముందుకెళుతున్నాం. మన ప్రభుత్వం మళ్లీ రాగానే నాతో పాటు ఈ కష్టాల్లో ఉన్న వారికి మంచి రోజులు వస్తాయి. ఇబ్బందులు కొంత కాలం ఉంటాయి. కష్టాలు వచ్చినప్పుడు వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదు. మనందరం కలిసికట్టుగా పని చేయాలి. మోసపూరిత హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. మనల్ని ప్రలోభాలకు గురిచేసినా.. ఇబ్బందులు పెట్టినా, కొంత ఓపిక పట్టండి. మీకు నా తమ్ముడు అవినాష్ అందుబాటులో ఉంటారు. మీకు ఏ అవసరం వచ్చినా తనను కలవండి. తప్పకుండా సాయం చేస్తారు. నేను కడప బిడ్డను కాబట్టే మీరంటే నాకు ప్రత్యేకమైన అనుబంధం. మీ అందరి ప్రేమ ఎప్పటికీ మరిచిపోను. మేము జిల్లాలో చూసుకుంటాం.. మీరు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించండంటూ మీరంతా నాకు అండగా ఒక్క తాటిపై నిలవాలి. మీ అందరినీ నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నా. ప్రజల కోసం ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలి. సంక్రాంతి తర్వాత ప్రత్యక్షంగా ప్రజల్లోకి వెళ్తాను. అన్ని జిల్లాల్లో పర్యటిస్తాను.

క్రిస్మస్ శుభాకాంక్షలు

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులందరికీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కరుణ, ప్రేమ, క్షేమ, సహనం , దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని వైఎస్ పేర్కొన్నారు. తద్వారా మానవాళిని సత్యపథం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారని చెప్పారు. దుర్మార్గం నుంచి సన్మార్గానికి, అమానుషత్వం నుంచి మానవత్వానికి, చెడు నుంచి మంచికి, దురాశ నుంచి దాతృత్వం, త్యాగాలకు జీసస్ బాటలు వేశారని తెలిపారు. క్రీస్తు బోధనలు మనుషులందరినీ ఎప్పటికీ సన్మార్గంలో నడిపిస్తాయన్నారు.

వైఎస్సార్‌కు నివాళులు

ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్ కుటుంబ సభ్యులు.. ఓపెన్ చర్చిలో చేపట్టిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్ జగన్, భారతి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతమ్మ, వైఎస్ ఆనందరెడ్డి, వైఎస్ రవీంద్రనాథరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఇతర కుటుంబీకులు పాల్గొన్నారు.

తిరుమలలో బ్రాండెడ్ హోటళ్లు

- శ్రీవారి లడ్డూల స్కాంపై విచారణ
- పాలకమండలి నిర్ణయాలను వెల్లడించిన ఈవో శ్యామలరావు


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు, పక్కన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు

తిరుమల: తిరుమలలో భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని తక్కువ ధరకు అందించేలా పేరొందిన బ్రాండెడ్ హోటళ్ల ఏర్పాటు చేసే విధానాన్ని తీసుకొస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పారు. బ్రాండెడ్ హోటళ్ల వాటి పేరు, ప్రఖ్యాతుల కోసం భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తాయని భావిస్తున్నామని చెప్పారు. మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన అన్నమయ్య భవనంలో టీటీడీ పాలకమండలి సమావేశం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను టీటీడీ ఈవో మీడియాకు వివరించారు. తిరుమలలోని బిగ్, జనతా క్యాంటీన్ల నిర్వహణ, మరింత నాణ్యంగా ఆహార పదార్థాలు తయారు చేసేందుకు దేశంలోని ప్రముఖ సంస్థలకు క్యాంటీన్ల నిర్వహణ లైసెన్సుల జారీలో నూతన విధానం అమలుకు పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు.

లడ్డూల స్కాంపై విచారణ

చెన్నైలోని టీటీడీ సమాచారం కేంద్రం నుంచి శ్రీవారి ప్రసాదాలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోవడంపై విచారణ చేపట్టామని ఈవో చెప్పారు. సోమవారం 'సాక్షి'లో 'శ్రీవారి లడ్డూల గుటకాయ స్వాహా!'శీర్షికన ప్రచురితమైన కథనంపై విచారణ చేపట్టామన్నారు. విచారణ అనంతరం లడ్డూలు పక్కదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్ పాల్గొన్నారు.

నీట్ పీజీ అడ్మిషన్లలో జాప్యం..

ఆందోళనలో విద్యార్థులు

▶ మొదటి పేజీ తరువాయి

రిజిగ్నేషన్ పీరియడ్ ఈనెల 26తో ముగియనుంది. ఆ తరువాత మూడో రౌండ్ ఓపెన్ అవుతుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి పీజీ ప్రవేశ పరీక్ష రాసిన సుమారు 8 వేల మంది విద్యార్థుల్లో ఆందోళన పెరిగింది.

ఫిబ్రవరి 5లోగా పూర్తికావాల్సిన ప్రక్రియ

నీట్-పీజీ ప్రవేశాలకు సంబంధించి అన్ని రకాల ప్రవేశాలను ఫిబ్రవరి 5లోగా పూర్తి చేయాలనేది నిబంధన. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల మేరకు ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఒకవేళ జనవరి 7న సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే... అప్పటి నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించినా ఫిబ్రవరి 5లోగా పూర్తి చేయడం సాధ్యంకాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రవేశాలకు సంబంధించి మొత్తం నాలుగు రౌండ్స్ ఉంటాయి. కన్వీనర్ కోటా, యాజమాన్య కోటా, ఎన్ఆర్ఐ (సీ కేటగిరి) కోటాతోపాటు స్ట్రే వెకెన్సీ ఉంటుంది. ఒక్కో విడతకు కనీసం వారం రోజుల సమయమివ్వాలి. అనంతరం మరోవిడత కౌన్సెలింగ్ చేపట్టాలి. కానీ ఇప్పటివరకు వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పీజీ విద్యార్థులకు సంబంధించిన ర్యాంకు కార్డులను గానీ, జాతీయస్థాయి మెరిట్ కార్డులను గానీ విడుదల చేయలేదు.

అఖిల భారత కోటాలో సగం సీట్లు భర్తీ

రాష్ట్రంలో 2,886 మెడికల్ పీజీ సీట్లున్నాయి. వీటిలో 1,300 సీట్లు ప్రభుత్వ కళాశాలల్లో ఉన్నాయి. వీటిల్లోని 50% సీట్లు ఆలిండియా కోటాకు వెళ్తాయి. మన రాష్ట్ర విద్యార్థులకు మిగిలేవి 650 సీట్లే. వీటిలో రెండు రౌండ్ల కౌన్సెలింగ్‌లో దాదాపుగా అన్ని సీట్లు నిండిపోయాయని విద్యార్థులు చెబుతున్నారు. మిగతా 650 సీట్ల విషయంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు వెలువడేదాకా వేచి చూడాలని అంటున్నారు. కాగా, ప్రైవేటులో 1,500కు పైగా సీట్లలో 50% కన్వీనర్ కోటా కిందకు వస్తాయి. 35% మేనేజ్‌మెంట్ కోటా, 15% ఎన్నారై కోటాకు వెళ్తాయి.

స్టేట్ రౌండ్ 1ను ప్రకటించాలి: టీ-జూడా

అఖిలభారత కోటా మూడో రౌండ్ నిర్వహణ ప్రారంభమయ్యేలోగా తెలంగాణలో స్టేట్ కౌన్సెలింగ్ ద్వారా రెండు రౌండ్లలో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము రాహుల్, ఇసాక్ న్యూటన్, చైర్‌పర్సన్ డి. శ్రీనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. ఏఐక్యూ రెండో రౌండ్ రిజిగ్నేషన్ డెడ్‌లైన్ పూర్తయ్యేలోపు స్టేట్ మొదటి కౌన్సెలింగ్ పూర్తి చేయాలన్నారు. మెడికో డి.వెంకటేష్ కుమార్ విద్యార్థుల తరపున మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెంటనే రాష్ట్రంలో కౌన్సెలింగ్ ప్రారంభించాలని కోరారు.

హెచ్‌పీఎస్ జ్ఞాపకాలతో


మురిసిన నాదెళ్ల

▶ మొదటి పేజీ తరువాయి

మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సత్య నాదెళ్లతోపాటు హెచ్‌పీఎస్‌కు చెందిన మరో పూర్వ విద్యార్థి అడోబ్ సీఈవో శంతను నారాయణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 1923లో జాగిర్దార్ కాలేజీగా ప్రస్థానం ప్రారంభమై వందేళ్లపాటు వేలాది మందికి విద్యాబుద్ధులు నేర్పిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వందేళ్ల ఘన చరిత్రపై పుస్తకాన్ని విడుదల చేశారు.

హెచ్‌పీఎస్‌లోనే నాయకత్వ లక్షణాలు నేర్చుకున్నాం: నాదెళ్ల, శంతను

హెచ్‌పీఎస్‌లోనే తాము నాయకత్వ లక్షణాలను నేర్చుకున్నామని నాదెళ్ల, శంతను చెప్పారు. ఈ పాఠశాల తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని.. ఇక్కడ నేర్చుకున్న నాయకత్వ లక్షణాలతోనే ఇంత స్థాయికి ఎదిగామన్నారు. తన భార్య అనుపమ కూడా ఇక్కడే చదువుకుందని నాదెళ్ల తెలిపారు. హెచ్‌పీఎస్‌తో ఎన్నో జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయని చెప్పారు. పుస్తకానికి ప్రధాన సంపాదకుడిగా కృష్ణమూర్తి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కాఫీ టేబుల్ బుక్ సబ్-కమిటీ సహ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి కందూర్, హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీనోరియా, ఫయాజ్‌ఖాన్ క్రియేటివ్ హెడ్ ప్రణవ్ పింగిల్, హెడ్ రీసెర్చర్ సంజీవ్ చక్రవర్తి, హెడ్ డిజైనర్ అనీష్ పెంటి, లీడ్ రైటర్ అలోక్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కూనంనేని, వినోద్, వీహెచ్ తదితరులు

చైనా దురాక్రమణపై చర్చ జరగాలి

- 'నట్స్ అండ్ బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్' పుస్తకావిష్కరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): చైనా దురాక్రమణ, మణిపూర్‌లో జరుగుతున్న అంతర్యుద్ధంపై చర్చ జరిగి, వాటిని నియంత్రించాలని అప్పుడే దేశంలో శాంతి నెలకొంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో అఖిలభారత శాంతి, సంఘీభావ సంఘం జాతీయ సలహా కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కె.యాదవ్‌రెడ్డి రచించిన 'నట్స్ అండ్ బోల్ట్స్ ఆఫ్ వార్ అండ్ పీస్'పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రపంచ శాంతి మాత్రమే కాకుండా భారతదేశంలో జరుగుతున్న అప్రకటిత యుద్ధం, నెలకొన్న భయానక వాతావరణంపై కూడా చర్చ జరగాలని, ప్రపంచ శాంతి కోరుతున్న ఉద్యమ కారులు ఈ విషయంపై ఆలోచన చేయాలని సూచించారు. భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని, మణిపూర్ రాష్ట్రంలో రెండు గిరిజన జాతుల మధ్య ఊచకోత కోసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత బలగాలు తలచుకుంటే మణిపూర్‌లో శాంతిని నెలకొల్పలేవా అని రేవంత్ ప్రశ్నించారు.

తెలంగాణ ఉద్యమ సంపూర్ణ వివరాలతో పుస్తకం రావాలి

ముల్కి, నాన్‌ముల్కి, తొలిదశ, మలిదశ ఉద్యమాలు, రాష్ట్ర ఏర్పాటు వరకు సంపూర్ణ వివరాలతో ఓ పుస్తకాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతగానో ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన వారి గురించి పుస్తకాన్ని వ్రాయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి సోనియాగాంధీకి వివరించడంలో యాదవరెడ్డి పాత్ర ఎంతగానో ఉందన్నారు. తెలంగాణ బిల్లును ఆమోదించడంలో జైపాల్‌రెడ్డితో పాటు యాదవ రెడ్డి కూడా బాధ్యతలను తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రపంచ శాంతి మండలి అధ్యక్షుడు పల్లబ్ సేన్‌గుప్తా మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా శాంతి ఉద్యమాన్ని బలోపేతం చేయడం ద్వారా యుద్ధ వాతావరణాన్ని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే సాంబశివ రావు, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, వి.హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఒబేదుల్లాతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

లోకల్ మెరిట్ లిస్టు విడుదల చేయాలి



సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): వైద్య విద్యార్థులు తెలంగాణలో సీట్లు పొందేలా వెంటనే లోకల్ మెరిట్ జాబితాను విడుదల చేయాలని కాళోజీ వైద్య విశ్వ విద్యాలయం పాలక మండలి, రాష్ట్ర ప్రభుత్వానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఐఎంఏ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నీట్ పీజీ కౌన్సెలింగ్ 2024-25కు సంబంధించి.. ఆల్ ఇండియా కోటాలో రెండు రౌండ్లు పూర్తయ్యాయని తెలిపారు. కానీ మెరిట్ లిస్ట్ లేనందున.. తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యార్థులు కనీసం రాష్ట్రంలోని మంచి కాలేజీల్లో సీట్లు పొందలేకపోతున్నారని వివరించారు. ఈ క్రమంలో త్వరలోనే నీట్ పీజీ కౌన్సెలింగ్‌కు సంబంధించి.. ఆల్ ఇండియా కోటాలో 3వ రౌండ్ కూడా డిసెంబర్ 27వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతుందన్నారు. ఆలస్యానికి గల కారణాలపై కాళోజీ వైద్య విద్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి.. వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా వెంటనే లోకల్ మెరిట్ జాబితా విడుదల చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

జీసీసీల చూపు హైదరాబాద్ వైపు!

▶ మొదటి పేజీ తరువాయి

కార్యకలాపాల నిర్వహణ కోసం స్థానిక నైపుణ్యాలు, ప్రావీణ్యత, వనరులను ఒడిసి పట్టుకునేందుకు దిగ్గజ కంపెనీలు వ్యూహాత్మకంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఏర్పాటు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీ'(నాస్కామ్) తెలంగాణలో జీసీసీల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరిస్తూ ఇటీవల 'జీసీసీ తెలంగాణ ప్లే బుక్'ను విడుదల చేసింది.

తెలంగాణ అనుకూలతలు ఇవే..!

- హైదరాబాద్‌లో నాణ్యమైన మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, సాంకేతిక ఆవిష్కరణలు, స్టార్టప్ వాతావరణం వేగంగా వృద్ధి చెందుతుండటం.
- భూమి కొనుగోలుపై రాయితీ, ఐటీ పార్క్ ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు, విద్యుత్ రాయితీ, పేటెంట్‌కు మద్దతు.
- టాస్క్, స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఏటా వేలాది మందికి నైపుణ్య శిక్షణ, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఎస్‌బీ వంటి అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఉండటం.
- వివిధ రంగాల్లో జీసీసీల ఏర్పాటుకు అనువుగా వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో 40 లక్షల నుంచి 60 లక్షల చదరపు మీటర్ల ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి వస్తుంది.
- ప్రభుత్వ సంస్థలైన టీ హబ్, వీ హబ్, టీఎస్ఐసీ వంటి స్టార్టప్ ఇంక్యుబేటర్లతో 50కి పైగా జీసీసీలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.
- తెలంగాణలో ఏటా స్టెమ్ కోర్సుల్లో (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్) లక్షకు పైగా విద్యార్థులు పట్టభద్రులవుతున్నారు. వీరిలో 80 వేల నుంచి 90 వేల మంది ఇంజనీరింగ్, సాంకేతిక రంగాలకు చెందినవారే.
- డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువుగా భూకంప సంభావ్యత తక్కువగా ఉండటం, ఏఐ సాంకేతికతకు సంబంధించిన మౌలిక వసతులు ఎక్కువగా ఉండటం.

జీసీసీల దృష్టి ఉన్న రంగాలివే..

తెలంగాణలో ఏర్పాటవుతున్న జీసీసీలు కొన్ని ప్రధాన రంగాల్లో కార్యకలాపాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్/ఇంటర్‌నెట్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ, సెమీకండక్టర్, ఫార్మాస్యూటికల్స్, రిటైల్, మెడికల్ డివైజెస్, టెలి కమ్యూనికేషన్స్, బీఎఫ్ఎస్ఐ, ఆటోమోటివ్, వృత్తిపరమైన సేవల రంగాల్లో జీసీసీల ఏర్పాటుకు సంస్థలు మొగ్గు చూపుతున్నాయి. తెలంగాణలో ఏర్పాటైన జీసీసీలన్నీ హైదరాబాద్‌లో.. ప్రత్యేకించి గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్, మణికొండలోనే కేంద్రీకృతమయ్యాయి. అయితే ద్వితీయ శ్రేణి నగరాలైన వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లోనూ జీసీసీల ఏర్పాటుకు మౌలిక వసతులు అందుబాటులో ఉన్నట్లు నాస్కామ్ ప్రకటించింది.

2024 నాటికి దేశంలో జీసీసీలు

నగరం	జీసీసీల సంఖ్య
బెంగళూరు	875
ఢిల్లీ/ఎన్‌సీఆర్	465
ముంబై	365
పుణే	360
హైదరాబాద్	355
చెన్నై	305

దేశంలో జీసీసీల పురోగతి

	2024	2030
జీసీసీ మార్కెట్ పరిమాణం (బిలియన్ డాలర్లలో)	64.6	99-105
జీసీసీలు	1710	2,100-2,200
జీసీసీ యూనిట్లు	2,970	4,300-4,400
ఉద్యోగాల కల్పన (లక్షల్లో)	19	25 - 28

దేశం గర్వించదగ్గ గొప్ప నేత



మాట్లాడుతున్న ఎంపీ సుధాన్షు త్రివేది. చిత్రంలో కిషన్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, రఘునందన్‌రావు

హైదరాబాద్‌లో జరిగిన వాజ్‌పేయి స్మారకోపన్యాసంలో బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది

- సిద్ధాంతానికి కట్టుబడ్డ వ్యక్తి వాజ్‌పేయి అని కొనియాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుల్లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ముఖ్యులని బీజేపీ రాజ్యసభ సభ్యుడు సుధాన్షు త్రివేది కొనియాడారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లో అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మారకోపన్యాసంలో త్రివేది ప్రసంగించారు. దేశ చరిత్రలో ఇప్పటివరకు నాయకులుగా పుట్టి ప్రధాని పగ్గాలు చేపట్టింది ఇద్దరేనని.. వారిలో వాజ్‌పేయి అయితే మరొకరు నరేంద్ర మోదీ అన్నారు. వాజ్‌పేయి ఆలోచనలను ప్రధాని మోదీ అనుసరిస్తున్నారని త్రివేది చెప్పారు. దేశంలో మౌలికవసతుల కల్పనకు వాజ్‌పేయి బీజం వేస్తే దాన్ని మోదీ వటవృక్షం చేశారన్నారు. విద్యుత్‌తోపాటు, నైపుణ్యం, డిజిటల్ విద్య, డిజిటల్ ఎకానమీ వరకు అన్నింటినీ గ్రామాల చెంతకు చేర్చారని ప్రశంసించారు. నాటి వాజ్‌పేయి ప్రభుత్వం దేశ అణ్వస్త్ర సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తే ప్రస్తుతం మోదీ సర్కారు అణ్వాయుధాలను భూమ్యాకాశాల నుంచి ప్రయోగించే సామర్థ్యానికి తీసుకెళ్లిందని గుర్తుచేశారు.

అందరినీ మెప్పించిన నేత వాజ్‌పేయి: కిషన్‌రెడ్డి

అనంతరం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పాయ్ పేరు కాదని, ఒక చరిత్ర అని అన్నారు. దేశ ప్రధానిగా, కేంద్రమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా, పార్టీ అధినేతగా వేలెత్తి చూపించలేని పనితీరుతో అందరినీ మెప్పించారన్నారు. చివరి శ్వాస వరకు జాతీయ వాదానికి, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి అని కొనియాడారు. అటల్‌జీ స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నామన్నారు. మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ వాజ్‌పేయిని ప్రజలు దేశానికి ఒక కాంతిరేఖగా గుండెల్లో దాచుకున్నారన్నారు. అలాంటి వ్యక్తి పాలనలో పని చేసే అవకాశం లభించిందని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, వాజ్‌పేయి ఫౌండేషన్ చైర్మన్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రిస్మస్ పర్వదినం

లోక రక్షకుడు



మానవాళి ముక్తికొరకు మనుజావతారుడైన దైవం...
జగతిలో భీతి బాపేందుకు దిగివచ్చిన దైవ తనయుడు...
సర్వలోకానికి శాంతి సందేశం..
దివిలోనూ భువిలోనూ వేడుక...
పరలోక దూతావళి పరవశించి పాడిన వేళ
ప్రతి హృదిలో క్రిస్మస్ ఆనందం...

జగతిలో పాపం నిండినప్పుడు ప్రేమతో కలిసి జీవించాల్సిన ధరణి వాసుల హృదయాలు అసూయ, ద్వేషంతో రగులుతున్నప్పుడు చీకటి జలధిలో మునిగిన వారికి, శృంఖలాల్లో మగ్గే వారికి మరణ ఛాయలో బతికే వారికి ఒక ఆశా కిరణంగా... అరుణోదయ కాంతిగా... విమోచకుడిగా... జగద్రక్షకుడిగా రెండు వేల సంవత్సరాల క్రితం యేసుప్రభువు ఈ భువిపైకి అరుదెంచాడు. అదొక సుమనోహర ఘట్టం.. సర్వలోకాన్ని సంభ్రమాశ్చర్యాలతో విశేషంగా ఆకట్టుకున్న మధుర కావ్యం. తమను రక్షించే మెస్సయ్య కోసం సుదీర్ఘంగా ఎదురుచూస్తున్న విశ్వాసుల్లో నింపిన అంతులేని ఆనందం వెరసి స్తోత్ర గీతంగా స్తుతి గానంగా మారిన వైనం.. అందుకు యూదా దేశంలోని బెత్లెహేము వేదిక అయింది. ఆ సమయంలో రాజైన హేరోదు యెరూషలేము రాజధానిగా రాజ్యమేలుతున్నాడు. యూదా ప్రజలంతా తమను విమోచించే మెస్సయ్యా కోసం ఎదురు చూస్తున్న తరుణం. ఆ భాగ్యం కన్య అయిన మరియకు లభించింది. అప్పటికే గలిలయలోని నజరేతులో దావీదు వంశస్థుడైన యోసేపునకు మరియ ప్రదానం చేయబడింది. పరమ దేవుని ఆజ్ఞ మేరకు ప్రభువు దూత గబ్రియేలు ద్వారా ఈ శుభ వర్తమానం అందింది. 'దయా ప్రాప్తురాలా!'... అంటూ గబ్రియేలు ప్రత్యక్షమైనప్పుడు అప్పుడే యవ్వనప్రాయంలో అడుగుపెడుతున్న మరియ ఎంతో భయపడింది. ఎందుకంటే ఆ కాలంలో దేవుడు కాని ఆయన దూతల దర్శనం అరుదుగా మారింది. ప్రవక్తలకు ప్రవచనాలు నిలిచిపోయాయి. నిశ్శబ్దకాలంగా చెప్పబడింది. అటువంటి తరుణంలో దేవుని దూత మరియ వద్దకు వచ్చి 'భయపడకుము నీవు ధన్యురాలవు, దేవుని వలన నీవు కృప పొందావు. నీవు గర్భము ధరించి కుమారుని కంటావు. ఆయన సర్వోన్నతుని కుమారుడనబడతాడు. అతని రాజ్యము అంతము లేనిదై వుంటుందని' పేర్కొన్నాడు. దూత మాటలు మరింత విస్మయానికి భయానికి గురిచేశాయి. ఇది దేవాది దేవుని నుంచి వచ్చిన పిలుపుగా మరియ తెలుసుకుంది. 'అయ్యో నేను పురుషుని ఎరుగని దానినే ఇది ఏలాగు సాధ్యం?' అని అడిగింది.

'మరియా! భయపడకు. దేవుని పరిశుద్ధాత్మ శక్తి నీ మీదికి వస్తుంది సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకుంటుంది. పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడతాడని దేవదూత చెప్పిన మాటలను బట్టి ఇది దైవకార్యంగా గ్రహించి ప్రభువు దాసురాలను నీ మాట చొప్పున నాకు జరుగును గాక అని చెప్పి దేవాది దేవుని తన గర్భంలో మోయడానికి సిద్ధపడింది. వాస్తవానికి వివాహం కాకుండా ఆ రోజుల్లో యూదా స్త్రీ గర్భవతి అయితే రాళ్ళతో కొట్టి చంపే ఆచారం ఉండేది. దేవుని దయపొంది అంతులేని విశ్వాసంతో దేవుని ఆజ్ఞను శిరసావహించడానికి ముందుకు వచ్చింది కాబట్టే మరియ స్త్రీలందరిలో ధన్యురాలిగా కొనియాడబడింది.

అయితే మరియ గర్భవతియైన సంగతి తెలుసుకున్న యోసేపు కలత చెందాడు. నీతిమంతుడు కాబట్టి ఆమెను నలుగురిలో నగుబాటు చేయకుండా రహస్యంగా విడనాడాలని నిశ్చయించుకున్నాడు. ప్రభువు దూత స్వప్నమందు ప్రత్యక్షమై మరియ గర్భము ధరించింది ఏ పురుషుని వలన కాదని పరిశుద్ధాత్మ వలన జరిగినదని మరియను చేర్చుకొనడానికి ఏమాత్రమూ సందేహపడవద్దని పుట్టబోవు శిశువునకు యేసు అని పేరు పెట్టాలని తన ప్రజలందరి పాపముల నుండి ఆయనే రక్షిస్తాడని తెలుపడంతో యోసేపులో ఆవేదన తొలగిపోయింది. అంతేకాదు మరియ యేసుకు జన్మనిచ్చేవరకూ ఆమెను ముట్టకుండా జాగ్రత్త పడ్డాడు.

ఇదే సమయంలో ఆరు నెలలకు ముందు మరొక ఆశ్చర్యకరమైన సంగతి జరిగింది. మరియ సమీప బంధువు రాలైన ఎలీసబెతు ఆమె భర్త జెకర్యా కురు వృద్ధులు. ఆ వయస్సులో దేవుడు వారికి సంతాన ప్రాప్తి అనుగ్రహించాడు. దేవుని హస్తం వారికి తోడుగా వుండి ఒక మగ శిశువును దయచేసాడు. ఆ శిశువే తర్వాతి కాలంలో బాప్తీస్మం ఇచ్చు యోహానుగా పిలువబడి యేసు ప్రభు పరిచర్యకు ముందు ఆయన మార్గం సరళం చేసే సాధనమయ్యాడు.

లేఖన ప్రవచనాలు నెరవేర్చిన క్రిస్మస్

యేసుక్రీస్తు జననం రెండు వేల సంవత్సరాల క్రితం జరిగినా ఆయన ఆదిసంభూతుడు. ఆల్ఫా ఒమేగా ఆయనే. ఆదియు అంతమునై యున్నాడు. మొదటివాడు కడపటివాడుగా ఉన్నవాడు. జగత్ పునాది వేయక ముందే వున్న యేసు కాలం సంపూర్ణమైనప్పుడు సాతాను చెరలో చిక్కుకున్న మానవుడు పాపానికి బందీగా మారి దేవుని సన్నిధికి దూరంగా వెళుతున్న తరుణంలో ఆధ్యాత్మికంగా ఆత్మీయంగా పతనమై ఏ నిరీక్షణ లేని సమయంలో నిత్య జీవమిచ్చి తిరిగి దేవునితో ఐక్యపర్చేందుకు భూమి మీద దేవుని కుమారుడిగా క్రీస్తు అవతరించాడు. యేసు పుట్టుకను క్రీస్తుకు పూర్వం 700 సంవత్సరాల క్రితమే మీకా, యెషయా ప్రవక్తలు ప్రవచించడం విశేషం. 'బెత్లెహేము ఎఫ్రాతా యూదా కుటుంబంలో స్వల్పగ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలీయులను ఏల బోవువాడు నీలో నుండి వచ్చును' అని మీకా ప్రవచించగా 'ఆలకించుడి కన్యక గర్భవతియై కుమారుని కనును అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టబడును' అని యెషయా ప్రవక్త ప్రవచించాడు. ఇమ్మానుయేల నగా దేవుడు మనకు తోడని అర్థం. యేసు పుట్టుక ఆవశ్యకత గూర్చి యెషయా వివరించాడు. 'ప్రభువు ఆత్మ నా మీదికి వచ్చియున్నది దీనులకు సువార్తమానం ప్రకటించుటకు, నలిగిన హృదయం కలవారిని దృఢ పరచుటకు చెరలో నున్న వారికి విడుదల, బంధింపబడిన వారికి విముక్తి ప్రకటించుటకు ఆయన నన్ను పంపియున్నాడు' అని యెషయా ప్రవక్త చెప్పిన లేఖనాలు తన రాక ద్వారా నిజమయ్యాయని యేసుప్రభు తనపరిచర్యలో చెప్పడం విశేషం.

ప్రజా సంఖ్యలో రాయబడటానికి యోసేపు మరియలు నజరేతు నుండి బెత్లెహేముకు రావాల్సి వచ్చింది. రెండింటి మధ్య 90 మైళ్ళ దూరం. రెండు వేల సంవత్సరాల క్రితం ఎలాంటి ప్రయాణ సాధనాలు లేనిరోజుల్లో నిండు చూలాలైన మరియను వెంటబెట్టుకొని బహు ప్రయాస కోర్చి చలికాలంలో బెత్లెహేము చేరుకున్నారు దంపతులు. జన సంఖ్య కోసం ఆ గ్రామం అప్పటికే క్రిక్కిరిసి పోయి ఉండటంతో ఎక్కడా స్థలం లేక ఓ పశువుల కొట్టమే వారికి అశ్రయమైంది. అర్ధరాత్రి వేళలో క్రీస్తు జన్మించడంతో పశువుల తొట్టె క్రీస్తు పాన్పుగా మారిపోయింది. పరలోకాన్ని విడచివచ్చి పశువుల కొట్టంలో బాల యేసు పరుండాల్సి వచ్చింది. అతి సామాన్య కుటుంబంలో అతి సామాన్యంగా యేసు జన్మించాడు. యేసు పుట్టుక శుభవార్త మొదట తెలిసింది సామాన్యులకే. ఊరి వెలుపల పొలంలో గొర్రెలను కాచుకుంటున్న పశు కాపరుల వద్దకు ప్రభువు దూత వచ్చి వారి మధ్య నిలచినప్పుడు ప్రభువు మహిమ వారిచుట్టూ ప్రకాశించగా వారెంతో భయపడ్డారు. అందుకు దూత 'భయపడకుడి ప్రజలందరికీ కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము మీకు తీసుకు వచ్చాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు' అంటూ శిశువు ఆనవాలు తెలియజేయడం జరిగింది. అప్పుడు పరలోకం నుంచి వచ్చిన దేవదూతల సమూహం 'సర్వోన్నతమైన స్థలములో దేవునికి మహిమ ఆయనకు ఇష్టులైన వారికి భూమి మీద సమాధానం కలుగునుగాక' అంటూ దేవుని స్తుతిస్తూ పాటలు పాడారు.

యేసు పుట్టుక కేవలం యూదా ప్రాంతానికే పరిమితం కాలేదు. యేసుక్రీస్తు జన్మవిశేషం తెలియజేస్తూ ఆకాశంలో ఓ వింత తార వెలిసింది. దాన్ని చూసిన ముగ్గురు తూర్పు దేశపు జ్ఞానులు యూదుల రోజును వెతుక్కుంటూ యెరూషలేము చేరుకున్నారు. తుదకు బెత్లెహేము లో పుట్టాడని తెలుసుకొని శిశువును పూజించి తాము తెచ్చిన బంగారం, సాంబ్రాణి, బోళం కానుకలను సమర్పించి అత్యానందభరితులై తిరిగి వెళ్లారు. ఈ విధంగా యేసు పుట్టుక ఒక విశ్వ వేడుకగా మారింది.

> **సంతోషం... సమాధానం తెచ్చిన క్రిస్మస్**
>
> యేసుక్రీస్తు పుట్టుకే మానవాళికి గొప్ప శుభ వార్త. క్రీస్తు పుట్టుక సమయంలో కురేనియ. సిరియా దేశమునకు అధిపతి అయిన కైసరు ఔగుస్తు మొదటి ప్రజాసంఖ్య ప్రకటించాడు. ఇలాంటి ఎన్నో చారిత్రాత్మక అంశాలతో తెలియ చేయబడిన క్రీస్తు జననం ఒక కల్పిత కథ కాదు ఒక చారిత్రాత్మక సత్యం. ఆయన కారణ జన్ముడు. చారిత్రాత్మక పురుషుడు. క్రీస్తుకు ముందు... క్రీస్తు తర్వాతగా కాలం రెండుగా విభజింపబడటయే ఇందుకు ఓ గొప్ప ఉదాహరణ.

రక్షణ తెచ్చిన క్రిస్మస్

యేసు పుట్టుక సర్వమానవాళికి రక్షణ అందించిది. యేసు పుట్టుక పరమార్థమే అది.

పాప పంకిలమైన మానవ జాతిని రక్షించడానికే యేసు జన్మించాడు. దేవుని ఆజ్ఞ మీరడం ద్వారా దేవుడు సృజించిన తొలి మానవుడు ఆదాము, అతని భార్య హవ్వ ఈ లోకానికి పాపాన్ని శాపాన్ని తీసుకు వచ్చారు. ఆ పాపానికి ప్రతిఫలంగా నర జాతి మొత్తానికి మరణం సంప్రాప్తించింది. అయితే ఆ శాపాన్ని పాపాన్ని కొట్టివేసి తద్వారా వచ్చిన మరణభయాన్ని తొలగించేందుకు క్రీస్తు అందించిన శిలువ యాగం ద్వారా రక్షణ పొంది నిత్యజీవానికి వారసులై సదా కాలం క్రీస్తుతో నివసించే భాగ్యాన్ని క్రిస్మస్ మనకు అందించింది.

క్రిస్మస్ ద్వారా రక్షకుడు ఈ లోకానికి వచ్చి ప్రజలందరి రక్షణార్థం పాపపరిహారార్థ బలిగా శిలువపై తనను తాను సమర్పించుకున్నాడు. యేసు శిలువలో కార్చిన రక్తం ద్వారా పాప విమోచన. యేసు రక్తం ప్రతి పాపం నుండి మనలను పవిత్రులుగా చేస్తుంది. మానవుడు దేవునితో పరలోకంలో ఉండే భాగ్యం అందించడానికి దేవుడు మానవుడిగా అవతరించాల్సి వచ్చింది. అందుకు క్రీస్తు పుట్టుక వేదికగా మారింది. అప్పుడు ఈ ధరిత్రి మీద మానవునిగా జన్మించిన యేసు ఇప్పుడూ నీవు ఆహ్వానిస్తే నీ హృదిలో ఆత్మరూపుడై వసించడానికి సిద్ధంగా ఉన్నాడు. నీలో నిత్యసంతోషం నింపుతాడు.

అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు.

– బందెల స్టెర్జి రాజన్
సీనియర్ పాత్రికేయులు

ఆర్ట్ అండ్ కల్చర్



కాలానుగుణంగా కోలాటం

'చీరలంటే చీరలు... చీరల మీద చిలకలు/ రైకలంటే రైకలు... రైకల మీద రంగులు'

'జానపదమైనా సరే-

'అబ్బబ్బా దేవుడూ... అయోధ్య రాముడు సీతమ్మ నాథుడు... శ్రీరామచంద్రుడు'... ఇలా ఆధాత్మికమైనా సరే– ఈ జనరేషన్ ఆ జనరేషన్ అనే తేడా లేకుండా ఆబాలగోపాలం కోలాటం సంబరాల సందడిలో ఉత్సాహ తరంగమై ఎగరాల్సిందే.

తెలుగు వారి సాంస్కృతిక చిరునామాలలో ఒకటి... కోలాటం. కళ అనేది పుస్తకాల్లో కాదు ప్రజల మధ్య, ప్రజలతో ఉంటేనే నిత్యనూతనంగా వెలిగిపోతుంది. ఈ ఎరుకతో కోలాటానికి పూర్వ వైభవం తేవడానికి ముందుకు కదిలారు ప్రొద్దుటూరు మహిళలు.

కడప జిల్లా ప్రొద్దుటూరులోని మహిళలు కోలాట నృత్యానికి కొత్త హంగులను జోడించి ఆ కళకు మరింత ఆదరణ వచ్చేలా కృషి చేస్తున్నారు. బండి మల్లిక ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మాస్టర్ సాయి భరత్ దగ్గర కోలాటంలో శిక్షణ తీసుకుంది. తనలాగే శిక్షణ తీసుకున్న దాదాపు నాలుగు వందలమందితో 'సావిత్రి బాయి పూలే అభ్యుదయ మహిళా కోలాట బృందం' ఏర్పాటు చేసింది.

అందరినీ ఒకే తాటి పైకి...

కోలాటం సంప్రదాయ స్ఫూర్తిని పదిలంగా కాపాడేలా పూలమాలలు, లెజిన్స్, భజన తాళాలు... మొదలైన వాటితో అన్నమాచార్య కీర్తనలతో నృత్యప్రదర్శనలు చేస్తూ కోలాటానికి కొత్త శోభను తీసుకువస్తున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో కోలాటం నేర్చుకున్న వారు ఎవరికి వారు బృందాలుగా వుండడంతో వారందరినీ ఒకేతాటిపై తీసుకువచ్చి కొత్తగా ఏదైనా సాధించాలనే ఆలోచన మల్లికకు వచ్చింది.

వండర్స్ బుక్ ఆఫ్ రికార్డ్‌లోకి దశావతార కోలాటం

పశ్చిమ గోదావరి జిల్లాలోని ద్వారకాతిరుమల క్షేత్రంలో 222 మంది మహిళలు కోలాటంతో దశావతార జానపద నృత్య ప్రదర్శన చేశారు. 'గోవిందుడేలరాడే.. గోపాలుడేలరాడే.. మా అయ్య ఏల రాడే..' అనే పాటతో ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శన తో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ 'వండర్స్ బుక్ ఆఫ్ రికార్డ్'లో చోటు సాధించారు.

కాలంతో పాటు ప్రవహించాలి...

ప్రొద్దుటూరుకు మాత్రమే పరిమితం కాకుండా హైదరాబాద్, తిరుచానూరు, శ్రీకాళహస్తి, ఒంటిమిట్ట, అరుణాచలంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో, తిరుమల తిరుపతి ఆలయాల బ్రహ్మోత్సవాలలో తమ కోలాటంతో కనుల పండగ చేస్తున్నారు బృందం సభ్యులు.

'కాలేజీలో పనిచేస్తూనే సాయంత్రం వేళల్లో, సెలవుల్లో కోలాటం నేర్చుకున్నాను. శారీరక, మానసిక ఉల్లాసానికి ఉపకరించే కళ ఇది. ప్రాచీన జానపద కళలకు జీవం పోయాలనే లక్ష్యంతో కోలాటం ఆడుతున్నాం. ఈ కళ నిలువ నీరులా ఉండకూడదు. కాలంతోపాటు ప్రవహించాలి. ప్రతి తరం సొంతం చేసుకోవాలి' అంటుంది 'గౌతమి ఇంజినీరింగ్ కాలేజీ'లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న భూమి రెడ్డి నాగమణి.

– మోపూరు బాలకృష్ణారెడ్డి
సాక్షి ప్రతినిధి, కడప
ఫొటోలు: షేక్ మహబూబ్ బాషా, ప్రొద్దుటూరు.

> **ఇక అయోధ్య రాముడి దగ్గరికి...**
>
> 'దశావతారం' కోలాట నృత్య ప్రదర్శనకు ప్రత్యేక గుర్తింపు లభించడం సంతోషంగా ఉంది. ప్రదర్శనల కోసం ఎవరి దగ్గరా డబ్బు తీసుకోకుండా సొంత ఖర్చులతో దేవస్థానాలలో ప్రదర్శనలు చేస్తున్నాం. బయట ఎక్కడా ప్రదర్శనలు చేయం. అయోధ్యలో కోలాటం ప్రదర్శన చేయడానికి అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాం. ఈ తరం పిల్లలు కూడా కోలాటానికి దగ్గర కావాలి. ఏ కళా దానికి అదే దూరం కాదు. సంప్రదాయ కళలకు చేరువ కావడం అనేది మన మీదే ఆధారపడి ఉంటుంది. ఒక్కరిద్దరు కాకుండా కళాకారులందరూ ఐక్యంగా కృషి చేస్తే ఎంత అద్భుతం సృష్టించవచ్చో నిరూపించాం.
>
> – బండి మల్లిక



> **అరుణాచల కొండల్లో... అలుపెరగని కోలాటం**
>
> బండి మల్లిక నేతృత్వంలో తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణ సందర్భంగా 'సావిత్రి బాయి పూలే కోలాట బృందం'లోని 111 మంది మహిళా కళాకారులు 14 కిలోమీటర్లు కోలాటాన్ని ప్రదర్శించారు. కోలాట కర్రలతో అన్నమయ్య, శివనామస్మరణ కీర్తనలకు లయబద్ధంగా నృత్యం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు మొదలైన కోలాట నృత్యం మరుసటి రోజు ఉదయం 3.40 గంటల వరకు కొనసాగింది. ఏకధాటిగా తొమ్మిది గంటల పాటు గిరి నృత్య ప్రదక్షిణలో అలసిపోకుండా కోలాటం పూర్తి చేసిన వీరి ప్రతిభ ఉత్తర అమెరికాలోని 'తానా బుక్ ఆఫ్ రికార్డు'లో నమోదైంది. 'భారత్ టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' లోనూ చోటు సాధించారు.

2024 ఉమెన్ పవర్

సిల్వర్ క్వీన్స్

ఓటీటీ, థియేటర్ రిలీజెస్... ఈ రెండింటిలోనూ నటీమణులకు సంబంధించి అద్భుతమైన నటనకు చెప్పుకోదగ్గ సంవత్సరంగా 2024 నిలుస్తుంది. వారి నట ప్రతిభకు మాత్రమే కాకుండా భారతీయ సినిమా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలోని వైవిధ్యానికి, అద్భుత కథాకథనాలను హైలైట్ చేసిన సంవత్సరంగా కూడా 2024 గురించి చెప్పవచ్చు...

టాప్ టెన్‌లో ఒకటి... దో పట్టీ

గ్లామర్ పాత్రలు మాత్రమే కాదు నటనకు సవాలు విసిరే పాత్రలలో కూడా మెప్పించగలనని నిరూపించింది కృతీసనన్. సంక్లిష్టమైన సంబంధాలు, గృహహింసను ప్రతిబింబించే గ్రిప్పింగ్ డ్రామా 'దో పట్టీ'లో సౌమ్య, శైలిగా ద్విపాత్రాభినయం చేసింది. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను దృఢసంకల్పంతో ఎదుర్కొనే మహిళగా తన నటనతో ప్రేక్షకుల మన్ననలు పొందింది. పాత్రలలో భావోద్వేగాన్ని పండించడంలో కృతీసనన్ తనదైన నటనను ప్రదర్శించింది.

నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన 'దో పట్టీ' ప్రపంచవ్యాప్తంగా నాన్-ఇంగ్లీష్ సినిమాల టాప్-టెన్ జాబితాలో ఒకటిగా నిలిచింది.



నవ్వుతూనే భయపడేలా... భయపడుతూనే నవ్వేలా!

చాలా తక్కువ స్క్రీన్ టైమ్‌తో, ఆకట్టుకునే ట్విస్ట్‌లతో 'స్త్రీ-2'లో మెప్పించింది శ్రద్ధాకపూర్. హాస్యం, హారర్‌ను మేళవించిన ఆమె నటన అదుర్స్ అనిపించింది. ఫ్రెష్ లుక్‌తో, చక్కని టైమింగ్‌తో ఆకట్టుకుంది. 'సీక్వెల్ కోసం చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది కత్తిమీద సాములాంటిది. ఎంటర్‌టైనింగ్ డైలాగులు ఉన్న'స్త్రీ-2'లో అద్భుతమైన నటీనటులు ఉన్నారు' అంటుంది శ్రద్ధా కపూర్.



అయితే ఆ అద్భుతమైన నటీనటులలో అందరి కంటే శ్రద్ధాకపూర్ ఎక్కువ మార్కులు తెచ్చుకుంది. 'స్త్రీ-2' విజయంతో ఇప్పుడు 'స్త్రీ-3'కు ఉత్సాహంగా రెడీ అవుతోంది.

16 కిలోల బరువు పెరిగింది!

ప్రముఖ పంజాబీ గాయకుడు అమర్‌సింగ్ చమ్కీల జీవితం ఆధారంగా తెరకెక్కిన 'అమర్ సింగ్ చమ్కీల' అనే బయోగ్రఫీ డ్రామాలో పరిణీతి చోప్రా పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో ప్రశంసలు అందుకుంది. ప్రతి సన్నివేశంలో పాత్ర పట్ల అంకితభావం కనిపిస్తుంది. ఈ సినిమా కోసం పరిణీతి చోప్రా ఏకంగా 16 కిలోల బరువు పెరిగింది!

'చమ్కీల' సినిమాలో అమర్ జోత్ కౌర్ పాత్రలో చోప్రాకు నటించే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ ఇంతియాజ్ అలీ షూటింగ్‌కు ముందు... 'కానీ మీరు ఆమెలా కనిపించడం లేదు' అన్నాడు. అంతే.. బరువు పెరగడంపై దృష్టి పెట్టింది పరిణీతి చోప్రా. వర్కవుట్స్ చేస్తూ ఫిట్‌గా ఉన్న అమ్మాయి కాస్తా పాత్ర కోసం ఎడాపెడా తినేసి బరువు పెరిగింది.



పరిణీతి చోప్రా ఉత్తమ నటన గురించి చెప్పుకునే చిత్రాలలో 'చమ్కీల' అగ్రస్థానంలో నిలుస్తుంది.

> **భయపడింది... భయపెట్టింది!**
>
> 'భూల్ భులైయా 3' ఫ్రాంచైజీతో మంజులికగా మెరిసింది విద్యాబాలన్. మంత్రముగ్ధులను చేసే నటనతో ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. 'అమీ జే తోమర్' పాటకు మాధురీ దీక్షిత్ కలిసి చేసిన డ్యాన్స్ 'వావ్' అనిపించింది. 'భూల్ భులైయా 2'లో నటించడానికి 'సారీ' చెప్పింది విద్యాబాలన్. 'భూల్ భులైయా నాకు బాగా నచ్చిన సినిమా. నేను బాగా నటించగలనా అనే సందేహం. రిస్క్ తీసుకోకూడదు అనుకోవడం వల్లే నో చెప్పాల్సి వచ్చింది' అంటుంది విద్య. అయితే 'భూల్ భులైయా 3' కోసం మరోసారి తన దగ్గరకు వచ్చినప్పుడు మాత్రం నో చెప్పలేకపోయింది. స్క్రిప్ట్ బాగా నచ్చడమే కారణం. 'ఈ సినిమాలో నేను నటించాల్సిందే' అని డిసైడైపోయిన విద్యాబాలన్ తన నటనతో 'భూల్ భులైయా 3'ని మరో స్థాయికి తీసుకువెళ్లింది.



వెరీ స్ట్రాంగ్ ఉమెన్



సంప్రదాయ మహారాష్ట్ర మహిళగా 'సర్ఫిరా'లో రాధిక మదన్ అద్భుత నటన ప్రదర్శించింది. ప్రేమను పంచే భార్యగా, బలమైన వ్యక్తిత్వం, తిరగబడే శక్తి ఉన్న మహిళగా ఆమె పాత్ర ఆకట్టుకుంది.

విభిన్నమైన పాత్రలు పోషించడం రాధికకు కొత్త కాకపోయినా 'సర్ఫిరా'లో పాత్ర స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రామాణికమైన నటనతో ఆకట్టుకుంది. విమర్శకుల ప్రశంసలతో పాటు ఎంతోమంది అభిమానులను సంపాదించింది.

'మరాఠీ భాష, యాసపై రాధికకు ఉన్న పట్టు ఈ సినిమాలో హైలైట్.

'కంటెంట్ డ్రివెన్ స్క్రిప్ట్‌లు ఎంచుకోవడంలో ముందు ఉంటుంది' అని తన గురించి వినిపించే మాటను మరోసారి నిజం అని నిరూపించింది రాధికా మదన్.

మాటలు కాదు... మాస్టర్ క్లాస్

ఈ హసీన్ దిల్రుబా (2021)కి సీక్వెల్‌గా వచ్చిన 'ఫిర్ ఆయి హసీన్ దిల్రుబా'లో తాప్సీ పన్ను మరో సారి తన బహుముఖ ప్రజ్ఞను చాటుకుంది. రొమాన్స్, సస్పెన్స్, డ్రామాలను బ్యాలెన్స్ చేయడంలో తన నటనతో మాస్టర్ క్లాస్ అనిపించుకుంది. కుట్రల ఉచ్చులో చిక్కుకుపోయే 'రాణి కాశ్యప్' పాత్రను పోషించి చిరస్మరణీయమైన నటనను ప్రదర్శించింది. ఎంతో సంక్లిష్టమైన పాత్రను కూడా అవలీలగా పోషించింది.

'లవ్ అంటే పిచ్చి కాదు' అంటున్న తాప్సీ ప్రేమ చుట్టూ ఉండే నమ్మకం నుంచి త్యాగం వరకు ఎన్నో అంశాలను ప్రతిఫలించే పాత్రలో నటించి మెప్పించింది.



'రాణి పాత్రను పోషించినందుకు గర్వంగా ఉంది. నా క్యారెక్టర్ ద్వారా ఓపెన్ మైండ్‌తో ఉన్నప్పుడే ప్రతికూల పరిస్థితులతో పోరాడగలమని చెప్పాను' అంటున్న తాప్సీ పన్ను సీక్వెల్‌లో లోతైన భావోద్వేగాలను ప్రదర్శించి మొదటి భాగంతో పోల్చితే ఎక్కువ మార్కులు తెచ్చుకుంది.

హర్లీన్ సెంచరీ... భారత్‌దే విక్టరీ


హర్లీన్ డియోల్


హేలీ మాథ్యూస్

- రెండో వన్డేలో వెస్టిండీస్‌పై 115 పరుగులతో ఘనవిజయం
- రాణించిన ప్రతీక, స్మృతి మంధాన, జెమీమా
- సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకున్న టీమిండియా
- హేలీ మాథ్యూస్ శతకం వృథా

వడోదర: బ్యాటర్లు సమష్టిగా పరుగుల వరద పారించడంతో... భారత మహిళల క్రికెట్ జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే వెస్టిండీస్‌పై వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన రెండో వన్డేలో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 115 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై ఘనవిజయం సాధించింది. టాపార్డర్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్లీన్ డియోల్ (103 బంతుల్లో 115; 16 ఫోర్లు) కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... జోరుమీదున్న ఓపెనర్ స్మృతి మంధాన (53; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), మరో ఓపెనర్ ప్రతీక రావల్ (76; 10 ఫోర్లు, 1 సిక్స్), మిడిలార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్ (36 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 358 పరుగుల భారీస్కోరు చేసింది. తద్వారా వన్డేల్లో భారత్ తమ అత్యధిక స్కోరును సమం చేసింది. 2017లో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ భారత జట్టు 358 పరుగులు సాధించింది. అంతేకాకుండా వన్డేల్లో విండీస్‌పై అత్యధిక స్కోరు నమోదు చేసిన జట్టుగా భారత్ నిలిచింది.

359 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 46.2 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఓపెనర్, కెప్టెన్ హేలీ మాథ్యూస్ (109 బంతుల్లో 106; 13 ఫోర్లు) శతకం సాధించింది. భారత బౌలర్లలో ప్రియా మిశ్రా 3, దీప్తి శర్మ, టిటాస్, ప్రతీక తలా 2 వికెట్లు తీశారు. మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-0తో చేజిక్కించుకోగా... ఇక్కడే 27న ఆఖరి పోరు జరుగుతుంది.

శతక్కొట్టిన హర్లీన్

ఓపెనర్లు స్మృతి, ప్రతీక విండీస్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొని చకచకా పరుగులు రాబట్టారు. దీంతో 15.2 ఓవర్లలోనే జట్టు స్కోరు వందకు చేరింది. మంధాన 44 బంతుల్లో, ప్రతీక 58 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తిచేసుకున్నారు. విండీస్‌పై స్మృతికిది వరుసగా ఐదో అర్ధశతకం కావడం విశేషం. తొలివికెట్‌కు 110 పరుగులు జోడించాక మంధాన అవుటైంది. తర్వాత వచ్చిన హర్లీన్‌తో రెండో వికెట్‌కు 62 పరుగులు జతచేశాక ప్రతీక నిష్క్రమించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (22) నిరాశ పరచగా, జెమీమా క్రీజులోకి వచ్చాక స్కోరు వేగం పుంజుకుంది. కెరీర్‌లో 15వ వన్డే ఆడుతున్న హర్లీన్ 98 బంతుల్లో తొలి సెంచరీ సాధించగా, జెమీమా 34 బంతుల్లో అర్ధశతకాన్ని బాదింది. 46వ ఓవర్లోనే జట్టు స్కోరు 300 దాటింది. ఈ క్రమంలో వీళ్లిద్దరు నాలుగో వికెట్‌కు 116 పరుగులు జతచేశారు.

కెప్టెన్ ఒంటరి పోరాటం

పెద్ద లక్ష్యాన్ని కరిగించేందుకు దిగిన కరీబియన్ అమ్మాయిలకు ఆరో ఓవర్‌నుంచే కష్టాలు మొదలయ్యాయి. క్వియానా (15), నెరిస్సా (13), రషద (0) స్వల్ప వ్యవధిలో నిష్క్రమించడంతో 10.4 ఓవర్లో 40 పరుగులకే 3 వికెట్లను కోల్పోయింది. మరోవైపు కెప్టెన్ హేలీ సహచరుల నుంచి సహకారం కరువైనా ఒంటరిపోరాటం చేసింది. డియాండ్రా (10), ఆలియా (0) విఫలమవగా, షెమైన్ క్యాంప్‌బెల్ (38; 5 ఫోర్లు), జైదా జేమ్స్ (25; 3 ఫోర్లు) అండతో హేలీ 99 బంతుల్లో సెంచరీ సాధించింది. 199 జట్టు స్కోరు వద్ద ఆమె నిష్క్రమించాక మిగతా 3 వికెట్లు 44 పరుగుల వ్యవధిలో కూలాయి.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: స్మృతి మంధాన (రనౌట్) 53; ప్రతీక (సి) క్వియానా (బి) జైదా జేమ్స్ 76; హర్లీన్ (సి) ఆలియా (బి) క్వియానా 115; హర్మన్‌ప్రీత్ (బి) అఫీ ఫ్లెచర్ 22; జెమీమా (సి) హేలీ మాథ్యూస్ (బి) డియాండ్రా 52; రిచా ఘోష్ (నాటౌట్) 13; దీప్తి శర్మ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 358. వికెట్ల పతనం:** 1-110, 2-172, 3-215, 4-331, 5-341. **బౌలింగ్:** డియాండ్రా 7-0-53-1, షమిలియా 4-0-36-0, హేలీ మాథ్యూస్ 10-0-60-0, ఆలియా అలెన్ 4-0-39-0, కరిష్మా 10-0-46-0, అఫీ ఫ్లెచర్ 6-0-38-1, జైదా జేమ్స్ 7-0-57-1, క్వియాన జోసెఫ్ 2-0-27-1. **వెస్టిండీస్ ఇన్నింగ్స్:** హేలీ మాథ్యూస్ (సి) జెమీమా (బి) ప్రతీక 106; క్వియానా (సి) ప్రతీక (బి) దీప్తిశర్మ 15; నెరిస్సా (సి అండ్ బి) టిటాస్ 13; రషద విలియమ్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రియా మిశ్రా 0; డియాండ్రా (బి) రేణుక 10; షెమైన్ (సి) స్మృతి (బి) టిటాస్ 38; ఆలియా (సి) సబ్-మిన్ను మణి (బి) దీప్తి శర్మ 0; జైదా జేమ్స్ (సి) ప్రతీక (బి) ప్రియా 25; అఫీ (సి) స్మృతి (బి) ప్రతీక 22; కరిష్మా (సి) హర్లీన్ (బి) ప్రియా 3; షమిలియా (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (46.2 ఓవర్లలో ఆలౌట్) 243. వికెట్ల పతనం** : 1-20, 2-36, 3-40, 4-69, 5-181, 6-182, 7-199, 8-227, 9-237, 10-243. **బౌలింగ్:** రేణుక 9-2-41-1, దీప్తి శర్మ 9-1-40-2, టిటాస్ సాధు 10-0-42-2, ప్రియా మిశ్రా 9.2-0-49-3, సైమా ఠాకూర్ 4-0-33-0, ప్రతీక 5-0-37-2.

దుబాయ్‌లో భారత్ మ్యాచ్‌లు

- చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్‌ను విడుదల చేసిన ఐసీసీ
- ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు టోర్నీ
- ఫిబ్రవరి 23న పాకిస్తాన్‌తో భారత్ మ్యాచ్



దుబాయ్: క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదలైంది. 8 దేశాలు పాల్గొంటున్న ఈ టోర్నీకి పాకిస్తాన్ ఆతిథ్యమిస్తుండగా... ఆ దేశంలో పర్యటించేందుకు భారత జట్టు అంగీకరించకపోవడంతో... టీమిండియా ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదిక దుబాయ్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. 19 రోజుల పాటు సాగనున్న ఈ టోర్నీలో 15 మ్యాచ్‌లు జరగనున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు ఈ టోర్నీ జరుగుతుంది.

- చివరిసారిగా 2017లో చాంపియన్స్ ట్రోఫీ నిర్వహించగా... పాకిస్తాన్ జట్టు విజేతగా నిలిచింది. ఐసీసీ టోర్నీకి పాకిస్తాన్ ఆతిథ్యమివ్వనుండటం 1996 తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం.
- గ్రూప్ 'ఎ'లో భాగంగా పాకిస్తాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌తో కలిసి భారత్ బరిలోకి దిగనుంది. గ్రూప్ 'బి' నుంచి ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా పోటీ పడుతున్నాయి.
- పాకిస్తాన్‌లోని లాహోర్, కరాచీ, రావల్పిండితో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ స్టేడియంలో మ్యాచ్‌లు జరగనున్నాయి.
- ఫిబ్రవరి 19న ఆతిథ్య పాకిస్తాన్, న్యూజిలాండ్ మధ్య పోరుతో చాంపియన్స్ ట్రోఫీకి తెరలేవనుంది. ఫిబ్రవరి 23న చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జరగనుంది. మార్చి 4న తొలి సెమీఫైనల్ దుబాయ్‌లో, 5న రెండో సెమీఫైనల్ లాహోర్‌లో జరగనున్నాయి. మార్చి 9న జరగనున్న ఫైనల్ వేదికను ఖరారు చేయలేదు. భారత జట్టు తుదిపోరుకు అర్హత సాధిస్తే దుబాయ్‌లో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. లేదంటే ఫైనల్‌కు లాహోర్ ఆతిథ్యమివ్వనుంది. రెండు సెమీఫైనల్స్‌తో పాటు తుదిపోరుకు రిజర్వ్ డేలను కేటాయించారు.
- ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్ పోరుతో టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ వేట ప్రారంభించనుంది. ఆ తర్వాత వరుసగా పాకిస్తాన్‌తో (ఫిబ్రవరి 23న), న్యూజిలాండ్‌తో (మార్చి 2న) ఆడనుంది. రెండు గ్రూప్‌ల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.
- ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ జరగగా... అందులో భారత్ (2002, 2013), ఆస్ట్రేలియా (2006, 2009) రెండేసి సార్లు విజేతగా నిలిచాయి. 1998లో తొలిసారి ఐసీసీ నాకౌట్ ట్రోఫీ పేరుతో నిర్వహించిన ఈ టోర్నీలో దక్షిణాఫ్రికా విజయం సాధించగా... న్యూజిలాండ్ (2000), వెస్టిండీస్ (2004), పాకిస్తాన్ (2017) ఒక్కోసారి ట్రోఫీ చేజిక్కించుకున్నాయి.

చాంపియన్స్ ట్రోఫీ-2025 షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక
ఫిబ్రవరి 19	పాక్ X న్యూజిలాండ్	కరాచీ
ఫిబ్రవరి 20	బంగ్లాదేశ్ X భారత్	దుబాయ్
ఫిబ్రవరి 21	అఫ్గానిస్తాన్ X దక్షిణాఫ్రికా	కరాచీ
ఫిబ్రవరి 22	ఆస్ట్రేలియా X ఇంగ్లండ్	లాహోర్
ఫిబ్రవరి 23	పాకిస్తాన్ X భారత్	దుబాయ్
ఫిబ్రవరి 24	బంగ్లాదేశ్ X న్యూజిలాండ్	రావల్పిండి
ఫిబ్రవరి 25	ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా	రావల్పిండి
ఫిబ్రవరి 26	అఫ్గానిస్తాన్ X ఇంగ్లండ్	లాహోర్
ఫిబ్రవరి 27	పాకిస్తాన్ X బంగ్లాదేశ్	రావల్పిండి
ఫిబ్రవరి 28	అఫ్గానిస్తాన్ X ఆస్ట్రేలియా	లాహోర్
మార్చి 1	దక్షిణాఫ్రికా X ఇంగ్లండ్	కరాచీ
మార్చి 2	న్యూజిలాండ్ X భారత్	దుబాయ్
మార్చి 4	తొలి సెమీఫైనల్	దుబాయ్
మార్చి 5	రెండో సెమీఫైనల్	లాహోర్
మార్చి 9	ఫైనల్	లాహోర్

నోట్: మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం గం.2:30 నుంచి ప్రసారమవుతాయి. భారత జట్టు ఫైనల్ చేరితే దుబాయ్‌లో నిర్వహిస్తారు.

అండర్-19 టి20 ప్రపంచకప్ భారత జట్టులో త్రిష, ధృతి, షబ్నమ్

న్యూఢిల్లీ: వచ్చే నెలలో మలేసియాలో జరిగే అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో ముగ్గురు తెలుగు అమ్మాయిలు గొంగడి త్రిష, కేసరి ధృతి (తెలంగాణ), షబ్నమ్ (ఆంధ్రప్రదేశ్) చోటు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఈ మెగా టోర్నీ జరుగుతుంది. భారత జట్టుకు నిక్కీ ప్రసాద్ కెప్టెన్‌గా, సనికా చాల్కె వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. 2023లో తొలిసారి నిర్వహించిన మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్‌లో షఫాలీ వర్మ సారథ్యంలో భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. త్రిష, షబ్నమ్ నాటి విజేత జట్టులో సభ్యులుగా ఉన్నారు. త్రిష, షబ్నమ్‌లకిది రెండో టి20 ప్రపంచకప్ కానుంది. గత ఆదివారం కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియా కప్ అండర్-19 టి20 టోర్నీలో భారత జట్టుకు టైటిల్ దక్కడంలో త్రిష కీలకపాత్ర పోషించింది. త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్'తోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు గెల్చుకుంది. టి20 ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు నాలుగు గ్రూప్‌లుగా పోటీ పడనున్నాయి. ఆతిథ్య మలేసియా, వెస్టిండీస్, శ్రీలంకతో కలిసి భారత జట్టు గ్రూప్ 'ఎ' నుంచి బరిలోకి దిగనుంది. తమ తొలి మ్యాచ్‌లో భాతర అమ్మాయిల జట్టు జనవరి 19న వెస్టిండీస్‌తో, 21న మలేసియాతో, 23న శ్రీలంకతో తలపడుతుంది. గ్రూప్ దశ ముగిశాక పాయింట్ల పట్టికలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధిస్తాయి. 'సూపర్ సిక్స్'ను రెండు గ్రూప్‌లుగా విభజిస్తారు. ఇందులో మెరుగైన ప్రదర్శన కనబర్చిన నాలుగు జట్లు సెమీఫైనల్‌కు చేరతాయి.

భారత టి20 జట్టు: నిక్కీ ప్రసాద్ (కెప్టెన్), సనికా చాల్కె (వైస్ కెప్టెన్), గొంగడి త్రిష, కమిలిని, భవిక అహిరె, ఈశ్వరి అవసారె, మిథిల, వీజే జోషిత, సోనమ్ యాదవ్, పరుణిక సిసోడియా, కేసరి ధృతి, ఆయూషి శుక్లా, అనందిత, షబ్నమ్, వైష్ణవి.


త్రిష


షబ్నమ్


ధృతి

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

పిల్లలకు... పెద్దలకు నచ్చే సినిమా ఇది

- మోహన్ లాల్


వై. రవిశంకర్, ముఖేష్ మెహతా, మోహన్ లాల్

''బరోజ్ 3డీ' చిల్డ్రన్స్ ఫ్రెండ్లీ ఫిల్మ్. పిల్లలు, పెద్దలందరూ చూడాల్సిన సినిమా. చాలా ప్రేమతో తీశాం. మనలోని బాల్యాన్ని సెలబ్రేట్ చేసుకునే చిత్రమిది. ప్రపంచమంతా చూడదగ్గ కుటుంబ కథా చిత్రం'' అని మోహన్ లాల్ తెలిపారు. ఆయన టైటిల్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'బరోజ్ 3డీ'. ఆంటోని పెరుంబవూర్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేస్తున్నారు. మంగళవారం జరిగిన 'బరోజ్ 3డీ' ప్రీ రిలీజ్ వేడుకలో మోహన్ లాల్ మాట్లాడుతూ– ''మైత్రీ మూవీ మేకర్స్ తీసిన 'జనతా గ్యారేజ్' సినిమాలో నటించాను. 'బరోజ్ 3డీ' కథ వారికి నచ్చి, విడుదల చేస్తుండటం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత వై. రవిశంకర్ మాట్లాడుతూ– ''మోహన్ లాల్‌గారు 'బరోజ్ 3డీ'లోని కొన్ని సాంగ్స్ విజువల్స్ చూపించారు. మేం చిన్నప్పుడు చూసిన 'చిన్నారి చేతన' లాంటి త్రీడీ సినిమాలు గుర్తొచ్చాయి. 'బరోజ్' రియల్ త్రీడీ సినిమా. ఆడియన్స్‌కి అద్భుతమైన అనుభూతినిస్తుంది'' అన్నారు.


కల్యాణ్ కృష్ణ, బాబీ, అనన్య, రవితేజ మహాదాస్యం, వంశీ నందిపాటి

కథ చాలా కొత్తగా ఉంది

- బాబీ కొల్లి

''నేను, మోహన్ కలిసి రైటర్స్‌గా పని చేశాం. తను ఈ సినిమాని వినోదంతో పాటు సస్పెన్స్ థ్రిల్లింగ్ అంశాలతో తీశాడని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కథ చాలా కొత్తగా ఉంది. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అని డైరెక్టర్ బాబీ కొల్లి అన్నారు. 'వెన్నెల' కిశోర్ టైటిల్ రోల్‌లో, రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల జంటగా, శియా గౌతమ్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. లాస్యా రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణా రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ బాబీ కొల్లి, కల్యాణ్ కృష్ణ అతిథులుగా హాజరయ్యారు. ''ఈ సినిమా కంటెంట్‌ని బలంగా నమ్మాను. ఆ కథే నన్ను గెలిపిస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు వంశీ నందిపాటి. ''నా కెరీర్‌లో చాలా మంచి పేరు తీసుకొచ్చే సినిమా ఇది'' అని అనన్య నాగళ్ల పేర్కొన్నారు. ''నటుడిగా ఈ చిత్రం నాకు చాలా కీలకం'' అన్నారు రవితేజ మహాదాస్యం. ''ఈ మూవీతో కచ్చితంగా హిట్ సాధిస్తాం'' అని వెన్నపూస రమణారెడ్డి చెప్పారు.

గుర్తుండిపోతుంది


నాగవంశీ

''డాకు మహారాజ్' సినిమా బాగా వచ్చింది. ప్రేక్షకులు ఊహించినదానికంటే బ్రహ్మాండమైన యాక్షన్ సీన్స్ ఉంటాయి. అలాగే వినోదం, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. బాలకృష్ణగారి నుంచి ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి. మాస్, క్లాస్ అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఉంటుంది'' అని డైరెక్టర్ బాబీ కొల్లి చెప్పారు. బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందినీ చౌదరి హీరోయిన్లుగా నటించగా, బాబీ డియోల్ కీలక పాత్ర చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం జనవరి 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ –''బాలకృష్ణగారి కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా 'డాకు మహారాజ్' నిలుస్తుంది. జనవరి 2న హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల వేడుక, 4న అమెరికాలో ప్రీ రిలీజ్ వేడుక చేసి, ఒక పాట విడుదల చేయాలనుకుంటున్నాం. 8న ఏపీలో ప్రీ రిలీజ్ వేడుక ప్లాన్ చేస్తున్నాం'' అని తెలిపారు.

యూత్‌ను చెడగొట్టే సినిమా కాదు


ధర్మ

ధర్మ, ఐశ్వర్యా శర్మ జంటగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరీధర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ధర్మ మాట్లాడుతూ –''మా తాతగారు ఎగ్జిబిటర్. శోభన్‌బాబుగారు చేసిన 'పుణ్యదంపతులు' సినిమాకు మా నాన్నగారు కాకాణి బాబు ఓ నిర్మాతగా చేశారు. సినిమాలంటే ఆసక్తితో ఇండస్ట్రీకి వచ్చాను. తొలి సినిమాగా 'డ్రింకర్ సాయి' ఒప్పుకున్నా. కానీ తొలి చిత్రంగా 'సింధూరం' విడుదలైంది. ఇక 'డ్రింకర్ సాయి' కథ విషయానికొస్తే... సాయి అనే వ్యక్తి కథ ఇది. కమర్షియల్ హంగులతో లవ్‌స్టోరీ నేపథ్యంలో ఈ సినిమా తీశాం. యూత్‌ను చెడగొట్టే సినిమా కాదు... చెప్పాలంటే బాగు చేసే సినిమా'' అన్నారు.

కోర్టు డ్రామా...


వీర్ రెడ్డి

వీర్ రెడ్డి హీరోగా, దయానంద్ రెడ్డి, ఢిల్లీ గణేశన్, గిరిధర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లీగల్లీ వీర్'. రవి గోగుల దర్శకత్వంలో శాంతమ్మ మలికిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ 27న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వీర్ రెడ్డి మాట్లాడుతూ– ''నాకు సినిమా నేపథ్యం లేదు. ఓ మంచి సినిమా చేద్దామని 'లీగల్లీ వీర్' తీశాను. ఇంతవరకు మన వద్ద లీగల్ థ్రిల్లర్ సినిమాలు అంతగా రాలేదు. నేను లీగల్ లాయర్‌ను కావడంతో ఈ పాత్ర చేయడం సులభంగా అనిపించింది'' అన్నారు. ''రియల్ కోర్టు డ్రామా నేపథ్యంలో రూపొందిన చిత్రమిది'' అని రవి గోగుల చెప్పారు. ''న్యాయ వ్యవస్థ నేపథ్యంలో మంచి సినిమా తీసుకు వస్తున్నాం'' అన్నారు శాంతమ్మ. ''ఈ సినిమాని 70 థియేటర్లలో విడుదల చేస్తున్నాం'' అన్నారు డిస్ట్రిబ్యూటర్ విశ్వనాథ్ చౌదరి.

మెరిసే... మురిసే...

సిల్వర్ స్క్రీన్‌పై మెరుపులా మెరవడానికి మెరుపు తీగల్లాంటి కథానాయికలు జోరుగా హుషారుగా సినిమాలు చేస్తుంటారు. ఒకే ఏడాది మూడు ఆపై ఎక్కువసార్లు తెరపై మెరిసే చాన్స్ వస్తే వాళ్ల ఆనందం పట్టలేనంతగా ఉంటుంది. ఈ ఏడాది అలా మినిమమ్ మూడు చిత్రాలతో తెలుగులో మెరిసి, కెరీర్ బాగున్నందుకు మురిసిపోయిన కథానాయికల గురించి తెలుసుకుందాం.


మీనాక్షీ చౌదరి


అనన్య నాగళ్ల


కావ్యా థాపర్


నయన్ సారిక

2024లో తెలుగు తెర్పై మీనాక్షీ చౌదరి హవా కనిపించింది. మహేశ్‌బాబు 'గుంటూరు కారం', దుల్కర్ సల్మాన్ 'లక్కీ భాస్కర్', వరుణ్ తేజ్ 'మట్కా', విశ్వక్ సేన్ 'మెకానిక్ రాకీ' చిత్రాలతో మీనాక్షీ చౌదరి వెండితెర్పై కనిపించారు. అంతేనా... తమిళ హీరో విజయ్ 'గోట్: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' తెలుగులో అనువాదమై, ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోనూ ఓ లీడ్ రోల్ చేశారు మీనాక్షి. 'లక్కీ భాస్కర్, మట్కా, మెకానిక్ రాకీ' చిత్రాలు నెల రోజుల గ్యాప్‌లో విడుదల కావడం విశేషం. ఇక 'గుంటూరు కారం, లక్కీ భాస్కర్, మెకానిక్ రాకీ, గోట్' చిత్రాలు హిట్స్‌గా నిలిచాయి. మరోవైపు తెలుగు అమ్మాయి అనన్య నాగళ్ల ఈ ఏడాది మంచి జోరు కనబరిచారు. హారర్ మూవీ 'తంత్ర'లో లీడ్ రోల్ చేసి, రూరల్ యాక్షన్ ఫిల్మ్ 'పొట్టేల్'లో గృహిణిగా భావోద్వేగభరితమైన పాత్ర చేశారు. ప్రియదర్శి–నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటించిన 'డార్లింగ్'లోనూ డాక్టర్‌గా ఓ లీడ్ రోల్ చేశారీ బ్యూటీ. అలాగే నేడు విడుదలవుతోన్న 'శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్' చిత్రంలోనూ ఓ లీడ్ చేశారు. ఇలా అనన్య ఈ ఏడాది నాలుగుసార్లు ప్రేక్షకుల ముందుకు వచ్చినట్లవుతుంది. ఇక ముంబై బ్యూటీ కావ్యా థాపర్ కూడా తెలుగు ప్రేక్షకులను ఈ ఏడాది తరచూ పలకరిస్తూ వచ్చారు. రవితేజ 'ఈగిల్', సందీప్ కిషన్ 'ఊరు పేరు భైరవకోన, రామ్ 'డబుల్ ఇస్మార్ట్', గోపీచంద్ 'విశ్వం' చిత్రాల్లో కావ్యా థాపర్ కనిపించారు. ఓ మంచి కమర్షియల్ హీరోయిన్‌గా ఈ ఏడాది తెలుగు ఆడియన్స్‌ను అలరించారు కావ్యా థాపర్. మరోవైపు హీరోయిన్‌గా పరిచయమైన తొలి ఏడాదే మూడు సినిమాలతో సత్తా చాటారు యువ హీరోయిన్ నయన్ సారిక. ఆనంద్ దేవరకొండ 'గం గం గణేశా', నార్నే నితిన్ 'ఆయ్', కిరణ్ అబ్బవరం 'క' చిత్రాల్లో హీరోయిన్‌గా చేశారీ బ్యూటీ. నయన్ చేసిన ఈ మూడు చిత్రాలకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడం ఆమె కెరీర్‌కు బలం చేకూరినట్లయింది. ఇక హీరోయిన్‌గా కాదు కానీ... కథను ఇంపాక్ట్ చేసే పాత్రల్లో రుహానీ శర్మ కనిపించారు. వెంకటేశ్ 'సైంధవ్', వరుణ్ తేజ్ 'ఆపరేషన్ వాలెంటైన్', సుహాస్ 'శ్రీరంగనీతులు' చిత్రాల్లో రుహానీ మంచి పాత్రలు చేశారు. 'లవ్ మీ' చిత్రంలో ఓ చిన్న గెస్ట్ రోల్‌లో కూడా కనిపించారు రుహానీ. ఇలా ఈ ఏడాది తెలుగు ప్రేక్షకులను తరచూ పలకరించిన మరికొంతమంది హీరోయిన్లు ఉన్నారు.

విలన్‌గానూ విజృంభించారు

సిద్ధు జొన్నలగడ్డ 'డీజే టిల్లు స్క్వేర్'లో స్పై ఏజెంట్ లిల్లీ జోసెఫ్‌గా, రవితేజ 'ఈగిల్'లో జర్నలిస్ట్ నలినీ రావుగా కనిపించారు అనుపమా పరమేశ్వరన్. అయితే 'డీజే టిల్లు 2'లో కాస్త నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో అనుపమ నటించడం విశేషం. ఈ తరహాలోనే మరో హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ తొలిసారి నెగటివ్ షేడ్స్ ఉన్న అప్సర ఆలియాస్ మాయ పాత్రను విశ్వక్ సేన్ 'మెకానిక్ రాకీ' సిని మాలో చేశారు. ఈ బ్యూటీయే వెంకటేశ్ 'సైంధవ్'లో మనోజ్ఞ అనే సెంటిమెంట్ రోల్‌లో కనిపించడం విశేషం. మహేశ్ బాబు 'గుంటూరు కారం'లో హీరోయిన్‌గా చేసిన శ్రీలీల, అల్లు అర్జున్ 'పుష్ప: ది రూల్'లో స్పెషల్ సాంగ్ 'కిస్సిక్'లో మెరిశారు. ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది తెలుగులో రష్మిక కనిపించిన చిత్రం ఇదొక్కటే. విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్'తో మృణాల్ ఠాకూర్ ('కల్కి 2898 ఏడీ'లో ఓ గెస్ట్ రోల్ చేశారు), శర్వానంద్ 'మనమే'లో ఐటీ ఉద్యోగిగా కృతీ శెట్టి, ఫ్యామిలీ డ్రామా '35: చిన్న కథ కాదు'లో గృహిణి సరస్వతిగా నివేదా థామస్‌ల నుంచి ఈ ఏడాది ఒక్క చిత్రమే తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన అనుష్క, సమంత, సాయి పల్లవి, పూజా హెగ్డే, కీర్తీ సురేష్ వంటి హీరోయిన్లు ఇతర భాషల చిత్రాలతో బిజీగా ఉండటం వల్ల ఈ ఏడాది తెలుగులో కనిపించలేదు. ఇక ఈ ఏడాది దీపికా పదుకోన్, భాగ్యశ్రీ భోర్సే, రుక్మిణీ వసంత్... ఇలా దాదాపు 20మంది హీరోయిన్లు తెలుగుకు పరిచయం అయ్యారు.

– ముసిమి శివాంజనేయులు

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	67	78,473
నిఫ్టీ ▽	26	23,728

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	19,988	△ 223
డోజోన్స్	43,240	△ 333
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,137	△ 34
డాక్స్ (సోమవారం ముగింపు)	19,849	0
షాంఘై	3,394	△ 42
నికాయ్	39,037	▽ 124

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	75,874 ▽	70
బంగారం (99.5 స్వచ్ఛత)	75,570 ▽	70
వెండి (కేజీ)	87,511 △	23


ఫారెక్స్ రేట్లు రూ.లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసీఐఐ	84.70	85.72
£	బ్రిటన్ పౌండ్	ఎసీఐఐ	105.40	108.21
€	యూరో	ఎసీఐఐ	87.30	89.89
¥	జపాన్ ఎన్ (100)	ఎసీఐఐ	53.27	54.92
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎసీఐఐ	52.04	54.21
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.36	65.04
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.82	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.31	24.09
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.80	12.62

జారుడు బల్లపై రూపాయి

- సరికొత్త కనిష్టానికి పతనం
- 4 పైసలు క్షీణించి 85.15 వద్ద క్లోజ్

ముంబై: రూపాయి విలువ రెండో రోజూ జీవితకాల కనిష్టాన్ని తాకింది. డాలర్ మారకంలో 4 పైసలు బలహీనపడి 85.15 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో నెలకొన్న స్తబ్దత, ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ ఇండెక్స్ బలపడటం మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయి. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 85.10 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 10 పైసలు పతనమై 85.21 వద్ద సరికొత్త జీవితకాల కనిష్టాన్ని తాకింది. ''నెలాఖరు, సంవత్సరాంతం కావడంతో దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ ఎగసింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టిన తర్వాత భారీ సుంకాలు విధించవచ్చనే భయాలూ నెలకొన్నాయి. మరోవైపు ఫెడ్ కఠిన పాలసీ అంచనాలు, క్రూడాయిల్ ధరలు పుంజుకోవడం రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి' అని మిరే అసెట్స్ విశ్లేషకుడు అనుజ్ చౌదరి తెలిపారు. కాగా, ట్రంప్ విజయం తర్వాత నుంచి డాలరుతో రూపాయి విలువ 104 పైసలు క్షీణించడం గమనార్హం.





ఐపీవో బూమ్!

స్టాక్ మార్కెట్లో ఐపీఓలు దుమ్ముదులిపేస్తున్నాయి. సరిగ్గా మూడేళ్ల తర్వాత సరికొత్త రికార్డులతో కదం తొక్కుతున్నాయి. కేవలం లిస్టింగ్ మాత్రమే కాదు బంపర్ లాభాలతో ఇన్వెస్టర్లను రారమ్మని ఊరిస్తున్నాయి. ఈ ఏడాది (2024)లో మొత్తం 91 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను చేపట్టాయి. రూ. 1.6 లక్షల కోట్లకుపైగా సమీకరించాయి. ఇది సరికొత్త రికార్డ్ కాగా.. వీటిలో అధిక శాతం ఇష్యూలకు ఇన్వెస్టర్లు రికార్డ్‌స్థాయిలో క్యూకట్టారు. వెరసి 2021లో 63 కంపెనీలు సమకూర్చుకున్న రూ. 1.2 లక్షల కోట్ల రికార్డ్ బ్రేక్ అయింది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

2024లో సరికొత్త రికార్డ్

- మొత్తం 91 ఇష్యూలు
- రూ. 1.6 లక్షల కోట్ల సమీకరణ
- 2025లో మరింత దూకుడుకు చాన్స్

ప్రస్తుత క్యాలెండర్ ఏడాదిలో సెకండరీ మార్కెట్లు ఆటుపోట్లు చవిచూసినప్పటికీ ప్రధాన ఇండెక్సులు సరికొత్త గరిష్టాలను సాధించాయి. స్టాక్ మార్కెట్ చరిత్రలోనే సెన్సెక్స్ (బీఎస్ఈ) తొలిసారి సెప్టెంబర్ 27న 85,978 పాయింట్లకు చేరగా.. నిఫ్టీ (ఎన్ఎస్ఈ) 26,277ను తాకింది. ఈ బాటలో ఐపీవో మార్కెట్ మరింత కళకళలాడింది. ప్రధాన విభాగంలో ఏకంగా 91 కంపెనీలు లిస్టింగ్ బాటలో సాగాయి. తద్వారా మొత్తం రూ. 1,60,500 కోట్లు సమకూర్చుకున్నాయి. ఇందుకు ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి, కంపెనీల ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు, నగదు లభ్యత, భారీగా పెరిగిన రిటైల్ ఇన్వెస్టర్లు, వారి పెట్టుబడులు, లావాదేవీల సులభతర నిర్వహణకు వీలు తదితర అంశాలు తోడ్పాటునిచ్చాయి. దీంతో పలు ఐపీవోలకు గరిష్ట స్థాయిలో బిడ్డింగ్ లభించగా.. లిస్టింగ్ రోజు 64 కంపెనీలు లాభాలతో నిలిచాయి. 17 మాత్రమే నష్టాలతో ముగిశాయి.

భారీ ఇష్యూల తీరిలా...

2024లో కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ. 27,870 కోట్ల సమీకరణ ద్వారా దేశీ స్టాక్ మార్కెట్లో అతిపెద్ద ఐపీవోగా రికార్డులకెక్కింది. ఇదేవిధంగా ఫుడ్ అగ్రిగేటర్ యాప్ స్విగ్గీ రూ. 11,327 కోట్లు, ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ. 10,000 కోట్లు, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ. 6,560 కోట్లు, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ రూ. 6,145 కోట్లు అందుకున్నాయి. కేఆర్ఎన్ హీట్ ఎక్స్చేంజర్ ఐపీవోకు 200 రెట్లు అధిక బిడ్స్ లభించాయి. ఇక వన్ మొబిక్విక్, యూనికామర్స్ ఈసొల్యూషన్స్, డిఫ్యూజన్ ఇంజినీర్స్, బీఎల్ఎస్ ఈసర్వీసెస్, ఎక్సికామ్ టెలి ఇష్యూలకు 100 రెట్లుపైగా స్పందన నమోదైంది. విభోర్ స్టీల్, బీఎల్ఎస్, బజాజ్ హౌసింగ్, కేఆర్ఎన్ లిస్టింగ్ రోజు 100 శాతం లాభపడ్డాయి.

వచ్చే ఏడాదీ మెరుపుల్...

సెబీకి దాఖలైన 89 కంపెనీల ఐపీవో దరఖాస్తుల ప్రకారం 2025లో రూ. 2.5 లక్షల కోట్ల సమీకరణకు వీలున్నట్లు అంచనా. వీటిలో ఇప్పటికే 34 కంపెనీలు సెబీ నుంచి అనుమతులు సైతం పొందాయి. ఈ జాబితాలో రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా, టాటా క్యాపిటల్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, హెక్సావేర్ టెక్నాలజీస్‌తో పాటు ఫ్లిప్‌కార్ట్, హీరో ఫిన్‌కార్ప్, ఎన్ఎస్‌డీఎల్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ, కెనరా రోబెకో, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ, బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ వంటివి . దీంతో కొత్త ఏడాది ఇంకెన్ని రికార్డులు బద్దలవుతాయనే ఆసక్తి నెలకొంది!

కొత్త ఏడాదిలో భారీ ఇష్యూలు రెడీ..

కంపెనీ పేరు	నిధుల లక్ష్యం రూ. కోట్లలో★
రిలయన్స్ జియో	50,000
ఎన్ఎస్ఈ	25,000
ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్	15,000
టాటా క్యాపిటల్	15,000
హెచ్‌డీబీ ఫైనాన్షియల్	12,500
హెక్సావేర్ టెక్	9,950

(★అంచనాలు)

సగటు పరిమాణం అప్...

ఈ ఏడాది చిన్న, మధ్యతరహా, భారీ కంపెనీలు లిస్టింగ్ బాటలో సాగాయి. దీంతో ఇష్యూ సగటు పరిమాణం రూ. 1,700 కోట్లను దాటింది. 2023లో ఇది కేవలం రూ. 867 కోట్లుగా నమోదైంది. ఏడాది చివరి నెల (డిసెంబర్)లోనూ 15 కంపెనీలు ఐపీవోలకు రాగా.. సెకండరీ మార్కెట్లో నికర అమ్మకందారులుగా నిలుస్తూనే విదేశీ ఇన్వెస్టర్లు పబ్లిక్ ఇష్యూలకు క్యూ కట్టడం విశేషం! ఈ నెల 24 వరకూ ముగిసిన 90 ఇష్యూల ద్వారా అన్‌లిస్టెడ్ కంపెనీలు రూ.1.6 లక్షల కోట్లను సమీకరించాయి. సోమవారం (23న) ప్రారంభమైన యూనిమెక్ ఏరోస్పేస్ మరో రూ. 500 కోట్లు అందుకోనుంది. గతేడాది (2023)లో 57 కంపెనీలు రూ. 49,436 కోట్లు మాత్రమే సమీకరించాయి. ఈ బాటలో మరోపక్క ఎస్ఎంఈ విభాగం సైతం రికార్డ్ నెలకొల్పడం గమనార్హం! ప్రైమ్‌డేటా గణాంకాల ప్రకారం ఈ ఏడాది 238 ఎస్ఎంఈలు రూ. 8,700 కోట్లు సమకూర్చుకున్నాయి. 2023లో లిస్టింగ్ ద్వారా ఎస్ఎంఈలు అందుకున్న రూ. 4,686 కోట్లతో పోలిస్తే రెట్టింపైంది!

ఒడిదుడుకుల్లో స్వల్ప నష్టాలు

- లాభాలు ఒక రోజుకే పరిమితం
- క్రిస్మస్ సందర్భంగా నేడు సెలవు



ముంబై: స్టాక్ సూచీల లాభాలు ఒక రోజుకే పరిమితమయ్యాయి. సెన్సెక్స్ 67 పాయింట్లు నష్టపోయి 78,473 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 26 పాయింట్లు పతనమై 23,728 వద్ద నిలిచింది. విదేశీ పెట్టుబడులు నిరంతరాయంగా తరలిపోతున్న తరుణంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 78,398–78,877 శ్రేణిలో... నిఫ్టీ 23,868–23,685 రేంజ్‌లో ట్రేడయ్యాయి. ఫైనాన్సియల్స్, ఐటీ, మెటల్, విద్యుత్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. కన్జూమర్ డిస్క్రిషనరీ, ఇంధన, ఫార్మా, టెలికం, ఆటో, ఆయిల్‌అండ్‌గ్యాస్, సర్వీసెస్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. క్రిస్మస్ సందర్భంగా బుధవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు సెలవు ప్రకటించాయి. బులియన్, ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లు కూడా పనిచేయవు.

ఐపీఓలకు భారీ స్పందన

సెనోరెస్ ఫార్మా ఐపీఓకు చివరిరోజు నాటికి 93.69 రెట్ల స్పందన లభించింది. ఆఫర్‌లో భాగంగా 85.34 లక్షల ఈక్విటీలను జారీ చేయగా 79.95 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ విభాగం 90.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. వెంటివ్ హాస్పిటాలిటీ ఐపీఓ 9.82 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 1.44 కోట్ల షేర్లను జారీ చేయగా 14.17 కోట్ల ఈక్విటీలకు దరఖాస్తులు వచ్చాయి. రిటైల్ విభాగానికి 5.94 రెట్ల స్పందన లభించింది. ఇక కరారో ఇండియాకు 1.12 రెట్ల స్పందన నమోదైంది. ఆఫర్‌లో 1.30 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 1.46 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగం 2.21 రెట్లు, రిటైల్ విభాగం 71% సబ్‌స్క్రైబ్ అయ్యాయి.

అన్‌లిమిటెడ్ స్టోర్లలో 'రెడ్ అలర్ట్ సేల్'

న్యూఢిల్లీ: వివిధ ఉత్పత్తులపై అత్యుత్తమ డిస్కౌంట్‌లు, ఆఫర్లతో 'రెడ్ అలర్ట్ సేల్' ప్రారంభించినట్లు అన్‌లిమిటెడ్ స్టోర్స్ ప్రకటించింది. అన్ని బ్రాండెడ్ దుస్తులపై 50% ఫ్లాట్ డిస్కౌంట్ లభిస్తుంది. రూ.3,000 షాపింగ్‌పై అంతే విలువైన బ్రాండెడ్ దుస్తులను ఉచితంగా పొందవచ్చు. అతి త్వర్లో ముగియనున్న ఈ ఆఫర్‌ను కస్టమర్లు వినియోగించుకోవాలని కోరింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఆలోచనా విధానంలో మార్పుతోనే వికసిత్ భారత్: మోదీ	1.42 కోట్ల మంది విమానయానం

థియేటర్లలో పాప్‌కార్న్‌పై జీఎస్‌టీ 5 శాతమే

- లూజ్ సేల్స్‌పై వర్తింపు...
- సెకండ్ హ్యాండ్ కార్ల జీఎస్‌టీపైనా స్పష్టత



న్యూఢిల్లీ: థియేటర్లలో లూజుగా విక్రయించే పాప్‌కార్న్‌పై జీఎస్‌టీ అనేది రెస్టారెంట్ల తరహాలో 5 శాతంగానే ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే, సినిమా టికెట్‌తో పాటు కలిపి విక్రయిస్తే మాత్రం నిబంధనల ప్రకారం ఆ కాంబో ప్యాకేజీకి వర్తించే రేటు అమలవుతుందని పేర్కొన్నాయి. జీఎస్‌టీ కౌన్సిల్ 55వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రభుత్వ వర్గాలు ఈ మేరకు వివరణనిచ్చాయి. మరోవైపు, సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయానికి సంబంధించిన జీఎస్‌టీపైనా స్పష్టతనిచ్చాయి. విక్రయ విలువ కన్నా తరుగుదల విలువ ఎక్కువ ఉంటే మార్జిన్లపై 18 శాతం జీఎస్‌టీ వర్తించదని, అదే తక్కువగా ఉంటే వర్తిస్తుందని పేర్కొన్నాయి. మధ్యవర్తిత్వ సంస్థలు విక్రయించే పాత వాహనాల విషయంలో మార్జిన్లపై సింగిల్ జీఎస్‌టీ రేటు 18 శాతం వర్తింపచేయాలని జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవడంపై అస్పష్టత నెలకొన్న నేపథ్యంలో ఈ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com



కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 224 వర్క్‌మెన్ పోస్టులు

కొచ్చి(కేరళ)లోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన వర్క్‌మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 224.
» వేతనం: నెలకు రూ.23,300.
» పోస్టులు, ట్రేడులు: ఫ్యాబ్రికేషన్ అసిస్టెంట్(షీట్ మెటల్ వర్కర్, వెల్డర్), ఔట్‌ఫిట్ అసిస్టెంట్(మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, ప్లంబర్, పెయింటర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, షిప్‌రైట్ వుడ్, మెషినిస్ట్, ఫిట్టర్).
» అర్హత: ఎస్ఎస్ఎల్‌సీ, సంబంధిత విభాగాల్లో ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. వయసు: 30.12.2024 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్, సర్టిఫికేట్‌ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.12.2024
» వెబ్‌సైట్: https://cochinshipyard.in

నాల్కో, భువనేశ్వర్‌లో 518 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

భువనేశ్వర్(ఒడిశా)లోని నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో).. నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 518.
» పోస్టుల వివరాలు: ఎస్‌యూపీటీ(జేవోటీ)-ల్యాబొరేటరీ-37, ఎస్‌యూపీటీ (జేవోటీ)-ఆపరేటర్-226, ఎస్‌యూపీటీ(జేవోటీ)-ఫిట్టర్-73, ఎస్‌యూపీటీ (జేవోటీ)-ఎలక్ట్రికల్-63, ఎస్‌యూపీటీ (జేవోటీ)-ఇన్‌స్ట్రుమెంటేషన్(ఎం-ఆర్)/ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ (ఎస్-పి)-48, ఎస్‌యూపీటీ(జేవోటీ)-జియాలజిస్ట్-04, ఎస్‌యూపీటీ(జేవోటీ)-హెచ్ఈఎంఎం ఆపరేటర్-09, ఎస్‌యూపీటీ (ఎస్‌వోటీ) -మైనింగ్-01, ఎస్‌యూపీటీ (జేవోటీ)-మైనింగ్ మేట్-15, ఎస్‌యూపీటీ (జేవోటీ) -మోటార్ మెకానిక్-22, డ్రస్సర్ కమ్ ఫస్ట్ ఎయిడర్(డబ్ల్యూ2 గ్రేడ్)-05, ల్యాబొరేటరీ టెక్నీషియన్ గ్రేడ్3(పీవో గేడ్)-02, నర్స్ గ్రేడ్3(పీఏ గ్రేడ్)-07, ఫార్మసిస్ట్ గ్రేడ్3(పీఏ గ్రేడ్)-06.
» నాల్కో ప్రాంతాలు: ఎస్-పి కాంప్లెక్స్(అంగుల్), ఎం-ఆర్ కాంప్లెక్స్(దమంజోడి).
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
» గరిష్ట వయో పరిమితి: 21.01.2025 నాటికి డ్రస్సర్ కమ్-ఫస్ట్ ఎయిడర్ /ల్యాబొరేటరీ టెక్నీషియన్/నర్సు/ఫార్మసిస్ట్ పోస్టులకు 35 ఏళ్లు, ఎస్‌యూపీటీ (ఎస్‌వోటీ)-మైనింగ్ పోస్టులకు 28 ఏళ్లు, ఇతర పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు. » ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 31.12.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.01.2025
» వెబ్‌సైట్: https://nalcoindia.com

జిప్‌మర్, పుదుచ్చేరిలో 99 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్).. సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 99.
» వేతనం: నెలకు రూ.67,700.
» విభాగాలు:అనెస్తీషియాలజీ అండ్ క్రిటికల్ కేర్, అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్, మైక్రోబయాలజీ,న్యూక్లియర్ మెడిసిన్,పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, రేడియో-డయాగ్నోసిస్.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 05.03.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, టైపింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 06.01.2025
» హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది: 13.01.2025.
» సీబీటీ ఎగ్జామ్ తేది: 18.01.2025.
» వెబ్‌సైట్: https://jipmer.edu.in

సైన్స్‌లో పరిశోధనలకు మార్గం ఇదిగో!

సైన్స్, టెక్నాలజీ విభాగాల్లో పరిశోధనలతో పాటు అధ్యాపక వృత్తిలో ప్రవేశానికి మార్గం.. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్! ఈ పరీక్షలో ప్రతిభతో పీహెచ్‌డీలోనూ ప్రవేశించొచ్చు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు! అంతేకాకుండా జేఆర్ఎఫ్ పొంది పరిశోధనలు సాగించొచ్చు! ఆకర్షణీయ ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందుకోవచ్చు!! తాజాగా... సీఎస్ఐఆర్-యూజీసీ నెట్-డిసెంబర్ 2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

» సీఎస్ఐఆర్-యూజీసీ-నెట్ డిసెంబర్ 2024 నోటిఫికేషన్
» జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్, పీహెచ్‌డీకి ఎంపిక
» జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే నెలకు రూ.37వేల ఫెలోషిప్

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సంయుక్తంగా నిర్వహిస్తున్న పరీక్ష.. సీఎస్ఐఆర్ యూజీసీ నెట్. ప్రతి ఏటా రెండుసార్లు (జూన్, డిసెంబర్) ఈ పరీక్ష జరుగుతుంది. దరఖాస్తు సమయంలో అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యం ఆధారంగా జేఆర్ఎఫ్‌కు లేదా లెక్చర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌నకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. పీహెచ్‌డీలోనూ ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంటుంది.

మూడు కేటగిరీలు

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌ను మూడు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అవి.. జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్; అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ పీహెచ్‌డీ అడ్మిషన్; అడ్మిషన్ టు పీహెచ్‌డీ. జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీ ఉత్తీర్ణులకు జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ అడ్మిషన్స్‌కు అర్హత లభిస్తుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ అడ్మిషన్ కేటగిరీ ఉత్తీర్ణులకు అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత లభిస్తుంది. అడ్మిషన్ టు పీహెచ్‌డీ కేటగిరీ ఉత్తీర్ణులు కేవలం పీహెచ్‌డీలో ప్రవేశాలకే అర్హులవుతారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమ అర్హతలకు అనుగుణంగా కేటగిరీ ప్రాథమ్యాలను పేర్కొనాల్సి ఉంటుంది.

అయిదు విభాగాలు

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ద్వారా సైన్సెస్‌కు సంబంధించిన అయిదు విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. అవి.. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్; ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్. ఆయా విభాగాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పరిశోధన సంస్థల్లో పీహెచ్‌డీలో చేరేందుకు, జేఆర్ఎఫ్ పొందేందుకు అవకాశం లభిస్తుంది. అదేవిధంగా ఈ అయిదు విభాగాలకు సంబంధించి అధ్యాపక వృత్తిలో అడుగుపెట్టేందుకు అర్హత లభిస్తుంది.

అర్హతలు

కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్, బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణత ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

- రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు ఆయా కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లకు అర్హత లభించదు. బీఎస్సీ ఆనర్స్ చివరి సంవత్సరం చదువుతున్న వారికి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారికి దరఖాస్తుకు అర్హత లేదు.

వయసు

జేఆర్ఎఫ్ అభ్యర్థులు 2025 ఫిబ్రవరి 1 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ వర్గాల వారికి అయిదేళ్లు, ఓబీసీ వర్గాల వారికి మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్, అడ్మిషన్ టు పీహెచ్‌డీ కేటగిరీ అభ్యర్థులకు ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

200 మార్కులకు పరీక్ష

కెమికల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్‌లో 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఆయా సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నపత్రంలో పార్ట్ ఏ, పార్ట్ బీ, పార్ట్ సీ కేటగిరీలుగా ప్రశ్నలు ఉంటాయి. సదరు కేటగిరీల్లో నిర్దిష్ట సంఖ్యలో ప్రశ్నలు అడుగుతారు. పార్ట్ ఏ అన్ని సబ్జెక్టులకు కామన్‌గా జనరల్ ఆప్టిట్యూడ్‌పై ఉంటుంది. పార్ట్ బిలో సదరు సబ్జెక్టు సంబంధిత ఎంసీక్యూ ప్రశ్నలు ఉంటాయి. పార్ట్ సీలో అభ్యర్థికి సబ్జెక్టుపై ఉన్న లోతైన పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. మూడు గంటల వ్యవధిలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరుగుతుంది. ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది.



సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ 2024

జేఆర్ఎఫ్ నెలకు రూ.37వేలు

- సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌లో విజయం సాధించి నిర్దేశిత ఇన్‌స్టిట్యూట్ లేదా రీసెర్చ్ లేబొరేటరీల్లో పీహెచ్‌డీ దిశగా ప్రవేశం పొందిన అభ్యర్థులకు రెండేళ్లపాటు నెలకు రూ. 37 వేలు చొప్పున జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) అందుతుంది. దీంతోపాటు రెండేళ్లపాటు ప్రతి ఏటా రూ.20 వేల చొప్పున కాంటింజెంట్ గ్రాంట్ కూడా లభిస్తుంది.
- రెండేళ్ల తర్వాత పీహెచ్‌డీకి నమోదు చేసుకుంటే సీనియర్ రీసెర్చ్ ఫెలోగా పరిగణిస్తూ నెలకు రూ.42 వేలు చొప్పున ఫెలోషిప్ అందిస్తారు. ఇలా గరిష్టంగా మొత్తం అయిదేళ్ల పాటు జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌లు లభిస్తాయి.
- బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు తొలి రెండేళ్లు ఎలాంటి ఫెలోషిప్ లభించదు. రెండేళ్లలోపు పీహెచ్‌డీ లేదా ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో పేరు నమోదుకు అర్హత పొందితేనే జేఆర్ఎఫ్ లభిస్తుంది.

అధ్యాపకులకు కనీస అర్హత

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణతతో అధ్యాపక వృత్తిలో అడుగుపెట్టే అవకాశం లభిస్తుంది. నిబంధనల ప్రకారం-ఉన్నత విద్యా సంస్థలు లెక్చరర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. లెక్చరర్‌షిప్‌కు అర్హత పొందిన అభ్యర్థులు యూజీసీ నిబంధనల ప్రకారం కళాశాలల్లో అధ్యాపకులుగా చేరొచ్చు. అదేవిధంగా సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌లో జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి పరిశోధన లేబొరేటరీలు, ఐఐటీలు, ఎన్ఐటీలలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభిస్తుంది.

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

పార్ట్-ఎ (జనరల్ ఆప్టిట్యూడ్)

పరీక్షలో ఉమ్మడి విభాగంగా జనరల్ ఆప్టిట్యూడ్ ఉంటుంది. ఇందులో రాణించేందుకు తార్కిక విశ్లేషణ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, పజిల్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. అదేవిధంగా బేసిక్ జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

పార్ట్-బి (సబ్జెక్ట్)

ప్రశ్నపత్రం పార్ట్-బిలో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇవి పూర్తిగా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. అభ్యర్థులు తమ అకడమిక్ స్థాయి పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయాలి. దీంతోపాటు అన్వయ దృక్పథంతో ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇందులో మార్కులు సాధించొచ్చు.

పార్ట్-సి (సబ్జెక్ట్)

ప్రశ్నపత్రం పార్ట్-సిలో ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలే ఉంటాయి. వీటి క్లిష్టత స్థాయి అధికంగా ఉంటుంది. అభ్యర్థుల్లోని శాస్త్రీయ భావనలపై అవగాహన, శాస్త్రీయ భావనలను అన్వయించే నైపుణ్యాలను పరీక్షించే విధంగా పూర్తిగా విశ్లేషణాత్మక దృక్పథంతో సమాధానాలను గుర్తించాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు పీజీ స్థాయి పుస్తకాలను చదవడం మేలు.

పీజీ పుస్తకాలే ఆదరవు

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్టులలో పీజీ స్థాయిలో పూర్తి అవగాహన పొందాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. తమ సబ్జెక్టులకు సంబంధించి ప్రస్తుతం ఉన్న సమస్యలు, వాటి పరిష్కారం దిశగా ఉపయోగపడే పరిశోధనల గురించి తెలుసుకోవాలి. దీనివల్ల పరీక్షలో ముఖ్యంగా పార్ట్-సిలో రాణించేందుకు మార్గం సుగమం అవుతుంది. అభ్యసనం చేసేటప్పుడే రీసెర్చ్ ఓరియెంటేషన్ అలవర్చుకోవడం లాభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, డిసెంబర్ 30
- సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ తేదీలు: 2025 ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు
- వెబ్‌సైట్: https://csirnet.nta.ac.in



ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు వివాహ రిసెప్షన్‌కు హాజరై వధూవరులను ఆశీర్వదించిన సీఎం రేవంత్‌రెడ్డి



మంగళవారం తెలంగాణ హైకోర్టు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ రాధారాణి, జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, జస్టిస్ లక్ష్మీనారాయణ తదితరులు

పల్లెలకు న్యాయవ్యవస్థ చేరడమే లక్ష్యం

హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

సాక్షి, హైదరాబాద్: సాంకేతికతను అందిపుచ్చుకుని న్యాయవ్యవస్థను గ్రామీణుల చెంతకు కూడా చేర్చాలన్నదే లక్ష్యమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు. డిజిటలైజేషన్‌తో సత్వర సేవలు సాధ్యపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. హైకోర్టు ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో.. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కోర్టుల్లో 29 ఈ సేవా కేంద్రాలను వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. వీటితో కలిపి ఇప్పటివరకు 97 ఈ సేవా కేంద్రాలు.. ఆయా కోర్టుల్లో అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన హైకోర్టు క్యాలెండర్‌తో పాటు టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



అక్క బయోమెట్రిక్ తమ్ముడికి.. తమ్ముడి బయోమెట్రిక్ అక్కకు..

చిత్రంలో కనిపిస్తున్న ఇద్దరూ అక్కాతమ్ముళ్లు. కర్నూలు జిల్లా సీ బెళగాల్ మండలం చెందిన కృష్ణ దొడ్డి గ్రామానికి చెందినవారు. వీరి ఆధార్‌కార్డుల్లో అక్క మమత బయోమెట్రిక్‌ను తమ్ముడికి, తమ్ముడు గోవర్ధన్ బయోమెట్రిక్‌ను అక్క ఆధార్‌కు అనుసంధానం చేశారు. దీన్ని సరిచేసుకునేందుకు నాలుగేళ్లుగా ప్రయత్నిస్తున్నా ఫలితం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లో ఉన్న యూఐడీఏఐ ప్రాంతీయ ఆఫీస్‌కు మూడు సార్లు వచ్చామని.. ప్రతీసారి ఈ- మెయిల్ పెట్టామని చెప్తున్నారే తప్ప, సమస్య మాత్రం పరిష్కారం కాలేదని చెబుతున్నారు.

ఆధారం.. జాగారం!

ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం జనం తిప్పలు

- పొరపాట్లు, బయోమెట్రిక్ సవరణ కోసం ప్రాంతీయ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌లోని ఆఫీసుకే రావాల్సిన పరిస్థితి
- తెల్లవారుజామున 5 గంటల నుంచే బారులు తీరుతున్న ప్రజలు
- రోజుకు 150 మందికి మాత్రమే టోకెన్లు ఇస్తున్న అధికారులు
- తప్పుల సవరణపై సందేహాలు నివృత్తి చేయని తీరు
- రోజులకు రోజులు ఇక్కడే ఉండాలంటే ఎలాగని దూరప్రాంతాల వారి ఆవేదన



ఈ చిత్రంలోని విద్యార్థి పేరు మహమ్మద్ అబ్దుల్ గనీ. ఆరేళ్ల వయసులో ఉన్నప్పుడు 2011లో అతడి తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేయించారు. రెండేళ్ల క్రితం ఫోటో అప్‌డేట్ చేయించారు. ప్రస్తుతం ఘనీ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు కోసం బయోమెట్రిక్ అవసరం ఉండటంతో వేలిముద్ర ఇచ్చాడు. అది మిస్ మ్యాచ్ అని వస్తుండటంతో.. ఆధార్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అప్‌డేషన్‌కు ప్రయత్నించాడు. కానీ ఆ బయోమెట్రిక్‌తో వేరేవారి పేరుతో ఆధార్ ఉన్నట్లుగా చూపిస్తోంది. యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి ప్రయత్నించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు.

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం ఏ చిన్న పని కావాలన్నా ఆధార్ కార్డు ఉండాల్సిందే. స్కూళ్లలో అడ్మిషన్ నుంచి ఉద్యోగం పీఎఫ్ వరకు, మొబైల్ సిమ్‌కార్డు నుంచి ట్రైన్ టికెట్ వరకు ఆధార్ కావాల్సిందే. ఇక ప్రభుత్వ పథకాలను పొందాలనుకునే ఆధార్ తప్పనిసరి. అలాంటి ఆధార్‌లో ఏవైనా పొరపాట్లు ఉంటే ప్రతిచోటా సమస్యలే. ఆ మార్పులు, చేర్పుల కోసం జనం తిప్పలు పడుతున్నారు. ఆధార్‌లో మార్పుచేర్పులు, అప్‌డేషన్‌కు ఉన్న పరిమితుల కారణంగా.. అవి దాటితే కచ్చితంగా ప్రాంతీయ కార్యాలయానికి రావాల్సిందే. దీనితో తెలంగాణ, ఏపీ రెండు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లో ఉన్న యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయానికి జనం క్యూకడుతున్నారు. తెల్లవారుజాము నుంచే టోకెన్ కోసం పడిగాపులు కాస్తున్నారు. రోజుకు 150 టోకెన్లు మాత్రమే ఇస్తుండటంతో మిగతావారు ఉసూరుమనాల్సి వస్తోంది. ప్రధానంగా విద్యార్థుల ఆధార్ కార్డులో అప్‌డేషన్ సమస్యగా మారింది. చిన్నప్పుడు ఆధార్ నమోదు చేసుకున్నవారు... నిర్ధారిత వయసు దాటాక బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయించుకోవాల్సి రావడమే దీనికి కారణం.

అప్‌డేట్‌కు పరిమితులతో...

భారత విశిష్ట ప్రాధికార గుర్తింపు సంస్థ (యూఐడీఏఐ) 2019లో ఆధార్ రికార్డుల్లో మార్పులు, చేర్పులపై కొన్ని నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఆధార్ కార్డులో వ్యక్తి పేరు, పుట్టిన తేదీ, జెండర్ వంటివి అప్‌డేట్ చేసుకునేందుకు పరిమితులు పెట్టింది. ఆధార్ కార్డులో పేరును రెండుసార్లు మాత్రమే అప్ డేట్ చేసుకోవచ్చు. ఇంటిపేరు, స్పెల్లింగ్ తప్పిదాలను సరిచేసుకోవచ్చు. ఇందుకోసం తగిన ధ్రువపత్రాలను సమర్పించాలి. పుట్టిన తేదీని కేవలం ఒకసారి మాత్రమే అప్‌డేట్ చేసుకోవచ్చు. అదికూడా నమోదు సమయంలో ఇచ్చిన తేదీకి మూడేళ్లు మాత్రమే తగ్గించుకోవచ్చు. అలాగే ఎంతైనా పెంచుకోవచ్చు. ఇందుకోసం తప్పనిసరిగా ఆధారాలు సమర్పించాలి. జెండర్ వివరాలు ఒక్కసారి మాత్రమే మార్చుకోవచ్చు. ఆధార్ కార్డుపై ఉండే ఫొటోను మాత్రం ఎన్నిసార్లయినా అప్‌డేట్ చేసుకోవచ్చు. దీనిపై పరిమితి లేదు. జారీ అయి పదేళ్లు దాటిన ఆధార్ కార్డుల్లో ఫొటో అప్‌డేట్ తప్పనిసరి.

రీజనల్ ఆఫీసులోనే మార్పులు..

నిర్దేశిత పరిమితి వరకు ఆన్‌లైన్‌లో తగిన ధ్రువపత్రాలను సమర్పించి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవచ్చు. పరిమితి దాటితే యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయంలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. వాటికి తగిన ఆధారాలను జత చేయడంతోపాటు ఎందుకు వివరాలు మార్చాల్సి వస్తోందనేది స్పష్టంగా పేర్కొనాలి. ఈ-మెయిల్, పోస్ట్ ద్వారా కూడా ప్రాంతీయ కార్యాలయాలకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నా.. దానిపై అవగాహన లేక జనం ఇబ్బందిపడుతున్నారు. అంతేకాదు ఈ దరఖాస్తులకు తగిన ఆధారాలను చేయాలి, ఏమేం సమర్పించవచ్చన్నది తెలియడం లేదని జనం వాపోతున్నారు. దీనితో నేరుగా ప్రాంతీయ కార్యాలయానికి వస్తున్నామని పేర్కొంటున్నారు.

9 ఏళ్ల పాపకు 16 ఏళ్ల వయసు వేశారు



మాది ఏపీలోని కర్నూలు జిల్లా నందవరం గ్రామం. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటా. నా కూతురు పేరు ఇందు. ఆమె వయసు తొమ్మిదేళ్లే. కానీ ఆధార్ కార్డులో 16 ఏళ్లు అని వచ్చింది. దీనితో ప్రభుత్వ అమ్మ ఒడి పథకం అందలేదు. మూడు సార్లు కర్నూలులో ప్రయత్నించినా ఆధార్‌లో మార్పు జరగలేదు. హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లాలంటే వచ్చాం. రెండు, మూడు రోజుల నుంచి ఇక్కడే ఉంటున్నాం. ఏం చేయాలో తెలియడం లేదు.

– హుసేనమ్మ, నందవరం గ్రామం, కర్నూలు జిల్లా


నాలుగేళ్లుగా తిరుగుతున్నాం



మాది మహబూబ్‌నగర్ జిల్లా కాకర్లపాడు గ్రామం. నా కూతురు మాధవి ఇంటర్ చదువుతోంది. తన ఆధార్‌లో పేరు తప్పుగా ఉండటంతోపాటు బయోమెట్రిక్ తప్పుగా చూపిస్తోంది. నాలుగేళ్ల నుంచి స్థానికంగా ప్రయత్నం చేశాం. తెలిసిన వారు చెబితే ప్రాంతీయ కార్యాలయానికి వచ్చాం. తప్పులు సవరించాలంటే ఏం చేయాలనేది ఎవరూ చెప్పడం లేదు.

- భారతమ్మ, కాకర్లపాడు, మహబూబ్‌నగర్

తెలుగు రాష్ట్రాల్లో ఆధార్ నమోదు తీరు ఇలా.. -సాక్షి ప్లస్‌లో



ముజఫర్‌నగర్- సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ముజఫర్‌నగర్–సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ముజఫర్‌నగర్–సికింద్రాబాద్ (05293/ 05294) ప్రత్యేక రైలు జనవరి 7 నుంచి ఫిబ్రవరి వరకు ప్రతి మంగళవారం ఉదయం 10.40 గంటలకు బయల్దేరి.. బుధవారం రాత్రి 11.50కి సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి గురువారం తెల్లవారుజామున 3.55 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ముజఫర్‌నగర్ చేరుకుంటుంది.

అనుమానం ఉంటే ఫిర్యాదు చేయండి

ప్రజలకు టీజీసీఎస్‌బీ సూచన

సాక్షి, హైదరాబాద్: స్మార్ట్ ఫోన్లు వాడే ప్రతి ఒక్కరూ ఈ–మెయిల్‌తోపాటు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితర సోషల్ మీడియాను వాడటం సర్వసాధారంగా మారింది. సరిగ్గా వీటినే మార్గంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు తెరతీస్తున్నారు. బ్యాంకుల పేరిట, దర్యాప్తు సంస్థల పేరిట, ఆఫర్లు, లాటరీలు, క్రెడిట్, డెబిట్ కార్డులు ఇలా అనేక అంశాలపై ప్రజలకు నకిలీ ఎస్‌ఎంఎస్‌లు, వెబ్‌లింక్‌లు, ఈ–మెయిల్స్ పంపుతున్నారు. ఇలా వచ్చే ఎస్‌ఎంఎస్‌లలోని లింక్‌లు, వెబ్‌లింక్‌లు, ఈ–మెయిల్స్‌పై ఏవైనా అనుమానం ఉన్నా.. అవి సైబర్ నేరగాళ్ల పనై ఉంటుందని అనుమానం వచ్చినా వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి అనుమానాస్పద మెసేజ్‌లపై సమాచారం ఇస్తే అవి నిజమైనవా, కాదా అన్నది నిర్ధారించి చెబుతామని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఇటీవల వెల్లడించారు. ప్రజలు సైబర్ మోసానికి గురికాకుండా వారిని అప్రమత్తం చేసేందుకు ఇటీవలే నూతన సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు ఆమె తెలిపారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.







దేవత లేని గుడి

ఆండాలమ్మ ఆలయ నిర్మాణం • అనివార్య కారణాలతో ప్రతిష్టించని విగ్రహం
ఫొటో షూట్‌కు చిరునామాగా పురాతన ఆలయం • అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా మారే అవకాశం

సాక్షి, పెద్దపల్లి: గుడి ఉంటే దేవుడు ఉండాలి. దర్శనం చేసుకునేందుకు భక్తులు రావాలి. ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాలి. కానీ, ఈ గుడిలో దేవుడిని దర్శించుకునేందుకు భక్తులు రారు. వెడ్డింగ్ ఫొటోషూట్, షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌లు, పిక్నిక్‌ల కోసం వచ్చే సందర్శకులు, పర్యాటకులతోనే గుడి కళకళలాడుతోంది. ఆ గుడి ఏంటి? విశేషాలు, చరిత్ర తెలుసుకోవాలంటే పెద్దపల్లి జిల్లా ముత్తారం గ్రామ పరిధిలోని ధర్మాబాద్ ప్రాంతానికి వెళ్లాల్సిందే.

ఆండాలమ్మ గుడి కోసం..

13వ శతాబ్దంలో జైనుల కాలంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం గ్రామ పరిధిలోని ధర్మాబాద్.. రాఘవాపూర్ సంస్థానాధీశుల ఆధీనంలో ఉండేది. ఆయా సంస్థానాధీశులైన ఎరబాటి లక్ష్మీనరసింహారావు, ఆయన కుమారుడు లక్ష్మీకాంతరావు గుడికి అంకుర్పారణ చేసినట్లు చరిత్రకారులు, గ్రామస్తులు చెబుతున్నారు. తొలుత రంగనాయకస్వామి ఆలయాన్ని నిర్మించారు. దీనికి అనుబంధంగా 500 అడుగుల దూరంలో ఆండాలమ్మ దేవాలయం నిర్మించారు. ఈ రెండింటి మధ్య రోప్ వే నిర్మించి, దీనిద్వారా అమ్మవారిని రంగనాయకస్వామి ఆలయానికి తీసుకొచ్చి.. కల్యాణవేడుక జరిపించాలన్న ఆలోచనతో గుడి నిర్మించారు. దాని నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తి హఠాత్తుగా మృతి చెందటంతో.. ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేయలేదు. అనంతరం వారి వారసులు సైతం అమ్మవారి విగ్రహం ఏర్పాటుపై అంతగా ఆసక్తి చూపకపోవడంతో.. విగ్రహం లేకుండానే గుడి మిగిలిపోయింది.

ఎత్తయిన కొండల మధ్య..
అద్భుత శిల్ప కళాసౌందర్యంతో..

దట్టమైన అడవి, చుట్టూ ఎత్తయిన పచ్చని కొండల నడుమ గుడి దర్శనమిస్తోంది. ప్రధాన గోపురంలో అమ్మవారు, గర్భగుడికి ఇరువైపులా దేవతామూర్తుల కోసం ప్రత్యేక గదులు, అందమైన మండపం నిర్మించారు. గోపురంపై జీవకళ ఉట్టిపడేలా చెక్కిన శిల్పాలు ఆకట్టుకుంటాయి. మండపానికి కొద్దిదూరంలో ఆలయానికి మరింత శోభను తీసుకొచ్చేలా విశాలమైన స్వాగత తోరణం ఏర్పాటు చేశారు. అయితే, దేవత విగ్రహం లేకపోవడం, రంగనాయకుల స్వామి గుడి పరిధిలోని 439 ఎకరాల దేవాదాయ భూములు కాలక్రమంలో అన్యాక్రాంతమవడంతో.. ఈ గుడిని పట్టించుకునే వారు కరువయ్యారు. ఇటీవల పల్లె ప్రకృతివనం కార్యక్రమంలో ఆండాలమ్మ గుడిచుట్టూ ఉన్న మూడెకరాల్లో మొక్కలు నాటి పార్క్ ఏర్పాటు చేశారు. దీంతో పురాతన ఆలయాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగిపోతోంది. ఈ ప్రదేశం వెడ్డింగ్, షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌ల చిరునామాగా మారింది.

అభివృద్ధి చేయాలి



మా తాతల కాలంలో రాఘవపూర్ సంస్థానాధీశులైన ఎరబాటి లక్ష్మీనరసింహారావు ఆండాలమ్మ గుడి నిర్మించాడు. విగ్రహ ప్రతిష్ఠ సమయంలో.. ఎవరో చనిపోవడంతో అలాగే ఉండిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం గుడిని అభివృద్ధి చేస్తే బావుంటుంది.

– అందె పోచమల్లు, గ్రామస్తుడు

అరకొర సౌకర్యాలు



ప్రాచీన సంస్కృతి, శిల్పకళ ఉట్టిపడేలా గుడి నిర్మించారు. అనివార్య కారణాలతో ఆండాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేయలేదు. ప్రస్తుతం అరకొర సౌకర్యాలు ఉన్నాయి. అయినా, వెడ్డింగ్, షార్ట్ ఫిల్మ్‌ల కోసం తెలుగు రాష్ట్రాల నుంచి సందర్శకులు, దర్శకులు వస్తున్నారు. ఈ గుడితోపాటు పక్కనే ఉన్న రంగనాయకులస్వామి ఆలయం, సబ్బితం జలపాతం, రామగిరి ఖిలాతో టూరిజం సర్క్యూట్ నిర్మించి, అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

– నల్లగొండ కుమార్, స్థానికుడు





ఎస్‌ఓపీ మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకోండి

పవర్‌గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్తా మాధారం గ్రామం సర్వే నంబర్ 35, 36, 37లోని భూముల మీదుగా వెళ్తున్న 765 కేవీ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల కారణంగా నష్టపోతున్న రైతుల విషయంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకోవాలని పవర్‌గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మాధారం గ్రామంలోని తమ భూమి నుంచి 765 కేవీ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లు వేసేందుకుగాను పవర్‌గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌కు కేంద్రం, కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్, జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కడ్తాల్‌కు చెందిన గంట శ్రీనివాసులుతోపాటు మరికొందరు రైతులు హైకోర్టులో సెప్టెంబర్ 26న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘిస్తూ అధికారులు ఆమోదం తెలపడం విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 68, వర్క్స్ ఆఫ్ లైసెన్సు రూల్స్ 2006లోని నిబంధనలకు విరుద్ధమన్నారు. తమ భూముల నుంచి విద్యుత్ లైన్లు వెళ్లకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఎస్‌ఓపీని అనుసరించి పరిహారం చెల్లిస్తామని ప్రతివాదులు తెలపడంతో సింగిల్ జడ్జి పిటిషన్‌పై విచారణ ముగించారు. సింగిల్ జడ్జి ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ.. రైతులు హైకోర్టులో అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించింది. 'తమ భూముల నుంచి విద్యుత్ లైన్లు వెళ్లడంపై అభ్యంతరం తెలుపుతూ సెప్టెంబర్ 21న అధికారులకు వినతిపత్రం సమర్పించినా స్పందించలేదు. దీంతో రైతులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. చట్టప్రకారం పరిహారం ఇస్తామని పవర్‌గ్రిడ్ బీదర్ పేర్కొనడంతో సింగిల్ జడ్జి విచారణ ముగించారు. తమ అభ్యంతరాలు చెప్పుకునే స్వేచ్ఛ ఇచ్చారంటూ పిటిషనర్ల తరఫు న్యాయవాది, మరోసారి రైతులు వినతిపత్రం సమర్పిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పవర్‌గ్రిడ్ తరఫు న్యాయవాది వాదించారు. అందువల్ల రైతులు మరోసారి పవర్‌గ్రిడ్ బీదర్‌కు వినతిపత్రం సమర్పించాలి. ఆ వినతిపత్రాలను సంస్థ పరిగణనలోకి తీసుకొని, వారి అభ్యంతరాలన్నింటినీ పరిశీలించాలి. 2024, జూన్ 14న కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకోవాలి' అని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.



తెలుగు రాష్ట్రాల్లో ఆధార్ నమోదు తీరు ఇలా.. (ఉమ్మడి జిల్లాల వారీగా..)

జిల్లా	ఆధార్ నమోదు సంఖ్య	జనాభాతో పోలిస్తే శాతం
తెలంగాణలో...		
హైదరాబాద్	73,44,733	186
రంగారెడ్డి	54,13,434	102
మహబూబ్‌నగర్	44,21,455	109
కరీంనగర్	41,79,187	111
వరంగల్	38,64,439	110
నల్లగొండ	38,23,487	110
మెదక్	32,61,749	108
ఆదిలాబాద్	31,73,613	116
ఖమ్మం	30,06,294	107
నిజామాబాద్	29,04,238	114
ఆంధ్రప్రదేశ్‌లో...		
తూర్పు గోదావరి	59,27,227	115
గుంటూరు	54,41, 622	111
కృష్ణా	49,34,545	109
విశాఖపట్నం	48,45,399	113
అనంతపురం	48,29,594	118
చిత్తూరు	47,07,207	113
కర్నూల్	46,49,079	115
పశ్చిమ గోదావరి	44,02,956	112
ప్రకాశం	37,85,151	112
నెల్లూరు	32,59.393	110
కడప	32,319,62	112
శ్రీకాకుళం	31,72,496	118
విజయనగరం	26,20,722	112

పుట్టినతేదీ తప్పుగా వేశారు



నా భార్య ఉమామహేశ్వరి ఆధార్ కార్డులో పుట్టినతేదీ తప్పుగా నమోదు చేశారు. దాన్ని సరిచేసుకునేందుకు విశాఖపట్నంలో మూడు సార్లు ప్రయత్నం చేసినా ఫలితం లేదు. దీనితో ఇక్కడికి వచ్చి గది అద్దెకు తీసుకొని అప్‌డేషన్ కోసం ఆధార్ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చిపోతున్నాం. ఇప్పటికే పది వేల దాకా ఖర్చయింది. చంటి బిడ్డను తీసుకొని తెల్లవారు జామున ఇక్కడ పడిగాపులు కాయాల్సి వస్తోంది. రాష్ట్రం విడిపోయినప్పటికీ ఆధార్‌లో కరెక్షన్ కావాలంటే హైదరాబాద్ వరకు రావాలంటే కష్టంగా ఉంది.

– సాయికుమార్, శ్రీకాకుళం

క్రీస్తు బోధనలు ఆదర్శప్రాయం: మండలి చైర్మన్ గుత్తా



సాక్షి, హైదరాబాద్: క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆయన క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమను పంచడం, మంచి మనసుతో సేవ చేయడం ఎలాగో క్రీస్తు బోధనలు తెలుపుతాయని గుత్తా పేర్కొన్నారు.

ప్రేమ, కరుణ ఏసు సందేశం: ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: ప్రేమ, కరుణ, క్షమాగుణాలను ఏసు తన జీవిత సందేశంగా మానవాళికి అందించారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. క్రీస్తు బోధించిన శాంతి, సహనం, ఔదార్యం సర్వదా ఆచరణీయమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన శ్యామ్ బెనగళ్

మాజీ సీఎం కేసీఆర్ సంతాపం



సాక్షి, హైదరాబాద్: భారతీయ సినిమా దర్శక దిగ్గజం, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పద్మభూషణ్ శ్యామ్ బెనగళ్ మరణంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. విస్మరించిన మనుషుల సామాజిక నేపథ్యాలకు సినిమా రంగంలో సమాంతర స్థానం కల్పించారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్యుల జీవన ఇతివృత్తాలకు వెండితెర గౌరవం కల్పించిన గొప్ప దర్శకుడని పేర్కొన్నారు. ఇటు తెలంగాణ జీవన నేపథ్యాన్ని, అటు దేశీయ సామాజిక సాంస్కృతిక వైవిధ్యాన్ని ఇరుసుగా చేసుకుని, ఆలోచింపజేసే విధంగా దృశ్యమానం చేస్తూ, డాక్యుమెంటరీలు, సినిమాల రూపంలో శ్యామ్ బెనగళ్ అందించిన సేవలను స్మరించుకున్నారు. హైదరాబాద్ గడ్డ మీద పుట్టిన బిడ్డగా.. చలన చిత్ర రంగంలో తన కృషితో ప్రతిష్టాత్మక అవార్డులు సాధించి, భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన శ్యామ్ బెనగళ్ తెలంగాణకు గర్వకారణమని కేసీఆర్ అభివర్ణించారు.

టీఐఎల్ ఆస్తులు జప్తు చేసిన ఈడీ

బ్యాంకులను మోసం చేసిన కేసులో చర్యలు

సాక్షి, హైదరాబాద్: బ్యాంకుల కన్సార్టియం (కొన్ని బ్యాంకుల సమూహం) నుంచి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుని, నిధుల మళ్లించిన ఆరోపణలపై నమోదైన కేసులో ట్రాన్స్‌స్టోరీ ఇండియా లిమిటెడ్ (టీఐఎల్)కు చెందిన రూ.48.71 కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాత్కాలికంగా అటాచ్ చేసింది. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన జారీ చేసింది. కంపెనీ మోసాలపై సీబీఐ హైదరాబాద్ బ్రాంచ్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద మరో కేసు నమోదు చేసి ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. టీఐఎల్ సంస్థ బ్యాంకుల కన్సార్టియం నుంచి రుణాలు, క్రెడిట్ సదుపాయాల రూపంలో మొత్తం రూ.5,115 కోట్లు (వడ్డీతో సహా) తీసుకుంది. ఈ మొత్తాన్ని వాస్తవంగా చూపిన వ్యాపారాలకు కాకుండా.. షెల్ కంపెనీల్లోకి మళ్లించిందనే ఆరోపణలున్నాయి. టీఐఎల్ డైరెక్టర్లు/ప్రమోటర్లు అనేక షెల్ కంపెనీలను సృష్టించి, టీఐఎల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ఆ కంపెనీల్లో డైరెక్టర్లుగా చూపారు. ఇలా అడ్డగోలుగా నిధుల మళ్లింపునకు పాల్పడడంతో పాటు టీఐఎల్ సంస్థల బ్యాంక్ ఖాతాల నుంచి రూ.85.90 కోట్లు నగదు రూపంలో విత్‌డ్రా చేసినట్టు ఈడీ దర్యాప్తులో తేలింది. ఈడీ తాజాగా అటాచ్ చేసిన ఆస్తుల్లో టీఐఎల్ సంస్థలో పనిచేసిన ఒక డైరెక్టర్ తన కుటుంబ సభ్యుల పేరిట కొనుగోలు చేసిన స్థిరాస్తులు ఉన్నట్టు ఈడీ అధికారులు తెలిపారు.

అమిత్ షా వ్యాఖ్యలపై తొలి స్పందన రాహుల్‌దే

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్రమంత్రి అమిత్ షా అవమానపరిచిన అంశంపై తొలిసారిగా స్పందించింది ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో సమర్థమైన నాయకత్వ లక్షణాలతో రాహుల్‌గాంధీ పని చేస్తున్నారని చెప్పారు. ఆయన నేతృత్వంలో రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్ష నాయకునిగా అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసించారు.



తెలంగాణ భవన్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేత మధుసూదనాచారి తదితరులు

గాంధీభవన్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ తిరుపతి వర్మ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మెదక్ చర్చ్ ఫాదర్స్ బిషప్ సింగం, రాజేశ్వర్ సాల్మన్, లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

వీఆర్వోలను మళ్లీ తీసుకోవడంపై హర్షం

సాక్షి, హైదరాబాద్: వీఆర్వోలను మళ్లీ ఆప్షన్ల ద్వారా తీసుకోవడాన్ని హర్షిస్తున్నామని ట్రెసా అధ్యక్షుడు, వంగ రవీందర్, తెలంగాణ వీఆర్వోల జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థతో రాష్ట్ర అభివృద్ధి తథ్యమని చెప్పారు. గ్రామ ప్రజలతో పాటు రైతుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే వ్యవస్థ మళ్లీ ఆవిర్భవించడం సంతోషకరమన్నారు. ప్రతి గజం ప్రభుత్వ భూమి సైతం అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా...

రూ.20 లక్షలు విలువైన ఎర్రచందనం స్వాధీనం



తిరుపతి మంగళం: తిరుపతి జిల్లా నాగలాపురం మండలం రేప్పాల తిప్ప సమీపంలోని అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.20 లక్షలు విలువ చేసే ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమచారం మేరకు అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. అక్రమ రవాణా చేయడానికి ఎరచ్రందనం దుంగలు సిద్ధం చేస్తున్న కేవీబీపురానికి చెందిన సురేంద్ర, నాగలాపురానికి చెందిన మునివేలు, తమిళనాడు సేలం జిల్లాకు చెందిన మేస్త్రి సెల్వరాజితోరై స్వామితో పాటు మరో ఐదుగురు తమిళ కూలీలను అరెస్ట్ చేశారు. పట్టుబడిన ఎరచ్రందనం విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు తెలిపారు.

వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌గా మర్రెడ్డి ప్రమాణం

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌గా మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు జిల్లా, తాడేపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హాజరై శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, యార్లగడ్డ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

40 శాతం జేఎల్ పోస్టులు సీనియర్ ఎస్‌ఏలకు ఇవ్వాలి
ఏపీ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టుల్లో 40 శాతం సీనియర్ స్కూల్ అసిస్టెంట్ల ద్వారా భర్తీ చేయాలని ఏపీ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చింతల సుబ్బారావు, పి.నరోత్తమరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఎల్ ఖాళీల్లో 10 శాతం ఇంటర్, డిగ్రీ కాలేజీల్లోని నాన్ టీచింగ్ స్టాఫ్‌తో భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, మిగతా 90 శాతం పోస్టులను నేరుగా సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేస్తే స్కూల్ అసిస్టెంట్లకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

జూనియర్ లెక్చరర్లుగా టీచర్లు పనికిరారా?

ప్రభుత్వ .జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్లుగా నాన్ టీచింగ్ స్టాఫ్‌కు పదోన్నతులు కల్పించడాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఖండించింది. బోధనా అనుభవం లేని నాన్ టీచింగ్ స్టాఫ్, ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం బీఎడ్ అర్హత లేని కాంట్రాక్టు లెక్చరర్లు ఇంటర్ విద్యను బోధించేందుకు అవకాశం ఇస్తున్నప్పుడు, బోధన అనుభవం గల టీచర్లు ఇంటర్ బోధనకు ఎందుకు పనికిరారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ప్రపంచ శాంతి కోసం టిబెటన్ యువత ప్రచారం



సీతంపేట: ప్రపంచ శాంతిని కోరుతూ టిబెటన్ యూత్ కాంగ్రెస్‌కు చెందిన 15 మంది యువకులు మోటార్ సైకిళ్లపై ప్రయాణం చేస్తూ మంగళవారం ఉదయం విశాఖపట్నంలోని లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలో ఉన్న గాంధీ సెంటర్‌ను సందర్శించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఉపాధ్యక్షుడు నరవ ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి కె.ఎస్.ఎన్.మూర్తి వారికి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ భారతదేశం గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ శాంతి కోసం నిరంతరం కృషి చేస్తోందని, అదే విధంగా దలైలామాతో కలిసి శాంతికోసం పనిచేస్తున్న టిబెట్ ప్రజలకు తమ సానుభూతి ఉందన్నారు.

ఇసుక దందాతో తాగునీటికి కటకట

- జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన యానాదులు
- వేటపాలెం ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా
- బాపట్ల, ప్రకాశం, పల్నాడు, హైదరాబాద్‌కు తరలింపు
- తవ్వకాలు ఆపాలని పలుమార్లు కాలనీ వాసుల వినతి
- తాగు నీటికి ఇబ్బందులు వస్తాయని వేడుకోలు
- జిల్లా, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం నిల్ అధికార పార్టీ నేతలకే మద్దతు పలికిన అధికారులు
- మాపైనే ఫిర్యాదు చేస్తారా.. అంటూ బెదిరింపులు



నవంబర్ 27న ఆర్డీఓ, తహసీల్దార్ విచారణ సందర్భంగా ఎస్టీలను బెదిరిస్తున్న టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల : బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల ఇసుక దందా వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర సరిహద్దులు దాటి ఏకంగా జాతీయ స్థాయికి చేరింది. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటాయని, తాగునీటికి కటకట తప్పదని వేటపాలెం మండలం పుల్లరిపాలెంలోని సాయి ఎస్టీ కాలనీ వాసులు యానాది హక్కుల పరిరక్షణ సంఘం పేరున నవంబర్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. 'రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఎస్టీ కాలనీ సమీపంలోని ఇసుక దిబ్బల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పరిసర ప్రాంతాల్లోని అసైన్డ్ భూముల్లో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉండడంతో తవ్వకాల వ్యవహారాన్ని హైదరాబాద్‌కు చెందిన కొందరికి అప్పగించారు. ఈ వ్యవహారంలో స్థానిక నేతలు పెద్దఎత్తున ముడుపులు ముడుతున్నట్లు సమాచారం. వేటపాలెం ప్రాంతం నుంచి బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలతోపాటు హైదరాబాద్‌కు సైతం ఇసుక భారీగా తరలిపోతోంద'ని వారు వివరించారు. ఈ విషయమై తక్షణం విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్టీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు అందాయి. అయితే అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్న అధికారులు నవంబర్ 27న తొలి విచారణ సందర్భంగా బాధితులనే బెదిరించారు. ఈ విషయమై ఎస్టీలు మరోమారు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తహసీల్దార్, పోలీసు, ఇతర అధికారులతో కూడిన బృందం ద్వారా వీడియో రికార్డింగ్ చేస్తూ విచారించాలని ఆదేశించింది. కాగా, తాము చెప్పినట్లు విచారణలో చెప్పాలని, ఇక్కడ ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగడంలేదని అధికారులు రాసిన పేపర్లలో సంతకాలు పెట్టాలని అధికార పార్టీ నేతలు.. ఎస్టీలను బెదిరించినట్లు సమాచారం. మాపైనే ఫిర్యాదు చేస్తారా.. అని అధికారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తాము న్యాయవాదిని నియమించుకుని సమాధానం ఇస్తామని శుక్రవారం విచారణకు వచ్చిన అధికారులకు బాధితులు తేల్చి చెప్పారు.

మామూళ్ల మత్తులో అధికారులు!

వేటపాలెం ప్రాంతంలో ఇప్పటికే కనుచూపు మేర రొయ్యల చెరువులు వెలిసి, కెమికల్స్ ప్రభావంతో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, ఇప్పుడు ఇసుక తవ్వకాల వల్ల వేసవిలో తాగునీటి కోసం తమ కుటుంబాలకు ఇబ్బందులు తప్పవని యానాది హక్కుల పరిరక్షణ సంఘం ప్రెసిడెంట్ ఇండ్ల స్వాతి, సెక్రటరీ పోలయ్య, కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ విషయమై మండల, జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. అయినా కొందరు అధికారులు ఇసుక మాఫియా నుంచి నెల మామూళ్లు పుచ్చుకుంటుండటంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని సమాచారం.



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ప్రాంతం

విహంగం.. చూసి తరిద్దాం!

మూడు రోజుల పండుగ

ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు పక్షుల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మూడు రోజులు ఎగ్జిబిషన్ స్టాల్స్, ప్రతిరోజూ సినీ తారలు, సినీ యాంకర్స్‌తో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పులికాట్ సరస్సు పరిరక్షణపై పర్యావరణ వేత్తలతో సెమినార్లు నిర్వహిస్తారు. తడ మండలంలో తడ, భీములవారిపాళెం పడవల రేవు వద్ద బోట్ షికార్ ఏర్పాటు చేస్తున్నారు. నేలపట్టు చెరువులో పక్షులు సందర్శన, అక్కడే పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో పక్షులకు సంబంధించిన షో, సూళ్లూరుపేట-శ్రీహరికోట, అటకానితిప్ప- పేర్నాడు, అటకానితిప్ప-వేనాడుకు వెళ్లే రోడ్లల్లో పక్షుల గుంపులను వీక్షించేలా చర్యలు చేపడుతున్నారు. అటకానితిప్ప వద్ద ఉన్న పర్యావరణ విజ్ఞానకేంద్రం వద్ద కూడా షో నిర్వహించనున్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అన్ని ప్రభుత్వ శాఖలు వారు నిర్వహించబోయే ఎగ్జిబిషన్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో ఉద్యానవన శాఖ, షార్ వారు ఏర్పాటు చేసే స్టాల్స్ ప్రతిఏటా ఆకర్షణగా ఉంటాయి. అయితే ఈసారి శ్రీసిటి సెజ్‌లో కంపెనీల గురించి ప్రత్యేకమైన స్టాల్ ఏర్పాటు చేయనున్నారు.



ఫ్లెమింగో ఫెస్టివల్స్ సృష్టికర్త కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

2000 సంవత్సరంలో నెల్లూరు జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన ప్రవీణ్‌కుమార్ ఓ మారు కుటుంబంతో పులికాట్ సరస్సు సందర్శనకు వచ్చారు. తడ పడవల రేవు వద్ద పడవ షికారు చేసిన సమయంలో వేల సంఖ్యలో ఫ్లెమింగోలు దర్శనమిచ్చాయి. ఇలాంటి దృశ్యాలను పర్యాటకుల దృష్టికి ఎందుకు తేకూడదని ఆయనలో పుట్టిన ఆలోచనే నేటి ఫ్లెమింగోఫెస్టివల్. అనాటి ఎమ్మెల్యే పరసా వెంకటరత్నయ్యకు ఈ విషయాన్ని తెలియజేయడంతో ఆయన కలెక్టర్ ఆలోచనలకు ప్రాణం పోశారు. అప్పటి ప్రభుత్వం పండుగ నిర్వహణకు రూ.10 లక్షలు మంజూరు చేసింది. 2001 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్‌కు శ్రీకారం చుట్టారు.

ప్రకృతి అందాల హరివిల్లు పులికాట్ సరస్సును అధారంగా చేసుకుని ప్రతి ఏటా ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వచ్చే జనవరి నుంచి మూడు రోజులు పక్షుల పండుగ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు.



జనవరి 10, 11, 12 తేదీలలో ఫ్లెమింగో ఫెస్టివల్స్

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండల కేంద్రాలుగా చేసుకుని నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ (సముద్రపు రామచిలుక పండుగ)ను నాలుగేళ్ల తర్వాత మళ్లీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 10, 11, 12 తేదీలలో పండుగను నిర్వహించేందుకు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఇప్పటికే పలు సమావేశాలను నిర్వహించారు. ఆంధ్రా-తమిళనాడు సరిహద్దుల్లో సుమారు 620 చదరపు కిలోమీటర్లు పులికాట్ సరస్సును విస్తరించి ఉంది. విదేశీ వలస పక్షులకు ఈ సరస్సు ఆహార కేంద్రంగా, నేలపట్టు చెరువును సంతానోత్పత్తి కేంద్రంగా ఉపయోగించుకుంటూ తమ జీవనశైలిని ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగిస్తున్నాయి. ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినపుడు కాళంగి, స్వర్ణముఖినది, తమిళనాడులో అరణియార్, ఏడుకళ్లవారధి, పాములకాలువ, కరిపేటి కాలువల నుంచి వర్షపునీరు సరస్సులో కలుస్తుంది. బంగాళాఖాతం నుంచి పులికాట్ సరస్సుకు ముఖద్వారాల ద్వారా సముద్రంలో ఏర్పడే ఆటుపోట్లకు ఉప్పునీరు కలుస్తుంది. మంచినీరు, ఉప్పునీరు కలగలిసిన సంగమం కావడంతో మత్స్యసంపద విపరీతంగా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో కాకినాడ పండుగ, విశాఖ ఉత్సవ్ తరహాలో ఇక్కడ కూడా ప్రతి ఏటా పండుగను నిర్వహిస్తూ వచ్చారు. అయితే 2020, 2021లో కరోనా రావడం ఆపై పరిస్థితులు సహకరించకపోవడంతో నాలుగేళ్లు పండుగను చేసుకోలేకపోయారు.

1976లో పులికాట్, నేలపట్టును పక్షుల రక్షిత కేంద్రంగా ప్రకటన

1976లో వన్యప్రాణి సంరక్షణా చట్టాన్ని ప్రభుత్వం ప్రకటించింది. దీనికోసం సూళ్లూరుపేట, నేలపట్టులో పులికాట్ వన్యప్రాణి సంరక్షణా విభాగం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. బాంబే నేచురల్ బర్డ్స్ సొసైటీ వారు పులికాట్, నేలపట్టుకు వచ్చే విదేశీ వలస విహంగాలపై ఎన్నో రకాలుగా అధ్యయనం చేశారు. ముఖ్యంగా సైబీరియా, నైజీరియా, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, రష్యా, ఆఫ్ఘనిస్తాన్, ఉజ్బెకిస్థాన్ లాంటి దేశాల నుంచి పక్షులు వస్తున్నాయని గుర్తించారు. 1976 నుంచి సరస్సు పరిరక్షణకు సిబ్బందిని కూడా నియమించారు.

ఫ్లెమింగోల ప్రత్యేకత

పులికాట్ సరస్సుకు వచ్చే అతి అందమైన విదేశీ వలస పక్షుల జాతుల్లో ఫ్లెమింగోలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఈ పక్షులు హంసలను పోలి ఉంటాయి. ఇవి శాఖాహార పక్షులు. సరస్సులో ఈ పక్షులు మాత్రమే చేపలు తినకుండా కేవలం నాచును ఆహారంగా తీసుకుంటాయని పలు పరిశోధనల్లో వెల్లడైంది. అత్యంత అందమైన పక్షి కాబట్టే దీనికి ఫ్లెమింగో పేరుతో నామకరణం చేశారు.



రైతు రారాజుగా వెలగాలంటే అందివచ్చిన అవకాశాలను ఒడిసిపట్టుకోవాలి. నిరంతరం కొత్తదనం కోసం ఆలోచన చేయాలి. పది మంది చేసే సాగు కాకుండా నా రూటే సెపరేటు అన్నట్టుగా ఔరా అనిపించేలా లాభాల పంట పండించాలి. అపుడే రైతు నష్టాల నుంచి తప్పించుకుని లాభాల బాటలో పయనించే అవకాశం ఉంటుంది.

పట్టు చిక్కితే సిరులే..!



- లాభాలు కురిపిస్తున్న పట్టు పురుగుల పెంపకం
- రైతులను ప్రోత్సహిస్తున్న సెరికల్చర్ శాఖ
- జిల్లాలో 284 హెక్టార్లలో సాగవుతున్న మల్బరీ తోటలు

కోటవురట్ల: వ్యవసాయ రంగంలో పెనుమార్పులు వచ్చాయి. తదనుగుణంగా రైతులు ముందుకడుగేస్తున్నారు. పట్టు పరిశ్రమ తక్కువ కాలంలోనే ఎక్కువ ఆదాయం తెచ్చిపెడుతోంది. అందుకే ఇప్పుడు అందరి దృష్టి ఈ రంగంపై పడింది. పట్టు పురుగుల పెంపకానికి సెరికల్చర్ శాఖ రాయితీలు కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. అనకాపల్లి జిల్లాలో 284 ఎకరాల్లో పట్టు పురుగుల పెంపకం జరుగుతోంది. అందులో కోటవురట్ల మండలంలో అత్యధికంగా 125 ఎకరాల్లో మల్బరీ తోటలు పెంచుతున్నారు.

నెలలోనే ఆదాయం..

పట్టు పరిశ్రమ ద్వారా నెలలోనే ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది. పట్టు పురుగుల పెంపకానికి ప్రధానంగా కావలసిన మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే 15 ఏళ్ల వరకు తిరిగి చూడనవసరం లేదు. పట్టు గూళ్ల కోసం చాకీ పురుగులను 20 రోజులపాటు షెడ్లో జాగ్రత్తగా పెంచాల్సి ఉంటుంది. వీటికి మేతగా మల్బరీ ఆకులను వేస్తుండాలి. వీటిని తిన్న చాకీ పురుగులు పట్టు గూళ్లను అల్లుతాయి. ఇలా 28 రోజుల్లోనే పట్టు గూళ్లు ఎగుమతికి సిద్ధమవుతాయి. ప్రస్తుతం పట్టు గూళ్ల ధర కిలో రూ.650 వరకు పలుకుతోంది. ఇది కాకుండా సెరికల్చర్ శాఖ రైతుకు అదనంగా కిలోకు రూ.50 వంతున ప్రోత్సాహకం చెల్లిస్తోంది.

యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న యువకులకు పట్టు పరిశ్రమ మంచి అవకాశం కల్పిస్తోంది. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో పట్టు గూళ్ల నుంచి పట్టు దారం తీసే కేంద్రం నెలకొల్పేందుకు పట్టు పరిశ్రమ అవకాశం కల్పిస్తోంది. యూనిట్ ధర సుమారు రూ.12 లక్షలు ఉండగా పట్టు పరిశ్రమ 75 శాతం రాయితీ కల్పిస్తోంది. మిగతా 25 శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది.


లాభాలు ఇలా..

ఒక ఎకరా పరిధిలో మల్బరీ తోటలను పెంచి టైప్-1 షెడ్‌లో 200ల చాకీ పురుగులను పెంచితే ఏడాదికి నాలుగు దఫాలు పట్టు గూళ్లను తీయవచ్చు. అంటే ఏడాదికి 800 కిలోల పట్టుగూళ్ల ఉత్పత్తి సాధ్యమవుతుంది. ప్రస్తుతం ధర కిలో రూ.650 ఉండగా 800 కిలోలకు రూ.5,20,000 వరకు ఆదాయం సమకూరుతుంది.

రాయితీలతో ప్రోత్సాహం..

పట్టు పరిశ్రమను నడిపేందుకు రైతులకు ఆ శాఖ పలు రాయితీలను అందిస్తోంది. మల్బరీ మొక్కలు నాటుకోవడానికి, షెడ్ నిర్మాణానికి, ఘాట్ నిర్మించుకోవడానికి, ఇతర పరికరాలను రాయితీలు ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు మొక్కలు నాటేందుకు రూ.27 వేలు, షెడ్ నిర్మాణానికి రూ.4,05,000లు, ఓసీ, బీసీలకు మొక్కలు నాటేందుకు రూ.22,500, షెడ్డు నిర్మాణానికి రూ.3,37,500 ఆర్థిక సహాయం ఇస్తున్నారు. ఇవికాకుండా ఎస్టీ రైతులకు షెడ్ నిర్మించుకోవడానికి అదనంగా రూ.లక్ష ట్రికార్ ద్వారా ఇస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సన్నకారు రైతులకు అదనంగా రెండు ఎకరాల్లో మొక్కల పెంపకానికి ఖర్చులుగా రూ.63 వేలు అందిస్తున్నారు.

ప్రోత్సాహం ఇస్తున్నాం..



పట్టు పరిశ్రమ పెట్టుకునే రైతులను అనేక రాయితీలతో ప్రోత్సహిస్తున్నాం.పట్టు పరిశ్రమ కోసం మల్బరీ మొక్కను ఇవ్వడం నుంచి షెడ్ నిర్మాణం వరకు ఆర్థిక సహాయం ఇస్తోంది. వివరాల కోసం ఫోన్ నంబరు 9866699169లో సంప్రదించండి.

– తాళ్లూరి రాజేంద్రప్రసాద్, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి

పరస్పర సహకారానికి పెద్దపీట

- ఏపీ –టోయామా అవగాహన ఒప్పందం పునరుద్ధరణ
- ఇటీవల ఏపీఐఐసీ కార్యాలయంలో సంతకాలు

సాక్షి, అమరావతి: జపాన్‌లోని టోయామా ప్రాంతానికి చెందిన గవర్నర్ హచిరో నిట్టా నేతృత్వంలోని 14 మంది సభ్యుల బృందం ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించింది.ఈ బృందం మంగళగిరి లోని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)లో ఇరు ప్రాంతాల మధ్య కొత్త అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసింది. 2015లో ప్రారంభమైన ఈ ఒప్పందంలో భాగంగా వాణిజ్య, వ్యాపార రంగాలు, సాంస్కృతిక సంబంధాల పెంపు, విద్యార్థులు, పరిశోధకుల మధ్య అనుసంధాన కార్యక్రమాలు, డిజిటల్ రంగంలో సాంకేతిక సహకారం, ఔషధ తయారీ రంగంలో పరస్పర సహకారం ఉంటుంది. ఈ అవగాహన ఒప్పందం అనంతరం రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్య శాఖ కార్యదర్శి డా.ఎన్ యువరాజ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 25కు పైగా జపాన్ కంపెనీలు ఒకే ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. భారత్‌లోనే ఇది అతిపెద్ద జపనీస్ పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటని, ముఖ్యంగా ఔషధ తయారీ రంగంలో జపాన్ కంపెనీల పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. టోయామా గవర్నర్ నిట్టా మాట్లాడుతూ రాబోయే నాలుగేళ్ల పాటు తాను ఈ పదవిలో కొనసాగనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక జపనీస్ జెన్ గార్డెన్ ఏర్పాటు చేయడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ శాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు (ఏఐ), ఔషధ తయారీ,రక్షణ రంగాల్లో ఉమ్మడి పని బృందాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కాగా, ఈ ఒప్పందంలోని అంశాల అమలును పర్యవేక్షించేందుకు ఇరు పక్షాలు ప్రత్యేక కార్యనిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేయనున్నాయి.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 28 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,656 మంది స్వామివారిని దర్శించుకోగా 24,360 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గొబ్బిదేవతకు ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బిదేవతకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవత ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రేపు పడిమెట్ల పూజోత్సవం

సదుం: చిత్తూరు జిల్లా సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం పడిమెట్ల పూజోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ప్రతి ఏటా డిసెంబరు 26న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలోని పద్దెనిమిది మెట్లకు కేరళ సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

విద్యా సమాచారం

అధ్యాపకుడికి అవార్డు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో 'సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మల్టీడిసిప్లినరీ స్ట్రాటజీస్' అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో 'బెస్ట్ అకాడమిషన్-2024 అవార్డు'ను ఎస్వీయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఎస్.బాలసుబ్రమణ్యం అందుకున్నారు.

ఎస్వీయూలో లా సెట్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో రెండేళ్ల ఎల్ఎల్ఎమ్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం ఏపీ లాసెట్ – 2024 లో అర్హత సాధించి, ఆసక్తిగల విద్యార్థులు ర్యాంక్ కార్డ్, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల 26వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు.

27న వాలీబాల్ రాష్ట్ర జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27న ఏపీ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర సీనియర్ పురుషుల, మహిళల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

సాగుబడి

మూల కార్తె : డిసెంబర్ 29 వరకు
పూర్వాషాఢ : డిసెంబర్ 30 నుంచి







కొత్త పంట

స్టార్ ఆపిల్!

ప్రాచుర్యంలోకి రాని అద్భుతమైన ఉష్ణమండల పండ్ల జాతిలో 'స్టార్ ఆపిల్' ఒకటి. సపోటేసియా కుటుంబానికి చెందిన ఈ పండును వండర్ మిల్క్ ఫ్రూట్ అని వ్యవహరిస్తుంటారు. చూపులకు గుండ్రటి నేరేడు పండు లాగా ఉంటుంది. మధ్యకు కోసి చూస్తే నక్షత్రపు ఆకారంలో తెల్లని గుజ్జు ఉంటుంది. అందుకే దీన్ని 'స్టార్ ఫ్రూట్' అంటారు. దీని రంగును బట్టి పర్పుల్ ఆపిల్ అని కూడా పిలుస్తారు.

స్టార్ ఆపిల్ శాస్త్రీయ నామం క్రైసోఫైల్లం కైనిటో. కైనిటో, కైమిటో అని అంటుంటారు. ఈ పదాల మూలాలు పురాతన మయన్ భాషలో ఉన్నాయి. తెల్లని, తియ్యని రసం కలిగి ఉంటుంది కాబట్టి ఈ పేరు వచ్చిందట.

పుట్టిల్లు పనామా

స్టార్ ఆపిల్ మన వంటి ఉష్ణమండల ప్రాంతాల్లో సాగుకు అనువైన సతత హరిత వృక్షం. పనామా దేశంలోని ఇస్థమస్ దీని పురిటి గడ్డ. అక్కడి నుంచి గ్రేటర్ అంటిల్లెస్, వెస్ట్ ఇండీస్‌కు విస్తరించింది. ఇవ్వాళ స్టార్ ఆపిల్ విస్తరించని ఉష్ణమండల ప్రాంతాల్లేవంటే అతిశయోక్తి కాదు. ఈశాన్య ఆసియా దేశాల్లో ఈ పండ్ల చెట్టు ఎంచక్కా ఇమిడిపోయి సాగవుతోంది.

స్టార్ ఆపిల్ చెట్టు చాలా వేగంగా పెరుగుతుంది. అనుకూల వాతావరణ పరిస్థితుల్లో 20 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. ఈ ఊదా రంగు పండ్లలోని తెల్లని గుజ్జు, రసం తియ్యగా ఉంటుంది. పంట పండే స్థానిక ప్రాంతాల్లో తాజా పండ్ల వినియోగంతో పాటు ఇతర దేశాలకు వాణిజ్యపరంగా ఎగుమతి అవుతుంటాయి. కొన్ని ఉష్ణమండల దేశాల్లోని వ్యవసాయంలో స్టార్ ఆపిల్ ప్రధాన భాగంగా మారిపోయింది.

మయన్ భాషలోని కైనిటొ, కైమిటో పదాల నుంచి దీని శాస్త్రీయ నామం పుట్టింది. ఈ పండ్ల రసం తల్లిపాలు మాదిరిగా అత్యంత పోషకాలతో కూడినదని చెబుతారు. ఈ పండును అడ్డంగా రెండు ముక్కలుగా కోస్తే.. లోపలి తెల్లని గుజ్జు నక్షత్రం ఆకారంలో ఉంటుంది. అందువల్లే దీనికి స్టార్ ఆపిల్ అనే పేరు వచ్చింది. ఊదా రంగులో ఉంటుంది కాబట్టి పర్పుల్ ఆపిల్ అని కూడా అంటారు. ఈ జాతికి చెందిన కొన్ని రకాల పండ్లు పండిన తర్వాత కూడా ఆకుపచ్చగానే ఉంటాయి.

మెక్సికో నుంచి పెరూ వరకు..

స్టార్ ఆపిల్ సెంట్రల్ అమెరికాలో పుట్టినట్లు చెబుతున్నప్పటికీ దీని మూలాలు వెస్ట్ ఇండీస్‌లో కూడా ఉన్నాయని చెబుతుంటారు. దక్షిణ మెక్సికో నుంచి ఉత్తర అర్జెంటీనా, పెరు వంటి లో–మీడియం ఆల్టిట్యూడ్ ప్రాంతాల్లో విస్తారంగా సాగవుతోంది. గ్వాటిమల పసిఫిక్ తీర ప్రాంతంలో ఇది విస్తారంగా సాగు అవుతోంది. అక్కడితో దీని విస్తృతి ఆగలేదు. వియత్నాం, భారత్, చైనా, శ్రీలంక, మలేసియా, ఇండోనేసియా దేశాల్లోనూ సాగవుతోంది. కోస్టారికా, క్యూబా, డొమినిక, హైతి, హోండూరస్, జమైకా, నెదర్లాండ్స్ అంటిల్లెస్, నికరాగువ, పనామా, ఉరుగ్వే, ఫిలిప్పీన్స్, థాయిలాండ్, ఈజిప్టు, సౌత్ఆఫ్రికా, మొంజాబిక్, జింబాబ్వే తదితర దేశాల్లోనూ సాగులో ఉంది.

పోషకాలు పుష్కలం

స్టార్ ఆపిల్ గుజ్జు, రసం తియ్యగా ఉండటానికి కారణం అందులో గ్లూకోజ్ శాతం ఎక్కువగా ఉండటమే. ఈ పండులో నీరు 78–86% వరకు ఉంటుంది. వంద గ్రాముల పండ్లలో 0.71–2.33 గ్రాముల ప్రొటీన్, 15 గ్రాముల పిండి పదార్థం, 9–10 గ్రాముల టోటల్ సుగర్స్ ఉన్నాయి. దీని విత్తనాల్లో శ్యానోజెనిక్ గ్లైకోసైడ్ లుకుమిన్, తదితర యాక్టివ్ కాంపౌండ్‌లు ఉన్నాయి.

స్టార్ ఆపిల్‌లో ఉన్న జీవరసాయనాల జాబితా చెప్పాలంటే చాలానే ఉంది. ఫెనాల్స్, అల్కలాయిడ్స్, ఫ్లావనాయిడ్స్, స్టెరాయిడ్స్, సపోనిన్స్, టానిన్స్, కార్డియాక్ గ్లైకోసైడ్స్ వంటివి వున్నాయి. 2002లో వెలువడిన ఓ అధ్యయన పత్రం ప్రకారం ఈ పండులో 120 రకాల వొలేటైల్ కాన్‌స్టిట్యుయెంట్స్ ఉన్నాయి. పచ్చి, పండిన పండ్లలోనూ విటమిన్ సి బాగా ఉంది. ఆకుల్లో కూడా గాల్లిక్ యాసిడ్, ట్రిటెర్పినాయిడ్స్ వంటి ఉపయోగకరమైన కాంపౌండ్స్ ఉన్నాయి.

అధిక స్థాయిలో ఫెనోలిక్స్, ఫ్లావనాయిడ్స్ కలిగి ఉండటం వల్ల స్టార్ ఆపిల్‌కు వ్యాధినిరోధకతను పెంచే యాంటీఆక్సిడెంట్ల సామర్థ్యం మెండుగా ఉంది. ఇందులోని క్యుయెర్సెటిన్ కాంపౌండ్‌కు అత్యధిక యాంటీఆక్సిడెంట్ గుణం ఉన్నట్లు పరీక్షల్లో తేలింది.

గోళాకార పండ్లు

ఈ చెట్టు ఆకులు ఆకర్షణీయమైన ముదురు ఆకుపచ్చగా ఓవెల్ షేప్‌లో ఉంటాయి. ప్రాంతాన్ని బట్టి 5–15 సెం.మీ. పొడవు పెరుగుతాయి. ఊదా–తెలుపు రంగుల్లో ఉండే దీని పూలు చక్కని సుగంధాన్ని వెదజల్లుతూ తేనెటీగలను ఆకర్షిస్తూ ఉంటాయి. ఈ చెట్టు స్వీయ పరాగ సంపర్క సామర్థ్యం కలిగి ఉంటుంది. దీని కాయ గోళాకారంలో 2–3 అంగుళాల డయామీటర్‌లో ఉంటాయి.

ఈ పండ్లను తాజాగా తింటారు. ఈ జాతి పండ్లు ముదురు ఊదా రంగులోను, ఆకుపచ్చ–గోధుమ, పసుపు రంగుల్లో కూడా ఉంటాయి. ఊదా రంగు పండు తొక్క మందంగా, గుజ్జు గట్టిగా ఉంటుంది. రవాణాకు, నిల్వకు అనువైనవి కాబట్టి ఈ రకం స్టార్ ఆపిల్ తోటలే సాగులో ఉన్నాయి. ఆకుపచ్చ–గోధుమ రంగులో ఉండే రకం పండ్ల తొక్క పల్చగా, గుజ్జు పల్చని ద్రవంలా ఉంటుంది. పసుపు రంగులో ఉండే పండ్లు చాలా అరుదు.

ఈ కుటుంబంలోనే క్రైసోఫైల్లం కైనిటో మాదిరిగానే ప్రజాదరణ పొందుతున్న రెండు స్టార్ ఆపిల్ రకాలు ఆఫ్రికాలో సాగులో విస్తారంగా సాగులో ఉన్నాయి. అవి.. గంబేయ అల్బిద, గంబేయ ఆఫ్రికాన.



3-5 ఏళ్లకు కాపు ప్రారంభం

క్రైసోఫైల్లం కైనిటో రకం స్టార్ ఆపిల్ మొక్కలు నాటిన తర్వాత 3–5 ఏళ్లలో కాపు వస్తుంది. 6–7 ఏళ్లకు పూర్తిస్థాయి కాపు తీసుకోవచ్చు. ఫ్రూట్ చాలా త్వరగా సెట్ అవుతుంది కాబట్టి తోటల సాగుదారులకు అనుకూలంగా ఉంటుంది. శీతాకాలం ముగిసి ఎండా కాలం వచ్చే దశలో పండ్లు పక్వానికి వస్తాయి. వెస్ట్ ఇండీస్‌లో ఏప్రిల్–మే మధ్యన స్టార్ ఆపిల్స్ పుష్కలంగా మార్కెట్‌లోకి వస్తాయి. స్టార్ ఆపిల్ విత్తనాల వ్యాప్తికి గబ్బిలాలు బాగా తోడ్పడుతుంటాయి. ఏ సీజన్‌లోనైనా పచ్చగా ఉండే స్వభావం వల్ల ఈ చెట్లు వ్యాపించిన చోట్ల పచ్చదనం, పర్యావరణం పరిఢవిల్లుతాయి.

అన్ని పండ్లూ ఒకేసారి కోతకు రావు

స్టార్ ఫ్రూట్ పక్వానికి రాక ముందు బంక సాగుతూ వగరుగా ఉంటుంది. బాగా పండిపోయిన తర్వాత కోస్తే రవాణా చేయటానికి, నిల్వ చేయటానికి ఇబ్బంది అవుతుంది. అందుకని పండు ముచ్చిక దగ్గర కొంచెం ఆకుపచ్చగా ఉన్నప్పుడే కోసెయ్యాలి. తాజా పండ్లు తినొచ్చు లేదా జెల్లీలుగా మార్చి నిల్వ చేసుకోవచ్చు. ఈ పండులోని విత్తనాలు కూడా పనికొస్తాయి. విత్తనం లోపలి పప్పుతో తయారు చేసే డ్రింక్ బాదం పాల మాదిరిగా ఉంటాయి. అనేక తినుబండారాల్లో వాడుతున్నారు. ఫ్రోజెన్ స్టార్ ఫ్రూట్ గుజ్జును ఐస్‌క్రీమ్‌లు, షర్బత్‌లలో వాడుతున్నారు. కాబట్టి, వాణిజ్యపరమైన సాగుకు అనువైన పండ్ల జాతి. అయితే, నేరేడు మాదిరిగానే ఈ పంటకు కూడా కోత కూలి ఎక్కువ అవుతుంది.

మిర్చితో పాటే మొక్కజొన్న సాగు!

- 7 మిరప సాళ్లు, 1 మొక్కజొన్న సాలు విత్తుకుంటే రసం పీల్చే పురుగుల బెడద తీరింది
- 60 శాతం వరకు పురుగుమందుల అవసరం తగ్గింది
- పురుగుమందుల పిచికారీ 22 నుంచి 10కు తగ్గింది

ప్రపంచవ్యాప్తంగా సాగవుతున్న మిరప కాయల్లో సుమారు 40 శాతం వరకు మన దేశంలోనే పండిస్తున్నాం. అత్యధికంగా మిర్చిని వినియోగించే దేశం కూడా మనదే. సస్యరక్షణ కోసం పురుగుల మందుల వాడకం ఇతర కూరగాయలతో పోల్చితే మిర్చి పంటలోనే అధికం.

మిర్చి పంట మొత్తం పెట్టుబడిలో అత్యధిక శాతం సస్యరక్షణకే ఖర్చవుతుంది. ముఖ్యంగా రసం పీల్చే పురుగులు, వాటి ద్వారా వ్యాప్తి చెంది వైరస్ తెగుళ్ల నివారణకు రైతులు పెట్టుబడి ఖర్చుల్లో సుమారు 50 శాతం వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

ప్రతి సంవత్సరం రకరకాల రసం పీల్చే పురుగులు మిర్చి పంటను ఆశించి పెట్టుబడి ఖర్చును పెంచుతున్నాయి. రసం పీల్చే పురుగు ఉధృతి పెరగడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతినటం ఒక ప్రధాన కారణం.

ఒకే రకమైన పంటను అదే పొలంలో సంవత్సరాల తరబడి వరుసగా సాగు చేయడం.. కోతుల కారణంగా పొలాల్లో చెట్లను కొట్టేయడం.. మిశ్రమ పంటలు వేయకపోవడం.. మోతాదుకు మించి పురుగు మందుల వాడకంతో మిత్ర పురుగులు చనిపోవడం.. వాతావరణంలో మార్పుల వలన రసం పీల్చే పురుగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వస్తుంది.

మిర్చి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతిని అతి తక్కువ ఖర్చుతో కట్టడి చేయడానికి సిద్దిపేట జిల్లాకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున విజయవంతంగా ఒక ప్రయోగం చేశారు. నారాయణరావుపేట్ మండలం బంజరుపల్లి గ్రామానికి చెందిన సుతారి వెంకట్ వ్యవసాయ క్షేత్రంలో ప్రయోగాత్మకంగా మిర్చి పంటలు మొక్కజొన్నను అంతర పంటగా సాగు చేసి రసం పీల్చే పురుగుల ఉధృత్తిని తగ్గించడం విశేషం.



మిర్చి నారు నాటిన ఏడు రోజుల తర్వాత 7:1 నిష్పత్తిలో.. అంటే.. ప్రతి ఏడు మిర్చి సాళ్ల తర్వాత ఒక మొక్కజొన్న సాలు విత్తారు. అంతేకాకుండా మిర్చి పంటకు చుట్టూ ఎర పంటగా మొక్కజొన్న విత్తారు. ఇలా చేయడం ద్వారా పంటలో వైవిధ్యత పెరగటం.. పంటలో సూక్ష్మ ఉష్ణోగ్రతలు తగ్గటం.. తద్వారా రసం పీల్చే పురుగుల ఉధృతి తగ్గాయి.

మొక్కజొన్న మొక్కలకు ఎండ బాగా తగిలి, పోషకాలు బాగా అందటంతో ఆకులు దృఢంగా పెరిగాయి. దీని వల్ల రసం పీల్చే పురుగులకు మొక్కజొన్నను ఆశించే అనుకూలత లేకుండాపోయింది. దీంతో రసం పీల్చే పురుగుల వ్యాప్తి తగ్గిపోయింది. మిర్చి పంటలో మొక్కజొన్న అంతర పంటగా సాగు చేయడం వల్ల సుమారు 60 శాతం వరకు పురుగు మందుల వినియోగం తగ్గింది.

రైతులు సాధారణంగా 120 రోజుల పచ్చి మిర్చి పంట కాలంలో రసంపీల్చే పురుగులను నియంత్రించడానికి సుమారు 20–22 సార్లు పురుగుమందులతో పిచికారీ చేసేవారు. కానీ, ఈ పద్ధతి ద్వారా కేవలం 10 సార్లు మాత్రమే పిచికారీ చేశారు.

మొక్కజొన్న అంతర పంటగా వేయటంతో పాటు పసుపు, నీలి రంగు జిగురు అట్టలు ఎకరానికి 10 నుంచి 12 వరకు పెట్టుకున్నట్లయితే సమర్థవంతంగా రసం పీల్చే పురుగులను నివారించవచ్చని నాగార్జున తెలిపారు. అదేవిధంగా అక్షింతల పురుగులు, సాలీళ్ల తదితర మిత్రపురుగుల సంఖ్య కూడా పొలంలో పెరిగిందని నాగార్జున (96796 76685) తెలిపారు.



18% పెరుగుతున్న సేంద్రియ ఉత్పత్తుల గిరాకీ



- సేంద్రియ మార్కెట్ 2033 వరకు ఏటా 18% పెరుగుతుందని అంచనా
- పండ్లు, కూరగాయల వాటానే అధికం
- సేంద్రియ/ప్రకృతి సాగులో రెండో స్థానంలో భారత్

మన దేశంలో సేంద్రియ ఆహారోత్పత్తులకు గిరాకీ ప్రతి ఏటా 18% పెరుగుతోంది. దేశీయంగా సేంద్రియ ఆహారం వినియోగంతో పాటు విదేశాలకు ఎగుమతులు సైతం పెరుగుతున్నాయి. ముఖ్యంగా, సేంద్రియ మార్కెట్‌లో పండ్లు, కూరగాయలకు డిమాండ్ పెరుగుతోంది. ఇండియన్ ఆర్గానిక్ మార్కెట్ 2024 ట్రెండ్స్‌పై విడుదలైన తాజా నివేదిక ప్రకారం.. ఉల్లిపాయలు, బంగాళదుంపలు, టొమాటోలకు అధిక డిమాండ్ ఉంది. సేంద్రియ కూరగాయల అమ్మకాల్లో ఈ మూడిటిదీ తలా ఒక 15% వాటా. రసాయనాలు లేకుండా ప్రకృతి సేద్య పద్ధతుల్లో సాగు చేసే ఆహారోత్పత్తులపై వినియోగదారుల మక్కువ పెరుగుతుండటాన్ని దీన్ని బట్టి గమనించవచ్చు. ముఖ్యంగా ఆరోగ్య స్పృహతో పాటు కొనుగోలు శక్తి ఎక్కువగా ఉన్న పట్టణ, నగర ప్రాంతాల్లో సేంద్రియ ఆహారోత్పత్తులకు గిరాకీ పెరుగుతోంది. ఈ ధోరణిని బట్టి మన దేశంలో సేంద్రియ పండ్లు, కూరగాయలకు డిమాండ్ 2033 వరకు ప్రతి ఏటా (సిఏజీఆర్) 18% పెరుగుతుందని మార్కెట్ నిపుణుల అంచనా. ప్రకృతి/సేంద్రియ సాగును ప్రోత్సహించడానికి, సర్టిఫికేషన్ సదుపాయాలకు సంబంధించి ప్రభుత్వాలు వివిధ చర్యలు తీసుకోవటం ప్రారంభించటం వల్ల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. సిక్కింలక్ష 98% సాగుభూమిలో సేంద్రియ సాగు చేస్తున్నారు. ఉత్తరాఖండ్‌లో కూడా చాలా వరకు సేంద్రియ సాగువైపే రైతులు మళ్లారు.

తాజా ఆర్గానిక్ పండ్లు, కూరగాయలకు ఎగుమతి మార్కెట్లు కూడా అనువుగానే ఉన్నాయి. 2024 నవంబర్ నాటికే రూ. 4,159 కోట్ల విలువైన ఆర్గానిక్ ఆహారోత్పత్తులు మన దేశం నుంచి ఎగుమతి కాగా, అందులో పండ్లు, కూరగాయల వాటానే ఎక్కువ.

అంతర్జాతీయంగా చూస్తే సేంద్రియ సాగు విస్తీర్ణంలో 5.3 కోట్ల హెక్టార్లతో మొదటి స్థానంలో,
47
లక్షల హెక్టార్లతో భారత్ రెండో స్థానంలో ఉన్నాయి. అర్జెంటీనాలో 41 లక్షల హెక్టార్లలో, చైనాలో 29 లక్షల హెక్టార్లలో, ఫ్రాన్స్‌లో 28.9 లక్షల హెక్టార్లలో, ఉరుగ్వేలో 27.4 లక్షల హెక్టార్లలో, స్పెయిన్‌లో 26.8 లక్షల హెక్టార్లలో, ఇటలీలో 23 లక్షల హెక్టార్లలో, అమెరికాలో 21 లక్షల హెక్టార్లలో, జర్మనీలో 19 లక్షల హెక్టార్లలో రసాయన రహిత సర్టిఫైడ్ సేద్యం జరుగుతోందని తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి. అలాగని, సేంద్రియ రంగంలో అన్నీ సానుకూలతలే రాజ్యమేలుతున్నాయనుకుంటే పొరపాటే. సవాళ్లు కూడా ఉన్నాయి. మన దేశంలో సేంద్రియ సర్టిఫికేషన్ చార్జీలు ఎక్కువగా ఉండటం ప్రతిబంధకంగా ఉంది. ఆహార గొలుసులో తాజా పండ్లు, కూరగాయలను భద్ర పరచగానికి, రవాణా చేయటానికి అవసరమైన కోల్డ్‌స్టోరేజ్ సదుపాయాలు తక్కువగా ఉన్నాయి. దేశ, విదేశీ మార్కెట్లలో సేంద్రియ ఆహారోత్పత్తుల అమ్మకాలు అంతకంతకూ పెరగాలంటే దేశీయంగా సేంద్రియ / ప్రకృతి సేద్యం విస్తరణ, పరిశోధనలపై కూడా ప్రభుత్వాలు మరింతగా దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

'భుంగ్రు'తో తీరును నీటి ఇక్కట్లు!

- 'భుంగ్రు' (నీటిని పీల్చుకునే గొట్టం)తో నీటి కష్టాలకు చెక్
- కుండపోత వర్షాలప్పుడు నీటి ముంపును, ఎండాకాలంలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు చక్కని ఉపాయం 'భుంగ్రు'
- గుజరాత్‌కు చెందిన బిప్లవ్ కేతన్ పాల్ 'భుంగ్రు' ఆవిష్కర్త

మారిన వాతావరణ పరిస్థితుల్లో వర్షం కురిసే రోజులు తగ్గిపోవడమే కాకుండా తుపాన్ల వల్ల లేదా అకాలంగా వచ్చే కుండపోత వర్షాల సంఖ్య పెరుగుతోంది. కుండపోత వర్షాల సమయంలో ఆ నీటిని చప్పున భూగర్భంలోకి ఇంకింప జేసుకుంటే.. తదనంతరం కొన్ని నెలల పాటు సాగు నీటి కొరత ఉండదని నిపుణులు చెబుతున్నారు.

పొలాల్లో వాలుకు అడ్డంగా కందకాలు (మీటరు లోతు, మీటరు వెడల్పు, 25 మీటర్ల పొడవు) తవ్వుకుంటే అదాటుగా పెద్ద వర్షాలు పడినప్పుడు కూడా వాన నీటిని పొలం నుంచి బయటకు పోకుండా చాలా వరకు భూమిలోకి ఇంకేలా చేయవచ్చని తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం (ట్రీ) పనిగట్టుకొని గత దశాబ్దకాలంగా ప్రచారం చేస్తున్న విషయం మనకు తెలుసు. నీటి వాలులో ఉన్న బోర్ల చుట్టూ ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకుంటే వాన నీటిని కొంతమేరకు ఇంకింపజేసుకోవచ్చనీ మనకు తెలుసు...


అయినా, అదాటుగా వచ్చే కుండపోత వర్షాల నీరు ఎక్కువ శాతం పొలాల బయటకు కొట్టుకుపోతున్న సంగతి మనకు తెలిసిందే. ఇలా కొట్టుకుపోయిన వాన నీరు పొలాల పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీటి మడుగులు ఏర్పడుతుంటాయి. అలా నీటి మడుగులోకి చేరిన నీటిని భూమికి తాపించే (ఇంజెక్ట్ చేసే) ఏర్పాట్లు చేసుకుంటే.. రెండు పంటలకూ నీటి కొరతే ఉండదని బిప్లవ్ కేతన్ పాల్ చెబుతున్నారు. గుజరాత్‌కు చెందిన పాల్ 15 ఏళ్ల క్రితం ఇందుకు ఉపకరించే ఒక పద్ధతిని ఆవిష్కరించారు. దీనికి 'భుంగ్రు' అని పేరు పెట్టారు. గుజరాతీ భాషలో దీని అర్థం 'నీటిని పీల్చుకునే గొట్టం' అని అర్థం.

అతి చిన్న కమతాలున్న ఐదుగురు మహిళా రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి.. బృందానికి ఒకటి చొప్పున ప్రభుత్వ ఆర్థిక సాయంతో వందలాది భుంగ్రులను నెలకొల్పారు. మడుగుల్లోకి చేరే వాన నీటిని లేదా వరద నీటిని పీవీసీ గొట్టం ద్వారా భూమికి తాపి (ఇంజెక్ట్ చేసి).. కరువు కాలంలో ఆ నీటిని తోడుకొని నిక్షేపంగా రెండు పంటలు పండించుకొని అధిక నికరాదాయం పొందవచ్చని రుజువు చేశారు. ఒక్కో భుంగ్రు 15 ఎకరాలకు రెండు పంటలకు నీరందిస్తుంది. వేలాది చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు భుంగ్రుల ద్వారా ఆహార భద్రతను సాధించి పేదరికాన్ని జయించాయని ఆయన చెబుతున్నారు.


పొలాల్లో భూమి పైపొర వాన నీటిని ఇంకింపజేసుకోలేనంత గట్టిగా మారిన భూముల్లో కుండపోత వానలు లేదా వరదలు వచ్చినప్పుడు ఈ పద్ధతి ద్వారా నీటిని భూమిలోకి 'ఇంజెక్ట్' చేసుకోవడం ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. భూమి చౌడు బారి, భూమి లోపలి పొరల్లో ఇసుక పాళ్లు ఎక్కువగా ఉన్న భూముల్లో కూడా ఈ పద్ధతిలో వాన నీటిని ఇంకింపజేసుకోవడం ప్రయోజనకరమని అంటున్నారు. భూమి అడుగు పొరల్లో ఉప్పు నీరు ఉన్నప్పటికీ.. పైపొర ఇసుక భూమిలో స్వచ్ఛమైన వాన నీరు నిల్వ ఉంటుందని, మోటారు ద్వారా ఈ నీటిని తోడినప్పుడు ఈ మంచినీరే అందుబాటులోకి వస్తుందని, ఆ విధంగా పంటలకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా భుంగ్రు నిర్మించ దలచిన చోట భూగర్భంలోకి నీరు ఇంకింపజేయటానికి అవకాశం ఉందో, లేదో పరీక్షిస్తారు. నీరు ఇంకడానికి భూగర్భ పొరల్లో ఖాళీ ఉందనుకుంటే అక్కడ భుంగ్రు నిర్మించటం ద్వారా రైతులు ప్రయోజనం పొందుతున్నారు. అమలుపరచడానికి కందకాలతో పోల్చితే కొంచెం అధిక ఖర్చు, శ్రమతో కూడినదైనప్పటికీ.. దీని ప్రయోజనాలు దీనికి ఉన్నాయని చెప్పొచ్చు.

– సాగుబడి డెస్క్




'భుంగ్రు' (నీటిని పీల్చుకునే గొట్టం)తో ప్రయోజనాలు



ప్రతి వర్షాకాలంలో భుంగ్రు గుంత ద్వారా కనీసం 15 వేల సెంటీమీటర్ల వరద నీటిని భూమిలోపలికి ఇంకింపజేస్తుంది. భారీ వర్షం తర్వాత ఎక్కడైతే నీరు నిల్వ ఉండిపోతుందో ఆ నేల పైపొర చౌడుబారుతుంది. భుంగ్రు నిర్మాణం ద్వారా నీటి భద్రత కలగటంతో పాటు చౌడు సమస్య నుంచి కూడా బయటపడొచ్చు.

భుంగ్రు నిర్మించిన భూమిలో 4 కోట్ల లీటర్ల నీరు ఇంకుతుంది. వర్షాకాలం తర్వాత 7–8 నెలల పాటు రైతులు ఈ నీటిని వ్యవసాయానికి వాడుకోవచ్చు.





వివరాలకు: భుంగ్రు ఆవిష్కర్త బిప్లవ్ కేతన్ పాల్‌ను 0091 98255 06900 లేదా biplabkp@gmail.com ద్వారా సంప్రదించవచ్చు.

బిజినెస్ రీల్

ఏవో స్మిత్ నుంచి ఎలిగెన్స్ నియో వాటర్ హీటర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాటర్ హీటింగ్, వాటర్ ట్రీట్‌మెంట్ ఉత్పత్తుల సంస్థ ఏవో స్మిత్ కొత్తగా ఎలిగెన్స్ నియో సిరీస్ కింద వాటర్ హీటర్లు ఆవిష్కరించింది. బీఈఈ 5 స్టార్ రేటింగ్ ఉన్న ఈ హీటర్లు, రెండు రెట్లు అధికంగా తుప్పు నిరోధకత, దీర్ఘకాలిక మన్నిక కలిగి ఉంటాయని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పరాగ్ కులకర్ణి తెలిపారు. 10, 15 లీటర్ల సామర్థ్యాల్లో లభించే ఈ ఉత్పత్తుల ధర రూ. 9,800 నుంచి ప్రారంభమవుతుందని వివరించారు.

మూడేళ్లలో 8 ఎక్సలెన్స్ సెంటర్లు

ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌ను అంతర్జాతీయంగా అకౌంటింగ్, ఆడిటింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ అగర్వాల్ తెలిపారు. ఇందులో భాగంగా వచ్చే మూడేళ్లలో ఎనిమిది సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను (సీవోఈలు) ఏర్పాటు చేయనున్నట్లు, తద్వారా వాటి సంఖ్యను 11కు పెంచుకోనున్నట్లు వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్, జైపూర్‌లో రెండు సీవోఈలు ఉండగా, వచ్చే ఏడాది జనవరిలో కోల్‌కతా సీవోఈ అందుబాటులోకి వస్తుందని అగర్వాల్ చెప్పారు. ఆర్థికాంశాలు, పన్నులకు సంబంధించిన అక్షరాస్యతను పెంచేందుకు తోడ్పడే ప్రత్యేకాంశాలపై దృష్టి పెడుతున్నట్లు పేర్కొన్నారు. 2025 జనవరిలో వరల్డ్ ఫోరం ఆఫ్ అకౌంటెంట్స్‌ను (డబ్ల్యూఓఎఫ్ఏ) ఐసీఏఐ నిర్వహించనున్నట్లు అగర్వాల్ చెప్పారు.

ఇండో ఫామ్ ఎక్విప్‌మెంట్ @ రూ. 204-215

- ఈ నెల 31న ఐపీవో షురూ
- రూ. 260 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: ట్రాక్టర్లు, క్యారీ క్రేన్లు తదితర వ్యవసాయ పరికరాల తయారీ కంపెనీ ఇండో ఫామ్ ఎక్విప్‌మెంట్ పబ్లిక్ ఇష్యూకి రూ. 204-215 ధరల శ్రేణిని ప్రకటించింది. ఈ నెల 31న ప్రారంభంకానున్న ఇష్యూ 2025 జనవరి 2న ముగియనుంది. 30న యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించనుంది. ఇష్యూలో భాగంగా 86 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 35 లక్షల షేర్లను ప్రమోటర్ రణబీర్ సింగ్ ఖద్వాలియా ఆఫర్ చేయనున్నారు. తద్వారా మొత్తం రూ. 260 కోట్లు సమీకరించనుంది. ఈక్విటీ జారీ నిధులను విస్తరణలో భాగంగా పికప్, క్యారీ క్రేన్ల తయారీ ప్రత్యేక యూనిట్ ఏర్పాటుకు వెచ్చించనుంది. అంతేకాకుండా రుణ చెల్లింపులకు, ఎన్‌బీఎఫ్‌సీ అనుబంధ సంస్థ బరోటా ఫైనాన్స్‌కు మూలధన పెట్టుబడులకు సైతం నిధులను వినియోగించనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-12-2024

విశాఖ	600-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600-00
విజయవాడ	600-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	585-00
వరంగల్	587-00
రిటైల్ ధర	6.45

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	735.1	1.79
ADANIENT	2,372.00	1.41
EICHERMOT	4,800.00	1.04
NESTLEIND	2,170.00	0.86
BPCL	291.55	0.85

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
POWERGRID	310	-1.68
JSWSTEEL	923.8	-1.41
SBILIFE	1,387.30	-1.28
TITAN	3,359.00	-1.12
INFY	1,903.35	-1.09

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,706
ఎన్ఎస్ఈ	76,436
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,62,919
ఎఫ్ఐఐ	- 2454
డీఐఐ	+ 2,819

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.22	$ 69.24
బ్రెంట్	73.22	$ 72.32

ఆలోచనా విధానంలో మార్పుతోనే వికసిత్ భారత్ సాధ్యం

ఆర్థికవేత్తలతో చర్చల్లో ప్రధాని మోదీ ఉద్ఘాటన



ఆర్థికవేత్తలతో జరిగిన సమావేశంలో ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు

న్యూఢిల్లీ: భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) మార్చే దిశలో ఆలోచనా విధానంలో ప్రాథమిక మార్పు అవసరమని ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఆర్థికవేత్తలతో సమావేశం అయ్యారు. 2025-26 బడ్జెట్, ఆర్థిక పురోగతిపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన 2025-26 కేంద్ర బడ్జెట్‌ను లోక్‌సభలో సమర్పిస్తుండడం ఈ సమావేశం నేపథ్యం.

కీలక అంశాలపై సూచనలు..

ఉపాధి కల్పన, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులను సమీకరించడం వంటి కొన్ని అంశాలు ప్రధాని-ఆర్థికవేత్తల పరస్పర చర్చల్లో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు ఒక అధికారిక ప్రకటన పేర్కొంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఒత్తిళ్లు, యువతలో ఉపాధిని పెంపొందించే వ్యూహాలు వంటి పలు అంశాలపై ఆర్థికవేత్తలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్య శిక్షణా కార్యక్రమాలను అమలు చేయడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడం, స్థిరమైన గ్రామీణ ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం, ఆర్థిక వృద్ధిని పెంచడానికి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై ఆర్థికవేత్తలు సూచనలు, సలహాలు అందించారు. అందరికీ ఆర్థిక సేవలను అందుబాటులోకి తీసుకురావడం, ఎగుమతుల పెంపు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణపై కూడా ఆర్థికవేత్తలు కీలక సూచనలు చేసినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. ఆర్థిక మంత్రి సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్‌సహా సుర్జిత్ భల్లా, డీకే జోషివంటి ప్రముఖ ఆర్థికవేత్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ చెల్లింపులు

- లావాదేవీల్లో 33 శాతం వృద్ధి
- పేనియర్‌బై నివేదికలో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ స్టోర్లలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు 33 శాతం పెరిగాయి. డిజిటల్ చెల్లింపులు దూసుకెళ్తున్నాయనడానికి ఇది నిదర్శనమని డిజిటల్ బ్యాంకింగ్, నెట్‌వర్క్ సేవల్లో ఉన్న పేనియర్‌బై నివేదిక తెలిపింది. గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలలో ఆర్థిక, డిజిటల్ సేవలను అందిస్తున్న 10,00,000 కిరాణా, మొబైల్ రీఛార్జ్ వంటి చిన్న రిటైలర్ల నుండి సేకరించిన వాస్తవ లావాదేవీల సమాచారాన్ని విశ్లేషించి ఈ నివేదిక రూపొందించారు. 2024 జనవరి నుండి నవంబర్ వరకు జరిగిన వ్యాపార లావాదేవీల సమాచారాన్ని 2023తో పోల్చారు. 'ఈ ఏడాది బీమా పాలసీ కొనుగోళ్లు, ప్రీమియం వసూళ్ల లావాదేవీల పరిమాణంలో 127 శాతం పెరిగాయి. కొత్త కస్టమర్లు 96 శాతం అధికం అయ్యారు. భారత్ అంతటా బీమా చొచ్చుకుపోయే సవాళ్లను అధిగమించడంలో డిజిటల్ రిటైల్ దుకాణాలు కీలక పాత్రను పోషిస్తున్నాయి' అని నివేదిక వివరించింది.

నగదు ఉపసంహరణలు..

'గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలలో వ్యాపారం, బంగారం, వ్యక్తిగత రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్ సహా రుణ ఉత్పత్తులలో పరిమాణం 297 శాతం దూసుకెళ్లింది. ఈ గణనీయమైన పెరుగుదల అట్టడుగు స్థాయిలో రుణ పరిష్కారాల పట్ల పెరుగుతున్న అవగాహన, డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది. మైక్రో ఏటీఎం, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టమ్స్ వద్ద నగదు ఉపసంహరణలు 2024లో తగ్గాయి. లావాదేవీల పరిమాణం, ఒక్కో లావాదేవీకి సగటు నగదు ఉపసంహరణ రెండూ స్వల్ప క్షీణతను చవిచూశాయి. సగటు నగదు ఉపసంహరణ 2023లో రూ.2,624 నమోదైతే, ఈ ఏడాది ఇది రూ.2,482కి పడిపోయింది. జమ్మూ కాశ్మీర్‌లో నగదు ఉపసంహరణలు విలువలో 58 శాతం, పరిమాణంలో 74 శాతం వృద్ధిని నమోదు చేశాయి' అని నివేదిక తెలిపింది. బీమా, ఈ-కామర్స్, రుణాల వంటి విభిన్న సేవలను అందించే సాధనాలతో స్థానిక రిటైలర్లను సన్నద్ధం చేయడం ద్వారా.. అట్టడుగు స్థాయిలో ఆర్థిక లభ్యత, ఆర్థిక పురోగతికి కీలక సహాయకులుగా మారడానికి వారిని శక్తివంతం చేస్తున్నామని పేనియర్‌బై వ్యవస్థాపకుడు ఆనంద్ కుమార్ బజాజ్ తెలిపారు.

1.42 కోట్ల మంది విమానయానం

- గతేడాదితో పోలిస్తే 12 శాతం అధికం
- డీజీసీఏ నవంబర్ గణాంకాల్లో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా నవంబర్‌లో 1.42 కోట్ల మంది విమాన ప్రయాణం సాగించారు. 2023 నవంబర్‌తో పోలిస్తే ప్రయాణికుల సంఖ్య గత నెలలో 11.9 శాతం అధికం కావడం గమనార్హం. గతేడాది ఇదే కాలంలో 1.27 కోట్ల మంది విమానయానం చేశారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రకారం.. 2024 అక్టోబర్‌లో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 1.36 కోట్లుగా ఉంది. ఈ ఏడాది జనవరి-నవంబర్ కాలంలో భారత్‌లో వివిధ నగరాల మధ్య 14.64 కోట్ల మంది రాకపోకలు సాగించారు. వార్షిక వృద్ధి 5.91 శాతం నమోదైంది. గత సంవత్సరం ఇదే కాలంలో ఈ సంఖ్య 13.82 కోట్లుగా ఉంది. దేశీయ మార్కెట్ పరంగా ఇండిగో 63.6 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. ఎయిరిండియా 24.4 శాతం, అకాశా ఎయిర్ 4.7, స్పైస్‌జెట్ 3.1 శాతం వాటాతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అలయన్స్ ఎయిర్ 0.7 శాతం వాటాతో స్థిరంగా ఉంది. ఎయిరిండియాలో విస్తారా విలీనం నవంబర్‌లో పూర్తి అయింది. గత నెలలో విమానాల ఆలస్యం కారణంగా 2,24,904 మంది ప్రయాణికులపై ప్రభావం చూపింది.

గ్రీవ్స్ ఎలక్ట్రిక్ ఐపీవో బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహన తయారీ కంపెనీ గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. వీటి ప్రకారం రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 18.9 కోట్ల షేర్లను ప్రమోటర్ సంస్థ, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ప్రమోటర్ గ్రీవ్స్ కాటన్ 5.1 కోట్ల షేర్లను, ఏఎల్‌జే గ్రీన్ మొబిలిటీ సొల్యూషన్స్ డీఎంసీసీ 13.8 కోట్ల షేర్లను ఆఫర్ చేయనున్నాయి. కంపెనీ యాంపియర్ బ్రాండుతో ఎలక్ట్రిక్ స్కూటర్లు, మరో బ్రాండుతో త్రిచక్ర ఈవీలను రూపొందిస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 375 కోట్లు బెంగళూరు టెక్నాలజీ కేంద్రంలో ప్రొడక్ట్, సాంకేతిక అభివృద్ధికి, రూ. 83 కోట్లు సొంత బ్యాటరీ అసెంబ్లీ సామర్థ్యాలకు, రూ. 38 కోట్లు ఎంఎల్ఆర్ ఆటో తయారీ సామర్థ్య పెంపునకు, బెస్ట్‌వే ఏజెన్సీస్ ప్రయివేట్ తయారీ విస్తరణకు మరో రూ. 20 కోట్లు చొప్పున వెచ్చించనుంది. కంపెనీ తెలంగాణ(తూప్రాన్), తమిళనాడు(రాణీపేట్), ఉత్తరప్రదేశ్(గ్రేటర్ నోయిడా)లలో తయారీ యూనిట్లను కలిగి ఉంది. గతేడాది(2023-24) రూ. 612 కోట్ల ఆదాయం సాధించింది.

పర్యాటకుల ఎంపిక హైదరాబాద్

ఓయో ట్రావెలోపీడియా నివేదిక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ ఏడాది హైదరాబాద్‌ను సందర్శించేందుకు అత్యధికులు మొగ్గు చూపారు. ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ ప్లాట్‌ఫామ్‌పై హైదరాబాద్ అత్యధిక బుకింగ్స్ నమోదు చేసుకుంది. దేశంలో ప్రయాణ తీరుతెన్నులను తెలిపే ఓయో వార్షిక నివేదిక ట్రావెలోపీడియా 2024 ప్రకారం.. పూరీ, వారణాసి, హరిద్వార్ ప్రముఖ ఆధ్యాత్మిక గమ్యస్థానాలుగా నిలిచాయి. మతపర పర్యాటకం కీలకంగా కొనసాగింది. దేవఘర్, పళని, గోవర్ధన్ గణనీయ వృద్ధిని సాధించాయి. బుకింగ్స్ పరంగా హైదరాబాద్ తర్వాతి స్థానాల్లో బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా స్థానం సంపాదించాయి. ప్రయాణానికి అత్యంత ప్రజాదరణ పొందిన రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ తన స్థానాన్ని కొనసాగించింది. మహారాష్ట్ర, తెలంగాణ, కర్నాటక నుండి అధిక మొత్తంలో బుకింగ్స్ నమోదయ్యాయి. 48 శాతం వార్షిక వృద్ధితో పాట్నా, రాజమండ్రి, హుబ్లీ వంటి చిన్న పట్టణాలు అద్భుత వృద్ధిని కనబరిచాయి. ఈ సంవత్సరం విహార యాత్రల్లో జోరు కనిపించింది. జైపూర్ అగ్ర పర్యాటక స్థానంగా కొనసాగింది. వరుసలో గోవా, పాండిచ్చేరి, మైసూర్ ఉన్నాయి. ఆసక్తికరంగా బుకింగ్‌లలో ముంబై తగ్గుదల చవి చూసింది. జూలై నాల్గవ వారాంతంలో ఎక్కువగా బుకింగ్‌లు జరిగాయి.

శాట్‌కామ్ స్పెక్ట్రంపై త్వరలో ట్రాయ్ సిఫార్సులు



న్యూఢిల్లీ: శాటిలైట్ స్పెక్ట్రం కేటాయింపులకు సంబంధించిన నిబంధనలపై త్వరలోనే సిఫార్సులను ఇవ్వనున్నట్లు టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ చైర్మన్ ఏకే లాహోటీ తెలిపారు. వాటిని పరిశీలించిన తర్వాతే శాటిలైట్ కమ్యూనికేషన్ కంపెనీలకు స్పెక్ట్రం కేటాయింపులపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. అటుపైన దేశీయంగా శాటిలైట్ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ సేవలు ప్రారంభమవుతాయి. నిబంధనల రూపకల్పనకు సంబంధించి నవంబర్ రెండో వారంలో చర్చల ప్రక్రియ ముగిసింది. రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్ వంటి దేశీ టెలికం దిగ్గజాలు ఈ స్పెక్ట్రంను వేలం వేయాలని డిమాండ్ చేస్తుండగా.. స్టార్‌లింక్, క్విపర్‌లాంటి అంతర్జాతీయ సంస్థలు దీన్ని వేలం వేయకుండా, కేటాయించాలని కోరుతున్నాయి.

ఎకానమీ కోలుకుంటోంది

ఆర్‌బీఐ బులెటిన్



ముంబై: భారత్ ఎకానమీ సెప్టెంబర్ త్రైమాసికం తర్వాత క్రమంగా రికవరీ బాటన పయనిస్తోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బులెటిన్ పేర్కొంది. పండుగల సీజన్, గ్రామీణ డిమాండ్ పెరుగుదల దీనికి దోహదపడుతున్న అంశాలుగా వివరించింది. ద్రవ్యోల్బణం అదుపులో ఉండడం-వృద్ధి సమతౌల్యతతో ప్రపంచ ఎకానమీ కూడా సవాళ్లను తట్టుకుంటూ పురోగమిస్తున్నట్లు ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర నేతృత్వంలోని బృందం 'స్టేట్ ఆఫ్ ది ఎకానమీ' పేరుతో రూపొందించిన డిసెంబర్ బులెటిన్ విశ్లేషించింది. కాగా బులెటిన్‌లో వ్యక్తమైన అభిప్రాయాలు రచయితలవి తప్ప, ఆర్‌బీఐకి చెందినవిగా పరిగణించరాదన్న సంగతి తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటును 6.6 శాతంగా అంచనావేసిన ఆర్‌బీఐ పాలసీ సమీక్ష, క్యూ3లో 6.8 శాతం, క్యూ4లో 7.2 శాతం వృద్ధి రేట్లు నమోదవుతాయని విశ్లేషించింది. తొలి త్రైమాసికంలో 6.7 శాతం వృద్ధి నమోదవగా, రెండవ క్వార్టర్‌లో 7 క్వార్టర్ల కనిష్ట స్థాయిలో 5.4 శాతానికి చేరిన సంగతి తెలిసిందే.

వినియోగదారుల రక్షణకు ఏఐ ఆధారిత హెల్ప్‌లైన్



న్యూఢిల్లీ: వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణకు కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రల్హాద్ జోషి పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మోసపూరిత మార్కెటింగ్ విధానాలను గుర్తించేందుకు, వినియోగదారుల రక్షణకు తోడ్పడేందుకు కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్), ఈ-ఎంఏఏపీ పోర్టల్, జాగో గ్రాహక్ జాగో మొబైల్ యాప్ మొదలైన వాటిని ఆవిష్కరించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం కార్యక్రమంలో ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా పాల్గొన్నారు. వినియోగదారుల వివాదాలను వేగవంతంగా పరిష్కరించే విషయంలో గణనీయంగా పురోగతి సాధించినట్లు జోషి చెప్పారు. 2020లో ప్రవేశపెట్టిన ఈ-దాఖిల్ పోర్టల్‌ను 2023 జూన్ నాటికల్లా దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసేందుకు దీన్ని కర్ణాటక, పంజాబ్, రాజస్థాన్‌లో వంద శాతం వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

జోరుగా లెదర్ ఎగుమతులు

- 2024-25లో 5.3 బిలియన్ డాలర్లు
- సీఎల్ఈ చైర్మన్ రాజేంద్ర కుమార్



న్యూఢిల్లీ: లెదర్, పాదరక్షల ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12 శాతం పెరిగి రూ. 5.3 బిలియన్ డాలర్లకు (రూ.45 వేల కోట్లు) చేరుకుంటాయని లెదర్ ఎగుమతుల మండలి (సీఎల్ఈ) చైర్మన్ రాజేంద్ర కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో మెరుగైన డిమాండ్ ఉండడంతో రానున్న నెలల్లో ఆర్డర్లు పెరగనున్నట్లు చెప్పారు. 2023-24లో ఎగుమతులు 4.69 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అమెరికా సహా పలు దేశాలకు చెందిన అంతర్జాతీయ కంపెనీలు భారత్‌లో తయారీ కేంద్రాల ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తున్నట్లు కుమార్ తెలిపారు. భారత ఎగుమతిదారులు ఆఫ్రికాలోనూ వ్యాపార అవకాశాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. 42 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమ మొత్తం ఆదాయం 19 బిలియన్ డాలర్లు కాగా (రూ.1.61 లక్షల కోట్లు), ఇందులో ఎగుమతులు 5 బిలియన్ డాలర్ల వరకు ఉంటాయని వెల్లడించారు. "2030 నాటికి ఈ పరిశ్రమ ఆదాయం 47 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ఇందులో ఎగుమతుల రూపంలో 13.7 బిలియన్ డాలర్లు సమకూరొచ్చు" అని అంచనా వేశారు. 47 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకునేందుకు, అదనంగా 7-8 లక్షల మందికి ఉపాధి కల్పనకు వీలుగా తోలు పరిశ్రమకూ ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాన్ని (పీఎల్ఐ) విస్తరించాలని కోరారు.

బడ్జెట్ అంచనాలు..

బడ్జెట్ అంచనాలపై ఎదురైన ప్రశ్నకు కుమార్ స్పందిస్తూ.. వెట్ బ్లూ లెదర్, క్రస్ట్ లెదర్‌పై 20 శాతంగా ఉన్న ఎగుమతుల సుంకాన్ని తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖను కోరినట్లు తెలిపారు. ఫినిష్డ్ లెదర్ దిగుమతుల పైనా సుంకాన్ని తొలగించాలని కోరినట్లు చెప్పారు. భారత తోలు, తోలు ఉత్పత్తుల వృద్ధికి యూఎస్, ఈయూ కీలక మార్కెట్లుగా ఉన్నట్లు గ్రోవ్‌మోర్ ఇంటర్నేషనల్ కంపెనీ ఎండీ యద్వేంద్ర సింగ్ పేర్కొన్నారు. సామర్థ్యాలను విస్తరించడం ద్వారా అవకాశాలను పెంచుకోవాలంటూ దేశీ పరిశ్రమకు సూచించారు.

అసంఘటిత రంగంలో ఉపాధి వెల్లువ

ఏడాది కాలంలో 10 శాతం పెరుగుదల

- 7.34 కోట్లకు చేరిన సంస్థలు
- 26 శాతం మహిళలు నిర్వహిస్తున్నవే
- కేంద్ర ప్రభుత్వ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: అసంఘటిత రంగంలోని సంస్థల్లో (అన్ ఇన్‌కార్పొరేటెడ్/వ్యక్తుల ఆధ్వర్యంలోని) ఉపాధి అవకాశాల పరంగా మెరుగైన పరిస్థితులున్నట్టు ప్రభుత్వ సర్వేలో తెలిసింది. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన ఏడాది కాలంలో 10 శాతం మేర ఉద్యోగాలు పెరగ్గా, సంస్థల సంఖ్య 12 శాతం వృద్ధితో 7.34 కోట్లకు చేరినట్టు కేంద్ర ప్రణాళికలు, కార్యక్రమాల అమలు విభాగం (ఎంవోఎస్‌పీఐ) ప్రకటించింది. వ్యవసాయేతర అసంఘటిత రంగ సంస్థలపై ఈ సర్వే (ఏఎస్‌యూఎస్ఈ) జరిగింది. 2023 అక్టోబర్ నుంచి 2024 సెప్టెంబర్ కాలంలో ఈ సంస్థలకు సంబంధించి జోడించిన స్థూల అదనపు విలువ (జీవీఏ) 16.52 శాతంగా ఉన్నట్టు సర్వే నివేదిక తెలిపింది. 2024 సెప్టెంబర్ నాటికి అసంఘటిత రంగంలో ఉద్యోగాల సంఖ్య 12.05 కోట్లకు చేరగా, 2023 సెప్టెంబర్ నాటికి 10.96 కోట్లుగా ఉన్నట్టు పేర్కొంది. ఏడాది కాలంలో కోటికి పైగా ఉపాధి అవకాశాలు సమకూరినట్టు వెల్లడించింది. ఇతర సేవల విభాగంలో అత్యధికంగా 18 శాతం మేర ఉపాధి అవకాశాలు పెరగ్గా.. ఆ తర్వాత తయారీ విభాగంలో 10 శాతం అధికంగా ఉపాధి కల్పన జరిగింది. మహిళల ఆధ్వర్యంలోని సంస్థల సంఖ్య 22.9 శాతం నుంచి 26.2 శాతానికి పెరిగింది. వ్యాపార నిర్వహణలో మహిళల పాత్ర పెరగడాన్ని ఇది సూచిస్తోంది. ఈ సర్వేలో భాగంగా మొత్తం 4,98,024 సంస్థల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

వేతనాల్లోనూ వృద్ధి..

ఇంటర్నెట్ వినియోగిస్తున్న సంస్థలు 21.1 శాతం నుంచి 26.7 శాతానికి పెరిగాయి. డిజిటల్ టెక్నాలజీలవైపు సంస్థలు మళ్లుతుండడం దీని వెనుక నేపథ్యంగా ఉంది. 2023-24లో అసంఘటిత రంగంలో నియమితులైన ఉద్యోగికి వేతన చెల్లింపులు సగటున 13 శాతం పెరిగాయి. అత్యధికంగా తయారీ రంగంలో కార్మికుల వేతనాల్లో 16 శాతం వృద్ధి కనిపించింది. సగటు కార్మికుడి నుంచి జీవీఏ రూ.1,41,769 నుంచి రూ.1,49,742కు పెరిగింది.

రన్నరప్ రుత్విక-రోహన్ జోడీ

మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రియాంశికి నిరాశ



బెంగళూరు: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ)కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని రన్నరప్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో రుత్విక శివాని (పీఎస్‌పీబీ)-రోహన్ కపూర్ (ఢిల్లీ) ద్వయం 17-21, 18-21తో ఆయుశ్ అగర్వాల్-శ్రుతి మిశ్రా (ఉత్తరప్రదేశ్) జంట చేతిలో ఓడిపోయింది. మహిళల సింగిల్స్ విభాగంలో తెలంగాణకే చెందిన శ్రియాంశి వలిశెట్టి కూడా రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో శ్రియాంశి 15-21, 16-21తో దేవిక సిహాగ్ (హరియాణా) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఎం.రఘు (కర్ణాటక) 14-21, 21-14, 24-22తో మిథున్ మంజునాథ్ (రైల్వేస్)పై గెలిచి జాతీయ చాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో రఘు ఏకంగా మూడు మ్యాచ్ పాయింట్లు కాపాడుకోవడం విశేషం. మహిళల డబుల్స్ ఫైనల్లో ఆరతి సారా సునీల్ (కేరళ)-వర్షిణి (తమిళనాడు) జోడీ 21-18, 20-22, 21-17తో ప్రియా దేవి (మణిపూర్)-శ్రుతి మిశ్రా (ఉత్తరప్రదేశ్) జంటపై గెలిచింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో అర్ష్ మొహమ్మద్ (ఉత్తరప్రదేశ్)-సంస్కార్ సరస్వత్ (రాజస్తాన్) ద్వయం 12-21, 21-12, 21-19తో టాప్ సీడ్ నవీన్-లోకేశ్ (తమిళనాడు) జంటను ఓడించి టైటిల్ సొంతం చేసుకుంది.

హెడ్‌కు ఫిట్‌నెస్ పరీక్ష!



మెల్‌బోర్న్: భారత్‌తో నాలుగో టెస్టుకు ముందు ఆస్ట్రేలియాకు ఆందోళన పెంచే విషయమిది! సిరీస్‌లో చెలరేగిపోతున్న ట్రావిస్ హెడ్ 'బాక్సింగ్ డే' టెస్టులో ఆడటంపై కొంత సందిగ్ధత కనిపిస్తోంది. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న హెడ్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దాంతో తుది జట్టు ఎంపిక విషయంలో ఆసీస్‌కు ఇంకా స్పష్టత రాలేదు. మ్యాచ్‌కు ముందు రోజు హెడ్‌కు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. అప్పుడే టీమ్‌ను ప్రకటిస్తారు. ఈ సిరీస్‌లో హెడ్ వరుసగా 11, 89, 140, 152, 17 పరుగులు చేశాడు. బ్రిస్బేన్ టెస్టు రెండో ఇన్నింగ్స్ సమయంలోనే హెడ్ కండరాల నొప్పితో బాధపడ్డాడు. ఆ తర్వాత అతను ఫీల్డింగ్‌కు కూడా దిగలేదు. సోమవారం ప్రాక్టీస్‌కు పూర్తిగా దూరంగా ఉన్న అతను...మంగళవారం మాత్రం కాసేపే సాధన చేశాడు. హెడ్ స్థానం ఇంకా ఖాయం లేదని అంగీకరించిన కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్... బ్యాటింగ్ చేయడంలో ఇబ్బంది లేకపోతే కచ్చితంగా బరిలోకి దిగుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. మరోవైపు ఆసీస్ తుది జట్టులో రెండు మార్పులు ఖాయమయ్యాయి. మెక్‌స్వీనీ స్థానంలో స్యామ్ కొంటాస్ అరంగేట్రం చేయనుండగా... హాజల్‌వుడ్‌కు బదులుగా బోలండ్ జట్టులోకి వస్తాడు.

నిలకడగా కాంబ్లీ ఆరోగ్యం



ఎంఆర్‌ఐ స్కాన్ తర్వాతే ఐసీయూ నుంచి షిఫ్ట్: వైద్యులు

థానే: ఆస్పత్రిలో చేరిన భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు. తీవ్రమైన మూత్రనాళ ఇన్ఫెక్షన్ కారణంగా శనివారం అతన్ని భీవాండిలోని ఆకృతి హాస్పిటల్‌లో చేర్పించారు. తదనంతర వైద్య పరీక్షల్లో అతని మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డకడుతోందని తేలడంతో ఐసీయూలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. డాక్టర్ వివేక్ త్రివేది నేతృత్వంలోని స్పెషాలిటీ వైద్యబృందం అతన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. శనివారం రోజు కాంబ్లీ తీవ్రమైన అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారని ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్ త్రివేది తెలిపారు. అతని మెదడుకు ఎంఆర్‌ఐ స్కానింగ్ తీయాలనుకుంటున్నట్లు చెప్పారు. అయితే కాంబ్లీకి జ్వరం రావడంతో జ్వరం తగ్గాక స్కానింగ్ తీస్తామని అన్నారు. చికిత్సకు మాజీ క్రికెటర్ స్పందిస్తున్నారని ఇలాగే నిలకడగా అతని ఆరోగ్యం ఉంటే 24 గంటలు గడిచాక ఎంఆర్‌ఐ స్కాన్ రిపోర్టును సమీక్షించి ఐసీయూ నుంచి రూమ్‌కు మార్చుతామని డాక్టర్ చెప్పారు. ఆ తర్వాత కూడా మరో నాలుగు రోజులు ఆస్పత్రిలోనే ఉండి చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని వివేక్ త్రివేది వివరించారు.

'కుర్రాళ్ల దృక్పథం మార్చరాదు'

వారి సహజశైలిలో ఆడనిస్తాం

- భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్య
- కోహ్లికి సారథి మద్దతు
- రేపటి నుంచి భారత్, ఆస్ట్రేలియా నాలుగో టెస్టు





మెల్‌బోర్న్: బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో పైచేయి సాధించాలని కృతనిశ్చయంతో ఉన్న భారత్ అందుకు అన్ని విధాలా సన్నద్ధమైంది. నాలుగో టెస్టు మ్యాచ్‌కు ముందు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో ఆటగాళ్లంతా సుదీర్ఘ సాధనలో పాల్గొన్నారు. ఆస్ట్రేలియాతో సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉన్న దశలో ఈ మైదానంలో భారత్ మెరుగైన ప్రదర్శన కనబర్చేందుకు మంచి అవకాశం ఉంది. 2020-21 పర్యటనలో మెల్‌బోర్న్‌లో విజయంతోనే టీమిండియా సిరీస్ గెలుపు దిశగా అడుగు వేసింది. గురువారం 'బాక్సింగ్ డే' టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ మీడియాతో మాట్లాడాడు. తమ సన్నాహాలపై రోహిత్ ఇచ్చిన సమాధానాలు అతని మాటల్లోనే...

యశస్వి ప్రదర్శనపై...

నాకు తెలిసి జైస్వాల్, గిల్, పంత్ దాదాపు ఒకే తరహా ఆటగాళ్లు. కుర్రాళ్లుగా వారి మానసిక దృక్పథం, ఆలోచనలు ఒకే లాగా ఉంటాయి. తాము ఏం చేయగలమనేది వారికి బాగా తెలుసు. కాబట్టి వాటిని మార్చే ప్రయత్నంతో పరిస్థితులను సంక్లిష్టం చేయదల్చుకోలేదు. జైస్వాల్ ఇక్కడ మొదటిసారి ఆడుతున్నాడు. అతని ప్రతిభ ఎలాంటిదో ఇప్పటికే చూశాం. అతని బ్యాటింగ్ గురించి ఎక్కువగా చర్చించి భారం మోపవద్దు. స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వాలి. ఆసీస్ బౌలర్లపై కూడా అతనికి మంచి అవగాహన ఉంది. అటాక్‌తో పాటు అవసరమైతే జైస్వాల్ డిఫెండ్ కూడా చేయగలడు. ఒక్కసారి కుదురుకుంటే ప్రమాదకారిగా మారతాడు.

గిల్, పంత్ వైఫల్యంపై...

శుబ్‌మన్ గిల్ గురించి కూడా నేను ఇదే చెబుతాను. ఆరంభంలో 30-40 పరుగులు రాబడితే చాలు ఆపై భారీ స్కోరు సాధించడం ఎలాగో గిల్‌కు తెలుసు. ఇలాంటివి అతను గతంలో చేసి చూపించాడు. పంత్‌పై కూడా ఎలాంటి ఒత్తిడీ లేదు. తన బాధ్యతలు పంత్‌కు బాగా తెలుసు. మ్యాచ్ పరిస్థితిని బట్టి కాస్త జాగ్రత్తగా ఉండమని చెప్పడం తప్ప ఇతర విషయాల గురించి వీరితో మాట్లాడాల్సిన అవసరం లేదు.

బుమ్రా బౌలింగ్‌పై...

జస్‌ప్రీత్ బుమ్రాతో మంచి బౌలింగ్ చేయించుకోవాలంటే ఒక్కటే ఉపాయం. అతనికి అసలు ఏమీ చెప్పకుండా ఉంటే చాలు. ఏం చేయాలో, ఎలా చేయాలనే విషయంలో తన బౌలింగ్‌పై అతనికి చాలా స్పష్టత ఉంది. అతిగా ఆలోచించకుండా తన బౌలింగ్‌నే అతను నమ్ముకుంటాడు. వికెట్లు దక్కినా... దక్కకపోయినా తన ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి. కాబట్టి మ్యాచ్ మధ్యలో కూడా కొత్తగా బుమ్రాకు నేను ఎలాంటి సూచనలు ఇవ్వాల్సిన అవసరం లేదని అర్థమైంది.

తన గాయం, బ్యాటింగ్ స్థానంపై...

నా మోకాలుకు ఎలాంటి ఇబ్బందీ లేదు. అంతా బాగుంది. జట్టులో నేను ఏ స్థానంలో ఆడతాననే విషయంపై చర్చ అనవసరం. ఏం చేసినా జట్టు మేలు కోరే ప్రణాళికలు ఉంటాయి. గత టెస్టు తర్వాత రెండు బ్యాటింగ్ ప్రాక్టీస్ సెషన్లు జరిగాయి. ఈ రెండు రోజుల్లో నా ఆట ఎంతగా మారిందో చూడాలి.

కోహ్లి ఫామ్‌పై...

విరాట్ కోహ్లి ఆధునిక క్రికెట్ దిగ్గజాల్లో ఒకడు అని అంతా చెబుతుంటారు. అలాంటి ఆటగాళ్లకు ఎవరో చెప్పాల్సిన పని లేదు. వారు తమకంటూ సొంత దారిని సృష్టించుకుంటారు. లోపాలను సరిదిద్దుకొని ముందుకు వెళ్లడం ఎలాగే వారికి బాగా తెలుసు.

జోరుగా ప్రాక్టీస్...

భారత ఆటగాళ్లు మంగళవారం నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. ముఖ్యంగా కోహ్లి ఈ సిరీస్‌లో తనను ఇబ్బంది పెడుతున్న 'ఫోర్త్ స్టంప్' సమస్యను అధిగమించేందుకు ప్రయత్నించాడు. ఆఫ్ స్టంప్ బయట బంతులు వేయమని చెబుతూ హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణలకు సూచిస్తూ కోహ్లి బ్యాటింగ్ కొనసాగించాడు. సిరీస్‌లో ఇదే తరహా బంతులకు అతను వరుసగా అవుటయ్యాడు. త్రో డౌన్ స్పెషలిస్ట్ రాఘవేంద్రతో భిన్నమైన బంతులు వేయించుకొని రోహిత్ సాధన చేశాడు. బుమ్రా సహా ఇతర ప్రధాన బౌలర్లందరినీ ఎదుర్కొంటూ వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడంతో మెల్‌బోర్న్ టెస్టులో ఇద్దరు స్పిన్నర్లతో జట్టు ఆడవచ్చనే సంకేతాలు వస్తున్నాయి.

స్టోక్స్... మూడు నెలలు ఆటకు దూరం

లండన్: ఇంగ్లండ్ టెస్టు క్రికెట్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ మూడు నెలల పాటు ఆటకు దూరం కానున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో మూడో టెస్టు సందర్భంగా గాయపడ్డ స్టోక్స్... వచ్చే నెలలో శస్త్రచికిత్స చేయించుకోనున్నాడు. దీంతో మరో మూడు నెలల పాటు అతడు మైదానంలోకి దిగబోడని ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి స్టోక్స్ దూరం కానున్నాడు. ఇప్పటికే ఆ టోర్నీ కోసం ఇంగ్లండ్ బోర్డు జట్టును ప్రకటించగా... అందులో 33 ఏళ్ల స్టోక్స్‌కు చోటు కల్పించలేదు. గతంలోనూ కండరాల గాయంతో ఇబ్బంది పడ్డ స్టోక్స్... శ్రీలంక, పాకిస్తాన్‌తో సిరీస్‌లకు దూరమయ్యాడు. ఇప్పుడు మరోసారి అదే గాయం తిరగబెట్టడంతో శస్త్రచికిత్స చేయించుకోవాలని నిర్ణయించుకున్నాడు.



ఆఖరి బెర్త్ యు ముంబాదే

ఏడో స్థానంతో ప్లే ఆఫ్స్‌కు దూరమైన తెలుగు టైటాన్స్

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో సత్తా చాటిన తెలుగు టైటాన్స్... ఆ తర్వాత పడుతూ లేస్తూ చివరకు గ్రూప్ దశతోనే పోరాటాన్ని ముగించింది. మంగళవారం ముగిసిన లీగ్ దశ చివరి మ్యాచ్‌లో మాజీ చాంపియన్ యు ముంబా 36-27 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై గెలిచి ప్లే ఆఫ్స్‌కు చేరింది. యు ముంబా జట్టు ఆఖరి పోరులో 48 పాయింట్ల తేడాతో ఓడిపోయి ఉంటే టైటాన్స్ ఆరో స్థానంతో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించేది. కానీ యు ముంబా విజయం సాధించడంతో తెలుగు టైటాన్స్ ఏడో స్థానంతో లీగ్ దశకే పరిమితమైంది. కీలక పోరులో ముంబా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. అమీర్ మొహమ్మద్ 7 పాయింట్లు, అజిత్ చవాన్ 6 పాయింట్లు, సునీల్ కుమార్ 5 పాయింట్లు సాధించారు. బెంగాల్ వారియర్స్ తరఫున ప్రణయ్ 12 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. తాజా సీజన్‌లో 22 మ్యాచ్‌లాడి 12 విజయాలు, 8 పరాజయాలు, 2 'టై'లతో 71 పాయింట్లు ఖాతాలో వేసుకున్న యు ముంబా జట్టు పట్టికలో ఐదో స్థానానికి చేరి ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకుంది. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 44-30 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. యూపీ యోధాస్ తరఫున శివమ్ చౌధరీ 13 పాయింట్లు, సురేందర్ గిల్ 9 పాయింట్లతో రాణించారు. బెంగళూరు బుల్స్ తరఫున సుశీల్ 12 పాయింట్లతో ఒంటరి పోరాటం చేశాడు. నేడు విశ్రాంతి రోజు. గురువారం జరగనున్న తొలి ఎలిమినేటర్‌లో యూపీ యోధాస్‌తో జైపూర్ పింక్ పాంథర్స్, రెండో ఎలిమినేటర్‌లో పట్నా పైరేట్స్‌తో యు ముంబా తలపడనున్నాయి.



'నా వైపు నుంచే తప్పు జరిగిందేమో'

'ఖేల్‌రత్న' నామినేషన్‌పై మనూ భాకర్ స్పందన



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక క్రీడా పురస్కారం 'ఖేల్‌రత్న' నామినేషన్లలో షూటర్ మనూ భాకర్ పేరు లేకపోవడం చర్చకు దారి తీసింది. సోమవారం వెల్లడైన ఈ జాబితాలో ఈ అవార్డు కోసం ప్రతిపాదించిన ఆటగాళ్లలో హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రవీణ్ కుమార్ మాత్రమే ఉన్నారు. దరఖాస్తు సమయంలో ఏదైనా తప్పు జరిగి ఉండవచ్చని క్రీడాశాఖ పేర్కొనగా... అలాంటిదేమీ లేదని మనూ తండ్రి రామ్‌కిషన్ బదులిచ్చారు. అయితే మంగళవారం ఈ వివాదానికి ముగింపు పలికేందుకు మనూ భాకర్ సిద్ధమైంది. తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా స్పష్టతిచ్చిన మను... తన వైపు నుంచి తప్పు జరిగి ఉండవచ్చని అంగీకరించింది. 'ఒక ప్లేయర్‌గా నా దేశం తరఫున బరిలోకి దిగి బాగా ఆడటమే నా పని. అవార్డులు, గుర్తింపు అనేవి స్ఫూర్తిగా పని చేస్తాయే తప్ప అదే నా లక్ష్యం కాదు. ఖేల్‌రత్న కోసం దరఖాస్తు చేసే సమయంలో ఏదైనా లోపం ఉండవచ్చు. బహుశా నా వైపు నుంచే తప్పు జరిగింది కావచ్చు. అవార్డుతో సంబంధం లేకుండా అత్యుత్తమ ఆటను ప్రదర్శించి నా దేశానికి మరిన్ని పతకాలు అందించేందుకే ప్రయత్నిస్తా. ఈ అంశంపై మరింత ఊహాత్మకత జోడించవద్దని విజ్ఞప్తి' అని మనూ భాకర్ పేర్కొంది. మరోవైపు క్రీడామంత్రిత్వ శాఖ వ్యవహార శైలిని మనూ కోచ్ జస్పాల్ రాణా తప్పుపట్టాడు. ఆమె ఘనతలను పట్టించుకోకపోతే ఎలా అని అతను ప్రశ్నించాడు. 'సంబంధిత అధికారులదే తప్పంతా. మనూ దరఖాస్తు చేయలేదని అసలు ఎవరైనా ఎలా అంటారు. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్ మనూ. ఎలాంటి దరఖాస్తు లేకుండా ఆమె పేరు ఖేల్‌రత్న జాబితాలో ఉండాలి. ఇది ప్లేయర్‌ను అవమానించడమే. ఈ వ్యవహారశైలి మొత్తం క్రీడా వర్గాలను విస్మయానికి గురి చేసింది. తప్పుడు సంప్రదాయానికి దారి తీసిన ఇలాంటి నిర్ణయాలు ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీస్తాయి' అని జస్పాల్ వ్యాఖ్యానించాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలో రిత్విక్

తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడనున్న హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టూర్‌లో నిలకడగా రాణించిన హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడబోతున్నాడు. 23 ఏళ్ల రిత్విక్ తన డబుల్స్ ర్యాంక్ ద్వారా వచ్చే జనవరిలో జరిగే టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు నేరుగా అర్హత సాధించాడు. అమెరికాకు చెందిన రియాన్ సెగర్‌మన్‌తో కలిసి రిత్విక్ పురుషుల డబుల్స్ మెయిన్ 'డ్రా'లో ఆడనున్నాడు. ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో రిత్విక్ ప్రస్తుతం 72వ స్థానంలో ఉన్నాడు. రిత్విక్‌తోపాటు భారత ప్లేయర్లు రోహన్ బోపన్న, యూకీ బాంబ్రీ, శ్రీరామ్ బాలాజీ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ మెయిన్ 'డ్రా'లో పోటీపడతారు. హైదరాబాద్‌కే చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ 'ఆల్టర్నేట్' జాబితాలో నాలుగో స్థానంలో, భారత ప్లేయర్లు జీవన్ నెడుంజెళియన్, విజయ్ సుందర్ ప్రశాంత్ ఐదో స్థానంలో ఉన్నారు.

సాక్షి ప్లస్
బుధవారం । 25-12-2024



కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మంగళవారం ఢిల్లీలోని గిరి నగర్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లారు. అక్కడ దుకాణదారులు, మహిళా కొనుగోలుదార్లతో మాట్లాడారు. పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్యులు ఎలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నదీ తెలుసుకున్నట్లు అనంతరం 'ఎక్స్'లో తెలిపారు.



ఘాట్ రోడ్డులో వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి రోడ్డు అంచున ఉన్న పిట్టగోడపైకి దూసుకెళ్లి అక్కడే ఇరుక్కుపోయింది. భయం గొలిపే ఈ ఘటన మంగళవారం తమిళనాడులోని నమక్కల్ జిల్లాలో చోటుచేసుకుంది.

అధిక ధరలతో జనం అల్లాడుతుంటే.. ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్ర పోతోంది

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ: పెరుగుతున్న ధరలతో జనం ఓ వైపు సతమతమవుతుంటే ప్రభుత్వం మాత్రం పట్టింపులేకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఇటీవల ఢిల్లీలోని గిరి నగర్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లినప్పుడు గృహిణులతో జరిపిన సంభాషణ, ఆహార పదార్థాల ధరలు పెరుగుతుండటంతో వారెదుర్కొంటున్న ఇబ్బందులను గురించి చెప్పే వీడియోను మంగళవారం ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. 'కూరగాయల మార్కెట్‌లో వినియోగదారులతోపాటు నేనూ వెళ్లా. అధిక ధరల ప్రభావం సామాన్యుడి బడ్జెట్‌పై ఎలా ఉంది? ద్రవ్యోల్బణంతో అందరూ ఎలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అక్కడి దుకాణదారుల్ని అడిగి తెల్సుకున్నా' అని రాహుల్ పేర్కొన్నారు. ధరలు పెరగడంతో ఇది వరకటి అలవాట్లను సైతం మార్చుకున్నట్లు తెలిపారన్నారు. పెరుగుతున్న ధరలను తట్టుకోలేక సామాన్యులు ఉన్నంతలో సర్దుకుపోవడం వారికి తప్పడం లేదన్నారు. వెల్లుల్లి కిలో రూ.400 కాగా పచ్చి బఠాణీ కిలో రూ.120 ధర ఉంది. ఇలాంటి ధరలుంటే ఆదాయాలు పెరగకుండా సామాన్యుడు తినేదెలా? పొదుపు చేసేదెలా?' అని ప్రశ్నించారు. ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్రపోతోందని మండిపడ్డారు. ద్రవ్యోల్బణంతో నిత్య జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను తనకు తెలపాలంటూ ఆయన ప్రజలను కోరారు. మోదీ ప్రభుత్వం ప్రకటించిన బుల్లెట్ రైలు ఇంకా రాకున్నా..పెరుగుతున్న ధరలతో ద్రవ్యోల్బణం బుల్లెట్ ట్రెయిన్ స్పీడ్‌ను మించిందంటూ సోమవారం రాహుల్ వ్యాఖ్యానించారు.

విమానంలో మద్యం గోల

ఈనెల 20న సూరత్ నుంచి బ్యాంకాక్‌కు తొలి ఫ్లైట్

- తగినంత మద్యం సరఫరా చేయలేదని ప్రయాణికుల ఆగ్రహం
- ఖండించిన ఎయిర్ ఇండియా విమాన సిబ్బంది

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ జన్మించిన గుజరాత్‌లో మద్య నిషేధం అధికారికంగా అమల్లో ఉంది. గుజరాత్ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌కు బయలుదేరిన ప్రయాణికులు తమకు చాలినంత మద్యం సరఫరా చేయలేదంటూ గొడవకు దిగారు. విమాన సిబ్బంది తీరుపై సోషల్ మీడియాలో దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ వ్యవహారమంతా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గుజరాత్‌లోని సూరత్ నుంచి బ్యాంకాక్‌కు విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. తొలి విమానం ఈ నెల 20వ తేదీన బ్యాంకాక్‌కు బయలుదేరింది. మొత్తం 4 గంటల ప్రయాణం. అంతర్జాతీయ సర్వీసు కాబట్టి ప్రయాణికులకు మద్యం సరఫరా చేశారు. విస్కీ, రమ్, జిన్, బీర్ వంటివి ఇచ్చారు. అయితే, తమ అవసరానికి సరిపడా ఇవ్వలేదని ప్రయాణికులు మండిపడ్డారు. అరకొరగా ఇచ్చిన మద్యంతో తాము తృప్తి చెందలేదని అన్నారు. స్నాక్స్ కూడా సరిపోలేదని ఆక్షేపించారు. 'ఆల్కహాల్ ఖతం, ఫర్సన్(మిక్సర్) బాకీ'అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అయితే, ప్రయాణికుల ఆరోపణలను ఎయిర్ ఇండియా సిబ్బంది ఖండించారు. విమానంలో తగినంత మద్యం నిల్వలు ఉన్నాయని, ఎవరికీ తక్కువ లేదని స్పష్టంచేశారు. కొందరు కెపాసిటీకి మించి సేవించినట్లు కనిపించిందని, అలాంటి వారికి అదనంగా ఇవ్వలేదని చెప్పారు. నిజానికి విమానాల్లో మద్యం సరఫరా వల్ల లేనిపోని సమస్యలు వస్తున్నాయి. గత ఏడాది జనవరిలో న్యూయార్క్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో ఓ ప్రయాణికుడు మద్యం మత్తులో ఓ మహిళపై మూత్ర విసర్జన చేశాడు. 2022 డిసెంబర్‌లో పారిస్–ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానంలో ఓ ప్రయాణికుడికి మత్తు ఫుల్లుగా ఎక్కేసింది. ఓ ప్రయాణికురాలు కప్పుకున్న బ్లాంకెట్‌ను తడిపేశాడు. ఇలాంటి పరిణామాల వల్ల తీవ్ర విమర్శలు వస్తుండడంతో విమానయాన సంస్థలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ప్రయాణికులకు మోతాదుకు మించి మద్యం సరఫరా చేయడానికి నిరాకరిస్తున్నాయి.

లైంగికదాడి బాధితులకు వైద్యం నిరాకరణ నేరమే

ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు




న్యూఢిల్లీ: లైంగిక హింస, యాసిడ్ దాడి వంటి కేసుల బాధితులకు వైద్యం అందించే విషయమై ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆయా కేసుల బాధితులకు వైద్యం నిరాకరించడమే నేరమేనని స్పష్టం చేసింది. అత్యవసర వైద్యం అందించాల్సిన పరిస్థితిలో గుర్తింపు పత్రాలు తేవాలంటూ ఆస్పత్రులు, వైద్య నిపుణులు పట్టుబట్టడం సరికాదని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఇటువంటి బాధితులకు ఉచితంగా వైద్య సాయం అందించాల్సిందేనని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవంది. లేనట్లయితే బాధితుల ఫిర్యాదు మేరకు వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని జస్టిస్ ప్రతిభా ఎం.సింగ్, జస్టిస్ అమిత్ శర్మలతో కూడిన ధర్మాసనం మంగళవారం హెచ్చరించింది. ఆస్పత్రులతోపాటు వైద్య చికిత్సలు అందించే అన్ని రకాల కేంద్రాలకు ఇదే సూత్రం వర్తిస్తుందని వివరించింది. ఆయా కేసుల బాధితులకు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే కాదు, అవసరమైన ఇతర నిర్ధారణ పరీక్షలు, ఆస్పత్రిలో చేర్చుకోవడం, ఔట్ పేషెంట్‌గా వైద్యం అందించడం, సర్జరీ, భౌతిక, మానసిక కౌన్సెలింగ్, ఫ్యామిలీ కౌన్సెలింగ్ వంటి సేవలను కూడా అందించాలని తెలిపింది. తక్షణమే ఈ విషయాన్ని వైద్యులు, పరిపాలన సిబ్బంది, అధికారులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది వంటి అందరికీ చేరేలా ప్రభుత్వ యంత్రాంగాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. అత్యాచారం, సామూహిక అత్యాచారం, యాసిడ్ దాడి, లైంగికదాడి మైనర్ బాధితులు, ఇతరులకు ఉచిత వైద్య చికిత్సను అందించాలని కోరింది.

ఈ యుద్ధం గెలవాలంటే మనం కలిసి పోరాడాలి

నిరశన దీక్షలో ఉన్న రైతు నేత డల్లేవాల్

చండీగఢ్: 'ఈ యుద్ధంలో మనం విజయం సాధించాలంటే సమైక్యంగా ఉంటూ పోరాడాలి'అని రైతు నేత జగ్జీత్ సింగ్ డల్లెవాల్(70) ఉద్బోధించారు. పంజాబ్–హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీ వద్ద ఆయన చేపట్టిన దీక్ష మంగళవారం 29వ రోజుకు చేరుకుంది. డల్లెవాల్ ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు ఆయన్ను పరీక్షించిన వైద్యులు హెచ్చరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఖనౌరీలోని దీక్షా శిబిరం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఆయన మాట్లాడారు. 'నిరశన దీక్షకు మద్దతుగా నిలిచిన వారందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు. నేను బాగానే ఉన్నానని, మీ అందరికీ చెప్పాలనుకుంటున్నాను. ఈ యుద్ధంలో మనం గెలవాలి. దేశం యావత్తూ కలిసికట్టుగా పోరాడినప్పుడు మాత్రమే ఈ పోరాటంలో నెగ్గగలం. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం మనల్ని ఇక్కడి నుంచి తొలగించరాదని నేను కోరుతున్నా. ప్రభుత్వం మన పోరాటాన్ని కొనసాగనిస్తే మనం గెలుస్తాం లేదా ఇక్కడే చనిపోతాం. ఈ రెండింటిలో ఒకటి ఖాయం'అని ఆయన స్పష్టం చేశారు. డల్లెవాల్ చాలా బలహీన స్వరంతో నెమ్మదిగా రెండు నిమిషాలసేపు మాత్రం మాట్లాడగలిగారని ఆయనకు సహాయకుడిగా ఉంటున్న రైతు నేత అభిమన్యు కొహార్ చెప్పారు. తాను బాగానే ఉన్నానంటూ డల్లెవాల్ చెప్పడం అంటే..శారీరకంగా అత్యంత బలహీనంగా ఉన్నప్పటికీ, మానసికంగా ఇప్పటికీ దృఢంగా ఉన్నట్లు అర్థమని అనంతరం కొహార్ వివరించారు. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో రైతు సంఘాలు ఆందోళనలు సాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ నిరసనలకు మద్దతుగానే డల్లెవాల్ నిరాహార దీక్ష చేపట్టారు.



ఏకపక్షంగా చేర్చలేదు.. తొలగించలేదు..

మహారాష్ట్ర ఓటర్ల జాబితాపై ఎన్నికల సంఘం వివరణ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జాబితాలోని ఓటర్లను ఏకపక్షంగా తొలగించడం, చేర్చడం జరగలేదని ఎన్నికల సంఘం తెలిపింది. ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకంగా వ్యవహరించామని, అన్ని నియమాలను అనుసరించామని వెల్లడించింది. మహారాష్ట్రలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని, 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జూలై నుంచి నవంబర్ మధ్య సగటున 50వేల ఓట్లు కొత్తగా చేరాయని, అందులోని 47 స్థానాలను మహాకూటమి గెలుచుకుందని కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ ఆరోపణలకు ఈసీ సమాధానం ఇచ్చింది. సాయంత్రం 5 గంటల పోలింగ్ డేటాను తుది డేటాతో పోల్చడం సరికాదని కాంగ్రెస్‌కు ఇచ్చిన సమాధానంలో ఎన్నికల సంఘం పేర్కొంది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11:45 గంటల వరకు ఓటింగ్ శాతం పెరగడం సాధారణమేనని, ఓట్ల సమీకరణలో భాగంగా పోలైన ఓట్లకు, లెక్కించడానికి మధ్య నిజమైన తేడాలుంటాయని వివరించింది. పోలింగ్ ముగిసే సమయానికి అభ్యర్థుల అ. దీకృత ఏజెంట్ల వద్ద పోలింగ్ వివరాలతో కూడిన చట్టబద్ధమైన ఫారం 17సీ అందుబాటులో ఉన్నందున వాస్తవ ఓటింగ్‌ను మార్చడం అసాధ్యమని ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల జాబితా తయారీలో కాంగ్రెస్‌పార్టీ ప్రతినిధులు సైతం పాల్గొన్నారని తెలిపింది. అన్ని అసెంబ్లీ స్థానాల్లో భారీ తొలగింపులు, అసాధారణ తొలగింపు విధానాలు లేవని స్పష్టం చేసింది. 'రోల్ టు పోల్'(ఓటర్ల జాబితాల తయారీ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు) ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ రాజకీయ పార్టీలు కీలక భాగస్వాములుగా ఉన్నాయని ఎన్నికల సంఘం పునరుద్ఘాటించింది.

బంగ్లాదేశ్ అక్రమ వలసల రాకెట్..11 మంది అరెస్ట్

న్యూఢిల్లీ: దేశంలోకి దొంగచాటుగా బంగ్లాదేశీయులను తరలించే గ్యాంగ్ గుట్టును ఢిల్లీ పోలీసులు బయటపెట్టారు. ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేస్తున్న నలుగురు సహా ఈ ముఠాలోని 11 మందిని అరెస్ట్ చేశారు. అక్టోబర్ 21వ తేదీన సంగమ్ విహార్ ప్రాంతంలో జరిగిన సెంటు షేక్ అలియాస్ రజా హత్య కేసును ఛేదించే క్రమంలో ఈ ముఠా వ్యవహారం బయటపడినందని ఢిల్లీ సౌత్ డీసీపీ అంకిత్ చౌహాన్ చెప్పారు. మిదుల్ మియా, ఫర్దీన్ అహ్మద్ అనే వ్యక్తులను వారి భార్యలతోపాటు పట్టుకున్నామన్నారు. కొన్నేళ్ల క్రితం భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన వీరు సంగమ్ విహార్‌లో నివాసం ఉంటున్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరి వద్ద బంగ్లాదేశ్ గుర్తింపు కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు కూడా లభించాయని తెలిపారు. సెంటు షేక్ ఇంట్లో నాలుగు ఓటర్ కార్డులు, 8 పాన్ కార్డులు, 21 ఆధార్ కార్డులు దొరికినట్లు తెలిపారు. 'నకిలీ ఆధార్, ఇతర ఐడీల తయారీలో వీరికి కంప్యూటర్ సెంటర్ నడిపే సాహిల్ సెహగల్(26) సహకరిస్తున్నాడు. ఇతడికి రంజిత్, దీపక్ మిశ్రా, అఫ్రోజ్, మహ్మద్ చాంద్, సద్దాం హుస్సేన్ అనే వాళ్లు జతయ్యారు. కేవలం రూ.7 కే వీటిని వీరు విక్రయిస్తున్నారు. వీరందరినీ అరెస్ట్ చేశాం'అని డీసీపీ వెల్లడించారు. ఫేక్ డాక్యుమెంట్లు తయారీ కోసం జనతాప్రింట్స్.సైట్, పోర్టల్‌వాలె.కామ్, పోర్టల్‌వాలె.ఆన్‌లైన్ అనే వెబ్‌సైట్లను రూపొందించిన నోయిడా వాసి సోనూ కుమార్‌నూ పట్టుకున్నారు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు...

26 మందితో కాంగ్రెస్ రెండో జాబితా

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీకి జరిగే ఎన్నికలకు గాను కాంగ్రెస్ మంగళవారం 26 మంది అభ్యర్థులతో కూడిన రెండో జాబితాను విడుదల చేసింది. ఆప్ నేత మనీశ్ సిసోడియా బరిలో ఉన్న జంగ్‌పుర స్థానంలో అభ్యర్థిగా ఫర్హాద్ సూరిని ఖరారు చేసింది. అసెంబ్లీలోని మొత్తం 70 సీట్లకు గాను తాజా జాబితాతో కలిపి కాంగ్రెస్ 47 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. ఆప్ మాజీ ఎమ్మెల్యేలు ఆసిమ్ ఖాన్‌ను మటియా మహల్, దేవేందర్ సెహ్రావత్‌కు బిజ్వాసన్ టిక్కెట్లిచ్చింది.

రైలు పట్టాల మధ్యలో పడుకుని.. చావు తప్పించుకున్నాడు

ఓ వ్యక్తి పట్టాలపై నడుస్తుండగా ఎదురుగా రైలు దూసుకొచ్చింది. వెంటనే పట్టాల మధ్యలో పడుకున్నాడు. రైలు తన మీదుగా వెళ్తున్నంతసేపు కదలలేదు. మెదలలేదు. రైలు వెళ్లిపోగానే లేచి.. దుమ్ము దులుపుకొని ఇంటి దారి పట్టాడు. చూసినవారికి మాత్రం గుండె ఆగిపోయినంత పనయ్యింది. కేరళ రాష్ట్రంలో కన్నూర్ జిల్లాలో జరిగిన ఘటనను చిత్రీకరించిన ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వీడియో వైరల్ అవుతోంది. సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో.. మంగళూరు–తిరువనంతపురం ట్రైన్ కన్నూర్–చిరక్కల్ రైల్వే స్టేషన్ల గుండా వెళ్తోంది. అదే సమయంలో ఓ వ్యక్తి ఆ మార్గంలోని పట్టాల మీద నడుచుకుంటూ వెళ్తున్నాడు. అయితే అతను ఫోన్‌లో మాట్లాడుతుండటంతో రైలు దగ్గరగా వస్తున్న విషయాన్ని గమనించలేదు. తీరా చూసేసరికి.. తప్పించుకునే వీలులేకుండా పోయింది. వెంటనే సమయ స్ఫూర్తితో వ్యవహరించిన పవిత్రన్.. పట్టాల మధ్యలో పడుకున్నాడు. ట్రైన్ వెళ్లిపోగానే లేచి ఇంటికెళ్లిపోయాడు. అయితే వీడియో వెనుకనుంచి చిత్రీకరించడంతో వ్యక్తిని గుర్తించడం కష్టమైంది. వైరలైన వీడియోను చూసిన పోలీసులు.. తాగిన మత్తులో వ్యక్తి అలా చేశాడేమోనని భావించారు. తరువాత విచారించగా ఆ వ్యక్తి స్కూల్ వ్యాన్ క్లీనర్‌గా 56 ఏళ్ల పవిత్రన్ అని తేలింది. తాను తాగలేదన్న పవిత్రన్.. ప్రాణాలను కాపాడుకోవడానికి అలా పట్టాలపై పడుకున్నానని చెప్పారు. ఇంకా ఆ భయం నుంచి తేరుకోలేదన్నారు. వీడియో చూసి తాము ఆశ్చర్యపోయామని, బక్కగా ఉండటం వల్లే పవిత్రన్ ప్రాణాలతో బయటపడ్డాడని పోలీసులు అంటున్నారు. – సాక్షి, నేషనల్ డెస్క్

పుట్టిన రోజు వేడుకలకని పిలిచి... అవమానించడంతో బాలుడి ఆత్మహత్య

బస్తీ (యూపీ): పుట్టిన రోజు వేడుకలకు ఆహ్వానించారు. వచ్చిన బాలుడి బట్టలిప్పించారు. మీద మూత్ర విసర్జన చేశారు. ఆ ఘటనను వీడియోలో చిత్రీకరించారు. వీడియోను ఫోన్ నుంచి తీసేయాలని కుటుంబ సభ్యులు వేడుకున్నా వినిపించుకోలేదు. ఫిర్యాదు చేస్తే పోలీసులూ పట్టించుకోలేదు. అవమానం భరించలేక 17ఏళ్ల దళిత బాలుడు చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ అమానవీయ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాలో జరిగింది. సంత్ కబీర్‌నగర్ జిల్లాకు చెందిన బాలుడు బస్తీ జిల్లాలోని తన మేనమామ ఇంట్లో ఉంటున్నాడు. డిసెంబర్ 20వ తేదీ రాత్రి గ్రామస్తులు కొందరు బర్త్ డే పార్టీకి బాలుడిని ఆహ్వానించారు. అక్కడికి చేరుకోగానే నలుగురు వ్యక్తులు అతడిని బట్టలు విప్పి, చితకబాదారు. మూత్ర విసర్జన చేసి అవమానించారు. అంతే కాదు ఉమ్మివేసి నాకాలని బలవంతం చేశారు. ఈ తతంగం మొత్తాన్ని వీడియోలో బంధించారు. జరిగిన అవమానాన్ని బాలుడు ఇంట్లో చెప్పాడు. వీడియోను డిలీట్ చేయాలని కుటుంబ సభ్యులు వారిని కోరినా వినలేదు. దీంతో వారిపై కెప్టెన్‌గంజ్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. కానీ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడానికి ఎస్‌హెచ్‌ఓ నిరాకరించారు. నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ అవమానాన్ని భరించలేక సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బాధితుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయినా పోలీసులు పట్టించుకోలేదు. చివరకు ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలపడంతో ఎస్పీ స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కెప్టెన్‌గంజ్ ఎస్‌హెచ్‌ఓ దీపక్‌కుమార్ దూబేను సస్పెండ్ చేశారు. బాలుడి మేనమామ ఫిర్యాదు మేరకు సోమవారం ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపారు. నలుగురు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేశారు.

నాపై అవిశ్వాసం తుప్పు పట్టిన కత్తిలాంటిది: ధన్‌ఖడ్

న్యూఢిల్లీ: శస్త్రచికిత్స కోసం కూరగాయలు కోసే కత్తిని ఉపయోగించరని, అలాగే తనపై అవిశ్వాస తీర్మానం తుప్పు పట్టిన కత్తిలాంటిదని ఉపరాష్ట్రపతి జగదీప్ దనఖడ్ స్పష్టం చేశారు. అది చదివాక, దానికి ఇచ్చిన ఆరు లింకులు చూశాక తాను ఆశ్చర్యపోయానన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో మహిళా జర్నలిస్టుల బృందాన్ని ఉద్దేశించి ఉపరాష్ట్రపతి మాట్లాడారు. ఏ రాజ్యాంగ పదవి అయినా నిబద్ధత, విశిష్ట లక్షణాలతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించేందుకు కొన్ని శక్తులు ప్రణాళికాబద్ధంగా ఆజ్యం పోస్తున్నాయన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను కూల్చడమే వారి లక్ష్యమని, అధ్యక్ష పీఠాన్ని కించపరచాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దేశానికి రాష్ట్రపతి అయిన తొలి గిరిజన మహిళ అన్న విషయాన్ని మరుస్తున్నారని హెచ్చరించారు. పార్లమెంటరీ చర్చలను ప్రస్తావిస్తూ, తప్పుడు కారణాలతో ఉభయ సభలు వార్తల్లో నిలిచాయన్న ధన్‌ఖడ్.. మీడియా జవాబుదారీతనాన్ని అమలు చేయాలని, ప్రజలతో కలిసి ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెంచాలని సూచించారు.

అసదుద్దీన్ ఒవైసీకి బరేలీ కోర్టు సమన్లు

బరేలీ: ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ కోర్టు సమన్లు జారీ చేసింది. పార్లమెంట్‌లో ప్రో–పాలస్తీనా నినాదాలు ఇచ్చి రాజ్యాంగాన్ని ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు అంగీకరించిన కోర్టు.. అసదుద్దీన్ జనవరి ఏడున కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. పార్లమెంటులో ప్రమాణస్వీకారం సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. పాలస్తీనాకు అనుకూలంగా నినాదాలు చేశారని, అది భారత రాజ్యాంగాన్ని, విశ్వాసాలను ధిక్కరించడమేనని న్యాయవాది విరేంద్ర గుప్తా ఈ ఏడాది జూలై 12న చట్ట సభ్యుల కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒవైసీ నినాదం తనను గాయపరిచిందని పేర్కొన్నారు. కోర్టు పిటిషన్‌ను తిరస్కరించడంతో మళ్లీ జిల్లా కోర్టులో రివిజన్ పిటిషన్ వేశారు. హైదరాబాద్ ఎంపీగా ఒవైసీ జూన్ 25న ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన పోడియం నుంచి జై పాలస్తీనా నినాదం చేశారు. అనంతరం ఆ వ్యాఖ్యలను తొలగించాలని చైర్మన్ ఆదేశించారు. సభ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఒవైసీ తన నినాదాన్ని సమర్థించుకున్నారు. జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అనడంలో తప్పేమీ లేదన్నారు.

ఎంపీ రషీద్ రెగ్యులర్ బెయిల్‌కు ఢిల్లీ కోర్టు నో

న్యూఢిల్లీ: ఉగ్ర నిధుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జమ్మూకశ్మీర్‌కు చెందిన లోక్‌సభ సభ్యుడు రషీద్ ఇంజినీర్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు కొట్టివేసింది. అదనపు సెషన్స్ జడ్జి చందర్ జిత్ సింగ్ మంగళవారం ఈ మేరకు నిర్ణయం ప్రకటించారు. ఈ దశలో రెగ్యులర్ బెయిల్ మినహా మిగతా అంశాలపై మాత్రమే విచారణ చేపట్టగలనని పేర్కొన్నారు. ఎంపీ రషీద్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను ఎంపీ/ఎమ్మెల్యేల కోర్టు పరిశీలనకు పంపాలంటూ జడ్జి చందర్ జిత్ సింగ్ ఈ నెల 19న జిల్లా జడ్జికి పంపించారు. అయితే, ఎన్‌ఐఏ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న జిల్లా జడ్జి ఆ పిటిషన్‌ను తిరిగి అదనపు సెషన్స్ జడ్జి చందర్ జిత్ సింగ్‌కే పంపారు.ఎంపీ రషీద్ పిటిషన్ పరిధిపై ఢిల్లీ హైకోర్టు తుది నిర్ణయం వెలువరించే దాకా విచారణ కొనసాగించాలంటూ జిల్లా జడ్జి కోరారు. 2017 నాటి ఉగ్ర నిధుల కేసులో 2019 నుంచి తిహార్ జైలులో ఉంటున్న రషీద్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు.

ఉపాధ్యాయుడికి ప్రసూతి సెలవులు

పాట్నా: బిహార్ విద్యాశాఖలో ఓ వింత ఘటన జరిగింది. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రసూతి సెలవు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అది మంజూరైంది. వారం రోజుల పాటు ఆయన సెలవు కూడా తీసుకున్నారు. ఆన్‌లైన్‌లో సెలవుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు వినియోగదారుల పోర్టల్ ఓపెన్ చేయడంతో విషయం బయటపడింది. వెంటనే స్క్రీన్‌షాట్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వెలుగులోకి వచ్చింది. అయితే అది సాంకేతిక లోపం కారణంగా జరిగిన తప్పిదమని అధికారులు చెబుతున్నారు. నవజాత శిశువులను చూసుకునేందుకు పురుషులకు పెటెర్నిటీ లీవ్స్‌కు అవకాశం ఉందని, పోర్టల్‌లో 'పెటెర్నిటీ లీవ్స్' స్థానంలో 'మెటర్నిటీ లీవ్స్'గా వచ్చిందని, దాన్ని సరిచేస్తామని తెలిపారు.

ప్రిబోర్డ్ ఎగ్జామ్‌కు మొబైల్‌ఫోన్... పట్టుబడ్డానని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి

ధార్: ప్రి–బోర్డ్ పరీక్షలో సెల్‌ఫోన్ వాడుతూ పట్టుబడిన పదో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ధార్‌జిల్లాలో సోమవారం రాత్రి జరిగింది. జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలోని ఉతవాడ్ గ్రామానికి చెందిన విద్యార్థి.. ధార్‌లోని ఓ ప్రైవేట్‌పాఠశాలలో చదువుతున్నాడు. సోమవారం ప్రి–బోర్డ్ గణితం పరీక్ష జరుగుతుండగా విద్యార్థి మొబైల్ ఫోన్ ఉపయోగించినట్లు ఉపాధ్యాయుడు గుర్తించారు. ఫోన్ తీసుకుని, పరీక్ష పూర్తి చేసేందుకు మరో ఆన్సర్ షీట్ ఇచ్చారు. పరీక్ష పూర్తయిన తర్వాత పాఠశాల కార్యాలయానికి వచ్చిన విద్యార్థి.. మంగళవారం తన అన్నను తీసుకొచ్చి ఫోన్ తీసుకుంటానని చెప్పాడు. ఇంటికి వచ్చిన తరువాత ముభావంగా ఉన్న విద్యార్థి రాత్రి 9 గంటల సమయంలో గదిలో ఉరేసుకున్నాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

భోపాల్‌లో రెండు వర్గాల ఘర్షణ.. ఆరుగురికి గాయాలు

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని జహంగీరాబాద్‌లో సిక్కులు, ముస్లిం వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆ ప్రాంతంలో బైక్‌ను నిర్లక్ష్యంగా వేగంగా నడపటంపై మొదలైన వివాదం ముదిరి రాళ్లు రువ్వు కోవడం, కత్తులతో స్వైరవిహారం వంటి ఘటనలకు దారి తీసింది.అసలు వివాదం ఈ నెల 22న మొదలైంది. సిక్కులు ఎక్కువగా ఉండే పాత ధాన్యం మార్కెట్ రోడ్లపై ఫయాజ్ అనే యువకుడు నిర్లక్ష్యంగా వేగంగా బైక్‌ను నడిపాడు. దీనిపై గొడవ చెలరేగడంతో ఫయాజ్ ఓ సిక్కు వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు. 'బాధితుడి ఫిర్యాదు మేరకు ఫయాజ్, మరో ఇద్దరిని అరెస్ట్ చేశాం. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వాళ్ల కోసం వెదుకుతున్నాం'అని డీసీపీ ప్రియాంకా శుక్లా చెప్పారు. ఇలా ఉండగానే, మంగళవారం ఓ ముస్లిం యువకుడిపై సిక్కు వర్గం వారు దాడి చేయడం ఆ ప్రాంతంలో ఘర్షణలకు కారణమైంది. ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకుని, కత్తులతో బెదిరించుకున్నారు. ఆయా ఘటనల్లో ఆరుగురు గాయపడ్డారు. ఘటనల నేపథ్యంలో ఆ ప్రాంతంలో పోలీసు బందోబస్తును పెంచామని డీసీపీ వివరించారు.

తుర్కియేలో ఆయుధ ఫ్యాక్టరీలో పేలుడు.. 11 మంది దుర్మరణం

ఇస్తాంబుల్: తుర్కియేలోని ఓ ఆయుధ కర్మాగారంలో మంగళవారం ఉదయం సంభవించిన పేలుడులో 11 మంది చనిపోగా ఐదుగురు సిబ్బంది గాయపడ్డారు. బలికెసిర్ ప్రావిన్స్‌లోని కవక్లి గ్రామ సమీపంలో జరిగిన ఘటనతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్లాంట్‌లో తయారైన పేలుడు పదార్థాలు, ఆయుధాలను విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. పేలుడు తీవ్రతకు బుల్లెట్ల తయారీ యూనిట్ కుప్పకూలింది. రెండు నెలల క్రితం రాజధాని అంకారాకు సమీపంలోని రక్షణ శాఖకు చెందిన సంస్థపై జరిగిన దాడిలో ఐదుగురు చనిపోగా 22 మంది గాయపడ్డారు. ఘటనకు తామే కారణమంటూ కుర్దిస్తాన్ వేర్పాటు వాద సంస్థ పీకేకే ప్రకటించుకుంది. తాజా దాడికి విద్రోహ చర్య కారణం కాకపోవచ్చని అధికారులు అంటున్నారు.

పోలీసు క్యాంపుపై మావోయిస్టుల దాడి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా గోమగూడలో కొత్తగా ఏర్పాటైన పోలీసు క్యాంపుపైకి మావోయిస్టులు సోమవారం అర్ధరాత్రి కాల్పులు జరిపారు. బలగాలు సైతం దీటుగా బదులిచ్చాయి. మావోయిస్టులు బీజీఎల్(బారెల్ గ్రనేడ్ లాంచర్)తో చేసిన దాడిలో ఇద్దరు కమాండోలు గాయపడ్డారు. వీరిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. మావోయిస్టులకు పట్టున్న గోమగూడ అటవీ ప్రాంతంలో భద్రత బలగాలు క్యాంపు ఏర్పాటు చేసి 24 గంటలైనా గడవక ముందే ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. దీంతో, అదనపు బలగాలను రంగంలోకి దింపి కూంబింగ్ ముమ్మరం చేశారు. ఏడాది కాలంలో మావోయిస్టులకు గట్టి పట్టున్న 16 చోట్ల కొత్త పోలీస్ క్యాంపులను ఏర్పాటు చేశామని ఎస్పీ కిరణ్ చౌహాన్ చెప్పారు. ఇది తట్టుకోలేకనే వారు తరచూ బలగాలపైన, క్యాంపులపైన దాడులకు దిగుతున్నారని చెప్పారు.

అర్ధరాత్రి స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న వేళ

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగం - చారిత్రక నేపథ్యం

సి.ఆర్. ఫార్ములా (1944) (సి. రాజగోపాలాచారి సూత్రం)

ముస్లిం లీగ్ సహకారం కోసం, మతసమస్యల పరిష్కారం కోసం 1944 మార్చిలో గాంధీజీ ఆమోదంతో కాంగ్రెస్ తరఫున సి.రాజగోపాలాచారి ఒక సూత్రాన్ని ప్రతిపాదించారు. స్వయం నిర్ణయాధికార హక్కు కోసం పాకిస్తాన్‌ను ఏర్పాటు చేయాలనే ముస్లిం లీగ్ కోరికను ఆయన అంగీకరించారు. కాంగ్రెస్‌కు కావాల్సిన స్వతంత్ర సాధన, దాని కోసం ముస్లింల సహకారాన్ని పొందేందుకు ఎంత నష్టాన్నైనా భరించటానికి కాంగ్రెస్ సిద్ధమైంది. ముస్లిం లీగ్ మాత్రం దేశ స్వాతంత్ర్యం గురించి పట్టించుకోకుండా, ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చి, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా దేశ విభజనకు అంగీకరించాలని కాంగ్రెస్‌ను కోరింది.

వేవెల్ ప్రణాళిక (1945)

భారత వైస్రాయ్, గవర్నర్ జనరల్ లార్డ్ వేవెల్ నాటి బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌తో చర్చించి కొన్ని ప్రతిపాదనలు చేశారు.

ముఖ్యాంశాలు

- భారతదేశంలోని ప్రధాన మతాలకు సంబంధించిన వారికి సముచిత ప్రాతినిధ్యం కోసం వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిని విస్తరించడం.
- భారతదేశంలోని బ్రిటిష్ వారి ప్రయోజనాలు కాపాడేందుకు హైకమిషనర్‌ను నియమించడం.
- వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలో ముఖ్య సైన్యాధికారిగా భారతీయుడిని నియమించడం.
- వైస్రాయ్ కార్యనిర్వాహక వర్గం జాతీయ ప్రభుత్వంగా వ్యవహరించడం. దీని కోసం వైస్రాయి 1945 జూలైలో సిమ్లాలో ఒక సమావేశాన్ని నిర్వహించారు. కానీ కాంగ్రెస్ అవిభాజ్య భారత దేశం (యునైటెడ్ ఇండియా) కోసం పట్టు బట్టింది. ముస్లిం లీగ్ మాత్రం దేశ విభజనను సమర్థించింది.

కేబినెట్ మిషన్ (1946) (కేబినెట్ రాయబారం)

బ్రిటన్ ప్రధాని అట్లీ.. 1946 మార్చిలో పార్లమెంటులో భారతదేశానికి అధికార బదిలీకి సంబంధించి ఒక చరిత్రాత్మక ప్రకటన చేశారు. 'అల్ప సంఖ్యాకుల హక్కులపై మాకు అవగాహన ఉంది. అల్పసంఖ్యాకులు నిర్భయంగా జీవించాలి. అయితే అధిక సంఖ్యాకుల పురోగతిని కాదనే అల్ప సంఖ్యాక వర్గాన్ని కూడా మనం అనుమతించలేం' అని పేర్కొన్నారు. అందులో భాగంగా బ్రిటన్‌లో కేబినెట్ మంత్రులైన సర్ స్టాఫర్డ్ క్రిప్స్, ఎ.వి.అలెగ్జాండర్, లార్డ్ పెథిక్ లారెన్స్ సభ్యులుగా మంత్రుల బృందం భారత పర్యటన ప్రారంభించింది. ఈ బృందానికి సర్ పెథిక్ లారెన్స్ నేతృత్వం వహించారు. 1946 మే 16న వీరు తమ ప్రణాళికను వెల్లడించారు.

ముఖ్యాంశాలు

- బ్రిటిష్ పాలిత భారతదేశం, స్వదేశీ సంస్థానాలు, ఇండియన్ యూనియన్ అనే రాజకీయ వ్యవస్థ ఏర్పడుతుంది. ఆ యూనియన్ విదేశీ వ్యవహారాలు, రక్షణ, కమ్యూనికేషన్ లాంటి జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలను నిర్వహిస్తుంది.
- కేంద్ర ప్రభుత్వ పరిధిలో లేని పాలనాంశాలపై శాసనాధికారం రాష్ట్రాలకు సంక్రమిస్తుంది.
- ప్రాంతీయ ప్రభుత్వాలకు శాసన నిర్మాణ శాఖలు ఏర్పడుతాయి. పరిపాలనా నిర్వహణ కోసం 14 మంది సభ్యులతో కూడిన ఒక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటవుతుంది.
- పాకిస్తాన్ అనే మరొక దేశం ఏర్పడే భావన ఆచరణ సాధ్యం కాదు.
- రాజ్యాంగాన్ని రూపొందించేందుకు ప్రత్యేక రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటవుతుంది.

తాత్కాలిక ప్రభుత్వం (1946)

బ్రిటిష్ ప్రభుత్వం 1946 ఆగస్టు 24న తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రకటించింది. దీనికి అనుగుణంగా 1946 సెప్టెంబర్ 2న తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రారంభంలో సందేహించిన ముస్లిం లీగ్, 1946 అక్టోబర్ 29న తాత్కాలిక ప్రభుత్వంలో చేరింది. కాంగ్రెస్ తరఫున వల్లభాయ్ పటేల్, రాజేంద్ర ప్రసాద్, అరుణా అసఫ్ అలీ, రాజగోపాలాచారి, జగ్జీవన్‌రామ్ లాంటి ప్రముఖులు, ముస్లిం లీగ్ తరఫున లియాఖత్ అలీఖాన్, జె.ఎన్.మండల్, గజ్నేఫర్ అలీఖాన్ లాంటి నాయకులు మంత్రులుగా, జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా వ్యవహరించారు.

అట్లీ ప్రకటన (1947)

1947 ఫిబ్రవరి 20న కామన్స్ సభలో మాట్లాడుతూ 1948 జూన్ నాటికి బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశం నుంచి వైదొలుగుతుందని ప్రకటించారు. దీన్నే అట్లీ ప్రకటన అంటారు. ఈ ప్రకటనను బ్రిటిష్‌వారు జారీచేసిన వాటిలో అత్యుత్తమమైందిగా మహాత్మాగాంధీ వర్ణించారు.

మౌంట్‌బాటన్ ప్రణాళిక (1947)

భారతదేశ రాజ ప్రతినిధి, గవర్నర్ జనరల్ గా నియమితుడైన మౌంట్‌బాటన్ దేశంలోని రాజకీయ ప్రముఖులతో సంప్రదింపులు జరిపి, సమైక్య భారతదేశ ప్రాతిపదికన కాంగ్రెస్, ముస్లిం లీగ్ పార్టీల మధ్య అంగీకారం కుదర్చడం సాధ్యం కాదనీ, దేశ విభజన ఒక్కటే పరిష్కారంగా భావించి ప్రణాళిక తయారు చేశారు.



ముఖ్యాంశాలు

- ఇండియన్ యూనియన్‌ను భారత్, పాకిస్తాన్ అనే రెండు రాజ్యాలుగా విభజిస్తారు.
- 1948 జూన్‌కు బదులుగా 1947 ఆగస్టు 15 న రెండు దేశాలుగా విడిపోతాయి.
- అసోం భారత్‌లో అంతర్భాగంగా ఉండగా బెంగాల్, పంజాబ్‌లను మత ప్రాతిపదికన విభజించారు. అయితే ముస్లింలు అధికంగా ఉండే సిల్హట్ (బెంగాల్) జిల్లా విషయంలో మాత్రం అది తూర్పు బెంగాల్‌లో లేదా అసోంలో చేరడమా అనే విషయం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా జరుగుతుంది.
- బెలూచిస్థాన్ వాయవ్య ప్రాంతాలు భారత్ లేదా పాకిస్తాన్‌లో కానీ చేరే విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది.
- పంజాబ్, బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను విభజించే విషయంలో రెండు సరిహద్దు సంఘాలను నియమించారు.
- బ్రిటన్ ఆధ్వర్యంలోని కామన్‌వెల్త్ కూటమిలో చేరే విషయంలో భారత్, పాకిస్తాన్‌లకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

భారత స్వాతంత్ర్య చట్టం (1947)

భారతదేశ వ్యవహారాల నిర్వహణ, నియంత్రణ కోసం రూపొందించిన చివరి చట్టం ఇదే. బ్రిటన్ ప్రధాని క్లిమెంట్ అట్లీ ఆధ్వర్యంలో భారత గవర్నర్ జనరల్ లార్డ్ లూయిస్ మౌంట్‌బాటన్ సలహా మేరకు 1947 జూలై 4న బ్రిటిష్ పార్లమెంటులో భారత స్వాతంత్ర్య ముసాయిదాను ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై బ్రిటిష్ రాణి 1947 జూలై 18 న సంతకం చేసింది. ఇది 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది.

ముఖ్యాంశాలు

- ఇండియా, పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు ఏర్పడతాయి. వీటికోసం వేర్వేరు రాజ్యాంగ పరిషత్తులు కూడా ఏర్పాటవుతాయి.
- స్వదేశీ సంస్థానాలపై బ్రిటిష్ సార్వభౌమాధికారంతోపాటు భారత వ్యవహారాల కార్యదర్శి పదవి కూడా రద్దవుతుంది.
- బ్రిటిష్ రాజు లేదా రాణికి ఉన్న భారత చక్రవర్తి అనే బిరుదు రద్దవుతుంది.
- వైస్రాయ్ పదవి రద్దు అవుతుంది.
- రాజ్యాంగ పరిషత్తు తాత్కాలిక పార్లమెంటుగా పనిచేసి చట్టాలను రూపొందిస్తుంది.
- గవర్నర్ జనరల్, రాష్ట్ర గవర్నర్లు రాజ్యాంగ పరమైన అధిపతులుగా వ్యవహరిస్తారు.
- లార్డ్ మౌంట్‌బాటన్ మొదటి గవర్నర్ జనరల్‌గా నియమితులయ్యారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. 1833 చార్టర్ చట్టం ప్రకారం ప్రవేశపెట్టిన అంశాల్లో కింది వాటిలో సరికానిది?
   ఎ) ఈస్టిండియా కంపెనీ వాణిజ్య కార్యకలాపాల రద్దు
   బి) కౌన్సిల్‌లోని ఉన్నతాధికారిని గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియాగా మార్చడం
   సి) కౌన్సిల్‌లో న్యాయ చట్టాలను చేసే అధికారం గవర్నర్ జనరల్ ఇచ్చింది
   డి) గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లోని న్యాయమండలికి మొదటిసారిగా భారతీయుడిని నియమించారు
2. కింది వాటిలో సరైంది?
   ఎ) బ్రిటన్ తరహాలో భారతదేశంలో రెగ్యులర్ పోలీసు దళాన్ని ఏర్పాటు చేసిన మొదటి గవర్నర్ జనరల్ వారెన్‌హేస్టింగ్స్
   బి) రెగ్యులేటింగ్ చట్టం-1773 ద్వారా కలకత్తాలో సుప్రీంకోర్టు ఏర్పాటు ప్రతిపాదన
   సి) ఎ, బి డి) ఏదీకాదు
3. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం ఎన్ని జాబితాలు ఉండేవి?
   ఎ) రెండు బి) మూడు
   సి) అయిదు డి) ఆరు
4. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేయడానికి కారకుడు?
   ఎ) వాట్సన్ బి) రాబర్ట్ క్లైవ్
   సి) డూప్లెక్స్ డి) వారెన్ హేస్టింగ్స్
5. భారతదేశ పాలన బ్రిటిష్ చక్రవర్తి పరిధిలోకి వచ్చినట్లు విక్టోరియా రాణి ప్రకటన చేసిన రోజు?
   ఎ) 1858 నవంబర్ 1 బి) 1857 నవంబర్ 1
   సి) 1859 డిసెంబర్ 1 డి) 1857 డిసెంబర్ 1
6. భారత ప్రభుత్వ చట్టం-1919లోని ప్రధాన అంశం/ అంశాలు?
   ఎ) రాష్ట్రాల కార్యనిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం
   బి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారాల నిర్వచనం
   సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసన నిర్మాణ అధికార సంక్రమణం
   డి) పైవన్నీ
7. పాలనలో భారతీయులకు భాగస్వామ్యం కల్పించటానికి ఉద్దేశించిన మొదటి బ్రిటిష్ చట్టం?
   ఎ) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం- 1861
   బి) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం-1862
   సి) ఇండియన్ కౌన్సిళ్ల చట్టం- 1909
   డి) భారత ప్రభుత్వ చట్టం- 1919
8. 'గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం' గా నెహ్రూ దేన్ని పేర్కొన్నారు?
   ఎ) కేబినెట్ మిషన్
   బి) మౌంట్‌బాటన్ ప్రణాళిక
   సి) వేవెల్ ప్రణాళిక
   డి) భారత ప్రభుత్వ చట్టం-1935

సమాధానాలు

1) డి 2) సి 3) బి 4) బి
5) ఎ 6) డి 7) ఎ 8) డి

మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ రచనలో అత్యంత ప్రభావం చూపిన అంశం?
   ఎ) అమెరికా రాజ్యాంగం
   బి) బ్రిటిష్ రాజ్యాంగం సి) ఐరిష్ రాజ్యాంగం
   డి) భారత ప్రభుత్వ చట్టం
2. జతపరచండి.
   1) పోర్ట్ ఫోలియో పద్ధతి
   2) సివిల్ సర్వీసులు
   3) మత నియోజక వర్గాలు
   4) భారత న్యాయ సంస్కరణలు
   ఎ) లార్డ్ మెకాలే
   బి) లార్డ్ కార్న్ వాలిస్
   సి) లార్డ్ కానింగ్
   డి) లార్డ్ మింటో
   ఎ) 1-సి, 2-బి, 3-డి, 4-ఎ
   బి) 1-బి, 2-సి, 3-ఎ, 4-డి
   సి) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
   డి) 1-ఎ, 2-బి, 3-డి, 4-సి
3. కాలక్రమం ప్రకారం కింది వాటిని గుర్తించండి?
   1) ప్రత్యేక నియోజకవర్గాలు
   2) శాసన అధికారాల బదలాయింపు
   3) ద్విసభా విధానం
   4) డొమినియన్ ప్రతిపత్తి
   ఎ) 1, 2, 3, 4, బి) 2, 1, 3, 4
   సి) 3, 2, 1, 4 డి) 3, 4, 1, 4
4. ప్రభుత్వానికి ఉండే అధికారం దేనికి ఉదాహరణ?
   ఎ) సంప్రదాయ అధికారం
   బి) సమ్మోహనాధికారం
   సి) చట్టబద్ధ, హేతుబద్ధ అధికారం
   డి) పైవన్నీ

సమాధానాలు

1) డి 2) ఎ 3) ఎ 4) సి

వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?



మాదిరి ప్రశ్నలు

1. భూమిపై ఉన్న వృక్షాలన్నీ నశిస్తే జీవులన్నీ మరణిస్తాయి. కారణం? (సివిల్స్, 1988)
   1) కార్బన్ డై ఆక్సైడ్ లేకపోవడం
   2) ఆక్సిజన్ లేకపోవడం
   3) 1, 2 4) ఏదీకాదు
2. మడ వృక్షాలు (మంగ్రూవ్ అడవులు) అంటే? (గ్రూప్-1, 1999)
   1) నీటి మొక్కలు
   2) ఉప్పునీటి వృక్షాలు
   3) పండ్లనిచ్చే వృక్షాలు 4) ఆల్గే
3. హైడ్రోఫోనిక్స్ అంటే ఏమిటి? (సివిల్స్, 2000)
   1) ధ్వని తరంగాలతో నీటిని శుద్ధిచేయడం
   2) వాతావరణం, నీరు అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
   3) మృత్తిక అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
   4) తడి గాలిని పంపి మొక్కలను పెంచే పద్ధతి
4. హెర్బేరియం అనేది ఒక.. ? (ఎఫ్ఆర్ఓ, 2005)
   1) ఎండు ఔషధ మొక్కల సంకలనం
   2) వివిధ ఔషధ మొక్కల తోట
   3) విత్తనాలను నిల్వచేసే సంస్థ
   4) ఎండు మొక్కల నమూనాలను భద్రపరిచే సంస్థ
5. కాఫీలో కలిపే చికోరి పొడర్‌ను మొక్క ఏ భాగం నుంచి గ్రహిస్తారు? (గ్రూప్-1, 2010)
   1) కాండం 2) వేరు
   3) ఆకులు 4) విత్తనాలు
6. 'రాడిష్' అనేది ఒక ..? (ఏఈఈ, 2009)
   1) బల్బ్ 2) మొక్కజొన్న
   3) మార్పుచేసిన వేరు
   4) ట్యూబర్
7. వేరు బుడిపెలు ఉన్న పంటలను ఎక్కువగా సాగు చేస్తే నేలలో స్థాపితమయ్యే మూలకం ఏది? (వీడీవో, 1992)
   1) కాల్షియం 2) పొటాషియం
   3) భాస్వరం 4) నత్రజని
8. అల్లం అనేది ఒక ..? (గ్రూప్-1, 2003, గ్రూప్-4, 1996)
   1) కండ కలిగిన వేరు
   2) కండ కలిగిన కాండం
   3) నిల్వచేసే వేరు
   4) ఉపవాయుగత కాండం
9. 'జెనెటిక్స్' అనే పదాన్ని ప్రతిపాదించింది ఎవరు?
   1) హ్యూగో డీవ్రీస్ 2) మెండల్
   3) బేట్‌సన్ 4) సట్టన్-జొహెన్‌సన్
10. ఆకుల ద్వారా జరిగే ట్రాన్స్పిరేషన్ ప్రక్రియలో పాల్గొనే నిర్మాణాలేవి? (గ్రూప్-2, 2003)
    1) క్యూటికిల్ 2) లెంటిసెల్స్
    3) స్టొమాట 4) హైడథోడ్స్
11. కుంకుమపువ్వును మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్-1, 1999)
    1) ఎండిన రక్షక పత్రాలు
    2) ఎండిన పూమొగ్గలు
    3) కీలాగ్రం 4) ఆకర్షణ పత్రాలు
12. కింద పేర్కొన్న పత్రరంధ్రాల ద్వారా నీరు బిందువుల రూపంలో స్రవితమవుతుంది. ఆ నిర్మాణాలను ఏమంటారు? (సివిల్స్, 1996)
    1) లెంటిసెల్స్ 2) ఫయలోపోర్
    3) హైడథోడ్స్ 4) స్టొమాట
13. పీచర్ ప్లాంట్‌లోని ఏ భాగం పీచర్‌గా మార్పు చెందుతుంది? (సివిల్స్, 2007; ఎఫ్ఆర్ఓ, 2009)
    1) కాండం 2) ఆకు
    3) స్టిప్యూల్స్ 4) పిటియోల్
14. కింది వాటిలో మాంసాహార మొక్క ఏది? (సివిల్స్, 1996)
    1) నెపంథిస్ 2) డ్రాసిరా
    3) డయోనియా 4) పైవన్నీ
15. జీవితకాలంలో కొన్ని మొక్కలు ఒకేసారి పుష్పిస్తాయి. వాటిని ఏమని పిలుస్తారు? (గ్రూప్-4, 2010)
    1) మోనోకార్పిక్ 2) మోనోగామస్
    3) మోనోజెనిక్ 4) మోనోమార్ఫిక్
16. అతిపెద్ద పుష్పం ఏది? (గ్రూప్-4, 2010)
    1) క్రైసాంథిమమ్ 2) రఫ్లీషియా
    3) సన్‌ఫ్లవర్ 4) జిన్నియా
17. ఆపిల్‌లో తినే భాగం ఏది? (గ్రూప్-4, 1998)
    1) కార్పెల్ 2) థాలమస్
    3) పెడిసిల్ 4) ఎండోకార్ప్
18. పప్పుధాన్యాల్లో ప్రధానంగా ఉండే పోషక విలువలేవి? (ఏఈఈ, 2009)
    1) పిండి పదార్థాలు 2) విటమిన్లు
    3) కొవ్వులు 4) మాంసకృత్తులు
19. సుగంధద్రవ్యంగా ఉపయోగపడే లవంగం అనేది ఒక..? (డీఎల్, 2012)
    1) వేరు 2) ఫలం
    3) ఎండిన విప్పారని పూమొగ్గ
    4) కాండం
20. 'చందన వృక్షం' శాస్త్రీయ నామం? (గ్రూప్-4, 2002)
    1) సాంటాలమ్ ఆల్బం
    2) షోరియా రొబెస్టా
    3) సిడ్రస్ డియోడరా
    4) పైనస్ రాక్స్‌బర్గై
21. 'మార్ఫిన్'ను మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2003)
    1) పుష్పం 2) ఆకు
    3) పండు/కాయ లేటెక్స్ 4) కాండం
22. వృక్ష కణం, జంతు కణానికి మధ్య తేడా? (వాటర్‌వర్క్స్ మేనేజర్, 2008)
    1) కేంద్రకం 2) ప్లాస్మాత్వచం
    3) క్లోరోప్లాస్ట్ 4) మైటోకాండ్రియా
23. సూక్ష్మదర్శిని ద్వారా కణాన్ని పరిశీలించిన తొలి శాస్త్రవేత్త ఎవరు? (గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2000)
    1) రాబర్ట్ హుక్ 2) ఎ.వి. లీవెన్‌హుక్
    3) టి. ష్వాన్ 4) ఎం.జె. ష్లైడన్
24. కింది వాటిలో ప్రోకారియోటిక్ (కేంద్రక పూర్వ) కణం కానిది?
    1) క్లోరెల్లా 2) ఈస్ట్
    3) క్షయ బ్యాక్టీరియా 4) 1, 2
25. వాణిజ్యపరంగా 'కార్క్' అనేది ఏ వృక్షం నుంచి తీసిన బెండు?
    1) ఎల్మ్ 2) విల్లో
    3) ఆర్కిడ్ 4) ఓక్
26. 'ప్రతి జీవి దేహం కణాలతో నిర్మితమవుతుంది. జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం కణం' అని కణ సిద్ధాంతాన్ని వివరించినవారు? (సివిల్స్, 1998)
    1) లూయీపాశ్చర్
    2) రాబర్ట్ హుక్ 3) ష్లైడన్-ష్వాన్
    4) లీవెన్‌హుక్
27. జన్యువు (Gene) అంటే? (గ్రూప్-1, 1988)
    1) ప్రోటీన్‌లోని అమైనో ఆమ్లం
    2) ఆర్ఎన్ఏలో కొంత భాగం
    3) డీఎన్ఏ ముక్క
    4) సహలగ్న సముదాయం
28. అంతర్లీనంగా దాగి ఉండే లక్షణాన్ని ఏమంటారు? (గ్రూప్-4, 1989)
    1) డామినెంట్ 2) F_1 జనరేషన్
    3) రెసిసివ్ 4) పైవేవీకాదు
29. హరగోవింద్ ఖురానా చేసిన పరిశోధన ఏమిటి? (పాలిటెక్నిక్ లెక్చరర్, 2011)
    1) నూతన కణాల గుర్తింపు
    2) ప్రయోగశాలలో కృత్రిమ జన్యువు సృష్టి
    3) మొక్కల్లో పరివర్తన
    4) జన్యు మార్పిడి
30. 'జన్యువు' అని పేరు పెట్టినవారెవరు?
    1) బేట్‌సన్ 2) మెండల్
    3) జొహెన్‌సన్ 4) క్రిక్-వాట్సన్
31. జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలిసారిగా శాస్త్రీయంగా ప్రతిపాదించినవారు? (గ్రూప్-1, 1987-88)
    1) లామార్క్ 2) డార్విన్
    3) డీవ్రీస్ 4) మెండల్
32. 'ది ఆరిజన్ ఆఫ్ స్పెసీస్' గ్రంథకర్త? (గ్రూప్-1, 2003)
    1) లామార్క్ 2) ఛార్లెస్ డార్విన్
    3) డీవ్రీస్ 4) మెండల్
33. సముద్రంలో ఏర్పడిన, కిరణజన్య సంయోగ క్రియ జరిపే మొదటి జీవులేవి? (గ్రూప్-2, 2002)
    1) శైవలాలు 2) సయనో బ్యాక్టీరియా
    3) శిలీంద్రాలు 4) మొక్కలు
34. ఉత్పరివర్తన పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు? (సివిల్స్, 2006)
    1) డార్విన్ 2) లామార్క్
    3) మెండల్ 4) హ్యూగో డీవ్రీస్
35. 'ప్రోటీన్ల కర్మాగారాలు' అని వేటిని పిలుస్తారు?
    1) పెరాక్సీజోమ్‌లు 2) రైబోజోమ్స్
    3) హరితరేణువు 4) మైటోకాండ్రియా
36. మానవుడి శుక్రకణంలోని క్రోమోజోమ్‌ల సంఖ్య?
    1) 46 2) 44+XX
    3) 22 4) 23
37. కొబ్బరి అంకురచ్ఛద స్థితి?
    1) ఏక స్థితికం 2) ద్వయ స్థితికం
    3) త్రయ స్థితికం 4) బహు స్థితికం
38. సమ విభజనను పరిశీలించడానికి అనువైన స్థానం ఏది?
    1) కాండం 2) ఉల్లి వేరుకొన
    3) మొగ్గ
    4) పుష్పంలోని పరాగకోశం
39. డీఎన్ఏ డబుల్ హెలిక్స్ నమూనాను ప్రతిపాదించినవారు?
    1) ష్లైడన్ - ష్వాన్ 2) క్రిక్-వాట్సన్
    3) బెంథమ్-హుకర్
    4) ఎంగ్లర్ ప్రాంటల్
40. అంటుకట్టడం, గాయాలు మానడంలో ఇమిడి ఉన్న ప్రక్రియ ఏది?
    1) ద్విదావిచ్ఛిత్తి 2) బహుదావిచ్ఛిత్తి
    3) సమ విభజన
    4) క్షయకరణ విభజన
41. పాకిటీన్ ఉపదశ దేనిలో ఉంటుంది?
    1) సమ విభజన
    2) క్షయకరణ విభజన
    3) అసమ విభజన 4) ఏదీకాదు
42. కిరణజన్య సంయోగక్రియ ఏ కాంతిలో ఎక్కువగా జరుగుతుంది?
    1) నీలి కాంతి 2) సూర్య కాంతి
    3) అరుణ కాంతి
    4) అతినీలలోహిత కాంతి
43. క్లోరోఫిల్ అణువులో ఏ మూలకం ఉంటుంది? (గ్రూప్-1, 1999)
    1) ఇనుము 2) మెగ్నీషియం
    3) కోబాల్ట్ 4) కాల్షియం
44. మానవ నిర్మిత ధాన్యపు మొక్క (Man made cereal)?
    1) ఓట్స్ 2) రెఫానో బ్రాసికా
    3) ట్రిటికేల్ 4) షర్బతి సానోరా
45. నీటిలో కరిగే వర్ణద్రవ్యాలు?
    1) క్లోరోఫిల్స్ 2) కెరోటినాయిడ్స్
    3) జాంతోఫిల్స్ 4) పైకోబిలిన్లు
46. శిలీంద్రం నుంచి రూపొందించిన ఫైటోహార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
    3) సైటోకైనిన్ 4) ఇథిలీన్
47. అగ్రాధిక్యతకు కారణమైన హార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
    3) సైటోకైనిన్ 4) ఇథిలీన్
48. కింది వాటిలో జిబ్బరెల్లిన్ల చర్య ఏది?
    1) మొక్కల పొడవు పెంచుతుంది
    2) అన్ని రకాల మొక్కల పొడవు పెంచుతుంది
    3) పొట్టి మొక్కల పొడవు మాత్రమే పెంచుతుంది
    4) పొడవు మొక్కల పొడవు పెంచుతుంది
49. విత్తన రహిత ఫలాలు ఏర్పడటానికి దోహదపడే హార్మోన్ ఏది?
    1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) సైటోకైనిన్
    3) ఆక్సిన్ 4) జిబ్బరెల్లిన్లు
50. ఫ్రూట్ రైపెనింగ్ హార్మోన్ ఏది?
    1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) ఇథిలీన్
    3) సైటోకైనిన్ 4) జిబ్బరెల్లిన్
51. వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?
    1) ఆక్సిన్ 2) సైటోకైనిన్
    3) ఇథిలీన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
52. కణ విభజనను ప్రోత్సహించే హార్మోన్?
    1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
    3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
53. సుప్తావస్థను కలుగజేసే హార్మోన్ ఏది?
    1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
    3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
54. మొక్కల ఆకులు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం? (ఏఈ, 2009)
    1) మెలనిన్ 2) టానిన్
    3) క్లోరోఫిల్ 4) బ్యాక్టీరియా
55. మొక్కల పెరుగుదలకు కావాల్సిన ప్రధాన సమ్మేళనం ఏది? (ఏఈ, 2009)
    1) సల్ఫర్ 2) సోడియం
    3) కార్బన్ 4) నైట్రోజన్
56. క్వినైన్ దేని నుంచి లభిస్తుంది? (గ్రూప్-2, 2002)
    1) మల్బరీ 2) కోకో
    3) సింకోనా 4) యూకలిప్టస్
57. 'ద్వి ఫలదీకరణం' ఏ మొక్కల ముఖ్య లక్షణం? (ఎంపీడీవో, 1997)
    1) శైవలాలు 2) బ్రయోఫైటా
    3) వివృత బీజాలు 4) ఆవృత బీజాలు
58. లిట్మస్ పేపర్ తయారీకి ఉపయోగించే మొక్క ఏది?
    1) శైవలాలు 2) శిలీంధ్రం
    3) లైకేన్లు 4) ఫెర్న్
59. పిండి పదార్థాలను గుర్తించే రసాయనం?
    1) కోబాల్ట్ క్లోరైడ్ 2) అయోడిన్
    3) సోడియం హైడ్రాక్సైడ్
    4) కాపర్ సల్ఫేట్
60. పాక్షిక స్వయం ప్రతిపత్తి ఉన్న కణాంగం?
    1) హరిత రేణువు 2) మైటోకాండ్రియా
    3) రైబోజోమ్స్ 4) 1, 2
61. జీవ పరిణామంలో ప్రకృతి ఎన్నిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త? (వీడీవో, 1988)
    1) లామార్క్ 2) డార్విన్
    3) డీవ్రీస్ 4) మెండల్
62. జీవుల్లో వంశపారంపర్య లక్షణాలు కలిగించేది ఏది? (గ్రూప్-2, 1991)
    1) ఆర్ఎన్ఏ 2) ఏటీపీ
    3) డీఎన్ఏ 4) హిమోగ్లోబిన్
63. క్రోమోజోమ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు? (గ్రూప్-4, 1996)
    1) డార్విన్ 2) మెండల్
    3) సట్టన్-బవేరి 4) లామార్క్
64. శిశువు లింగ నిర్ధారణ ఎవరిపై ఆధారపడి ఉంటుంది?
    1) తల్లి 2) తండ్రి
    3) తల్లి, తండ్రి 4) పూర్వీకులు
65. డీఎన్ఏలోని క్రియాత్మక ప్రమాణం?
    1) సిస్ట్రాన్ 2) రేకాన్
    3) మ్యూటాన్ 4) ఏదీకాదు

సమాధానాలు

1) 2; 2) 2; 3) 3; 4) 4; 5) 2;
6) 3; 7) 4; 8) 2; 9) 3; 10) 3;
11) 3; 12) 3; 13) 2; 14) 4; 15) 1;
16) 2; 17) 2; 18) 4; 19) 3; 20) 1;
21) 3; 22) 3; 23) 1; 24) 4; 25) 4;
26) 3; 27) 3; 28) 3; 29) 2; 30) 3;
31) 2; 32) 2; 33) 2; 34) 4; 35) 2;
36) 4; 37) 3; 38) 2; 39) 2; 40) 3;
41) 2; 42) 3; 43) 2; 44) 3; 45) 4;
46) 2; 47) 1; 48) 3; 49) 4; 50) 2;
51) 2; 52) 2; 53) 4; 54) 3; 55) 4;
56) 3; 57) 4; 58) 3; 59) 2; 60) 4;
61) 2; 62) 3; 63) 3; 64) 2; 65) 1.

హుస్సేన్‌సాగర్ చెరువును నిర్మించిన పాలకుడు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

కాకతీయ యుగం

1. 'కేయూర బాహు చరిత్ర'ను రాసినవారు?
   1) మంచన 2) శివదేవయ్య
   3) శేషాద్రిరమణ కవులు
   4) గంగాధర కవి
2. సంస్కృతంలో 'యయాతి చరిత్ర, ఉషారాగోదయం' అనే నాటకాలు రాసిందెవరు?
   1) శివదేవయ్య 2) మంచన
   3) గంగాధర కవి 4) ప్రతాపరుద్రుడు
3. 'రంగనాథ రామాయణం' గ్రంథ రచయిత?
   1) గోన గన్నారెడ్డి 2) గోన బుద్ధారెడ్డి
   3) ప్రతాపరుద్రుడు 4) విశ్వనాథుడు
4. తొలి పురాణ అనువాద కవి ఎవరు?
   1) విశ్వనాథుడు 2) గోన బుద్ధారెడ్డి
   3) మారన 4) మంచన
5. కింది వారిలో 'మార్కండేయ పురాణం'ను ఎవరు అంకితం తీసుకున్నారు?
   1) జాయప్ప కవి
   2) గన్నయ నాయకుడు
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రమదేవి
6. తెలుగులో తొలి మహాపురాణం ఏది?
   1) మనుచరిత్ర 2) వాయు పురాణం
   3) రంగనాథ రామాయణం
   4) మార్కండేయ పురాణం
7. కింది వాటిలో అనేక కావ్యాలకు ఆధారమైన గ్రంథం ఏది?
   1) మనుచరిత్ర
   2) మార్కండేయ పురాణం
   3) నాట్యశాస్త్రం
   4) రంగనాథ రామాయణం
8. సంస్కృతంలో అలంకార గ్రంథం రాసిన తొలి ప్రసిద్ధ తెలుగు కవి?
   1) విద్యానాథుడు 2) మారన
   3) మంచన 4) విశ్వనాథుడు
9. 'ప్రతాపరుద్ర యశోభూషణం' గ్రంథ రచయిత ఎవరు?
   1) రామరాజ భూషణుడు
   2) విద్యానాథుడు
   3) అల్లసాని పెద్దన 4) మారన
10. 'నరసభూపాలీయం' దేని అనువాద రచన?
   1) నాట్యశాస్త్రం 2) ధ్వన్యాలోకం
   3) ప్రతాపరుద్ర యశోభూషణం
   4) మార్కండేయ పురాణం
11. వరంగల్ కోట తోరణ ద్వారం మీద శ్లోకాలను లిఖించిన కవి?
   1) విద్యానాథుడు 2) నరసింహుడు
   3) శరభాంకుడు 4) మల్లినాథసూరి
12. 'కాకతీయ చరిత్ర', 'మలయవతి' అనే గ్రంథాలను రాసిందెవరు?
   1) నరసింహుడు 2) విద్యానాథుడు
   3) మల్లినాథసూరి 4) శరభాంకుడు
13. 'సౌగంధికాపహరణం' అనే సంస్కృత వ్యాయోగం రచయిత?
   1) విద్యానాథుడు 2) నరసింహుడు
   3) శరభాంకుడు 4) విశ్వనాథుడు
14. తెలుగులో తొలి జంట కవులెవరు?
   1) కాచభూపతి, విట్టలరాజు
   2) కాచభూపతి, విద్యానాథుడు
   3) విద్యానాథుడు, విశ్వనాథుడు
   4) శరభాంకుడు, నరసింహుడు
15. 'ఉత్తర రామాయణం' రచించింది ఎవరు?
   1) కాచభూపతి, విట్టలరాజు
   2) శరభాంకుడు, నరసింహుడు
   3) కాచభూపతి, విద్యానాథుడు
   4) విద్యానాథుడు, విశ్వనాథుడు
16. తెలుగులో తొలి కవయిత్రి ఎవరు?
   1) మొల్ల 2) గంగాదేవి
   3) కుప్పాంబిక 4) మైలాంబిక
17. ముగ్గురు కాకతీయ రాజుల వద్ద మంత్రిగా పనిచేసింది ఎవరు?
   1) గోన బుద్ధారెడ్డి 2) శివదేవయ్య
   3) గణపనారాధ్యుడు 4) శరభాంకుడు
18. 'శివదేవధీమణి' శతకకర్త?
   1) శరభాంకుడు 2) గోన బుద్ధారెడ్డి
   3) గణపతారాధ్యుడు 4) శివదేవయ్య
19. తెలుగులో వచ్చిన మొదటి చంపూ రామాయణం?
   1) ఉత్తర రామాయణం
   2) భాస్కర రామాయణం
   3) మొల్ల రామాయణం
   4) రంగనాథ రామాయణం
20. 'హుళక్కి భాస్కరుడు' ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
   1) రుద్రదేవుడు 2) రుద్రమదేవి
   3) గణపతిదేవుడు 4) ప్రతాపరుద్రుడు
21. 'భాస్కర రామాయణం'ను పూర్తి చేసిన వారెవరు?
   1) మల్లికార్జునభట్టు 2) అయ్యలార్యుడు
   3) రుద్రదేవుడు 4) శివదేవయ్య
22. సంస్కృతంలో 'ప్రేమాభిరామం' కావ్యాన్ని రాసింది ఎవరు?
   1) మల్లికార్జున భట్టు
   2) అయ్యలార్యుడు
   3) రావిపాటి త్రిపురాంతకుడు
   4) శివదేవయ్య
23. 'విద్యారణ్య స్వామి' జన్మస్థలం?
   1) ధర్మపురి 2) ఓరుగల్లు
   3) కొలనుపాక 4) పానగల్లు
24. కింది వారిలో శ్రీనాథ మహాకవి స్తుతించిన కవి ఎవరు?
   1) మల్లికార్జునభట్టు
   2) రావిపాటి త్రిపురాంతకుడు
   3) సాయణ 4) శివదేవయ్య
25. 'సంగీతసారం' అనే సంగీత శాస్త్ర గ్రంథ రచయిత?
   1) మల్లికార్జునభట్టు
   2) రావిపాటి త్రిపురాంతకుడు
   3) సాయణ 4) విద్యారణ్య స్వామి

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 3; 5) 2;
6) 4; 7) 2; 8) 1; 9) 2; 10) 3;
11) 2; 12) 1; 13) 4; 14) 1; 15) 1;
16) 3; 17) 2; 18) 4; 19) 2; 20) 4;
21) 2; 22) 3; 23) 1; 24) 2; 25) 4.

కుతుబ్‌షాహీ యుగం

1. సుల్తాన్ కులీ కుతుబ్‌షా ఏ బహమనీ సుల్తాన్ వద్ద సేనాపతిగా పనిచేశాడు?
   1) అహ్మద్‌షా 2) మహమూద్‌షా
   3) హుమాయూన్
   4) మొదటి మహమ్మద్‌షా
2. కులీ కుతుబ్‌షా గోల్కొండ జాగీర్దారుగా ఎప్పుడు నియమితులయ్యారు?
   1) క్రీ.శ. 1476 2) క్రీ.శ. 1486
   3) క్రీ.శ. 1493 4) క్రీ.శ. 1496
3. కులీ కుతుబ్‌షాకు 'కుతుబ్ ఉల్‌ముల్క్' బిరుదు ఇచ్చిన బహమనీ సుల్తాన్?
   1) హుమాయూన్
   2) మొదటి మహమ్మద్‌షా
   3) మహమూద్ షా 4) అహ్మద్‌షా
4. స్వతంత్ర గోల్కొండ రాజ్య స్థాపన ఎప్పుడు జరిగింది?
   1) 1515 2) 1518 3) 1520 4) 1521
5. గోల్కొండ రాజ్య స్థాపకుడెవరు?
   1) ఇబ్రహీం కుతుబ్‌షా
   2) జంషీద్ కుతుబ్‌షా
   3) సుల్తాన్ కులీ కుతుబ్‌షా
   4) అబుల్ హసన్ తానీషా
6. గోల్కొండను ఎవరి కాలంలో నిర్మించారు?
   1) కాకతీయులు 2) యాదవ రాజులు
   3) కుతుబ్‌షాహీలు 4) అసఫ్‌జాహీలు
7. 'మంగళారం' అని పూర్వం ఏ ప్రాంతాన్ని పిలిచేవారు?
   1) భువనగిరి 2) గోల్కొండ
   3) నల్లగొండ 4) సికింద్రాబాద్
8. 'చిత్రభారతం'లో ఎవరికి సంబంధించిన ప్రశంస కనిపిస్తుంది?
   1) కులీ కుతుబ్‌షా
   2) మహమూద్‌షా
   3) ఇబ్రహీం కుతుబ్‌షా
   4) షితాబ్‌ఖాన్
9. ఎనుములపల్లి పెద్దనామాత్యుడు ఎవరి మంత్రి?
   1) కులీ కుతుబ్‌షా 2) మహమూద్‌షా
   3) ఇబ్రహీం కుతుబ్‌షా
   4) షితాబ్‌ఖాన్
10. చరిగొండ ధర్మన్న ఎవరి ఆశ్రితుడు?
   1) ఎనుములపల్లి పెద్దనామాత్యుడు
   2) మహమూద్‌షా
   3) ఇబ్రహీం కుతుబ్‌షా 4) షితాబ్‌ఖాన్
11. 'చిత్రభారతం'ను రాసింది ఎవరు?
   1) ఎనుముపల్లి పెదనామాత్యుడు
   2) చరిగొండ ధర్మన్న
   3) ఇబ్రహీం కుతుబ్‌షా
   4) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
12. కులీ కుతుబ్‌షాను హత్య చేసిన అతడి కుమారుడి పేరు?
   1) జంషీద్ కుతుబ్‌షా
   2) హైదర్ కుతుబ్‌షా
   3) అబ్దుల్ కలీం 4) దౌలత్‌కుతుబ్ షా
13. వారసత్వ తగాదాలతో పారిపోయి విజయనగర రాజుల శరణార్థిగా ఉన్న సుల్తాన్?
   1) జంషీద్ కుతుబ్‌షా
   2) అబ్దుల్లా కుతుబ్‌షా
   3) ఇబ్రహీం కుతుబ్‌షా
   4) హైదర్ కుతుబ్‌షా
14. హుస్సేన్‌సాగర్ చెరువును నిర్మించిన పాలకుడు ఎవరు?
   1) ఇబ్రహీం కుతుబ్‌షా
   2) కులీ కుతుబ్‌షా
   3) హైదర్ కుతుబ్‌షా
   4) జంషీద్ కుతుబ్‌షా
15. ఇబ్రహీం కుతుబ్‌షా రాజమండ్రి, కొండవీడును ఆక్రమించిన సంవత్సరాలు వరసగా?
   1) 1571, 1579 2) 1575, 1579
   3) 1571, 1581 4) 1579, 1585
16. 'పురానాపూల్'ను నిర్మించింది ఎవరు?
   1) షాజహాన్ 2) ఇబ్రహీం కుతుబ్‌షా
   3) హైదర్ 4) జంషీద్
17. ఇబ్రహీం కుతుబ్‌షా 'పురానాపూల్'ను ఎక్కడ నిర్మించాడు?
   1) హుస్సేన్‌సాగర్
   2) ఇబ్రహీంపట్నం చెరువు
   3) మూసీనది 4) గండిపేట చెరువు
18. హుస్సేన్‌సాగర్‌ను, ఇబ్రహీంపట్నం చెరువును నిర్మించినవారు?
   1) అబుల్‌హసన్ తానీషా
   2) ఇబ్రహీం కుతుబ్‌షా
   3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
   4) అబ్దుల్లా కుతుబ్‌షా
19. ఇబ్రహీంబాగ్, పూల్‌బాగ్‌లను నిర్మించిన వారెవరు?
   1) అబుల్ హసన్ తానీషా
   2) ఇబ్రహీం కుతుబ్‌షా
   3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
   4) అబ్దుల్లా కుతుబ్‌షా
20. భిక్షాటకులకు ప్రత్యేకంగా లంగర్‌హౌస్‌ను నిర్మించిన పాలకుడు?
   1) అబుల్ హసన్ తానీషా
   2) అబ్దుల్లా కుతుబ్‌షా
   3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
   4) ఇబ్రహీం కుతుబ్‌షా
21. 'మల్కిభరాముడు' అనే బిరుదున్న చక్రవర్తి ఎవరు?
   1) షాజహాన్ 2) ఇబ్రహీం కుతుబ్‌షా
   3) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
   4) హైదర్ కుతుబ్‌షా

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 2;
5) 3; 6) 1; 7) 2; 8) 4;
9) 4; 10) 1; 11) 2; 12) 1;
13) 3; 14) 1; 15) 1; 16) 2;
17) 3; 18) 2; 19) 2; 20) 4;
21) 2

శాతవాహన అనంతర యుగం

1. తెలంగాణలో లభిస్తున్న తొలి సంస్కృత శాసనం ఏది?
   1) చైతన్యపురి శాసనం
   2) గోరంట్ల తామ్రశాసనం
   3) ఏలేశ్వర శాసనం
   4) ఇంద్రపాలనగర తామ్రశాసనం
2. తెలంగాణలో లభిస్తున్న తొలి ప్రాకృత శాసనం ఏది?
   1) గోరంట్ల తామ్రశాసనం
   2) చైతన్యపురి శాసనం
   3) ఇంద్రపాలనగర తామ్రశాసనం
   4) ఏలేశ్వర శాసనం
3. తెలంగాణలో గోవిందవర్మ వేయించిన తొలి సంస్కృత శాసన కాలం?
   1) క్రీ.శ. 425 2) క్రీ.శ. 430
   3) క్రీ.శ. 435 4) క్రీ.శ. 440
4. తెలంగాణ ప్రాంతంలో వచ్చిన మొదటి సంస్కృత లక్షణ గ్రంథం ఏది?
   1) జనాశ్రయ ఛందో విచ్ఛిత్తి
   2) కవిజనాశ్రయం
   3) ఉదయాదిత్యాలంకారం
   4) గోకర్ణ ఛందస్సు
5. 'జనాశ్రయ ఛందో విచ్ఛిత్తి' రాసిందెవరు?
   1) ఇంద్రభట్టారక వర్మ
   2) మంచన భట్టారకుడు
   3) గోవిందవర్మ
   4) నాలుగో మాధవ వర్మ
6. విష్ణుకుండినుల రాజ భాష ఏది?
   1) సంస్కృతం 2) ప్రాకృతం
   3) తెలుగు 4) పైశాచీ
7. 'విజయరాజ్య సంవత్సరంబుళ్' అనే తెలుగు పదమున్న శాసనం ఏది?
   1) గోరంట్ల తామ్రశాసనం
   2) ఇంద్రపాలనగర తామ్రశాసనం
   3) చిక్కుళ్ల శాసనం
   4) చైతన్యపురి శాసనం
8. చిక్కుళ్ల శాసనాన్ని వేయించినవారు?
   1) నాలుగో మాధవవర్మ
   2) విక్రమేంద్ర భట్టారిక వర్మ
   3) గోవిందవర్మ
   4) రెండో మాధవవర్మ
9. ఎవరి కాలం నుంచి శాసనాల్లో తెలుగు పదాలు కనిపిస్తున్నాయి?
   1) వాకాటకులు 2) రాష్ట్రకూటులు
   3) విష్ణుకుండినులు 4) ఇక్ష్వాకులు
10. ఏ రాజుల పాలనా కాలం నాటికి 'సంస్కృతం' పూర్తిగా రాజ భాష అయింది?
   1) శాతవాహనులు 2) ఇక్ష్వాకులు
   3) వాకాటకులు 4) విష్ణుకుండినులు
11. ఇక్ష్వాకులు ఏ మతానికి చెందినవారు?
   1) బౌద్ధం 2) శైవం
   3) జైనం 4) వైదికం

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 1;
5) 4; 6) 1; 7) 3; 8) 2;
9) 3; 10) 4; 11) 2;

Mac Operating System is developed by..



BANK EXAMS
COMPUTER AWARENESS

Model Questions

1. Block on buffer caches is used:
   1) To improve disk performance
   2) To speed up main memory read operation
   3) To handle interrupts
   4) To increase capacity of main memory
   5) None of these
2. An E-R diagram is a graphic method of presenting
   1) Primary keys and their relationships to instances
   2) Entity classes and their relationships to primary keys
   3) Entity classes and their relationships
   4) Primary keys and their relationships
   5) None of the above
3. A hexadigit can be represented by
   1) Three binary (consecutive) bits
   2) Sixteen binary (consecutive) bits
   3) Eight binary (consecutive) bits
   4) Four binary (consecutive) bits
   5) None of the above
4. If a previously saved file is edited ___?
   1) The file must be saved again to store the changes
   2) The changes will automatically be saved in the file
   3) The file will only have to be saved again if it is more than one page in length
   4) Its name must be changed
   5) It cannot be saved again
5. What do we call the HTML codes written in a text editor to make web pages?
   1) Roots 2) HTML tags
   3) Source elements
   4) Source code 5) None of these
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page 2) Document
   3) Section 4) Page Setup
   5) None
7. Which key is used to indent a paragraph in MS word?
   1) Shift 2) Esc 3) Ctrl
   4) Tab 5) None of these
8. In a ring topology, the computer in possession of the ______ can transmit data
   1) Packet 2) Data
   3) Token 4) Access method
   5) None of these
9. When you save to ______, your data will remain undamaged even when the computer is turned off.
   1) RAM 2) Motherboard
   3) Auxiliary storage
   4) Primary storage device
   5) None of these
10. A device operating at the physical layer is ______
   1) Bridge 2) Repeater
   3) Router 4) All of the above
   5) None of these
11. What type of computer could be found in a digital watch?
   1) Embedded computer
   2) Super computer
   3) Mainframe computer
   4) Notebook computer
   5) None of these
12. HTTP in URL stands for
   1) Hyper Text to Point
   2) Hyperlink for Tiny Protocol
   3) Highlighted Text through Pictures
   4) Hyper Text Transfer Protocol
   5) None of the above
13. Memory allocation at the dynamic time is known as
   1) Static memory allocation
   2) Demanding 3) Paging
   4) Run time memory allocation
   5) None of the above
14. Network components are connected to the identical cable in the ______ topology
   1) Star 2) Bus 3) Ring
   4) Mesh 5) Mixed
15. A mobile phone number, a date of birth and a customer name are all examples of
   1) A record 2) Data
   3) A file 4) A database
   5) None of these
16. In Excel, ______ contains one or more worksheets.
   1) Template 2) Workbook
   3) Active cell 4) Label
   5) None of these
17. Cyberspace is being governed by a system of law and regulation called?
   1) Civil Law 2) Criminal Law
   3) Cyber Law 4) Electronic Law
   5) Cyber Authority
18. Primary memory is used by the:
   1) CPU 2) Input device
   3) User 4) All of these
   5) None of these
19. In Ms- Word, what combination of keys do you press to delete an entire word?
   1) Ctrl + Del 2) Alt + Del
   3) Shift + Backspace
   4) Shift + Alt + Del
   5) None of these
20. Specialized programs that allow particular input or output devices to communicate with the rest of the computer system are called ____.
   1) Operating systems
   2) Device drivers
   3) Utilities
   4) Language translators
   5) Connectors
21. ROM and memory differ with respect to which of the following characteristics?
   1) Price 2) Reliability
   3) Speed 4) All of the above
   5) None of these
22. The group of processors combined together to create a program is referred to as
   1) Multi-programming
   2) Multiprocessing
   3) Multitasking
   4) Thrashing 5) None of these
23. Which device is used to access your computer from another computer or for talk over phone?
   1) CD-ROM Drive 2) Modem
   3) RAM 4) Hard Drive
   5) None of these
24. System software does all of the following except
   1) Add graphics and pictures to files.
   2) Coordinate instructions between application software and the computer's hardware devices.
   3) Help manage system resources.
   4) Help run the computer.
   5) None of these
25. What are .bas, .doc and .htm examples of?
   1) Databases 2) Extensions
   3) Domains 4) Protocols
   5) None of these
26. When data changes in multiple lists and all lists are not updated, this causes:
   1) Data redundancy
   2) Information overload
   3) Duplicate data
   4) Data inconsistency
   5) Data repetition
27. Which of the following is not true?
   1) Chatting is like e-mail
   2) Chatting can be done with a single person
   3) Chatting can involve multiple persons
   4) Chatting is an electronic dialogue
   5) None of these
28. ______ is the process of dividing the disk into tracks and sectors.
   1) Tracking 2) Allotting
   3) Crashing 4) Formatting
   5) None of these
29. The computer abbreviation of KiB usually means-
   1) Key Block 2) kibi byte
   3) Kilobyte 4) Kernel Boot
   5) None of these
30. Hardware used to translate words, sounds, images, and actions that people understand into a form that the system unit can process is known as ______
   1) Device drives
   2) Device readers
   3) Input devices
   4) Output devices
   5) None of these
31. The mouse ______ usually appears in the shape of an arrow.
   1) Indicator 2) Marker
   3) Meter 4) Pointer
   5) None of these
32. A tool used to find a synonym or antonym for a particular word
   1) Dictionary 2) Summary
   3) Thesaurus 4) Spell check
   5) None of the above
33. Which of the following protocols is used by Internet mail?
   1) HTTP 2) TCP/IP 3) FTP
   4) HTMP 5) None of these
34. A scripting language similar to HTML and which runs only on a browser is
   1) FORTRAN 2) BASIC
   3) FOXPRO 4) Java script
   5) None of these
35. Generally, you access the Recycle Bin through an icon located-
   1) On the first visible screen
   2) On the hard drive
   3) On the shortcut menu
   4) In the Properties dialog box
   5) None of these
36. The first Computers were programmed using ______
   1) Assembly Language
   2) Machine Language
   3) Source Code 4) Object code
   5) Spaghetti code
37. The programs which are as permanent as hardware and stored in ROM is known as
   1) Hardware 2) Software
   3) Firmware 4) ROM ware
   5) None of these
38. Which computer memory is used for storing programs and data currently being processed by the CPU?
   1) Mass memory
   2) Internal memory
   3) Non-volatile memory
   4) PROM 5) None of these
39. The world's first truly cross-platform programming language is called ______
   1) C++ 2) Java
   3) Visual Basic.NET
   4) Smalltalk
   5) None of these
40. ______ software allows the user to speak into the computer rather than type in text.
   1) Speech recognition
   2) Chat 3) Message
   4) All of the above
   5) None of these
41. The ______ folder retains copies of mail that you have in progress but are not yet ready to send.
   1) Drafts 2) Outbox
   3) Address Book 4) Sent Items
   5) None of these
42. Which of the following programming language is used to create programs like applets?
   1) COBOL 2) C Language
   3) Java 4) BASIC
   5) None of these
43. Mac Operating System is developed by which company?
   1) IBM 2) Apple
   3) Microsoft 4) Samsung
   5) None of these
44. A characteristic of a file server is which of the following?
   1) Acts as a fat client and is limited to one PC
   2) Manages file operations and is limited to one PC
   3) Acts as a fat client and is shared on a network
   4) Manages file operations and is shared on a network
   5) None of these
45. The access method used for magnetic tape is______
   1) Direct 2) Random
   3) All of the above
   4) Sequential
   5) None of these
46. What is a serial port that adds a direct connection to a network?
   1) FireWire 2) NIC
   3) USB 4) Internal modem
   5) None of these
47. Which of the following activities is NOT a component of e-business?
   1) Collaboration with business partners
   2) Cash flow management
   3) Customer service
   4) Selling 5) None of these
48. Which of the following is used for close a tab on a browser?
   1) Ctrl + T 2) Ctrl + W
   3) Ctrl + A 4) Ctrl + Y
   5) None of these
49. ____ is the process of carrying out commands.
   1) Fetching 2) Storing
   3) Executing 4) Decoding
   5) None of these

KEY

1) 1; 2) 2; 3) 4; 4) 1;
5) 4; 6) 4; 7) 4; 8) 3;
9) 3; 10) 2; 11) 1; 12) 4;
13) 4; 14) 2; 15) 1; 16) 2;
17) 3; 18) 1; 19) 5; 20) 2;
21) 4; 22) 2; 23) 2; 24) 1;
25) 2; 26) 4; 27) 1; 28) 4;
29) 2; 30) 3; 31) 4; 32) 3;
33) 1; 34) 4; 35) 1; 36) 2;
37) 3; 38) 2; 39) 2; 40) 1;
41) 1; 42) 3; 43) 2; 44) 4;
45) 4; 46) 2; 47) 2; 48) 2;
49) 3.